
'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 135

మంగళవారం 5-8-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




**అమృత ఘడియలవి!**

అమ్మపాలే బిడ్డకు అమృతం.. ఔషధం కూడా.. - 13లో



**బొట్టుపై ట్రోల్స్**

ఆధునికతకు కేరాఫ్‌గా భ్రమపడే అమెరికాలో బొట్టు ఆక్షేపణీయమైంది. - 13లో



**మళ్లీ సుంకాలు పెంచుతా!**

భారతీయ సరకులపై 25% సుంకాల మోత మోగించిన కొద్దిరోజులకే ట్రంప్ తన తెంపరితనాన్ని మరోసారి బయటపెట్టారు.

- వివరాలు 6లో



**శ్రీకృష్ణుడి బాటలో నడవండి..**

ఠాకూర్ శ్రీ బాంకే బిహారీ జీ మహరాజ్ ఆలయ ట్రస్ట్ వివాదంలో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వ వైఖరిని సుప్రీంకోర్టు తప్పుబట్టింది.

- వివరాలు 6లో



**..మీకెవరు చెప్పారు?**

భారత్‌జోడో యాత్ర సందర్భంగా రాహుల్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నల వర్షం కురిపించింది.

- వివరాలు 6లో



**ఎస్ఐఆర్‌పై స్తంభించిన పార్లమెంట్**

వివాదాస్పదంగా మారిన బిహార్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశం మరోసారి పార్లమెంట్‌ను స్తంభింపజేసింది.

- వివరాలు 6లో

## న్యూస్‌రీల్

### పీవోకేలో ఉగ్ర శిబిరాల పునర్నిర్మాణానికి పాక్ సాయం



ఓవైపు భారత దళాలు ఉగ్రవాద నిరోధకానికి పని చేస్తుండగా.. మరోవైపు ఉగ్రవాదానికి పాకిస్తాన్ మద్దతు కొనసాగిస్తోంది. గత 90 రోజుల్లోనే, పీవోకే అంతటా 15కిపైగా ఉగ్ర శిబిరాలు, లాంచ్‌ప్యాడ్‌లు ఏర్పాటయ్యాయి.

- వివరాలు 6లో

### బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వకుంటే రణరంగమే



స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించకపోతే రణరంగం సృష్టిస్తామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. రిజర్వేషన్ల సాధనకు సోమవారం ఆమె 72 గంటల దీక్షకు దిగారు.

- వివరాలు 2లో

### పంచాయతీ ఎన్నికల జాప్యం.. రూ.1,514 కోట్లకు గండి



తెలంగాణలో సకాలంలో పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించని కారణంగా కేంద్రం నుంచి అందాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు.. రూ.1,514 కోట్లకు గండి పడిందని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ వెల్లడించింది.

- వివరాలు 3లో

### 'సృష్టి' కేసులో మరో డాక్టర్ అరెస్టు




శిశువుల అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడిన యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో గోపాలపురం పోలీసులు మరో డాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ఇప్పటి వరకు 15 మంది అరెస్టయ్యారు.

- వివరాలు 3లో





పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై మీడియాతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. పక్కన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి, సీతక్క

# అసెంబ్లీలో పెడతాం

## 'కాళేశ్వరం'పై చర్చించాకే చర్యలు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి


## జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను కేబినెట్ ఆమోదించింది

- ఊరు, పేరు, అంచనాలు మార్చి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలింది
- ఇది పూర్తి స్వతంత్ర కమిషన్.. అందరి అభిప్రాయాలు తీసుకొని నివేదిక ఇచ్చింది
- కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చించాకే ముందుకెళ్తాం
- అసెంబ్లీలో అందరూ స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు చెప్పొచ్చు
- ఇందులో ఎలాంటి రాజకీయ కక్ష సాధింపు చర్యలుండవు
- మంత్రివర్గ సమావేశం తరువాత మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికలో ఎలాంటి రాజకీయ జోక్యం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ నివేదికను అసెంబ్లీలోపెట్టి చర్చించి, అందరి అభిప్రాయాలు తీసుకున్న తరువాత ఎలాంటి చర్యలు తీసుకోవాలో నిర్ణయిస్తామని చెప్పారు. ఇది స్వతంత్ర కమిషన్ ఇచ్చిన నివేదిక అని, సిఫార్సుల ఆధారంగా చర్యలు ఉంటాయి తప్ప.. ఎలాంటి కక్షపూరిత చర్యలకు తావులేదని రేవంత్‌రెడ్డి తెలిపారు. కమిషన్ ఇచ్చిన నివేదికపై నీటిపారుదల, న్యాయ, సాధారణ పరిపాలన శాఖలకు చెందిన ముగ్గురు కార్యదర్శులతో కమిటీ వేసి, సంక్షిప్త నివేదిక రూపొందించినట్లు చెప్పారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో కమిషన్ నివేదికపై కూలంకషంగా చర్చించి ఆమోదం తెలిపింది. అనంతరం రేవంత్‌రెడ్డి.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరిలతో కలిసి మీడియాతో మాట్లాడారు.

### నాడు హామీ ఇచ్చాం...

రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కూలిపోవడంపై అధికారంలోకి వచ్చిన వెంటనే విచారణ చేపడతామని ఎన్నికలప్పుడు ప్రజలకు హామీ ఇచ్చామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. దాని ప్రకారమే మిగతా 5వ పేజీలో ▶



- ఏళ్లుగా బీఆర్ఎస్‌పై చేస్తున్న విమర్శలనే నివేదికలో పొందుపరిచారు
- ఎర్రవల్లిలో పార్టీ ముఖ్యనేతలతో భేటీలో కేసీఆర్
- అసెంబ్లీకి హాజరై వాస్తవాలను వివరించే యోచన
- అవసరమైతే సుప్రీంను ఆశ్రయించాలనే భావన
- నేడు తెలంగాణ భవన్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్న హరీశ్‌రావు

# జనంలోకి వెళ్దాం.. అసెంబ్లీలో ఎండగడదాం

## కాంగ్రెస్ అబద్ధాలకు 'కాళేశ్వరం' కమిషన్ ముసుగు తొడిగారన్న కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అంతర్భాగమైన మేడిగడ్డ బరాజ్‌లో రెండు పియర్స్ కుంగుబాటును సాకుగా చూపిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం ప్రాజెక్టు స్ఫూర్తిని దెబ్బతీసేలా వ్యవహరిస్తోందని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్‌రావు మండిపడ్డారు. గతంలో ప్రతిపక్ష పార్టీగా, నేడు అధికార పార్టీగా కాంగ్రెస్ వల్లెవేస్తూ వస్తున్న అబద్ధాలకు పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ముసుగు వేసి బీఆర్ఎస్‌పై బురద చల్లే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అబద్ధాలను అసెంబ్లీతోపాటు ప్రజాక్షేత్రంలోనూ ఎండగట్టాలని పార్టీ నేతలను ఆదేశించారు. రాష్ట్ర మంత్రివర్గ సమావేశం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎర్రవల్లి నివాసంలో కొన్ని రోజులుగా పార్టీ కీలక నేతలు కె. తారక రామారావు, హరీశ్ రావు, జగదీశ్‌రెడ్డితో వరుస భేటీలు జరుపుతున్న కేసీఆర్.. సోమవారం కూడా వారితో సుదీర్ఘంగా సమావేశమయ్యారు. బీజేపీ ప్రేరేపిత జాతీయ డ్యామ్‌ల భద్రత ప్రాధికార సంస్థ (ఎన్డీఎస్ఏ)ను అడ్డుపెట్టుకొని తయారు చేయించిన నివేదికపై ప్రజలకు వాస్తవాలు వివరించాలని కేసీఆర్ ఆదేశించినట్లు బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

### అసెంబ్లీ వేదికగానే అసలు నిజాలు చెబుదాం

పీసీ ఘోష్ కమిషన్ నివేదికను త్వరలో అసెంబ్లీ ఉభయ సభల్లో ప్రవేశపెట్టి చర్చిస్తామని సీఎం రేవంత్ చేసిన ప్రకటనపై ఈ భేటీలో కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేసినట్లు తెలిసింది. గతంలో అధికారపక్షంగా రాష్ట్రంలో సాగునీటి రంగం స్థితిగతులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో ప్రజలకు వివరించినట్లుగానే కమిషన్ విచారణ నివేదికపైనా స్పందించాలని కేసీఆర్ అభిప్రాయపడ్డట్లు తెలియవచ్చింది. ఈ అంశంపై తానే అసెంబ్లీకి స్వయంగా హాజరై వాస్తవాలను ప్రజల ముందు పెట్టాలనే యోచనలో కేసీఆర్ ఉన్నట్లు మిగతా 5వ పేజీలో ▶




# సమంగా.. సగర్వంగా..

- చివరి టెస్టులో ఇంగ్లండ్‌పై భారత్ అద్భుత విజయం
- సిరీస్‌ను 2-2తో ముగించిన టీమిండియా

**జో జీతా వహి సిరాజ్**

ఇంగ్లండ్‌తో సిరీస్‌లో చిరస్మరణీయ ప్రదర్శన

లండన్: అందరి అంచనాలను తారుమారు చేస్తూ... విమర్శకుల నోళ్లు మూయిస్తూ... ఇంగ్లండ్ గడ్డపై శుబ్‌మన్ గిల్ బృందం అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-2తో సమంగా ముగించింది. ఇంగ్లండ్‌తో సోమవారం ముగిసిన చివరిదైన ఐదో టెస్టులో టీమిండియా 6 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆఖరి రోజు గెలిచేందుకు ఇంగ్లండ్‌కు 35 పరుగులు అవసరం ఉండగా... టీమిండియాకు 4 వికెట్లు కావాలి. కొన్ని ఉత్కంఠ క్షణాలు చోటు చేసుకున్నా... ఓవర్‌నైట్ స్కోరు 339/6తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్... చివరకు భారత బౌలర్ల ధాటికి 367 పరుగులకు పరిమితమై లక్ష్యానికి దూరంగా ఉండిపోయింది. మ్యాచ్ మొత్తంలో 9 వికెట్లు తీసిన హైదరాబాద్ పేసర్ మొహమ్మద్ సిరాజ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. సిరీస్ మొత్తంలో నిలకడగా రాణించిన భారత కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (754 పరుగులు)... ఇంగ్లండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ (481 పరుగులు)లకు సంయుక్తంగా 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' పురస్కారం దక్కింది.

- వివరాలు 14లో



చంద్రబాబుతో వెంకటేశ్‌నాయుడు

# సూత్రధారి చంద్రబాబే..

## పాత్రధారులు టీడీపీ వర్గీయులే!

- ఇదీ రెడ్‌బుక్ కుట్ర కపట నాటకం
- తీగల విజయేందర్ రెడ్డి సహకారంతోనే రూ.11 కోట్ల జప్తు డ్రామా
- ఈయన టీడీపీ నేత తీగల కృష్ణారెడ్డి సోదరుని కుమారుడు
- చంద్రబాబు, లోకేశ్‌లకు అత్యంత సన్నిహితుడు వెంకటేశ్ నాయుడు
- వారి డైరెక్షన్‌లోనే నోట్ల కట్టల డెన్ డ్రామా
- లోకేశ్ బినామీ ఎంపీ కేశినేని చిన్ని వ్యాపార భాగస్వామే రాజ్ కేసిరెడ్డి
- ఆయన్ను బెదిరించి అబద్ధపు వాంగ్మూలం కోసం సిట్ కుట్ర
- అందుకే లేని కుంభకోణం ఉన్నట్టుగా చూపే కుతంత్రం 12లో

# ఇసుక దారి మళ్లకుండా



మొగ్దుంపూర్ వద్ద టీజీఎండీసీ అధికారులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

## సీసీ కెమెరాల ద్వారా ఇసుక లారీల కదలికలపై నిఘాకు సర్కారు కసరత్తు


- డంపింగ్, బ్లాక్ మార్కెట్‌ను అడ్డుకొనేందుకు టీజీఎండీసీ వినూత్న విధానం
- దారి పొడవునా లారీలను గుర్తించేలా హైవేల వెంబడి అధునాతన సీసీ కెమెరాలు
- టీజీఎండీసీ కేంద్ర కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూం ద్వారా నిరంతర పర్యవేక్షణ
- పైలట్ ప్రాజెక్టు కింద నాలుగు జిల్లాల ఎంపిక.. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా అమలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రంలో యథేచ్ఛగా సాగుతున్న ఇసుక అక్రమ డంపింగ్, బ్లాక్ మార్కెటింగ్‌కు చెక్ పెట్టేందుకు తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎండీసీ) వినూత్న విధానాన్ని అమలు చేయనుంది. ఇసుక క్వారీల నుంచి బయల్దేరే లారీలు నేరుగా గమ్యస్థానానికి వెళ్తున్నాయా లేదా అనే విషయాన్ని ప్రత్యక్షంగా పర్యవేక్షించనుంది. ఇందుకోసం ఆధునిక సాంకేతికతను వినియోగించనుంది. ప్రస్తుతం ఇసుక క్వారీలు, రీచ్‌ల నుంచి లోడ్‌తో బయల్దేరే వాహనాలను అక్రమార్కులు నేరుగా బుకింగ్ చేసుకున్న చోటుకు కాకుండా ప్రైవేటు డంపుల వద్దకు తరలిస్తూ ఇసుక కృత్రిమ కొరతను సృష్టించి తద్వారా భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా అనేక ఫిర్యాదులు ప్రభుత్వానికి అందుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు టీజీఎండీసీ సిద్ధమవుతోంది.

### హైవేలపై ఏఎన్‌పీఆర్ సీసీ కెమెరాలు

ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకున్న ప్రతి వాహనమూ రీచ్ నుంచి బయల్దేరుతుండగా రీచ్ లేదా క్వారీలో ఇప్పటికే సీసీ కెమెరాలు ఉన్నాయి. కానీ హైవేల వెంబడి ఆ వాహనాలు దారిమళ్లాయో లేదో తెలుసుకొనే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో ఆయా వాహనాలను నిరంతరం మిగతా 3వ పేజీలో ▶

## ఇదండీ సంగతి



బిహార్‌లో తీసేశాం కాబట్టి ఇక్కడ చేర్చాం.. అంతే!



సోమవారం వాన బీభత్సానికి జలమయమైన అమీర్‌పేట ప్రధాన రహదారి

# నడిరోడ్డుపై నరకం

- హైదరాబాద్‌లో కుండపోత..
- 3 గంటల పాటు కురిసిన వాన
- లోతట్టు ప్రాంతాలు, రోడ్లన్నీ జలమయం
- స్తంభించిన జనజీవనం... ట్రాఫిక్ చక్రబంధం
- వాహన చోదకులకు నరకం
- కుత్బుల్లాపూర్‌లో 15, బంజారాహిల్స్‌లో 12 సెం.మీ. వర్షపాతం

సాక్షి, హైదరాబాద్: రాజధానిలో కుండపోత వర్షం బీభత్సం సృష్టించింది. జనజీవనం అతలాకుతలమైంది. సోమవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా మూడుగంటల పాటు కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ చెరువులను తలపించగా, లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధమయ్యాయి. మరోవైపు రోడ్లపై చెట్లు విరిగి పడటంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచి పోయాయి. ట్రాఫిక్ ఇబ్బందులతో జనజీవనం స్తంభించిపోయింది. విద్యాసంస్థలు వదిలే వేళ, ఉద్యోగులు ఇంటిబాట పట్టే సమయం కావడంతో విద్యార్థులు, ఉద్యోగులు ఎక్కడివారక్కడ చిక్కుకుపోయారు. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ముందుకు సాగేందుకు గంటల కొద్దీ సమయం పట్టింది. అనేక ప్రాంతాల్లో భారీ ఎత్తున వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనాలు నీటమునిగాయి. నాలాలు, మిగతా 2వ పేజీలో ▶

# దిగంతాలకు దిషోం గురు



- జార్ఖండ్ రాష్ట్ర పితామహుడు, జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) వ్యవస్థాపకుడు, మాజీ సీఎం శిబు సోరెన్ అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన మూడుసార్లు జార్ఖండ్ సీఎంగా పనిచేశారు. కేంద్ర మంత్రిగానూ బాధ్యతలు నిర్వహించారు. జేఎంఎం వ్యవస్థాపక వ్యక్తుల్లో ఒకరైన సోరెన్ 4 దశాబ్దాల పాటు పార్టీకి నాయకత్వం వహించారు. జార్ఖండ్ ప్రత్యేక రాష్ట్రం కోసం అలుపెరుగని పోరాటం చేశారు. 2000లో ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుతో ఆయన కల నెరవేరింది. జార్ఖండ్ రాజకీయాల్లో 'గురూజీ'గా మన్ననలు పొందిన ఆయనను పిల్లలు, పెద్దలు అంతా అదే పేరుతో పిలిచేవారు. - 6లో

## క్లుప్తంగా...

### ఓబీసీ ధర్నాకు హాజరవ్వండి

**ఇండియా కూటమి పక్షాలకు ఎంపీ మల్లు రవి లేఖలు**



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వం ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో బుధవారం నిర్వహించనున్న ఓబీసీ ధర్నాకు హాజరుకావాలంటూ తెలంగాణ ఎంపీల ఫోరం కన్వీనర్, కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి ఇండియా కూటమి పక్షాలకు ఆహ్వానాలు పంపారు. ఈ మేరకు సోమవారం ఆయన కూటమి పార్టీలకు చెందిన ఎంపీలకు లేఖలు రాశారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించనున్న ఈ ధర్నాలో పాల్గొని దేశంలోని వెనుకబడిన వర్గాల సామాజిక న్యాయం, సాధికారత లక్ష్యానికి సంఘీభావం ప్రకటించాలని కోరారు. అనంతరం మల్లు రవి తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలుకు రాష్ట్రపతి ఆమోదం తెలపాల్సి ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రపతికి పంపిన ముసాయిదాకు ఆమోదం తెలపాలని ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రపతిని కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరామన్నారు. ధర్నాలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్ సహా వంద మంది ఎంపీలు, ఇతర పార్టీల నేతలు, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొంటారని తెలిపారు. మంగళవారం తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలంతా కలిసి 42 శాతం రిజర్వేషన్లపై లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు వాయిదా తీర్మానాన్ని అందజేస్తామని చెప్పారు.

### కేసీఆర్‌ను టార్గెట్ చేసిన కాంగ్రెస్

**మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్**



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్‌పై కేసు నమోదు చేస్తారంటూ కాంగ్రెస్ విమర్శలు చేస్తూ.. ఆయన్ను టార్గెట్ చేసిందని మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని విమర్శిస్తున్న కాంగ్రెస్ నేతలు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల సహా మొత్తం ప్రాజెక్టు ఎలా పూర్తయిందని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన నేతలతో కలిసి శ్రీనివాస్‌గౌడ్ సోమవారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడారు. కేసీఆర్‌పై కాంగ్రెస్ చేస్తున్న కట్టుకథలకు భయపడేది లేదని, న్యాయపోరాటం చేస్తామని ప్రకటించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కమిషన్ నివేదికను అడ్డుపెట్టుకొని కాంగ్రెస్, సీఎం రేవంత్ పైశాచిక ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. నిద్రాహారాలు మాని కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కోసం శ్రమించిన హరీశ్‌రావుపై ఆరోపణలు సరికావని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ ఆల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

### జగ్గారెడ్డి కంటతడి



కొండాపూర్(సంగారెడ్డి): సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండల పరిధిలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2017లో సంగారెడ్డిలో రాహుల్‌గాంధీ సభను విజయవంతం చేయడం కోసం.. కంది మండలానికి చెందిన ఆంజనేయులు తన భూమిని అమ్మి డబ్బు సమకూర్చాడంటూ కన్నీటి పర్యంతమయ్యారు. ఎప్పుడూ హుషారుగా కనిపించే జగ్గారెడ్డి.. ఒక్కసారిగా కన్నీరు పెట్టడంతో కార్యకర్తలు ఆయనను ఓదార్చే ప్రయత్నం చేశారు. అనంతరం సమావేశం మధ్యలో నుంచి జగ్గారెడ్డి వెళ్లిపోయారు.





అమీర్‌పేటలోని మైత్రివనం వద్ద నడుంలోతు వరద నీటిలో ఓ యువకుడు



సచివాలయం వద్ద భారీగా ట్రాఫిక్ జామ్

# నడిరోడ్డుపై నరకం..



సోమాజిగూడ వద్ద వరద నీటి ప్రవాహం...

▶ మొదటి పేజీ తరువాయి

మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లాయి. నగరంలో అత్యధికంగా కుత్బుల్లాపూర్ పరిధిలోని మహదేవ్‌పురంలో 15 సెంటీమీటర్లు, బంజారాహిల్స్‌లో 12, యూసుఫ్‌గూడలో 11 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మిగతా ప్రాంతాల్లో సగటున ఆరు నుంచి ఏడు సెంటీమీటర్ల వరకు వర్షం కురిసింది.

**రోడ్లపై నిలిచిన వరద:** ఏకధాటి వర్షంతో వరద నీరు రోడ్లపై భారీగా చేరింది. ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ కింద వర్షపు నీరు నిలిచిపోవడంతో ఆ మార్గంలో ఇరువైపులా ఇటు నాంపల్లి వరకు అటు అమీర్‌పేట మార్గంలో వాహనాల రాకపోకలకు గంటల కొద్దీ ఆటంకం ఏర్పడింది. ట్యాంక్‌బండ్–సెక్రటేరియట్ మార్గంలో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఖైరతాబాద్, లక్డీకాపూల్, హిమాయత్‌నగర్, నారాయణగూడ పరిసర ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. సచివాలయ బస్టాప్, సిటీ సెంట్రల్ జోన్ నీట మునిగాయి. హిమాయత్‌నగర్–నారాయణగూడ మార్గంలోనూ వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఖైరతాబాద్‌లోని ఒక ప్రైవేట్ స్కూల్ నీట మునిగింది. వందలాది మంది విద్యార్థులు స్కూల్లోనే చిక్కుకుపోయారు. పలు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో జీహెచ్ఎంసీ, హైడ్రా బృందాలు రంగంలోకి దిగాయి.

### మూసీలో చిక్కుకున్న పశువుల కాపరులు

**వలిగొండ:** హైదరాబాద్‌లో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి మూసీనది పొంగి ప్రవహించింది. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని ప్రొద్దటూరు –వర్కట్‌పల్లి గ్రామాల మధ్య మూసీలో ప్రొద్దటూరుకు చెందిన నలుగురు పశువుల కాపరులు చిక్కుకున్నారు. పెద్దబోయిన బుచ్చయ్య, పలుసం ప్రశాంత్, గజ్జి శ్రీను, పలుసం చింటూ పశువులను మేపుకుంటూ ఇంటికి వచ్చే క్రమంలో 6 గంటలకు వరద ఉధృతి పెరిగింది. దీంతో నది దాటే పరిస్థితి లేకపోవడంతో వారు పెద్ద రాతిబండపై కూర్చొని, డయల్100కు కాల్ చేశారు. గజ ఈతగాళ్లు ట్యూబ్‌లతో రోప్ వేసి బాధితులను ఒక్కొక్కరిని సురక్షితంగా రాత్రి పదిగంటలకు బయటకు తీసుకొచ్చారు. కాపరులను భువనగిరి డీసీపీ అక్షాంశ్‌యాదవ్, చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి పరామర్శించారు.

## అధికారులూ అప్రమత్తంగా ఉండండి

- విపత్తు సహాయక బృందాలు అందుబాటులో ఉండాలి...
- లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యల్లో జాప్యం చేయొద్దు
- ప్రభుత్వ యంత్రాంగానికి సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని సీఎంరేవంత్‌రెడ్డి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. సోమవారం సచివాలయంలో వివిధ విభాగాల ఉన్నతాధికారులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పని చేయాలని, లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలు వేగవంతంగా చేపట్టాలని సీఎం ఆదేశించారు. జీహెచ్ఎంసీతోపాటు రాష్ట్రవ్యాప్తంగా వరద నీటి ఉధృతి ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. రానున్న రెండ్రోజులు వివిధ ప్రాంతాల్లో వర్షాలు ఉంటాయనే సమాచారం ఉన్నందున జిల్లా కలెక్టర్లు అన్ని విభాగాలతో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలన్నారు. ఎక్కడ కూడా ఆస్తి నష్టం, ప్రాణ నష్టం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. భారీ వర్షాలతో వరదలు వచ్చినా... ఆ పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. జిల్లా అధికారులు జిల్లా కేంద్రంలోనే అందుబాటులో ఉండాలని చెప్పారు. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో ఎప్పటికప్పుడు మాట్లాడి పరిస్థితిని సమీక్షించాలన్నారు. విపత్తు సహాయక బృందాలు అందుబాటులో ఉండాలని... పరిస్థితులకు అనుగుణంగా తక్షణమే స్పందించాలని రేవంత్ ఆదేశించారు.

# పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపు
- మహేశ్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లోకి కొండబాల



కోటేశ్వరరావుకు కండువా కప్పి పార్టీలో ఆహ్వానిస్తున్న టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి తదితరులు

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పనిచేయాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఇందుకోసం అందరం చేయి చేయి కలిపి పనిచేద్దామని కోరారు. సోమవారం గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ల సమక్షంలో ఖమ్మం జిల్లా మధిర మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావుతో పాటు పలువురు మాజీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కొండబాలకు పార్టీ కండువా కప్పిన పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారిని ఉద్దేశించి భట్టి మాట్లాడుతూ ప్రజలు ఎంతో నమ్మకంతో కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారని, వారి అవసరాలు తీర్చడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. స్థానిక సంస్థల నుంచి చట్టసభల వరకు అన్ని విషయాలపై అవగాహన కలిగిన కొండబాల లాంటి నేతలు పార్టీలోకి రావడం సంతోషకరమని పేర్కొన్నారు. మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కొండబాల తన సొంత ఇంటికి తిరిగి వచ్చారని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీశ్వరరావుతో పాటు ఖమ్మం జిల్లా పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌కు మాజీ ఎమ్మెల్యే గువ్వల రాజీనామా

**ఈనెల 9న బీజేపీలోకి చేరనున్న బాలరాజు!**



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ సాక్షి, నాగర్‌కర్నూల్: బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు రాజీనామా చేశారు. ఈనెల 9న ఆయన బీజేపీలో చేరనున్నట్టు తెలుస్తోంది. మంగళవారం హైదరాబాద్ శివారులో తన ముఖ్య అనుచరులతో గువ్వల సమావేశం కానున్నారు. బీఆర్ఎస్ పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న గువ్వల బాలరాజు తన రాజీనామా లేఖను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు పంపారు. 'రెండు దశాబ్దాలకు పైగా పార్టీతో ఉన్న అనుబంధం, జ్ఞాపకాల నడుమ ఈ నిర్ణయం తీసుకుంటున్నందుకు బాధగా ఉంది. నన్ను నడిపించిన మీపై, పార్టీపై నాకు ఎప్పటికీ గౌరవం ఉంటుంది. పార్టీని వీడుతున్నందుకు బాధగా ఉంది.' అని రాజీనామా లేఖలో పేర్కొన్నారు. 'ఏళ్లుగా బీజేపీతో పోరాటం చేశాం. ఇప్పుడు బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేయడమో లేదా పొత్తు పెట్టుకుంటారట. వాళ్లకంటే ముందే మనం బీజేపీలో చేరుదాం' అంటూ గువ్వల తన అనుచరులతో మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. బీఆర్ఎస్‌లో మొదటి నుంచి క్రియాశీలకంగా పనిచేసిన గువ్వల 2014, 2018లో అచ్చంపేట ఎమ్మెల్యేగా గెలిచారు.

# మరోసారి మీరే సీఎం

**ముఖ్యమంత్రికి ఫోన్ చేసిన మంత్రి కోమటిరెడ్డి**



ఫోన్‌లో సీఎం రేవంత్‌తో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు వీరేశం, బీఎల్ఆర్, జైవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సత్యం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: మరోసారి మీరే సీఎం అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో అన్నారు. సోమవారం నల్లగొండలో మంత్రి క్యాంపు కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి కోమటిరెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి ఫోన్ చేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ.. 'మంచి భవనం మంజూరు చేశారు. నాకు సూట్ ఏర్పాటు చేయడంతోపాటు వీడియో కాన్ఫరెన్స్ హాల్ ఏర్పాటు చేశారు. గణపతి పూజ, హోమం మీ పేరు మీద చేశాం. మరోసారి మీరు సీఎం కావాలి' అని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డితో అన్నారు. నల్లగొండకు వీఐపీలు, ఎమ్మెల్యేలు వస్తే వారికి భోజనం పెట్టేలా క్యాంపు కార్యాలయంలో ఏర్పాట్లు ఉండాలని సీఎం సూచించగా.. అలా ఏర్పాటు చేస్తున్నామని, డైనింగ్ హాల్ ఏర్పాటు చేశామని కోమటిరెడ్డి సీఎంకు తెలిపారు. క్యాంపు కార్యాలయం ప్రారంభించినందుకు కోమటిరెడ్డికి సీఎం శుభాకాంక్షలు తెలిపారు.

**బనకచర్ల కథ క్లోజ్..**

బనకచర్ల కథ క్లోజ్ అయ్యిందని మంత్రి కోమటిరెడ్డి అన్నారు.నల్లగొండలో ఆయన మీడియాతో మాట్లాడారు. తమ ఒత్తిడితోనే కేంద్ర ప్రభుత్వం బనకచర్లపై వెనక్కి తగ్గిందని చెప్పారు. పోతిరెడ్డిపాడుపై కూడా పోరాటం చేస్తామన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లు జాతీయ పార్టీలో ఉండవని, కుటుంబ పార్టీలోనే ఉంటాయని తెలిపారు. హైదరాబాద్ నుంచి విజయవాడకు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటు చేయబోతున్నామని, ఆ రోడ్డు నల్లగొండ పక్క నుంచి వెళ్లేలా ముఖ్యమంత్రిని కోరతామని కోమటిరెడ్డి చెప్పారు. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిని 8 లేన్లుగా విస్తరించబోతున్నామని, త్వరలోనే టెండర్లు పిలవడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

## 72 గంటల నిరసనకు అనుమతివ్వాలని ఆదేశించలేం

**బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు తేల్చిచెప్పిన హైకోర్టు**



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటూ తాను చేపట్టిన 72 గంటల నిరాహార దీక్షకు అనుమతిచ్చేలా అధికారులకు ఆదేశాలివ్వాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కోరగా.. హైకోర్టు నిరాకరించింది. పోలీసుల తరఫు వాదనలు వినకుండా పిటిషనర్ అభ్యర్థనను ఆమోదించలేమని స్పష్టం చేసింది. పోలీసులను కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ.. తదుపరి విచారణ వచ్చే వారానికి వాయిదా వేసింది. హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లోని ఇందిరా పార్క్ వద్ద 72 గంటలపాటు దీక్ష చేసేందుకు అనుమతి కోరితే.. పోలీసులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకే అనుమతి ఇచ్చారంటూ తెలంగాణ జాగృతి లీగల్ సెల్ అధ్యక్షుడు లంచ్‌మోషన్ రూపంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది ముక్రమ్ అలీ వాదనలు వినిపిస్తూ.. 72 గంటల పాటు దీక్ష కొనసాగించేలా పోలీసులకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటూ బీసీ రిజర్వేషన్ బిల్లుకు మద్దతుగా ఇందిరా పార్క్ వద్ద ఆమె 72 గంటలపాటు నిరాహార దీక్షను ప్రారంభించారని వివరించారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 200 మందితో నిర్వహించేందుకు అనుమతి ఇచ్చారన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పోలీసులకు ఆదేశాలిచ్చేందుకు నిరాకరించారు. పిటిషనర్ చేస్తున్న నిరాహారదీక్ష కంటెంట్‌ను సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో పోస్ట్ చేయకూడదన్న పోలీసుల ఉత్తర్వులను రద్దు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ.. తదుపరి విచారణ వాయిదా వేశారు.

# బీసీలపై బీజేపీకి ప్రేమ లేదు

- బీసీలను అణగదొక్కేందుకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి యత్నం
- రేపు ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ధర్నా: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్



రైలులో మంత్రులు పొన్నం, శ్రీహరి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి

సాక్షి, యాదాద్రి/హైదరాబాద్, ఆలేరు: బీసీల పట్ల బీజేపీకి ఎన్నడూ ప్రేమ లేదని, బీసీ రిజర్వేషన్ బిల్లును కిషన్‌రెడ్డి, రాంచందర్‌రావు వ్యతిరేకిస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు చేపట్టిన 'చలో ఢిల్లీ' కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రత్యేక రైలులో హైదరాబాద్ నుంచి బయలుదేరిన టీపీసీసీ అధ్యక్షుడు, మంత్రులు ఆలేరులో రైలు దిగారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో కలిసి మహేశ్‌గౌడ్ విలేకరులతో మాట్లాడారు. భువనగిరిలోనూ మాట్లాడారు. బీసీల 42 శాతం రిజర్వేషన్లపై ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ఈ నెల 6న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, టీపీపీసీ ప్రతినిధులు కలిసి ధర్నా చేస్తున్నామని వెల్లడించారు. ముస్లింలను సాకుగా చూపించి బీజేపీ నాయకులు బీసీ బిల్లును అడ్డుకోవాలని చూస్తున్నారని చెప్పారు. బీసీలతో చెలగాటమాడుతున్న కిషన్‌రెడ్డి విషయంలో బీజేపీలో బీసీ సామాజిక వర్గానికి చెందిన ఎంపీలు అర్వింద్, ఈటల రాజేందర్, కేంద్ర మంత్రి బండి సంజయ్‌లు ఎందుకు నోరుమూసుకొని కూర్చున్నారని మండిపడ్డారు.

**ప్రభుత్వ పథకాలను ప్రజలు ప్రశంసించారు**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజల్లో సంతృప్తి కనిపించిందని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. నాలుగు రోజుల జనహిత పాదయాత్ర ముగిసిన అనంతరం సోమవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతి నెలలో నాలుగైదు రోజుల పాటు జనహిత పాదయాత్ర రాష్ట్రమంతటా ఉంటుందని, త్వరలోనే ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడిస్తామని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఒంటెద్దు పోకడలతోనే కాళేశ్వరం ప్రాజెక్టుకు ఈ దుర్గతి పట్టిందని మహేశ్‌గౌడ్ అభిప్రాయపడ్డారు. బీసీ ఉద్యమంలో కవిత పాత్ర ఏంటో చెప్పాలని డిమాండ్ చేసిన మహేశ్‌గౌడ్.. బీసీ బిల్లుపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు విషం కక్కుతుంటే ఆ పార్టీ బీసీ నేతలు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు.

### ఇది రైతు ప్రభుత్వం కాదు.. రాక్షస ప్రభుత్వం

**కేంద్రం కేటాయించిన ఎరువులు కూడా రాష్ట్ర ప్రభుత్వం డ్రా చేయలేదు: కేటీఆర్**



సాక్షి, హైదరాబాద్: ఇది రైతు ప్రభుత్వం కాదని..రాక్షస ప్రభుత్వమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సకాలంలో పంటలకు యూరియా అందించకపోవడంతో 70 లక్షల మంది రైతులు రాష్ట్రంలో ఇబ్బందులు పడుతున్నారని సోమవారం ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్వాకం కారణంగా పొలంలో ఉండాల్సిన రైతులు ఎరువుల దుకాణాల ముందు ఎదురు చూపులు చూస్తున్నారన్నారు. గత పదేళ్లలో ఎన్నడూ రైతులు ఎరువుల కోసం క్యూ లైన్లు కట్టిన దాఖలాలు లేవని చెప్పారు. యూరియాపై ప్రభుత్వ సమీక్షలు లేకపోవడం, కేంద్రం, రాష్ట్రం మధ్య కొరవడిన సమన్వయం మూలంగా రాష్ట్రంలో ఇప్పుడు యూరియా, డీఏపీ కొరత ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వం ఎరువుల కొరత రాకుండా ఏప్రిల్, మే నెలలో ఉత్తరాది రాష్ట్రాల్లో డిమాండ్ లేని సమయంలోనే నోడల్ ఏజెన్సీ మార్క్‌ఫెడ్‌కు ఆర్థిక సహాయం అందించి జూన్ నెల నాటికి 3 నుంచి 4 లక్షల మెట్రిక్ టన్నులు, డీలర్ల వద్ద మరో 3 లక్షల టన్నుల బఫర్ స్టాక్ ఉండేలా చూసుకునేదని గుర్తు చేశారు. అదే నేడు ప్రభుత్వ సమన్వయ లోపమే ఈ పరిస్థితికి కారణమని కేటీఆర్ పేర్కొన్నారు.

### పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలి

**స్పీకర్ అందుబాటులో లేకపోవడంతో గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ వినతి**

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలను వెంటనే అనర్హులుగా ప్రకటించాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో సోమవారం స్పీకర్‌ను కలిసేందుకు బీఆర్ఎస్ నేతలు సోమవారం అసెంబ్లీకి వచ్చారు. అయితే స్పీకర్ అందుబాటులో లేకపోవడంతో అసెంబ్లీ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. స్పీకర్‌ను కలిసేందుకు ఆదివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అపాయింట్‌మెంట్ కోరినట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ముందస్తుగా తీసుకున్న అనుమతి మేరకు స్పీకర్‌ను కలిసేందుకు ఉదయం 11 గంటలకు తాము వచ్చినా ఆయన అందుబాటులో లేరని కార్యాలయ సిబ్బంది సమాచారం ఇచ్చారన్నారు. కనీసం సభాపతి కార్యాలయ ద్వారం కూడా తెరవలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాపోయారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడారు. 'ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతున్నాం. సభాపతి అనుమతి తీసుకొని వచ్చినా ఆయన అందుబాటులో లేరు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని సభాపతిని కోరుతున్నామని' అన్నారు. స్పీకర్‌ను కలిసేందుకు వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందంలో తలసాని శ్రీనివాస్‌యాదవ్, కేపీ వివేకానంద, చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, సుధీర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, పాడి కౌశిక్‌రెడ్డి, అనిల్‌జాదవ్, ముఠా గోపాల్ ఉన్నారు.



దీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

### బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుంటే రణరంగమే

- తెలంగాణలో అందరికీ రాజ్యాధికారమే నా లక్ష్యం
- ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద దీక్షలో కల్వకుంట్ల కవిత

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకపోతే రణరంగం సృష్టిస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. తమది రాజకీయ పోరాటం కాదని, బీసీల ఆత్మగౌరవం కోసమే తమ ఆరాటమని పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతోపాటు ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించేలా ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టి బీజేపీ వైఖరిని బయట పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డికి కవిత సూచించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం సోమవారం కవిత ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద 72 గంటల దీక్షకు దిగారు. హరియాణాకు చెందిన ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ (ఐఎన్ఎల్‌డీ)నాయకుడు అర్జున్‌సింగ్ చౌతాలాతోపాటు వివిధ కుల, ప్రజాసంఘాల నాయకులు కవితకు సంఘీభావం ప్రకటించారు. తెలంగాణలో రాజ్యాధికారంలో అందరికీ వాటా రావాలని, బీసీలకు ప్రాధాన్యం దక్కాలని కవిత డిమాండ్ చేశారు.

**జంతర్‌మంతర్‌లో ధర్నా చేస్తాం:** బీసీ రిజర్వేషన్లలో ముస్లింలకు కూడా వాటా ఉందన్న అనుమానంతో బిల్లులను ఆపుతున్నామని బీజేపీ చెబుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ స్పష్టత ఇవ్వాల్సిన అవసరముందని కవిత అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతోపాటు ప్రత్యేకంగా ముస్లింల కోసం పది శాతం రిజర్వేషన్ల బిల్లులపై కేంద్ర ప్రభుత్వం సంతకం చేయకపోతే ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తామన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసే టైమ్ పాస్ ధర్నాలతో సాధించేదేమీ లేదని, బిల్లుల ఆమోదం కోసం రాష్ట్రపతిని కలవడంతోపాటు ఆర్డినెన్స్ ఆమోదంలో గవర్నర్ జాప్యంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని సూచించారు. ఆగస్టు 8 తర్వాత కవిత దీక్ష చేసేందుకు.. పోలీసులు హైకోర్టు ఎదుట సుముఖత వ్యక్తం చేసిన నేపథ్యంలో కోర్టులపై ఉన్న గౌరవంతో తన దీక్షను విరమిస్తున్నట్టు కవిత ప్రకటించారు. అయితే బీసీ రిజర్వేషన్ల కోసం తన పోరాటం వివిధ రూపాల్లో కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**కూకటివేళ్లతో కాంగ్రెస్‌ను పెకిలించాలి: అర్జున్‌సింగ్ చౌతాలా**

కాంగ్రెస్ పార్టీని కూకటివేళ్లతో సహా పెకిలించాలని ఐఎన్ఎల్‌డీ నాయకుడు అర్జున్‌సింగ్ చౌతాలా పిలుపునిచ్చారు. న్యాయమైన డిమాండ్ కోసం కవిత చేస్తున్న పోరాటంలో తాము భాగస్వాములం అవుతామని ప్రకటించారు.

### హైదరాబాద్‌లో కవిత దీక్ష చేస్తే ఏమొస్తుంది?

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



సాక్షి, హైదరాబాద్: తన కుటుంబంలోని కుట్రలను తట్టుకుని ఉనికి చాటుకునేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ప్రయత్నాలు చేస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. అందుకే తాము ఢిల్లీ వెళ్లి బీసీల రిజర్వేషన్ల సాధనకు ఉద్యమిస్తుంటే.. ఆమె ఇక్కడ కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. కవిత హైదరాబాద్‌లో దీక్షలు చేయడం వల్ల ఏమొస్తుందని, ఎవరికి లబ్ధి కలుగుతుందని ప్రశ్నించారు. ఢిల్లీ వెళ్లి దీక్ష చేసేందుకు భయమా? అని ఎద్దేవా చేశారు. కవిత దీక్షకు బీఆర్ఎస్ పార్టీ మద్దతు ఉందో, లేదో చెప్పాలని కోరారు. నిజంగా బీసీలపై కవితకు చిత్తశుద్ధి ఉంటే.. తండ్రి కేసీఆర్‌తో కలిసి వెళ్లి ఢిల్లీలో దీక్ష చేయాలని విప్ ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

### చండీయాగం.. శుద్ధ అబద్ధం: బీఆర్ఎస్

సాక్షి, హైదరాబాద్: మాజీ సీఎం కేసీఆర్ ఎర్రవల్లిలోని తన నివాసంలో చండీయాగం నిర్వహిస్తున్నారని కొన్ని మీడియా సంస్థలు దుష్ప్రచారం చేస్తున్నాయని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. చండీయాగం చేస్తున్నట్లు కేసీఆర్ నివాసం లేదా బీఆర్ఎస్ కార్యాలయం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదని స్పష్టం చేసింది. వాస్తవాలను నిర్ధారించుకోకుండా ఇష్టం వచ్చినట్లు చానళ్లు, మీడియా సంస్థలు దుష్ప్రచారాన్ని కొనసాగించడం బాధ్యతారాహిత్యమని విమర్శించింది. పత్రికలు, చానళ్లు బాధ్యతాయుతంగా వ్యవహరించి అసత్య వార్తలను తొలగించాలని విజ్ఞప్తి చేసింది.

# పట్టాలెక్కని ట్రంప్ కార్డు!

## పరుగులు తీస్తున్న ఈబీ–5

**అమెరికాలో శాశ్వత నివాసం కోసం ఇస్తున్న ఈబీ-5 వీసా స్థానంలో ట్రంప్ తెస్తానన్న 'గోల్డ్ కార్డ్' నేటికీ పట్టాలెక్కలేదు. కానీ, అమెరికాలో పెట్టుబడులు పెట్టేందుకు భారతీయులు గతంలో ఎన్నడూ లేనంతగా ఆసక్తి చూపుతున్నారు. ఇందుకోసం చేసే ఈబీ-5 దరఖాస్తులు రయ్యిన దూసుకుపోవడమే ఇందుకు నిదర్శనం. గతంలో ఎన్నడూ లేనంతగా మనదేశం నుంచి ఎక్కువ సంఖ్యలో ఈబీ-5 వీసాకు దరఖాస్తులు వెళ్లాయి.**

- సాక్షి, స్పెషల్ డెస్క్

డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడు అయ్యాక విద్యార్థి, తాత్కాలిక వర్క్ వీసాలపై నియంత్రణలు కఠినతరం కావటానికి ముందు.. 2024 ఏప్రిల్ నుండే ఈబీ–5 వీసాలకు డిమాండ్ పెరిగినట్లు వాషింగ్టన్‌లోని అమెరికన్ ఇమిగ్రెంట్ ఇన్వెస్టర్ అలయెన్స్ (ఎ.ఐ.ఐ.ఎ.) డేటా చెబుతోంది. 2025 ఆర్థిక సంవత్సరం మొదటి నాలుగు నెలల్లోనే (2024 అక్టోబర్–2025 జనవరి. అమెరికాలో ఆర్థిక సంవత్సరం అక్టోబరు 1న ప్రారంభమై సెప్టెంబరు 30తో ముగుస్తుంది) 1,200 మందికి పైగా భారతీయులు ఈబీ–5 వీసా కోసం ఫామ్ ఐ–526ఈ దరఖాస్తు చేశారు. ఈ సంఖ్య 2023 మొత్తం ఏడాది సంఖ్య కంటే కూడా ఎక్కువ కావడం విశేషం.

### శాశ్వత నివాసానికి హామీ

ఈబీ–5 వీసాకు డిమాండు పెరగటానికి హెచ్1–బి, గ్రీన్ కార్డ్ సహా ఇతర ఇమిగ్రేషన్ కేటగిరీల్లో రికార్డు స్థాయిలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటమూ ఒక కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. పలు అంచనాల ప్రకారం, ప్రస్తుతం యూఎస్‌లో కోటీ 10 లక్షలకు పైగా ఇమిగ్రేషన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో శాశ్వత నివాసానికి ఈబీ–5 వీసా ఒక వేగవంతమైన, నమ్మకమైన హామీగా మారిందని ఇమిగ్రేషన్ అధికారులు అంటున్నారు. ఇన్వెస్ట్ ఇన్ ది యూఎస్ఏ (ఐ.ఐ.యూఎస్ఏ) ఆధ్వర్యంలోని వాషింగ్టన్ ప్రాంతీయ ఇమ్మిగ్రేషన్ కార్యాలయం సమాచారం ప్రకారం 2024 ఆర్థిక సంవత్సరంలో (2023 అక్టోబర్ –2024 సెప్టెంబర్) భారతీయులకు 1,428 ఈబీ–5 వీసాలు జారీ అయ్యాయి. 2023లో ఈ సంఖ్య 815 మాత్రమే.



### అమెరికాలో పెట్టుబడులకు భారతీయుల ఆసక్తి

### ఈబీ-5 వీసా దరఖాస్తుల్లో భారీ పెరుగుదల
### దీన్ని రద్దు చేసే ఎత్తుగడతోనే 'ట్రంప్ కార్డు'

**ప్రాంతాన్ని బట్టి పైకం**

1992 నుంచి అమెరికా ఈబీ–5 వీసాలను ఇవ్వటం ప్రారంభించింది. అమెరికన్లకు ఉద్యోగాల సృష్టి కోసం వీటిని సృష్టించారు. అమెరికాలోని గ్రామీణ ప్రాంతం లేదా నిరుద్యోగులు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో (టార్గెటెడ్ ఎంప్లాయ్‌మెంట్ ఏరియా – టి.ఇ.ఎ.) 8 లక్షల డాలర్లు (సుమారు రూ. 6.88 కోట్లు), తక్కిన ప్రాంతాల్లో కనీసం 10.50 లక్షల డాలర్లు (సుమారు రూ. 9 కోట్లు) పెట్టుబడి పెట్టే వలసదారులకు ఈబీ–5 వీసా (గ్రీన్ కార్డులు) ఇస్తారు. ఈ వీసా ఉంటే.. పెట్టుబడి పెట్టేవాళ్లు, వారి జీవిత భాగస్వామి, 21 ఏళ్లలోపు ఉండే వారి పెళ్లికాని పిల్లలకు అమెరికాలో ఉండేందుకు అనుమతి ఉంటుంది. త్వరలో వీటిని.. ట్రంప్ ప్రకటించిన గోల్డ్ కార్డులతో భర్తీ చేస్తారు.

**అమెరికాలో నుంచే దరఖాస్తు**

హెచ్–1బి వీసాలపై ఉన్న విద్యార్థులు, పని చేసే సామర్థ్యం ఉన్న వ్యక్తులు తమ దేశానికి వెళ్లకుండానే ఈబీ–5ను అమెరికాలోనే దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం యూఎస్‌లో హెచ్–1బి లేదా విద్యార్థి వీసా వంటి వలసేతర హోదాలపై ఉన్న భారతీయ పౌరులు, కొత్త నిబంధనల ప్రకారం ఐ–526ఈ ఫారం దాఖలు చేసిన సమయం నుండి 3–6 నెలల్లోపు వర్క్, ట్రావెల్ పర్మిట్లను పొందటం ద్వారా ప్రయోజనం పొందుతారు. ఈ పర్మిట్ సాధారణంగా వారి ఈబీ–5 గ్రీన్ కార్డ్ ఆమోదం పొందేవరకు చెల్లుబాటులో ఉంటుంది.

**ఈబీ-5 వీసా**

కనీస పెట్టుబడి టి.ఇ.ఎ.లకు రూ. 6.88 కోట్లు, నాన్-టి.ఇ.ఎ.లకు రూ.9 కోట్లు

కనీసం 10 ఫుల్ టైమ్ ఉద్యోగాల కల్పన జరగాలి


2027 వరకు చట్టబద్ధమైన భరోసా

యూఎస్‌లో ఉన్న భారతీయులు అక్కడి నుండే దరఖాస్తు చేసుకోవచ్చు

**ట్రంప్ గోల్డ్ కార్డు**

రూ. **43.5** కోట్లు నేరుగా ప్రభుత్వానికి చెల్లించాలి.

విధి విధానాలు ఖరారు కాలేదు. చట్టం రూపొందలేదు.




# ఐక్యతకు చిహ్నం భారత్

**తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ**



గవర్నర్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

పటాన్‌చెరు (హైదరాబాద్): భిన్నత్వంలో ఏకత్వంతో పాటు.. ఐక్యతకు చిహ్నం భారత్ అని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ కొనియాడారు. గీతం యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర (పొలిటికల్ సైన్స్) విభాగం ఆధ్వర్యంలో 'సర్దార్ వల్లభాయ్ పటేల్, రైతులు చంపారన్ నుంచి చిత్రకూట్ వరకు' అనే అంశంపై రెండ్రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సెమినార్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం తర్వాత 562 సంస్థానాలను భారతదేశంలో విలీనం చేయడంలో సర్దార్ పటేల్ పాత్ర కీలకమన్నారు. రైతు ఉద్యమాలకు పటేల్ చేసిన సేవలు అంతగా వెలుగులోకి రాలేదన్నారు. మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి.. 'జై జవాన్, జై కిసాన్' నినాదం అప్పటి భారతీయులను ఉత్తేజపరిచిందని గుర్తు చేశారు. ఆ తర్వాత మాజీ ప్రధాని వాజ్‌పేయి.. 'జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్' అనే నినాదం అందుకున్నారని తెలిపారు. ప్రస్తుత ప్రధాని మోదీ.. వాజ్‌పేయి నినాదానికి 'విజ్ఞాన్ అనుసంధానం' అనే పదాన్ని జోడించారని చెప్పారు. ప్రపంచంలోనే అత్యధిక పరిశోధనలు, ఆవిష్కరణలు మన దేశంలో జరుగుతున్నాయని.. అందుకు నిదర్శనం కోవిడ్ వ్యాక్సిన్ తయారీ అని ప్రశంసించారు. కార్యక్రమంలో గుజరాత్ ప్రభుత్వ ఇండెక్స్ టీ–సీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి డాక్టర్ సంజయ్ జోషి, గీతం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, ములుగులోని సమ్మక్క సారక్క గిరిజన కేంద్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వైఎల్ శ్రీనివాస్, ఏపీ కేంద్ర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డీన్ షీలారెడ్డి పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల జాప్యం.. రూ.1,514 కోట్లకు గండి

- 15వ ఆర్థిక సంఘం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల నిలుపుదల
- ఈ ఆర్థిక సంవత్సరం కేటాయించిన రూ.1,477 కోట్ల నిధుల్లోనూ కోతకు అవకాశం
- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదికలో వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో సకాలంలో పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించని కారణంగా కేంద్రం నుంచి అందాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులకు భారీగా గండి పడిందని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ వెల్లడించింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీలకు కేంద్రం రూ.1,514 కోట్లు కేటాయించినప్పటికీ పాలకవర్గాలు లేని కారణంగా ఆ నిధులను విడుదల చేయలేదని పేర్కొంది. 2025–26వ ఆర్థిక సంవత్సరంలోనూ తెలంగాణకు రూ.1,477 కోట్లు కేటాయించారని, అయితే ఎన్నికల నిర్వహణలో జాప్యం జరిగితే ఆ నిధులకూ కోతపడే అవకాశాలున్నాయని చెప్పింది. అంతకుముందు సంవత్సరాల్లో కేటాయింపుల మేరకు 2020–21లో రూ.1,847కోట్లు, 2021–22లో రూ.1,365కోట్లు, 2022–23లో రూ.1,415కోట్లు, 2023–24లో రూ.1,424 కోట్లు విడుదల చేసిందని తెలిపింది. సకాలంలో పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేలా కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఇప్పటికైనా చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో పటిష్టమైన ప్రభుత్వ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. ఈ మేరకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ సప్తగిరి శంకర్ ఉలక నేతృత్వంలోని కమిటీ డిమాండ్ ఫర్ గ్రాంట్స్ (2025–26) రెండో నివేదికను ఇటీవల పార్లమెంట్‌కు సమర్పించింది.

**ఎన్నికల జాప్యంతో కుంటుపడుతున్న అభివృద్ధి**

గత మార్చిలో ఇచ్చిన తొలి నివేదికలో ప్రస్తావించిన మాదిరే ఇందులోనూ పంచాయతీ ఎన్నికల అంశాన్ని కమిటీ ప్రధానంగా ప్రస్తావించింది. మొదటి నివేదికలో '73వ రాజ్యాంగ సవరణ ద్వారా అన్ని రాష్ట్రాలు గ్రామస్థాయిలో ఐదేళ్లకోసారి పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించడం తప్పనిసరి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 ఈ(3) ప్రకారం పంచాయతీని ఏర్పాటు చేసేందుకు ఎన్నికలకు.. దాని కాలపరిమితి ముగిసేలోపు లేక రద్దు తేదీ నుంచి ఆరు నెలల వ్యవధి ముగిసేలోపు పూర్తి చేయాలి. తెలంగాణ, తమిళనాడు, ఉత్తరాఖండ్‌లలో 2024లోనే ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నా, ఇంకా నిర్వహించలేదు' అని తెలిపింది. దీనికి కొనసాగింపుగా ఇటీవల ప్రవేశపెట్టిన నివేదికలో తెలంగాణలో ఓబీసీ రిజర్వేషన్ అమలులో జరుగుతున్న జాప్యాన్ని ప్రస్తావించింది. గ్రామాల్లో ఆమోదంపొందిన ప్రణాళికల అమలు, నిధుల వినియోగం, అవసరమైన సేవల కొనసాగింపును నిర్ధారించడానికి పరిమిత పదవీకాలంతో నామినేటెడ్ ప్రతినిధిని లేక పరిపాలనాధికారిని నియమించాలని సూచించింది.

# చనిపోయిన వారి పింఛన్ల రికవరీ

- గత ఏడాది కాలంలో 28 వేల మందికి రూ.60 కోట్ల మేర చెల్లింపులు
- రికవరీకి ప్రభుత్వం ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: ఏడాది కిందట చనిపోయిన పింఛనుదారులకు చేయూత పింఛన్లు అందజేశారు. ఇలా గత ఏడాది 28 వేల మందికి రూ.60 కోట్ల మేర చెల్లింపులు జరిగినట్టు గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని గ్రామీణ దారిద్ర్య నిర్మూలనా సంస్థ (సెర్ప్) తాజాగా గుర్తించింది. చేయూత పింఛన్లు అందుకుంటూ మరణించిన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఇతర కేటగిరీ లబ్ధిదారుల వివరాలను వారి కుటుంబసభ్యులు అధికారులకు తెలియజేయకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని ఉన్నతాధికారులు నిర్ధారించారు. వృద్ధులు, ఇతర కేటగిరీల వారికిచ్చే రూ.2,016 మొదలు.. దివ్యాంగులకు ఇచ్చే రూ.4,016 వరకు చనిపోయిన లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో ఏడాది పాటు పింఛన్ మొత్తం జమ అయినట్టు వెల్లడైంది. దీంతో ఈ పింఛన్‌దారుల కుటుంబీకుల నుంచి ఈ మొత్తాన్ని రికవరీ చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. గ్రామీణ–పట్టణ స్థానిక సంస్థల్లో క్షేత్రస్థాయి పరిశీలనలు, సర్వేలు, క్రాస్ వెరిఫికేషన్, ఎస్‌పీ పోర్టల్‌లో పేర్లను సరిచూడడం వంటి వాటి ద్వారా పింఛన్‌దారులు చనిపోయినా వారి కుటుంబసభ్యులు డబ్బులు విత్‌డ్రాచేయడాన్ని గుర్తించారు. అంతేకాకుండా మరణించిన వారి బ్యాంక్ డెబిట్ కార్డులను వారి కుటుంబీకులు ఉపయోగించి ఏటీఎంల నుంచి డబ్బు తీసుకున్నట్టుగా కూడా తేలింది. దీంతో మరణించిన 28 వేల పింఛనుదారుల పేర్లను జాబితా నుంచి తొలగించినట్టు అధికారులు వెల్లడించారు. అదేసమయంలో వృద్ధాప్య పింఛన్లకు సంబంధించి మరణించిన వారి భార్య లేదా భర్తకు పింఛన్ అందించేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

# రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యం

- 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం: సీఎం రేవంత్‌రెడ్డి
- దేశంలో తయారవుతున్న ప్రతి మూడు టీకాల్లో ఒకటి ఇక్కడే ఉత్పత్తి
- గచ్చిబౌలిలో ఎలీ లిల్లీ జీసీసీని ప్రారంభించిన సీఎం

గచ్చిబౌలి (హైదరాబాద్): తెలంగాణను అన్ని రంగాల్లో ప్రపంచంలో అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గచ్చిబౌలిలో ఎలీ లిల్లీ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ)ను మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల్లోనే ప్రపంచ ప్రఖ్యాత ఫార్మా దిగ్గజం ఎలీ లిల్లీ హైదరాబాద్‌కు రావడం అభినందనీయమన్నారు. దేశంలో తయారవుతున్న టీకాల్లో ప్రతి మూడో టీకా ఇక్కడే తయారవుతోందని, జినోమ్ వ్యాలీ దేశంలోనే అతిపెద్ద లైఫ్ సైన్సెస్ పరిశోధనాభివృద్ధి కేంద్రమని చెప్పారు. దేశంలో ఫార్మాస్యూటికల్ ఉత్పత్తిలో 40 శాతం తెలంగాణలోనే జరుగుతోందన్నారు. ప్రపంచంలోని అగ్రశ్రేణి ఫార్మాస్యూటికల్, బయోటెక్నాలజీ సంస్థలకు హైదరాబాద్ కేంద్రంగా ఉందన్నారు. 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. మధుమేహం, కేన్సర్, ఇమ్యూనాలజీ, న్యూరోసైన్స్ తదితర రంగాల్లో ఎలీ లిల్లీ సంస్థ గేమ్ ఛేంజర్ అవుతుందని రేవంత్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. పరిశ్రమలకు అనువైన వాతావరణం, మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ముందుంటుందన్నారు. తెలంగాణ లైఫ్‌సైన్సెస్ రాజధానిగా ఉందని, ప్రపంచ ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణలకు నంబర్ వన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని వెల్లడించారు.




వేదికపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు ముచ్చట్లు

**100 జీసీసీల ఏర్పాటు లక్ష్యంగా...**

2026 నాటికి 100 జీసీసీలను ప్రారంభించే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించామని, ఇప్పటికే 70 జీసీసీలు ప్రారంభమయ్యాయని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. మెడ్ టెక్, లైఫ్ సైన్సెస్, డిజిటల్ హెల్త్, ఏఐ ఇన్ హెల్త్‌కేర్, తెలంగాణ డేటా ఎక్స్ఛేంజీతో ఇండస్ట్రీ పాలసీని అనుసంధానం చేశామని చెప్పారు. ఏఐ లీడ్ డిస్కవరీ, క్లౌడ్ బేస్డ్ క్లినికల్ ప్లాట్‌ఫామ్స్, ఆటోమేటెడ్ రెగ్యులేటరీ సిస్టమ్స్ తదితర అంశాలపై ఎలీ లిల్లీ దృష్టి సారిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎలీ లిల్లీ ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ డియాగో రావ్, ఇండియా ప్రెసిడెంట్ విన్సెలోవ్ టకర్, మేనేజింగ్ డైరెక్టర్ మనీష్ అరోరా పాల్గొన్నారు.

# వ్యవస్థతో ఆటలొద్దు

- పోలీసులపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు
- ఏ సెక్షన్లు పెట్టాలో ఫిర్యాదుదారులే చెబుతారా?
- కౌశిక్‌రెడ్డి పిటిషన్‌లో విచారణ ఆగస్టు 19కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: 'వ్యవస్థతో ఆటలాడుకోవద్దు.. ఏ సెక్షన్లు పెట్టాలో ఫిర్యాదుదారులే చెబుతారా.. వాళ్లు చెప్పినట్లు దర్యాప్తు అధికారులు విచారణ చేస్తారా..' అంటూ పోలీసులపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి తీరుతో ఎక్కడికి తీసుకుపోవాలని అనుకుంటున్నారో అర్థంకావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. అవసరమైతే ఫిర్యాదుదారులను న్యాయస్థానం ముందు హాజరయ్యేలా ఆదేశాలు ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించింది. ఒకే నేరానికి సంబంధించి హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై పెట్టిన కేసుల వివరాలన్నీ సమర్పించాలని అతని తరఫు న్యాయవాదిని ఆదేశించింది. తదుపరి విచారణ ఆగస్టు 19కి వాయిదా వేసింది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్టను దెబ్బతీసేలా రెచ్చగొట్టే విమర్శలు చేశారంటూ తనపై ఆరు పోలీస్ స్టేషన్లలో నమోదైన ఎఫ్ఐఆర్‌లను కొట్టివేయాలని కోరుతూ కౌశిక్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది టీవీ రమణరావు వాదనలు వినిపిస్తూ.. ఐపీసీ సెక్షన్ 504 (శాంతి భద్రతలకు విఘాతం), 505 (2) (విద్వేషం రేకెత్తించడం), సెక్షన్ 500 (పరువు నష్టం) కింద బంజారాహిల్స్, రాజేంద్రనగర్, చేవెళ్ల, శంకర్‌పల్లి, మోకిల, షాద్‌నగర్ పోలీస్ స్టేషన్లల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య చైర్‌పర్సన్ కాల్వ సుజాత గుప్తా, ఇతరుల ఫిర్యాదుల ఆధారంగా ఏకపక్షంగా, రాజకీయ దురుద్దేశంతో కేసు నమోదు చేశారని చెప్పారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21కు వ్యతిరేకమన్నారు. పిటిషనర్‌పై రాష్ట్రవ్యాప్తంగా 40 నుంచి 50 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయని వెల్లడించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఒక నిర్దిష్ట చట్టంలోని నిబంధన కింద నేరాన్ని నమోదు చేయాలని పోలీసు అధికారిని ఫిర్యాదుదారుడు ఎలా ఆదేశించగలడని ప్రశ్నించారు. ఒకే తరహా అభియోగంపై ఒకే కేసు ఉండాలన్న సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌కు విరుద్ధంగా పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారన్నారు. ఆరు ఎఫ్ఐఆర్‌ల అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తున్నామని చెప్పారు. ఒక ఎఫ్ఐఆర్‌లోనైనా దర్యాప్తు జరిపేలా అనుమతించాలని పీపీ కోరగా, న్యాయమూర్తి నిరాకరించారు. హోం శాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, ఇతరులు కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేశారు.



# తెలంగాణ రాష్ట్ర సాధనకు స్ఫూర్తి శిబూ సొరెన్

- ఉద్యమంలో ఆయన సహకారం మరువలేనిది
- జార్ఖండ్ సీఎం హేమంత్‌కు ఫోన్‌లో కేసీఆర్ పరామర్శ



సాక్షి, హైదరాబాద్: ఆదివాసీల హక్కులు, ప్రాంతీయ అస్తిత్వం కోసం పోరాటం చేసిన జార్ఖండ్ ముక్తి మోర్చా అధినేత, జార్ఖండ్ మాజీ సీఎం శిబూ సొరెన్ తెలంగాణ రాష్ట్ర సాధనకు స్ఫూర్తిగా నిలిచారని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ అన్నారు. శిబూ సొరెన్ మరణం ఫెడరల్ స్ఫూర్తికి తీరని లోటన్నారు. శిబూసొరెన్‌తో తనకున్న వ్యక్తిగత అనుబంధం, రాష్ట్ర సాధన ఉద్యమానికి ఆయన అందించిన సహకారాన్ని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావ సమయంలో హైదరాబాద్‌లో జరిగిన సభకు శిబూ సొరెన్‌ను మొదటి అతిథిగా ఆహ్వానించామని చెప్పారు. ఉద్యమ సమయంలో యూపీఏ ప్రభుత్వ భాగస్వామిగా ఉన్న జేఎంఎం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఒత్తిడి చేయడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. శిబూసొరెన్ ఆత్మకు శాంతి చేకూరాలని కేసీఆర్ ప్రార్థించారు. జార్ఖండ్ సీఎం హేమంత్ సొరెన్‌కు కేసీఆర్ ఫోన్ చేసి పరామర్శించారు. శిబూసొరెన్ అంత్యక్రియలకు హాజరయ్యేందుకు మాజీమంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కోవా లక్ష్మిని పార్టీ తరఫున గౌరవ సూచకంగా పంపిస్తున్నామని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. శిబూసొరెన్ మరణం తనను తీవ్రంగా కలిచి వేసిందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పోరాటాలకు ఆయన ఎప్పటికీ మార్గదర్శకంగా నిలుస్తారన్నారు. మాజీమంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వేర్వేరు ప్రకటనల్లో శిబూ సొరెన్ మరణం పట్ల సంతాపం ప్రకటించారు.

# కాళేశ్వరం సకాలంలో పూర్తి చేస్తే వడ్డీలపై రాయితీల పరిశీలన

**లోక్‌సభలో ఎంపీ చామల ప్రశ్నకు జవాబిచ్చిన కేంద్రం**




సాక్షి, న్యూఢిల్లీ: కాళేశ్వరం సాగునీటి ఎత్తిపోతల పథకాన్ని నిర్ణీత కాలంలో పూర్తి చేస్తే వడ్డీలపై రాయితీల అంశాన్ని పరిశీలిస్తామని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కాళేశ్వరం రుణాల సేకరణకు ఏర్పాటు చేసిన స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్పీవీ) ద్వారా సేకరించిన రుణాల పునర్నిర్మాణానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం నుంచి కేంద్రానికి అభ్యర్థన అందిందని తెలిపింది. సోమవారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. విద్యుత్ మంత్రిత్వ శాఖ నుంచి అందిన సమాచారం ప్రకారం, తెలంగాణలో కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను నిర్మించడానికి ఏర్పాటు చేసిన కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ కార్పొరేషన్ లిమిటెడ్ (కేఐపీసీఎల్)కు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (పీఎఫ్‌సీ), రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ఈసీ)లు నిధులు సమకూర్చాయని కేంద్రమంత్రి తెలిపారు. ఈ ఆర్థికేతర సంస్థలు దేశీయ మార్కెట్ లేక విదేశీ సంస్థల నుంచి తీసుకునే రుణాల వడ్డీని రుణగ్రహీత సంస్థ తీసుకునే రుణ మొత్తం, సంస్థ పరపతి (గ్రేడింగ్) ఆధారంగా నిర్ణయిస్తాయి. ఆర్ఈసీ ఇప్పటికే కేఐపీసీఎల్ సంస్థ కోరిన మేరకు ప్రాజెక్టును పూర్తి చేయడానికి గడువును డిసెంబర్ 2024 నాటికి పొడిగించింది. నిర్ణీత గడువులోగా ప్రాజెక్టును పూర్తి చేస్తే వడ్డీ రాయితీ ఇవ్వడాన్ని పరిశీలిస్తామని ఆర్ఈసీ రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చిందని కేంద్రం వెల్లడించింది. ఒకవేళ రుణ చెల్లింపు గడువులో మార్పు చేసిన పక్షంలో కేఐపీఎల్‌సీఎల్ సంస్థ పరపతి తగ్గుతుందని, ఇది ఆర్‌బీఐ మార్గదర్శకాల మేరకు ఉంటుందని పేర్కొన్న విషయాన్ని కేంద్ర మంత్రి గుర్తు చేశారు.

# బీఈడీ, డీఈడీ ప్రవేశాలకు మొదటి దశ సీట్ల కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: బీఈడీ, డీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు మొదటి దశ సీట్ల కేటాయింపు పూర్తయింది. సీట్లు పొందిన అభ్యర్థుల జాబితాను సోమవారం కన్వీనర్ విడుదల చేశారు. ఈ రెండు కోర్సుల్లో కన్వీనర్ కోటా కింద మొత్తం 1659 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందుకోసం 1080 మంది అభ్యర్థులు వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. వీరిలో 956 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 8వ తేదీ లోపు రిపోర్ట్ చేయాలని కన్వీనర్ స్పష్టం చేశారు. ఆగస్టు 11 నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం వెబ్‌సైట్ చూడాలని సూచించారు.

# సోషల్ మీడియాను గౌరవించాలి

**మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి**



మునుగోడు: ప్రజల కోసం పనిచేస్తున్న సామాజిక మాధ్యమాలను గౌరవించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఎక్స్‌లో తన అభిప్రాయం వ్యక్తం చేశారు. 'సామాజిక బాధ్యతతో పనిచేస్తున్న సోషల్ మీడియాను పాలకులు గౌరవించాలి తప్ప అవమానించడం సబబు కాదు. తెలంగాణ సమాజ ఆకాంక్షల మేరకు సోషల్ మీడియా తొలి నుంచి తన శక్తికొద్దీ పనిచేస్తుంది. నిబద్ధతతో పనిచేసే సోషల్ మీడియా జర్నలిస్టులకు నా మద్దతు ఎప్పుడూ ఉంటుంది. సోషల్ మీడియా జర్నలిస్టులను దూరం పెట్టాలంటూ ప్రధాన మీడియా వారిని ఎగదోయడం ముమ్మాటికి విభజించి పాలించడమే. ఇలాంటి కుటిల పన్నాగాలను తెలంగాణ సమాజం సహించదు' అని పోస్టు చేశారు.

# 'సృష్టి' కేసులో మరో డాక్టర్ అరెస్టు

- ఇప్పటివరకు అరెస్టు అయిన నిందితుల సంఖ్య 15
- బాధితుల ఫిర్యాదుతో మరో ఐదు కేసులు నమోదు

సాక్షి, హైదరాబాద్ : సరోగసీ పేరుతో శిశువుల అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడిన యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో గోపాలపురం పోలీసులు మరో డాక్టర్‌ను అరెస్టు చేశారు. వ్యక్తిగత పనుల మీద హైదరాబాద్‌కు వచ్చిన డాక్టర్ విజ్జు లతను సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈమె అరెస్టుతో ఈ కేసులో ఇప్పటి వరకు కటకటాల్లోకి చేరిన వారి సంఖ్య 15కు చేరింది. మరోపక్క డాక్టర్ నమ్రత తమను మోసం చేసిందంటూ మరో ఐదుగురు బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదు చేశారు. సరోగసీ కోసం హైదరాబాద్‌లోని సృష్టి సెంటర్‌ను ఆశ్రయించిన వారిని నమ్రత విశాఖపట్నంలోని బ్రాంచ్‌కు పంపేది. అక్కడ కీలకంగా వ్యవహరించిన డాక్టర్ విజ్జు లత వారికి హార్మోన్ ఇంజెక్షన్లు ఇవ్వడం తదితరాలు చేసేది. నమ్రత విచారణలో ఈ విషయం గుర్తించిన దర్యాప్తు అధికారులు విజ్జు లత కోసం గాలించారు. అయితే నమ్రత గ్యాంగ్ అరెస్టు విషయం తెలియడంతోనే ఆమెతోపాటు అనేక మంది ఏజెంట్లు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. నమ్రత చేతిలో మోసపోయిన మరో ఐదుగురు బాధితులు గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసుల్లోనే విజ్జు లతను అరెస్టు చేశారు. సరోగసీ పేరుతో ఒప్పందాలు చేసుకున్న నమ్రతకు రూ.11 లక్షలు, రూ.15 లక్షలు, రూ.13 లక్షలు చొప్పున ఆ ముగ్గురు, మరో జంట రూ. 20 లక్షలు చెల్లించినట్టు ఫిర్యాదు చేయగా, కేసులు నమోదు చేశారు. నమ్రతతో పాటు ఇతర నిందితులను ప్రిజనర్స్ ట్రాన్సిట్ వారెంట్‌పై అరెస్టు చేయడంతో పాటు కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకుని విచారించాలని నిర్ణయించారు. రాజస్తాన్ మహిళ ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో నమ్రత పోలీసు కస్టడీ మంగళవారంతో ముగియనుంది. ఆపై ఇతర కేసుల్లో అరెస్టు, కస్టడీ ప్రక్రియలు చేపట్టనున్నారు. నమ్రత ఫెర్టిలిటీ సెంటర్ నిర్వహణ లైసెన్స్‌ను తెలంగాణ మెడికల్ కౌన్సిల్ 2021లో పొడిగించలేదు. దీంతో తాను ఆ వృత్తి నిర్వహించట్లేదంటూ నమ్రత లేఖ కూడా ఇచ్చారు. సికింద్రాబాద్‌లోని గోపాలపురంలో నాలుగు అంతస్తుల భవనంతోపాటు మరో మూడు చోట్లా అక్రమంగా యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ నిర్వహిస్తున్నారు. అయితే తన పేరుతో కాకుండా డాక్టర్ సూరి శ్రీమతి పేరుతో ముద్రించిన లెటర్ హెడ్స్‌తో కథ నడిపించారు. ఈ సూరి శ్రీమతి వయస్సు ప్రస్తుతం 94 ఏళ్లు అని, ఆమెకు తెలియకుండానే నమ్రత ఈ పని చేసినట్టు గుర్తించిన గోపాలపురం పోలీసులు ఈ మేరకు వాంగ్మూలాలు నమోదు చేశారు. నమ్రతకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లతో సహా మొత్తం ఆరు రాష్ట్రాల్లో ఏజెంట్లు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. వీరి ద్వారానే మగ శిశువును గరిష్ఠంగా రూ.4.5 లక్షలు, ఆడ శిశువును గరిష్ఠంగా రూ.3.5 లక్షలకు ఖరీదు చేస్తోందని, వారిని సరోగసీ పేరుతో రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. ఈ ఏజెంట్ల కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

# ఇసుక దారి మళ్లకుండా?

▶ మొదటి పేజీ తరువాయి


పర్యవేక్షించేందుకు వీలుగా హైవేలు, రాష్ట్ర రహదారుల వెంబడి ఆటోమేటెడ్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్‌పీఆర్) సాంకేతికతతో కూడిన సీసీ కెమెరాలను అమర్చేందుకు టీజీఎండీసీ కసరత్తు చేస్తోంది. ఈ మేరకు పైలట్ ప్రాజెక్టు కింద కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, భద్రాచలంలో రెండు చోట్ల ఐదు పాయింట్లను ఎంపిక చేసింది. ఇందుకోసం ఏఎన్‌పీఆర్ సాంకేతికతగల సీసీ కెమెరాలు, హైస్పీడ్ ఇంటర్నెట్, విద్యుత్ సదుపాయాలు సమకూర్చుకుంటోంది. సీసీ కెమెరాలు అమర్చేందుకు కావాల్సిన అనుమతుల కోసం ఇప్పటికే రాష్ట్ర హైవేలు, జాతీయ రహదారుల ఉన్నతాధికారులకు లేఖలు రాసింది.

**ఏ వాహనం ఎప్పుడు, ఎటు వెళ్తోందో తెలుసుకొనేలా..**

ఏఎన్‌పీఆర్ సీసీ కెమెరాల ద్వారా ఇసుక లారీల కదలికలను హైదరాబాద్‌లోని టీజీఎండీసీ కేంద్ర కార్యాలయం నుంచి పర్యవేక్షించేలా అధికారులు కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. రీచ్ నుంచి ప్రతి వాహనం ఎప్పుడు బయల్దేరింది? ఏ దిశగా వెళ్తోందనే విషయాన్ని అక్కడి నుంచే ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు. వాస్తవానికి ఈ ప్రాజెక్టు నెల రోజుల కిందే ప్రారంభం కావాల్సి ఉండగా వర్షాల కారణంగా ఆలస్యంగా నడుస్తోందని అధికారులు తెలిపారు. పైలట్ ప్రాజెక్టు కోసం ఎంపిక చేసిన జిల్లాల్లో పర్యవేక్షణ అనంతరం అందులో తలెత్తే లోపాలు, సవాళ్లను అధ్యయనం చేసి ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఇదే మోడల్‌ను అమలు చేసేందుకు టీజీఎండీసీ అధికారులు సిద్ధమవుతున్నారు.

# తెలంగాణ వ్యతిరేకుల చేతిలో పావులా కాంగ్రెస్

**మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మండిపాటు**




సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వ్యతిరేకుల చేతిలో కాంగ్రెస్ పార్టీ పావులా మారిందని, వారు ఎలా చెబితే అలా పనిచేస్తోందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో సోమవారం నిరంజన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. 'కాళేశ్వరం సైట్ ఎందుకు మార్చారన్నది రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ఒక నివేదిక అందజేసింది. తెలంగాణ గొంతు తడపడానికే ఈ ఎత్తిపోతలు చేపట్టాం. చంద్రబాబు, వైఎస్‌ల హయాంలో ఉమ్మడి ఆంధ్రాలో కట్టిన ఏ రిజర్వాయర్లకూ అనుమతులు లేవు. అనుమతులన్నీ ఉన్న కాళేశ్వరంపై విషం చిమ్ముతున్నారు. తెలంగాణ విజయాలను వైఫల్యాలుగా చిత్రీకరించడానికి ఒక సెక్షన్ మీడియా నిరంతరం ప్రయత్నిస్తోంది' అని నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. 'బనకచర్ల నీళ్లను మలిపేందుకే కాళేశ్వరంపై కక్షగట్టారు. జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను యథాతథంగా ఎందుకు బహిర్గతం చేయలేదు? కమిషన్ నివేదిక ఫైనల్ కాదు దాని మీద కోర్టుకు వెళ్లొచ్చు. మేడిగడ్డలో కుంగింది మూడు పిల్లర్లయితే 3 బ్యారేజీలు కూలిపోయాయని మంత్రి చెప్పడం దుర్మార్గం. రూ.400 కోట్లు తామే భరిస్తామని, మరమ్మతులు చేస్తామని నిర్మాణ సంస్థ ముందుకొస్తే ఎందుకు అడ్డుకున్నారు?' అని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు చిరుమళ్ల రాకేశ్‌కుమార్, అభిలాష్ రంగినేని, తదితరులు పాల్గొన్నారు.



సామాన్య మానవులు కేవలం తమ సమయాన్ని ఎలా వెచ్చించాలా అని ఆలోచిస్తారు; ప్రతిభావంతుడు దాన్ని 'ఉపయోగించుకోవడానికి' ప్రయత్నిస్తాడు.
– ఆర్థర్ షోపెన్‌హావర్



సాక్షి
మంగళవారం, 5 ఆగస్టు 2025

# ప్రజ్వల్‌కు సరైన శిక్ష

డబ్బూ పలుకుబడీ జతగూడితే ఎన్ని నేరాలకు కారణమవుతుందో, ఎన్ని వికారాలకు ఆస్కారమిస్తుందో దాదాపు ఇరవయ్యేళ్లక్రితం అమెరికాలో ప్రముఖ ఫైనాన్షియర్ జెఫ్రీ ఎపిస్టిన్ ఉదంతం రుజువు చేసింది. ఈ రెండింటికీ రాజకీయాధికారం తోడైతే ఏమవుతుందో కర్ణాటక జేడీఎస్ మాజీ ఎంపీ, మాజీ ప్రధాని దేవెగౌడ మనుమడు ప్రజ్వల్ రేవణ్ణ నిరూపించారు. ఒక మహిళపై అత్యాచారం చేసిన కేసులో ప్రజ్వల్‌కు యావజ్జీవ శిక్ష విధిస్తూ కోర్టు ఇచ్చిన తీర్పు ఇప్పుడు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ప్రజ్వల్ ఒక రాజకీయ నాయకుడే కాక మాజీ ప్రధాని దేవెగౌడకు మనుమడు కావటం, తండ్రి మాజీ మంత్రి, ఎమ్మెల్యే అవడం, అతని బాబాయ్ కుమారస్వామి లోగడ ముఖ్యమంత్రిగా పనిచేయటంతోపాటు ప్రస్తుతం కేంద్రమంత్రిగా వుండటం, తమ్ముడు ఎమ్మెల్సీ కావటం వంటివి ఈ సంచలనానికి కారణమైతే కావొచ్చు గానీ... అంతకన్నా ఎక్కువగా ప్రజ్వల్ దురంతాలు ప్రజల్ని దిగ్భ్రాంతిపరచటం అసలు కారణం. ఒకరు కాదు... ఇద్దరు కాదు, పదులకొద్దీ మంది ప్రజ్వల్ అఘాయిత్యాలకు బలైపోయారు. అతని ఘోరాలకు సంబంధించి 3,000 వీడియోలు ప్రచారంలోకొచ్చాయంటే అతని దుర్మార్గం ఎంతటిదో ఊహించవచ్చు. తమనేమీ చేయొద్దని, కనికరించి వదిలేయాలని బాధిత మహిళలు వేడుకోవటం వంటి హృదయవిదారక దృశ్యాలు ఈ వీడియోల్లో ఉన్నాయంటున్నారు. తన ఘన కార్యాన్ని తానే వీడియో తీసి బాధితుల్ని బ్లాక్‌మెయిల్ చేయటం ప్రజ్వల్‌కు అలవాటు. ఆ వీడియోలు, ఫొటోలు చూసి 70 మంది బాధిత మహిళలను గుర్తించగలిగినా వారిలో కేవలం అయిదుగురు మాత్రమే ఫిర్యాదులీయటానికి ముందుకొచ్చారు. అందులో ఒక కేసులో ప్రస్తుతం ప్రజ్వల్‌కు శిక్షపడింది.

ఈ నేరాలు గుట్టుచప్పుడు కాకుండా జరగలేదు. కుటుంబంలో వీటికి సంబంధించి తీవ్రస్థాయిలో వాగ్యుద్ధాలవుతున్నాయని మీడియాలో కథనాలొచ్చాయి. కానీ ప్రజ్వల్‌ను చట్టానికి అప్పగించాలని కుటుంబంలో ఏ ఒక్కరూ భావించకపోవటం ఆశ్చర్యం కలిగిస్తుంది. అంతే కాదు... ప్రజ్వల్ తల్లిదండ్రులు బాధితుల్ని బెదిరించిన వైనం వెల్లడైంది. శిక్ష తప్పదనుకున్న ప్రజ్వల్ కొన్నాళ్లు విదేశాలకు పరారయ్యాడు. చిత్రమేమంటే ఇతర పార్టీలకు సైతం ఉప్పందినా అవి సైతం మౌనంగానే ఉన్నాయి. చివరకు ఒక మహిళా సంఘం ఫిర్యాదు చేయాల్సివచ్చింది. మరి పార్టీలున్నది దేనికి? ఆ ఫిర్యాదుపై రాష్ట్ర మహిళా కమిషన్ వేగంగా స్పందించి, డీజీపీకి ఆదేశాలివ్వటంతో అంతా బయటికొచ్చింది. రాజకీయంగా శక్తిమంతమైన కుటుంబంతో ఢీకొట్టి నట్టవుతుందని భయపడి బాధితుల్లో అత్యధికులు ఫిర్యాదు చేయటానికి ముందుకు రాలేదు సరి కదా... వారిలో చాలామంది ఏకంగా హసన్ నగరం నుంచి మకాం మార్చేశారు. ప్రఖ్యాత అమెరికన్ క్రిమినాలజిస్టు ఫ్రెడా అడ్లర్ ఒక సందర్భంలో బాధితులే దోషులుగా మారే ఏకైక నేరం అత్యాచారమేనన్నారు. బాధితులు ఎందుకంత భయపడ్డారో ఈ వ్యాఖ్యే చెబుతుంది. విచారణ పేరిట నిండు న్యాయస్థానంలో అవమానాలు పొంది, న్యాయమూర్తి నుంచే దుర్వ్యాఖ్యానాలు ఎదురైన మహిళలు తక్కువేమీ కాదు. ఇందుకు మన దేశం కూడా మినహాయింపు కాదు.

ఈ కేసులో నిష్పక్షపాతంగా వ్యవహరించి డీఎన్ఏ ఆధారాలతో సహా పకడ్బందీ సాక్ష్యాధారాలు సేకరించినందుకు, త్వరితగతిన విచారణ పూర్తికావటానికి దోహదపడినందుకు కర్ణాటక పోలీసు విభాగాన్ని అభినందించాలి. ప్రజ్వల్ ఉదంతంలో వీడియోలను ప్రచారంలో పెట్టి బాధితుల్ని మరింతగా వేధించిన ఇతరులను సైతం బోనెక్కించాలి. డబ్బూ, పలుకుబడి గల నిందితులకు శిక్ష పడేలా చేస్తే, సమాజంలో ఇతరులూ భయపడతారు. కర్ణాటకలో గతంలో కూడా కొందరు నాయకుల ఉదంతాలు వెల్లడైనా అవి పోలీసుల వరకూ రాలేదు. ఆ రాష్ట్రంలో అసెంబ్లీ సమావేశాల్లో అభ్యంతరకర వీడియోలు వీక్షిస్తూ ఎమ్మెల్యేలు లైవ్ కెమెరాలకు చిక్కిన సందర్భాలున్నాయి. బలహీనులపై అధికారం చలాయించటం, వారిని కనీసం మనుషులుగా గుర్తించకపోవటం స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా మన దేశంలో యథేచ్ఛగా సాగిపోతోంది. ఆ బలహీనులు మహిళలైతే ఇక చెప్పేదేముంది?

వందలమంది బాలికలపైనా, మహిళలపైనా లైంగిక నేరాలకు పాల్పడిన ఎపిస్టిన్ 2019లో న్యాయ విచారణ మొదలుకావడానికి ముందే నిర్బంధంలో ఉండగా ఆత్మహత్య చేసుకున్నాడు. అతగాడికి ఒకప్పుడు సన్నిహితులైన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, బ్రిటిష్ రాజవంశీకుడు ప్రిన్స్ ఆండ్రూ తదితరుల్ని ఆ పాపం ఇప్పటికీ వెన్నాడుతోంది. ట్రంప్ అయితే తరచూ సంజాయిషీ ఇచ్చుకోక తప్పడం లేదు. మన దేశంలో కూడా మహిళలపై నేరాలు చేసే బడాబాబులు కటకటాల వెనక్కిపోయినప్పుడే నిజమైన న్యాయం, ప్రజాస్వామ్యం వర్ధిల్లుతున్నట్టు లెక్క!

## గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, **తిథి:** శు.ఏకాదశి ప.11.23 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** జ్యేష్ఠ ఉ.10.48 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** రా.7.25 నుండి 9.09 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.18 నుండి 9.08 వరకు, తదుపరి రా.10.55 నుండి 11.41 వరకు, **అమృత ఘడియలు:** ఉ.8.25 నుండి 9.07 వరకు, మతత్రయ ఏకాదశి

సూర్యోదయం : 5.43
సూర్యాస్తమయం: 6.29
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

## సోషల్ టాక్

### వెనక్కి వద్దు



పేజీ వెనక్కి తిప్పటానికి వీలు లేని ఒక పుస్తకాన్ని చదువుతున్నట్లు ఊహించుకోండి. మీరు దాన్ని ఎంత జాగ్రత్తగా చదువుతారు? అదే జీవితం! ఏ రోజు జీవితం ఆ రోజుదే. ఒక్క రోజునైనా వెనక్కు తిప్పలేం.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

### అన్నీ ఉండాలి



మనందరిలో అసాధారణ సామర్థ్యం ఉంది. సరైన వాతావరణం, వనరులు, నైపుణ్యాలు జ్ఞానం ఉంటే, 'సాధారణ' వ్యక్తులు సైతం అసాధారణ ఫలితాలను సాధించగలరు.

– కెవిన్ ఐకెన్‌బెర్రీ, చీఫ్ పొటెన్షియల్ ఆఫీసర్, ఐకెన్ బెర్రీ గ్రూప్

### నిశ్చయమే బలం



విజయం అనేది గెలవటం లేదా ఓడిపోవటం కాదు. అది మీరు అనుకోవటాన్ని బట్టి ఉంటుంది. మీరు ఓటమిని అంగీకరిస్తే మీరు ఓడిపోయినట్లు. మీరు దృఢ నిశ్చయంతో ఉంటే మీ గెలుపు పోరు ఇంకా కొనసాగుతున్నట్లు!

– డా॥ వివేక్ బింద్రా, మోటివేషన్ స్పీకర్

### మీ చుట్టూ శక్తి!



కష్టపడి పని చేయండి. ఆశను వదులుకోకండి. విమర్శలను స్వీకరించండి. నిరంతరం నేర్చుకుంటూ ఉండండి. మీ చుట్టూ సంతోషాన్నీ, ఆప్యాయతనూ ఉండనివ్వండి. అప్పుడు మీరు సాధించాలనుకున్న దానికి మీకు శక్తి, ఉత్సాహం అందుతాయి.

– సోనూ సిన్హా, కార్పొరేట్ ట్రైనర్

### కొత్తగా ఉండాలి



ఇప్పటి వరకు ఎవరూ చేయని పనిని మీరు చేయాలనుకున్నప్పుడు, మీ సంకల్పం మీ హృదయం నుండి వచ్చిన తర్వాత... మీరు ఏమీ చేయనవసరం లేదు. మీ సంకల్పం మీ శరీరం నుంచి తోడ్పాటును అందుకోవటం ద్వారా మీ చేత దేనినైనా చేస్తుంది.

– సందీప్ మహేశ్వరి, మోటివేషనల్ స్పీకర్

### సహాయ హస్తం



భూమిపై మన పని విమర్శించడం, తిరస్కరించడం లేదా తీర్పు చెప్పడం కాదు. సహాయ హస్తం, కరుణ, దయను అందించడం! ఇతరులు మనకు ఎలా సహాయం చేయాలని ఆశిస్తున్నామో మనమూ వారికి అలాగే మన చేయిని అందించాలి.

– డానా అర్కురి, రచయిత్రి

# పాటుపడనిదే ఫలితం రాదు!

విశ్వ గురు



అమెరికాలోని లాస్ ఏంజెలస్‌లో ఉన్న యు.ఎస్.సి. మార్షల్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో అండర్ గ్రాడ్యుయేట్ విద్యను పూర్తి చేసుకున్న 2014వ సంవత్సరపు బ్యాచ్‌ను ఉద్దేశించి ఆ సంవత్సరం మే నెలలో పారిశ్రామికవేత్త ఎలాన్ మస్క్ చేసిన ప్రసంగ పాఠం:

ధన్యవాదాలు.

నేను చెప్పగలిగినవి, అత్యంత ఉపయోగకరమైనవి, ఏవైనా ఉంటే చెప్పవలసిందని నాకు సుమారు ఐదు నుంచి ఆరు నిమిషాల సమయం ఇచ్చారు. వీలైనంత ప్రయత్నిస్తాను. ఏవైనా మూడు అంశాలకు పరిమితం కావలసిందని కూడా నాకు సూచించారు. నేను నాలుగు అంశాలు చెప్పాలనుకుంటున్నాను. అవి చాలా ముఖ్యమైన అంశాలని నేను భావిస్తున్నాను. వాటిలో కొన్ని ఇంతకు ముందు మీరు విన్నవి కూడా కావచ్చు. కానీ, వాటి గురించి మళ్ళీ చెప్పుకోవడంలో తప్పు లేదు.

### కష్టపడి పనిచేయాలి!

మొదటిది – కృషి చేయడం! మీరు ఒక పనిని ఎంత బాగా చేయాలనుకుంటున్నారో, దాని కోసం అంతగా కృషి చేయాలి. మీరు ఒక కంపెనీని నెలకొల్పదలిస్తే, దానికి సంబంధించి మీరు ఇంకా ఎక్కువ పాటుపడాలి. ఎంతగా అంటారా... నేను, నా సోదరుడు కలసి మొదటి కంపెనీని ప్రారంభించినపుడు, అపార్ట్‌మెంట్ తీసుకోవడానికి బదులు, ఒక చిన్న ఆఫీసును అద్దెకు తీసుకున్నాం. అక్కడే సోఫాలో పడుకునేవాళ్ళం. స్నానాలు, నిత్యకృత్యాలు వై.ఎం.సి.ఎ.లో కానిచ్చేసే వాళ్ళం. ఎంత కష్టపడ్డామంటే, ఒకటే కంప్యూటర్ ఉండేది. పగటి పూట వెబ్‌సైట్‌కి వాడుకునేవాళ్ళం. కోడింగ్ పని నేను రాత్రిపూట చేసేవాడిని. వారంలో 7 రోజులూ, మొత్తం సమయాన్ని దానికే వెచ్చించేవాళ్ళం.

నా సంగతి తెలుసుగా! నాకో గర్ల్ ఫ్రెండ్ ఉండేది. నాతో ఉండటం కోసం, ఆమె కూడా ఆఫీసులోనే పడుకునేది. కనుక కష్టపడాలి. మెలకువగా ఉన్నంతసేపూ పని చేస్తూనే ఉండాలి. అదే నేను చెప్పదలచుకుంది. ముఖ్యంగా మీరు ఏదైనా కంపెనీ ప్రారంభించాలంటే శ్రమించక తప్పదు. ఏమీ లేదు. చిన్న లెక్కే. ఎవరన్నా వారి సంస్థ కోసం వారానికి 50 గంటలు పని చేస్తున్నారనుకుందాం. మీరు 100 గంటలు పని చేయాలి. ఫలితంగా,

> ఏమీ లేదు. చిన్న లెక్కే! ఎవరన్నా వారి సంస్థ కోసం వారానికి 50 గంటలు పనిచేస్తున్నారనుకుందాం. మీరు 100 గంటలు పని చేయాలి. ఫలితంగా, రెండింతల పని పూర్తవుతుంది.

రెండింతల పని పూర్తవుతుంది. తర్వాత కాలంలో, ఆ ఇతర కంపెనీలలా పనిచేసినా ఫరవాలేదు.

### గొప్ప బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలి!

రెండవ సంగతి. మీరు ఏదైనా కంపెనీ ప్రారంభిస్తున్నా లేదా ఏదైనా కంపెనీలో చేరదలచుకున్నా కూడా ప్రజ్ఞావంతుల సాహచర్యం లభించేటట్లు చూసుకోండి. పెట్టదలచుకుంటే ప్రతిభావంతులతో కంపెనీ పెట్టండి లేదా మీరు గౌరవించే ప్రతిభావంతులున్న కంపెనీలో చేరండి. కంపెనీ అంటే ఏమిటి? ఒక వస్తువును తయారు చేసేందుకు లేదా ఒక సేవను అందించేందుకు కొంతమంది ఒకచోట చేరి, కలసికట్టుగా పనిచేయడం. అంతేనా? ఒక బృందంలోనివారి శక్తియుక్తులు, కష్టపడి పనిచేసే తత్త్వం, సరైన దిశలో సమన్వయంతో, సమష్టిగా దృష్టి కేంద్రీకరించి పని చేయడాన్ని బట్టి ఆ కంపెనీ విజయం ఆధారపడి ఉంటుంది.

అందుకని, కంపెనీని నెలకొల్పదలిస్తే, గొప్ప వ్యక్తులందరినీ ఒక చోట చేర్చేందుకు ఏం చేయాలో అంతా చేయండి.

### పూర్తిగా మీ పని మీదే దృష్టి పెట్టాలి!

హంగు ఆర్భాటాలకన్నా శ్రేష్ఠతపై దృష్టి పెట్టడం మూడవ అంశం. చాలా కంపెనీలు ఈ విషయంలో గందరగోళంగా ఉంటాయి. వస్తువును మెరుగుపరచడానికి, వాస్తవానికి ఏ విధంగానూ తోడ్పని అంశాలపై అవి పెద్ద మొత్తంలో ద్రవ్యాన్ని వెచ్చిస్తూంటాయి. మేం 'టెస్లా'లో ఎన్నడూ అడ్వర్టయిజింగ్ కోసం ఖర్చు పెట్టింది లేదు. కారును వీలైనంత గొప్పదిగా తీర్చిదిద్దేందుకు డిజైన్, తయారీ, పరిశోధన–అభివృద్ధి విభాగాలపైనే మొత్తం డబ్బు వెచ్చించాం. పయనించాల్సింది ఆ మార్గంలోనేనని అనుకుంటున్నా.

ఆ మాటకొస్తే ఏ కంపెనీ విషయంలోనైనా సరే, "మనం చేస్తున్న ప్రయత్నాలు ప్రజల ఆశలను ప్రతిఫలిస్తున్నాయా? వాటి వల్ల మెరుగైన ఉత్పత్తి ఒనగూడుతోందా? సేవలు సమకూరుతున్నాయా?" అని నిరంతరం ఆలోచిస్తూనే ఉండండి. లేదని భావిస్తే, ఆ ప్రయత్నాలకు అంతటితో స్వస్తి పలకండి.

### ట్రెండ్స్‌ను ఫాలో కావొద్దు!

చివరగా చెప్పదలచుకున్నది ఏమంటే, గొర్రెదాటు మనస్తత్త్వం వద్దు. వర్తమాన ధోరణిని పరిశీలించాల్సిందే. కానీ, దాన్ని గుడ్డిగా అనుసరించ కూడదు. భౌతిక శాస్త్ర దృక్పథంతో చూడటం అన్నమాట. పోల్చి చూసి ఒక నిర్ణయానికి రావడం కన్నా, ఆ వస్తువుల మూలాల్లోకి వెళ్ళాలి. అత్యంత మౌలిక సత్యాలను తెలుసుకునేందుకు ఎంతవరకు అన్వేషించగలరో అంతవరకు అన్వేషించండి. తార్కికతను అక్కడ నుంచి వర్తింపజేయండి. ఒక వస్తువును సృష్టించడంలో లేదా ఏదైనా ఒక పని చేయడంలో ప్రయోజనం ఏమైనా ఉందా లేక మిగిలిన వాళ్ళందరూ చేస్తున్నారు కనుక మనమూ అదే పనిచేస్తున్నామా అని తెలుసుకునేందుకు అదే సరైన మార్గం. ఆ విధంగా ఆలోచించడం కష్టం. అన్నింటి విషయంలోనూ అలాగే ఆలోచించలేం. దానికి చాలా కృషి చేయాలి. ఒప్పుకుంటాను. కానీ, మీరు ఏదైనా కొత్తది చేయదలచుకున్నప్పుడు, అదే ఉత్తమ మార్గం. అది అంతరాత్మ ప్రబోధాలకు వ్యతిరేకమైన అంశాలను అర్థం చేసుకునేందుకు భౌతికశాస్త్రం అభివృద్ధి చేసిన చట్రం. క్వాంటమ్ మెకానిక్స్ లాగా అది చాలా చాలా శక్తిమంతమైన పద్ధతి.

### రిస్క్ తీసుకోవాలి!

అదీ సంగతి. ఇంకొక్కటి చెప్పదలచుకున్నాను. మీరు రిస్క్ తీసుకోవడాన్ని నేను ప్రోత్సహిస్తాను. అందుకు ఇదే సరైన సమయం. మీకు పిల్లాజెల్లా లేరు. బరువు బాధ్యతలు లేవు. మీలో కొందరికి బరువు బాధ్యతలు ఉంటే ఉండవచ్చు. బహుశా పిల్లలు మాత్రం ఉండి ఉండరు. వయసు పెరుగుతున్న కొద్దీ బరువు బాధ్యతలు కూడా పెరుగుతాయి. మీకో కుటుంబం ఏర్పడ్డాక, రిస్కులు తీసుకోవడం ప్రారంభిస్తే, మీతోపాటు మీ కుటుంబంలోని వారు కూడా ఆ రిస్కులను స్వీకరిస్తున్నట్లు లెక్క. ఫలిస్తాయో లేదో తెలియని వాటిని ప్రయత్నించి చూడటం కష్టమవుతుంది. కనుక, సాహసించేందుకు ఇదే తగిన సమయం. బరువు బాధ్యతలు మీద పడకముందే, తెగించండి. ఏమైతే అదవుతుంది అనుకోండి. ధైర్యంగా అడుగు ముందుకు వేయండి. ఈ విషయంలో మీ భుజం తట్టేందుకు నేను రెడీ. చేసిన పనికి చింతించాల్సిన అవసరం ఉండదు. థ్యాంక్యూ.

> గొర్రెదాటు మనస్తత్త్వం వద్దు. వర్తమాన ధోరణిని పరిశీలించాల్సిందే. కానీ, దాన్ని గుడ్డిగా అనుసరించకూడదు. పోల్చి చూసి ఒక నిర్ణయానికి రావడం కన్నా, ఆ వస్తువుల మూలాల్లోకి వెళ్ళాలి.

నా మాటలు మీకేమైనా ఉపయోగపడతాయో లేదో నాకు తెలియదు. మంచి విషయాలే మాట్లాడుకున్నాం అనుకుంటా!

# బీసీలకు వారి వాటా వారికి దక్కాల్సిందే!

అభిప్రాయం



చనగాని దయాకర్

భారత రాజ్యాంగం తన పౌరుల సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయానికీ; భావ ప్రకటనా స్వేచ్ఛకూ, మత విశ్వాసాలకూ సమాన హోదా, అవకాశాలూ లభ్యమవుతాయన్న భరోసా ఇచ్చింది. అయితే, రాజ్యాంగం ప్రమాణం చేసిన ఈ భరోసా దేశ ప్రజలందరికీ అమలులో సమానంగా అందకపోవడం వల్ల ఎందరో వెనుకబడి ఉన్నారు. అందులో ఎస్టీ, ఎస్సీలతో బాటు వెనుకబడిన కులాలవారూ (బీసీలు) ఉన్నారు. బీసీల జనాభా ప్రస్తుతం ఎంత ఉంది అనేది తెలియకపోవడం వల్ల వారి అభ్యున్నతికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కచ్చితమైన చర్యలు తీసుకోవడానికి వీలు లేకుండా పోతోంది. అందుకే కాంగ్రెస్ పార్టీ బీసీ జనగణన జరగాలని కేంద్రంపై ఒత్తిడి తెచ్చింది. కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో బీసీ జనగణనను పూర్తిచేయడమూ తెలిసిందే. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లను బీసీలకు కల్పించాలని తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసింది. అయితే తెలంగాణలో బీసీ జాబితాలో 'ఈ'గ్రూపులో ముస్లింలు ఉన్నారన్న సాకు చూపి 42% రిజర్వేషన్లను ఇవ్వడానికి బీజేపీ వ్యతిరేకిస్తోంది.

మన రాజ్యాంగంలోని అధికరణం 15(4), ఎస్సీ, ఎస్టీలకే కాదు, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన ప్రజానీకం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టే అవకాశాన్ని కల్పించింది. అధికరణం 16(4) ప్రకారం ప్రభుత్వ శాఖలలో, వివిధ వెనుకబడిన తరగతులకు తగినంత ప్రాతినిధ్యం లభించలేదని రాష్ట్ర ప్రభుత్వం గనుక భావిస్తే ప్రత్యేక చర్యలు తీసుకోవచ్చు. దీని అర్థం ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే బీసీలకు రిజర్వేషన్లు గాని లేదా వారి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు కానీ తీసుకోవచ్చన్నమాట.

> దేశంలో అనేక రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమాల్లో బీజేపీ, లేదా దాని సోదర సంస్థల ప్రమేయం ఉంది. అదే ధోరణిని 2025 లోనూ కొనసాగిస్తూ... స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వాలన్న డిమాండ్‌ను తిరస్కరిస్తోంది.

పుట్టుక కారణంగానో, ఇతర కారణాల రీత్యానో ఉన్నత స్థానంలో ఉన్నవారు అనుభవించే స్వేచ్ఛ, అందుకుంటున్న అభివృద్ధి ఫలాలు... వెనుకబడిన కులాలు కూడా సమానంగా అనుభవించాలి. 'సాంఘిక, ఆర్థిక అసమానతలు ఉన్నప్పుడు రాజకీయ స్వాతంత్ర్యం లేదా ప్రజాస్వామ్యం విజయవంతం కాదని' అంబేడ్కర్ అన్నారు. ఇంతటి పవిత్ర కర్తవ్య నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్నే అపహాస్యం చేస్తోంది.

రాజకీయ శక్తిని సముపార్జించుకొన్నవారే సామాజిక, ఆర్థిక రంగాల్లో త్వరితగతిన పురోగతి సాధించిన విషయం చారిత్రకంగా నిరూపితమైంది. వెనుకబడిన తరగతుల ప్రజానీకం కూడా ఉన్నత వర్గాలతో సమానంగా అభివృద్ధి చెందాలంటే విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు ఒక్కటే చాలదు. ఆర్థిక రాయితీలు మాత్రమే సరిపోవు. రాజకీయ రంగంలో రిజర్వేషన్లు కల్పించవలసిందే. జనాభా దామాషా ప్రకారం రాజకీయ రంగంలో బీసీలకు ప్రాతినిధ్యం లభించకపోవడం ఏ విధంగానూ న్యాయం కాదు.

1985 గుజరాత్‌లో రిజర్వేషన్ల వ్యతిరేక పోరాటంలో, 1986 ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వడానికి వ్యతిరేకంగా 'సేవ్ మెరిట్' ఉద్యమంలో, 1990ల్లో మండల్ కమిషన్ వ్యతిరేక ఉద్యమంలో... ఇలా దేశంలో అనేక రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమాల్లో బీజేపీ, లేదా దాని సోదర సంస్థల ప్రమేయం ఉంది. అదే ధోరణిని 2025లోనూ కొనసాగిస్తూ... స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వాలన్న డిమాండ్‌ను బీజేపీ తిరస్కరిస్తోంది. దీనిపై కాంగ్రెస్ పోరాడుతుంది.

వ్యాసకర్త టీపీసీసీ జనరల్ సెక్రటరీ

# మొండి బాకీలు గొడ్డలిపెట్టు

ఇన్ బాక్స్

భారత ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)లు అభివృద్ధి చెందాలంటే, స్థూల నిరర్థక ఆస్తులను (జీఎన్ పీఏ)లను తగ్గించాలి. ఆ దిశలో కొంత కృషి జరిగిన మాట నిజమే కానీ మరింత పకడ్బందీగా వ్యవహరించవలసి ఉంది. 2018 ఆర్థిక సంవత్సరంలో గరిష్ఠంగా జీఎన్ పీఏ నిష్పత్తి 11.2 శాతానికి చేరింది. క్రమంగా తగ్గుతూ 2025 ఆర్థిక సంవత్సరంలో ఇది 2.58 శాతానికి వచ్చింది. బ్యాంకులు అనుసరిస్తున్న మెరుగైన రుణ మదింపు, కఠినమైన నియంత్రణ పర్యవేక్షణతోటు దేశవ్యాప్తంగా తయారీ, సేవల రంగాల్లో వృద్ధి నమోదవుతుండటంతో ఈ పురోగతి సాధ్యమైంది.

ప్రతిసారీ బ్యాలెన్స్ షీట్లను క్లియర్ చేయడానికి రుణాల రైట్–ఆఫ్ బ్యాంకులకు ఒక సాధనమైంది. అయితే అధిక మొత్తంలో రుణమాఫీలు సరికాదు. ఇవి జీఎన్ పీఏ గణాంకాలను తగ్గించి, మూలధన వినియోగాన్ని నియంత్రించేలా చేస్తాయి. కష్టమర్లు తీసుకున్న రుణాల్లో బలమైన రికవరీ (వసూలు) లేకపోతే బ్యాంకులు శాశ్వత నష్టాల్లో కూరుకుపోతాయి. దేశంలో నిరర్థక ఆస్తుల రికవరీ ఏటా 10 నుంచి 15% వరకు ఉంటోంది. దానికి తోడు ఏటా కొత్తగా ఎన్పీఏలు చేరుతున్నాయి. ఇది బ్యాంకింగ్ వ్యవస్థకు గొడ్డలిపెట్టు.

ఆర్బీఐ డేటా ప్రకారం, రూ.1 లక్ష అంతకంటే ఎక్కువ పరిమాణంలోని ఆర్థిక మోసాల విలువ 2025 ఆర్థిక సంవత్సరంలో 36,013 కోట్లకు చేరింది. ఈ పెరుగుదల క్రెడిట్ అండర్ రైటింగ్ (అప్పు ఇచ్చే ముందు బ్యాంకులు పరిగణించే పరామితులు)లో లోపాలను ప్రతిబింబిస్తోంది. గతంలో కంటే మోసాల సంఖ్య తగ్గినా సగటు మోసం చేసే మొత్తం నగదు విలువ అధికంగా ఉంటోంది. ఇది వ్యవస్థాగత బలహీనతను సూచిస్తోంది. దీనికితోడు ఉద్దేశపూర్వక ఎగవేతదారులు (విల్‌ఫుల్ డిఫాల్టర్లు) పెరుగుతున్నారు. 2025 ఆర్థిక సంవత్సరం నాటికి భారతీయ బ్యాంకులు 1,629 ఉద్దేశపూర్వక ఎగవేతదారులను నివేదించాయి. వీరి మొత్తం రుణం రూ. 1.62 లక్షల కోట్లుగా తెలిపాయి. వీరిపై అనేక సందర్భాల్లో చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నా రికవరీ మందకొడిగా ఉంది. ఈ దీర్ఘకాలిక సమస్యను తగ్గించడానికి కఠిన చర్యలు అవసరం.

రియల్ టైమ్ అనలిటిక్స్, ఏఐ ఆధారిత నిఘా, ఆడిట్ ఇంటిగ్రేషన్ ద్వారా పెద్ద మొత్తంలో మోసాలను తగ్గించవచ్చు. పన్ను చెల్లింపుదారుల సొమ్మును రికవరీ చేయడానికి, భవిష్యత్తులో ఎగవేతలను నిరోధించడానికి కఠిన చట్టాలు అవసరం. బ్యాంకుల కార్పొరేట్, ఎస్ఎంఈ విభాగాల్లో రుణాలు మంజూరు చేసేటపుడు మరింత పకడ్బందీ విధానాలు పాటించాలి.


– అల్లపురపు పవన్ కుమార్ | జర్నలిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

## డేటా పాయింట్

### బొగ్గు ఉత్పత్తిలో మనం నం.2

గ్లోబల్ కోల్ మైన్ ట్రాకర్ ప్రకారం, ప్రపంచంలోని 30 ప్రధాన దేశాల్లో 850 బొగ్గు గనుల ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి మొత్తం సామర్థ్యం ఏడాదికి 227 కోట్ల టన్నులు. ఈ దేశాల్లో చైనా మొదటి స్థానంలో ఉంటే, భారత్ రెండో స్థానంలో నిలిచింది.




వార్షిక సామర్థ్యం (కోట్ల టన్నుల్లో)

# కర్మభూమి



జ్యోతిర్మయం

భారతదేశం గురించి భాగవతంలో చెప్పిన మాటలు గమనిస్తే, హృదయం ఉప్పొంగుతుంది. భరత వాసులకున్న భాగ్యం తమకు లేదని దేవతలే ప్రశంసిస్తూ పాడతారట. 'ఈ దేశవాసులు విశేషపుణ్యం ఏదయినా చేసుకొని ఉండాలి, లేదా స్వయంగా శ్రీమన్నారాయణుడే వీళ్ళపట్ల ప్రత్యేక ప్రసన్నత, అకారణ ప్రీతీ కలిగి ఉండాలి!' అని.

**యైః జన్మ లబ్ధం నృషు భారత అజిరే**
**ముకుంద సేవా – ఔపయికం; స్పృహా హి నః** (భాగ. 5.19.21)

'నరజాతిలో, ఎవరికైతే భారతదేశపు గడ్డ మీద, ముకుంద సేవా సాధనమైన జన్మ ప్రాప్తించిందో, అలాంటి జన్మ దేవతలమైన మాకు ఒక తీరని వాంఛగా మిగిలి ఉంది' అని దేవతలు వాపోతారట. అంతేకాదు, ఇతర స్థానాలలో ఒక కల్పం పాటు నడిచే దీర్ఘాయుష్షు కలిగిన జన్మలతో పుట్టటం కన్నా, భరత వర్షంలో స్వల్పమైన ఆయుష్షుతో జన్మనెత్తటం ఘనమట. **కల్పాయుషాం స్థాన జయాత్ పునర్భవాత్, క్షణాయుషాం భారత భూజయః వరమ్.** కారణమేమిటంటే, భరతవర్షం కర్మభూమి. ఇక్కడ స్వల్పమైన ఆయు పరిమితిలోనే, వివేకవంతులు తాము చేసిన కర్మల ఫలాన్ని భగవదర్పణం చేసి, తద్వారా అన్ని భయాలకూ, శోకాలకూ అతీతమైన మోక్ష పథం పొందగలరు.

భారతదేశం వైకుంఠుడి కథాసుధలు నదులుగా ప్రవహించే చోటు. భగవదాశ్రితులైన పరమ భాగవతులెందరో నడయాడే ప్రదేశం. స్వర్గంలో కూడా ఇలాంటి విశేషాలు కనపడవు. అక్కడ ఇంద్రియ భోగాల కోలాహలంలో, నారాయణ పాద పంకజార్చనను విస్మరిస్తారు. కనుక, అక్కడికంటె ఇక్కడి నివాసమే ఎక్కువ వాంఛనీయం, అంటాడు శుకమహర్షి పరీక్షిత్తుతో.

అయితే భాగవతం ఒక హెచ్చరిక కూడా చేస్తుంది. జ్ఞానార్జనకూ, సత్కర్మాచరణకూ అనువైన ఈ కర్మభూమిలో నరజన్మ ఎత్తే సువర్ణావకాశం పొంది కూడా... జన్మరాహిత్యం కోసం ప్రయత్నించని అమాయకుడు, వేటగాడి ఉచ్చులో చిక్కే వన్యప్రాణులలా, భవబంధాలలో చిక్కుకుపోతాడు.

– ఎం. మారుతి శాస్త్రి

## అల్పాహారం తిని విద్యార్థినులకు అస్వస్థత



చిట్యాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

కల్లూరు/మొగుళ్లపల్లి/చిట్యాల:వేర్వేరు జిల్లాల్లో అల్పాహారం తిన్న విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఖమ్మం జిల్లా కల్లూరు మున్సిపాలిటీ పరిధి ఎన్నెస్పీలోని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు సోమవారం అల్పాహారంగా కిచిడీ వడ్డించగా.. తిన్న వెంటనే వాంతులు, కడుపునొప్పి, విరోచనాలు మొదలయ్యాయి. దీంతో 33 మందిని కల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

**పురుగుల కిచిడీ తిని..**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం కొర్కిశాల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం అల్పా హారంగా కిచిడీ పెట్టారు. అందులో తెల్ల పురుగులతో పాటు అప్పాల పురుగు రావడంతో ఉపాధ్యాయినులకు సమాచారం అందించారు. అనంతరం విద్యార్థినులు అస్వస్థతకు గురై వాంతులు, విరోచనాలు చేసుకున్నారు. వీరిని చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, డీఎస్పీ సంపత్‌రావు విద్యార్థినులను పరామర్శించారు. కుళ్లిన పండ్లు ఇస్తున్నారని, భోజనంలో రాళ్లు, తెల్ల పురుగులు వస్తున్నాయని పలుమార్లు ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినట్లు విద్యార్థినులు వాపోయారు. ఎమ్మెల్యే స్పందిస్తూ చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.


## విమలక్కకు జయశంకర్ స్ఫూర్తి పురస్కారం



కరీంనగర్ కల్చరల్: ఆచార్య కొత్తపల్లి జయశంకర్ స్మారక స్ఫూర్తి పురస్కారానికి అరుణోదయ విమలక్కను ఎంపిక చేసినట్లు.. తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి బూర్ల వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 6న సాయంత్రం 6 గంటలకు ఫిలింభవన్‌లో పురస్కార ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్‌హాజరవుతారని తెలిపారు.

## నైపుణ్యంతో కూడిన జర్నలిజాన్ని అందించాలి

- తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: నైపుణ్యంతో కూడిన జర్నలిజాన్ని సమాజానికి అందించాలని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మీడియా అకాడమీ భవనంలో సోమవారం గిరిజన జర్నలిస్టులకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణ తరగతుల్లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. విడతల వారీగా జర్నలిస్టుల శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. సమాచార శాఖ అదనపు సంచాలకుడు డీఎస్ జగన్ మాట్లాడుతూ గిరిజన విలేకరులు.. గిరిజన జాతి ఔన్నత్యాన్ని చాటేలా కృషి చేయాలని కోరారు. సంపాదకుడు కె.శ్రీనివాస్ తెలంగాణ జర్నలిజం గతం, వర్తమానం, భవిష్యత్తు – మీడియా ధోరణులు, ఆధునిక యుగంలో మీడియాలో వస్తున్న మార్పులను వివరించారు. ఎడిటర్ మార్కండేయ మాట్లాడుతూ వార్తా కథనాలు – ప్రత్యేక కథనాలు ఎలా రాయాలో తెలిపారు.

## 'భూదాన్' పిటిషనర్‌ను బెదిరిస్తారా?

- కోర్టుకు రావాలని కానిస్టేబుల్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా నాగారంలోని భూములను ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు అక్రమంగా తమ పేరిట పట్టా చేయించుకున్నారని, విచారణ కమిషన్ వేయాలని కోరిన పడమటి తండాకు చెందిన రాములును బెదిరించారన్న ఆరోపణలను హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న మహేశ్వరం పీఎస్‌కు చెందిన కానిస్టేబుల్ వెంకటేశ్వర్లును మంగళవారం తమ ముందు హాజరుకావాలని ఆదేశించింది. సర్వే నంబర్ 194లో 10 ఎకరాల భూమి తనది ఉందని, తనకు ఎలాంటి నోటీసులివ్వకుండా భూభారతిలో ఆ భూమిని వేరే వ్యక్తుల పేర్లపై మార్చారని రాములు వాదన. దీనిపై వాదనలు విన్న హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. బెదిరింపు ఆరోపణలపై దాఖలు చేసిన లంచ్‌మోషన్ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది విజయలక్ష్మి వాదనలు వినిపిస్తూ.. మహేశ్వరం సీఐ..రాములును ఆధార్ కార్డుతో పాటు స్టేషన్‌కు రావాలని 10కిపైగా కాల్స్ చేశారన్నారు. స్టేషన్‌కు వెళ్లడానికి రాములు నిరాకరించడంతో.. స్టేషన్ నుంచి వచ్చిన కానిస్టేబుల్ అరెస్టు చేస్తామని బెదిరించారన్నారు. న్యాయమూర్తి ఆదేశం మేరకు వివరాలు తెలుసుకున్న జీపీ.. రాములు ఇంటికి వెళ్లింది ఎస్‌హెచ్‌వో కాదని, కానిస్టేబుల్ అని చెప్పారు. రాములుకు తరచూ ఫోన్ చేయడాన్ని ప్రశ్నించిన న్యాయమూర్తి.. కోర్టు ముందు హాజరు కావాలని కానిస్టేబుల్‌కు సమన్లు జారీచేశారు.



బుధరావుపేటలో యూరియా కోసం బారులుదీరిన రైతులు



కొమరారంలో క్యూలో పెట్టిన పట్టాదారు పాస్‌పుస్తకాలు

# యూరియా.. లేదా మాపై దయ..

**మండుటెండలో రైతుల పడిగాపులు**

ఇల్లెందురూరల్/ఖానాపురం: యూరియా కోసం రైతులు రోజంతా నిరీక్షించిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం కొమరారంలో చోటుచేసుకుంది. ఆదివారం రాత్రి వర్షం కురవడంతో యూరియా తీసుకెళ్లి చల్లాలని రైతులు సోమవారం ఉదయమే పీఏసీఎస్ కేంద్రం వద్దకు భారీగా చేరుకున్నారు. గంటల తరబడి నిల్చున్నారు. ఆ తర్వాత ఓపిక నశించి పాస్‌పుస్తకాలను లైన్‌లో పెట్టి చెట్ల కిందకు చేరారు. అయినా సాయంత్రం వరకు విక్రయ కేంద్రం తెరవక.. కారణాలు చెప్పేవారు లేక వెనుదిరిగారు. ఈ విషయమై పీఏసీఎస్ సీఈఓ హీరాలాల్‌ను వివరణ కోరగా.. శనివారం నుంచి యూరియా సరఫరా లేదని, సోమవారం కూడా జిల్లా కేంద్రంలో లోడింగ్ జరగకపోవడంతో కేంద్రాన్ని తెరవలేదని వెల్లడించారు.

- వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద సోమవారం రైతులు ఎరువుల కోసం ఎగబడ్డారు. ఎస్‌ఐ రఘుపతి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయగా, పీఏసీఎస్ అధికారులు ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున 222 మందికి పంపిణీ చేశారు. చివరగా ఉన్న వారికి స్టాక్ లేదని చెప్పడంతో రైతులు ఆగ్రహంతో బుధరావుపేట శివారులో జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఎస్‌ఐ వారికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

# అసెంబ్లీలో పెడతాం

▶ మొదటి పేజీ తరువాయి

న్యాయరంగంలో విశేష అనుభవం ఉన్న ఉమ్మడి ఏపీ ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి, తొలి లోక్‌పాల్‌గా వ్యవహరించిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ ఆధ్వర్యంలో కమిషన్‌ను నియమించామని గుర్తుచేశారు. ఈ కమిషన్ 16 నెలలపాటు అందరి అభిప్రాయాలు తీసుకుని 665 పేజీల నివేదికను రూపొందించిందని, దీన్ని మంత్రివర్గం ఆమోదించిందని రేవంత్‌రెడ్డి చెప్పారు. 'ఊరు, పేరు, అంచనాలు మార్చి అవినీతికి పాల్పడి అక్రమాలకు పునాదులు వేసి నిర్మించిన కాళేశ్వరం కూలిపోయింది. ఈ విషయాన్ని కమిషన్ స్పష్టంగా తన నివేదికలో పొందుపర్చింది. రాజకీయ నేతలు, ఇంజనీర్లు, ఐఏఎస్‌లు, నిపుణులు, ప్రజా సంఘాలు, ప్రజలు, పాత్రికేయుల నుంచి సమాచారం సేకరించడమేకాక, వారి వాదనలను పరిగణనలోకి తీసుకుంది. మంత్రివర్గం ఆమోదించిన నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టి, అన్ని రాజకీయ పక్షాల అభిప్రాయాలను, ప్రతిపక్ష నాయకుడు, అప్పటి నీటిపారుదల మంత్రి, ఇతర మంత్రుల అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయడానికి అవకాశం కల్పిస్తాం. దీనిపై సభ్యులకు పూర్తి అవగాహన కల్పిస్తాం. తొందరలోనే సభ ఏర్పాటు చేసి అందరి అభిప్రాయాలను విన్నాకే ప్రభుత్వం ముందుకెళ్తుంది' అని సీఎం చెప్పారు.

**నోటీసులు ఇచ్చి.. వాదనలు విన్న కమిషన్:** 'కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలక భూమిక పోషించిన అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, ఐఏఎస్ అధికారులు, ఇంజనీర్లు, నిర్మాణ సంస్థలకు నోటీసులు ఇచ్చి వారికి తమ వాదనలు వినిపించడానికి కమిషన్ పూర్తి అవకాశం కల్పించింది. దివంగత సీఎం రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రాణహిత–చేవెళ్లకు గోదావరి నీళ్లు తీసుకుని రావడానికి ప్రాజెక్టు డిజైన్ చేస్తే.. తెలంగాణ రాష్ట్రం వచ్చిన ఏడాదిన్నర తరువాత అప్పటి ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు రీడిజైన్ పేరిట ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు స్థలం తుమ్మిడిహెట్టి నుంచి మార్చి, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను నిర్మించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరిగిన మూడేళ్లల్లోనే మేడిగడ్డ కుంగడం, అన్నారం, సుందిళ్ల పగలడం జరిగింది. ప్రణాళిక, నిర్మాణ, నిర్వహణ లోపాలు ఉన్నాయని నిపుణులు నివేదించారు. ప్రాజెక్టులు ప్రమాదంలో పడ్డాయని సాంకేతిక నిపుణులు, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీతో సహా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు గుర్తించి వాటి మీద విచారణ చేశాయి. ఆ విచారణలో ప్రణాళిక, నిర్మాణ, నిర్వహణలో లోపాలు ఉన్నాయిని తేల్చాయి. దీని మీద పూర్తిస్థాయి విచారణ జరగాలని ఆనాటి ముఖ్యమంత్రికి నివేదిక ఇచ్చాయి. మా పార్టీ నాయకుడు రాహుల్ గాంధీతోపాటు టీపీసీసీ అధ్యక్షుడిగా నేను, మా కాంగ్రెస్ నాయకులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, ఉత్తమకుమార్ రెడ్డి ఈ ప్రాజెక్టులను సందర్శించాం. లోపభూయిష్టమైన నిర్ణయాలు, అవినీతి, ఆశ్రిత పక్షపాతం నిర్లక్ష్య వైఖరి ఎన్నో లోపాలతో కూడుకున్న నిర్ణయాల వల్ల రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిగా కూలిపోయింది' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

**అనుకూలమైతే ఒకలా.. లేదంటే మరోలా..**

నివేదికలు తమకు అనుకూలంగా ఉంటే ఒకలా.. లేదంటే మరోలా మాట్లాడడం బీఆర్‌ఎస్ నాయకులకు అలవాటేనని సీఎం రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కమిషన్ నివేదికను వారు తప్పుపట్టడం సహజమేనని వ్యాఖ్యానించారు. నివేదికను తప్పుబట్టేట్లయితే వారు కమిషన్‌కు ఎందుకు నివేదిక ఇచ్చారన్నారు. ఇది రాజకీయ నివేదికనో, ప్రభుత్వ నివేదికనో కాదని, ఇది స్వతంత్ర కమిషన్ ఇచ్చిన నివేదిక అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఎవరు ఏ రకమైన విశ్లేషణలు చేస్తారన్నది వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో తన బావ (హరీశ్‌రావు) అవినీతి చేశారని, ఇందులో ఎవరెవరు కుమ్మక్కయ్యారో కవిత వాళ్ల తండ్రిని అడిగి జస్టిస్ చంద్ర ఘోష్ కమిషన్‌కు నివేదిక ఇచ్చి ఉంటే బాగుండేదని సీఎం వ్యాఖ్యానించారు. కవిత అప్పుడు మాట్లాడకుండా, ఇప్పుడు ఇక్కడ ప్రశ్నించడం ఎందుకని, కోల్‌కతాకు వెళ్లి అడగమనండి అని పేర్కొన్నారు. కమిషన్ నివేదికపై ఊహాజనిత వార్తలు, కల్పనకు అవకాశం ఉండకూడదనే ఏ శషభిషలు లేకుండా అన్ని విషయాలను స్పష్టంగా మీడియాకు చెప్పానన్నారు.

# నిర్ణయం కేసీఆర్ ఒక్కరిదే!

**మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణం ఆయన వ్యక్తిగత నిర్ణయం: ఉత్తమ్**

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద బరాజ్‌లు నిర్మించాలని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్కరే వ్యక్తిగత స్థాయిలో నిర్ణయం తీసుకున్నట్టు జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ విచారణలో తేలిందని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వస్థాయిలో ఎలాంటి నిర్ణయం జరగలేదని, పనులకు పరిపాలనపర అనుమతులకు సైతం రాష్ట్ర మంత్రివర్గ ఆమోదం తీసుకోలేదని కమిషన్ నివేదించిందన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదనే విషయాన్ని కారణంగా చూపి మేడిగడ్డకు బరాజ్ లొకేషన్‌ను మార్చడంలో నిజాయితీ కొరవడిందని కమిషన్ వ్యాఖ్యానించిందన్నారు. అక్కడ 205 టీఎంసీల లభ్యత ఉందని 2015లో నాటి కేంద్ర జలశక్తి శాఖ మంత్రి ఉమా భారతి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసిన విషయాన్ని కమిషన్ వెలుగులోకి తెచ్చిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో కమిషన్ నివేదికపై ఉత్తమ్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం ఆయన సీఎం, డిప్యూటీ సీఎంతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

**నివేదికను నిర్లక్ష్యం చేశారు..**

మేడిగడ్డ వద్ద బరాజ్ కట్టవద్దని కోరుతూ ఐదుగురు రిటైర్డ్ సీఈలతో కూడిన నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికను కేసీఆర్, నాటి మంత్రి హరీశ్‌రావు ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేశారని కమిషన్ తెలిపిందని ఉత్తమ్ చెప్పారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రమాదంలోకి నెట్టారని కమిషన్ పేర్కొందన్నారు. బరాజ్ వైఫల్యాలతోపాటు ఇతర తప్పిదాలకు నాటి సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌తోపాటు ఐఏఎస్ అధికారులు ఎస్‌కే జోషి, స్మితా సబర్వాల్ తదితరులు బాధ్యత వహించాల్సి ఉంటుందని కమిషన్ తేల్చిందన్నారు. ఎల్‌అండ్‌టీ, నవయుగ, ఆఫ్కాన్స్ వంటి కాంట్రాక్టర్లకు అనుచిత లబ్ధి కలిగించేందుకు నిబంధనలకు విరుద్ధంగా సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ) ఇంజనీర్లు తప్పుడు డిజైన్లు ఇచ్చారన్నారు. ప్రజలను తాకట్టు పెట్టి అధిక వడ్డీతో రూ.84 వేల కోట్లు అప్పుతెచ్చి కట్టిన ప్రాజెక్టు కుంగిందన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మిస్తే రూ.38 వేల కోట్లతో ప్రాజెక్టు పూర్తి అయ్యేదని చెప్పారు. ప్రాజెక్టును కేసీఆర్ స్వయంగా డిజైన్, నిర్మాణం చేసి ప్రారంభించారని ఉత్తమ్ ఎద్దేవా చేశారు.

# కేసీఆర్‌తోనే బరాజ్‌లు విఫలం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు భావన దశ నుంచి మూడు బరాజ్‌ల నిర్మాణం వరకు జరిగిన అన్ని చర్యలకు నాటి సీఎం కేసీఆర్ ఒక్కరే వ్యక్తిగత స్థాయిలో నిర్ణయాలు తీసుకోవడంతోనే బరాజ్‌లు విఫలమయ్యాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. ఈ విషయాన్ని తాము చెప్పడం లేదని, బరాజ్‌ల వైఫల్యంపై విచారణ జరిపిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ తన నివేదికలో తేల్చిందన్నారు. మంత్రివర్గ సమావేశం ముగిసిన అనంతరం సచివాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బరాజ్‌ల నిర్మాణంపై జరిగిన నిర్ణయాలను నాటి సీఎం, నీటిపారుదల శాఖ మంత్రి కేసీఆర్ వ్యక్తిగత స్థాయిలో తీసుకున్నారని, ఇందులో ప్రభుత్వ ప్రమేయం లేదని కమిషన్ తేల్చిందన్నారు. బరాజ్‌ల నిర్మాణానికి సంబంధించిన నిర్ణయాలు మంత్రివర్గ సమావేశాల్లో జరిగాయని సాక్ష్యం ఇచ్చి కమిషన్‌ను తప్పుదోవ పట్టించేందుకు మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్ ప్రయత్నించారని ఆరోపించారు. ఈ విషయంలో వీరిద్దరినీ కమిషన్ తప్పుబట్టిందన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదనడం సరికాదన్నారు.

## టెన్త్‌లో టాపర్.. ట్రిపుల్‌ఐటీలో సీటు రాలేదని

- ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని



శైలజ

ఆదిలాబాద్‌టౌన్: బాసర ట్రిపుల్ ఐటీ (ఆర్జీయూకేటీ)లో సీటు రాలేదని మన స్తాపం చెందిన ఓ విద్యార్థిని ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. బోథ్ మండలంలోని ధన్నూర్‌కు చెందిన మునిమెల శైలజ (15) ఇటీవల కేజీబీవీలో పదోతరగతి పూర్తి చేసింది. టెన్త్‌లో 563 మార్కులతో తలమడుగు మండల టాపర్‌గా నిలిచింది. ట్రిపుల్ ఐటీ కోసం దరఖాస్తు చేసుకుంది. సీటు రాకపోవడంతో మనస్తాపానికి గురైంది. నెలరోజు లుగా జిల్లా కేంద్రంలోని అటెండర్స్ కాలనీలోని తన బాబాయ్ నర్సింగ్ ఇంట్లో ఉంటోంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం నానమ్మ బయటకు వెళ్లగా, ఆ సమయంలో ఆమె ఒక్కతే ఇంట్లో ఉంది. సాయంత్రం చిన్నమ్మ ఇంటికి వచ్చి చూసే సరికి లోపలి నుంచి గడియ వేసి ఉంది. వెనకాల నుంచి వెళ్లి చూడగా, ఫ్యాన్‌కు వేలాడుతూ శైలజ కనిపించింది. అప్పటికే ఆమె మృతి చెందింది. కాగా, శైలజ ఇటీవల కేజీబీవీ ఉపాధ్యాయులకు ఫోన్ చేసి తాను ఎంపీసీలో చేరతానని, తనకు ట్రిపుల్ ఐటీలో సీటు రాలేదని చెప్పింది. దీంతో ఆమె కోసం సీటును సైతం ఉంచారు. అంతలోనే ఆమె ఆత్మహత్య చేసుకోవడంతో ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు కన్నీరుమున్నీరయ్యారు.

# నేడు ఢిల్లీకి ముఖ్యమంత్రి

- రేపు జంతర్‌మంతర్ వద్ద జరిగే ధర్నాకు హాజరు
- ఎల్లుండి కాంగ్రెస్ ప్రతినిధి బృందంతో కలిసి రాష్ట్రపతిని కలిసే అవకాశం
- ఢిల్లీ బయలుదేరనున్న టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, ఇతర మంత్రులు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం ఢిల్లీ వెళ్లనున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించిన విధంగా బీసీల రిజర్వేషన్లు 42 శాతం పెంపు కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో భాగంగా చేపట్టే ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంటకు ఆయన ఢిల్లీ బయలుదేరనున్నారు. ముఖ్యమంత్రితోపాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర కేబినెట్‌లోని ఇతర మంత్రులు కూడా ఢిల్లీ వెళుతున్నారు. వాస్తవానికి మంగళవారం స్పెషల్ మోషన్ ద్వారా తెలంగాణలో బీసీల రిజర్వేషన్ల పెంపు అంశాన్ని లోక్‌సభలో చర్చకు తేవాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించినా, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబూ సోరెన్ మృతితో షెడ్యూల్‌లో మార్పు వచ్చిందని టీపీసీసీ వర్గాలు చెబుతున్నాయి అయితే ఈ నెల ఆరో తేదీన జంతర్‌మంతర్ వద్ద జరిగే ధర్నాలో ఎలాంటి మార్పు లేదని వెల్లడించాయి. ఈ ధర్నాకు సీఎంతోపాటు డిప్యూటీ సీఎం భట్టి, బీసీ రిజర్వేషన్లపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం చైర్మన్ ఉత్తమ్, బీసీ మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరిలతోపాటు ఇతర మంత్రులు హాజరవుతారు. రాష్ట్రంలోని పలు బీసీ సంఘాల నాయకులు కూడా జంతర్‌మంతర్ ధర్నాలో పాల్గొంటారు. ఇక గురువారం కాంగ్రెస్, ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలతో కలిసి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. రాష్ట్ర గవర్నర్ పంపిన బీసీ రిజర్వేషన్ల బిల్లులను ఆమోదించాలని కోరుతూ ఆమెకు వినతిపత్రం సమర్పించేందుకు గాను కాంగ్రెస్ పార్టీ పక్షాన అపాయింట్‌మెంట్ అడిగారని, ఈ అపాయింట్‌మెంట్ లభించే మేరకు రాష్ట్రపతిని కలిసే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా, ముఖ్యమంత్రితోపాటు మిగిలిన మంత్రులు, టీపీసీసీ చీఫ్ తదితరులు గురువారం సాయంత్రానికి హైదరాబాద్ చేరుకోనున్నట్టు సమాచారం.

# జనంలోకి వెళ్దాం.. అసెంబ్లీలో ఎండగడదాం

▶ మొదటి పేజీ తరువాయి

సమాచారం. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఏ తప్పూ చేయనందునే పీసీ ఘోష్ కమిషన్ విచారణకు తనతోపాటు హరీశ్‌రావు హాజరై వివరణ ఇచ్చిన విషయాన్ని కేసీఆర్ ఈ సందర్భంగా ప్రస్తావించారని... అదే రీతిలో అసెంబ్లీ వేదికగా కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం చేసిన విమర్శలు, ఆరోపణలను తిప్పికొట్టాలని ఆయన భావిస్తున్నట్లు తెలిసింది. అసెంబ్లీ సమావేశాల అనంతరం ప్రభుత్వం వ్యవహరించే తీరునుబట్టి అవసరమైతే సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించే యోచనలో కేసీఆర్ ఉన్నట్లు సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలోని బీజేపీతో కుమ్మక్కై, కక్షపూరిత చర్యలకు పాల్పడితే అనుసరించాల్సిన వ్యూహంపైనా కేసీఆర్ ఈ భేటీలో చర్చించినట్లు తెలియవచ్చింది.

**నేడు కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్**

కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికలో ఎంచుకున్న అంశాలను మాత్రమే కేబినెట్‌లో ప్రభుత్వం చర్చించినట్లు బీఆర్‌ఎస్ అభిప్రాయపడుతోంది. సోమవారం కేబినెట్‌లో చర్చించిన కమిషన్ సంక్షిప్త నోట్‌లోని అంశాలను పార్టీ నేతలకు వివరించి ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో పార్టీ ముఖ్య నేతలకు కమిషన్ నివేదికలోని డొల్లతనాన్ని, రేవంత్ సర్కారు కుట్రలను ప్రజలకు విడమర్చి చెప్పాలని హరీశ్‌రావును కేసీఆర్ ఆదేశించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో కమిషన్ నివేదికపై ప్రభుత్వ కార్యదర్శుల త్రిసభ్య కమిటీ ఇచ్చిన సంక్షిప్త నివేదికలో పేర్కొన్న వివరాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఈ ప్రజెంటేషన్‌ను రాష్ట్రవ్యాప్తంగా పార్టీ ముఖ్య నేతలు వీక్షించేలా ఏర్పాట్లు చేయాలని కేడర్‌ను కేటీఆర్ ఆదేశించారు. ప్రజెంటేషన్ అనంతరం ముఖ్య నేతలు ఎక్కడికక్కడ జిల్లా కేంద్రాల్లో ప్రెస్‌మీట్‌లు పెట్టి ప్రభుత్వ తీరును ఖండించాలని నిర్దేశించారు.

**నేడు ఢిల్లీకి కేటీఆర్**

కేంద్ర ఎన్నికల సంఘం ఆహ్వానం మేరకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు నేతృత్వంలో పార్టీ ప్రతినిధి బృందం మంగళవారం ఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో జరిగే సమావేశానికి హాజరు కానుంది. ఎన్నికల సంస్కరణలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళితోపాటు వివిధ పార్టీలు సమర్పించిన పెండింగ్ ప్రతిపాదనలపై చర్చలు జరగనున్నాయి.

## క్రిటికల్ మినరల్స్‌పై రాష్ట్రానికి మరో రెండు సీఓఈలు

**హర్షం వ్యక్తం చేసిన కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి**



సాక్షి, న్యూఢిల్లీ: క్రిటికల్ మినరల్స్‌పై పరిశోధనల కోసం దేశవ్యాప్తంగా ఏడు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)లను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. వాటిలో రెండు (ఐఐటీ హైదరాబాద్, నాన్–ఫెర్రస్ మెటీరియల్స్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్ హైదరాబాద్‌లలో) తెలంగాణకు కేటాయించింది. దీనిపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్రం నిర్ణయంతో క్లీన్ ఎనర్జీ, మొబిలిటీ ట్రాన్సిషన్, ఎలక్ట్రానిక్స్, డిఫెన్స్, స్పేస్ తదితర రంగాల్లో ప్రగతి సాధించేందుకు వీలుకలుగుతుందని అభిప్రాయపడ్డారు.

## హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు ప్రతిపాదన లేదు

**ఎంపీ కడియం కావ్య ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం**

సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేసే ప్రతిపాదనేదీ లేదని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుకాంత మజుందార్ స్పష్టం చేశారు. లోక్‌సభలో ఎంపీ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం దేశంలో 21 ఐఐఎంలు ఉన్నాయన్నారు. వాటిలో ఏడింటిని 2015–16 విద్యా సంవత్సరంలో థర్డ్ జనరేషన్ ఐఐఎంలుగా వర్గీకరించినట్లు పేర్కొన్నారు.

## కాంగ్రెస్ నేతలకు తప్పిన విమాన ప్రమాదం

**ఢిల్లీలో ల్యాండింగ్‌కు ముందు తెరుచుకోని విమాన చక్రాలు**

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు సోమవారం తృటిలో విమాన ప్రమాదం తప్పింది. మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ కథనం ప్రకారం జంతర్‌మంతర్‌లో ఓబీసీ ధర్నాకు హాజరయ్యేందుకు ఆయనతోపాటు మరో 30 మంది కాంగ్రెస్ నేతలు హైదరాబాద్ నుంచి ఢిల్లీకి ఇండిగో విమానంలో బయలుదేరారు. ఢిల్లీ ఎయిర్‌పోర్టులో విమానం ల్యాండ్ కావడానికి ముందు.. చక్రాలు తెరుచుకోకపోడంతో సుమారు 20 నిమిషాలపాటు విమానం గాల్లో చక్కర్లు కొట్టింది. దీంతో ప్రయాణికులంతా భయాందోళనకు గురయ్యారు. ఎట్టకేలకు చక్రాలు తెరుచుకోవడంతో విమానం క్షేమంగా ల్యాండ్ అయింది.

## కన్నెపల్లి పంప్‌హౌస్ ముట్టడి ఉద్రిక్తం

- సీఎం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ నేతల నినాదాలు



కన్నెపల్లి గేటు లోపలికి వస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు

కాళేశ్వరం: కన్నెపల్లి(లక్ష్మీ)పంప్‌హౌస్ మోటార్లు ఆన్ చేసి నీటిని ఎత్తిపోయాలనే డిమాండ్‌తో బీఆర్‌ఎస్ నేతలు చేపట్టిన 'చలో కన్నెపల్లి' ఉద్రిక్తతకు దారితీసింది. సోమవారం జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కన్నెపల్లి వద్ద లక్ష్మీపంపుహౌస్ వద్దకు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ రమణ, దివాకర్‌రావు, బాలకిషన్, రవిశంకర్, విద్యాసాగర్‌రావు, చందర్, మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నారాదాసు లక్ష్మణ్‌రావు, మాజీ జెడ్పీచైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిని, మాజీ ఎంపీపీ వసంత తదితరులు చేరుకు న్నారు. పంపుహౌస్ సమీపంలోని అప్రోచ్ కెనాల్ వద్ద గోదావరి వరద ఉధృతిని పరిశీలించారు. ఇక్కడ లభ్యమయ్యే నీటితో మోటార్లు ఆన్ చేసి రోజుకు రెండు టీఎంసీలు ఎగువకు తరలించొచ్చని చర్చించారు. ఒక్కసారిగా 300 మంది కార్యకర్తలతో నేరుగా పంపుహౌస్ సమీపంలోని 2వ గేటు గుండా లోపలికి వెళ్లడానికి రావడంతో డీఎస్పీ సూర్యనారాయణ, సీఐ రామచందర్‌రావుల ఆధ్వర్యంలో పోలీసులు భారీగా మోహరించారు. బీఆర్‌ఎస్ శ్రేణులు సీఎం డౌన్ డౌన్, మోటార్లు ఆన్ చేసి తీరాలి అంటూ నినాదాలు చేస్తూ గేటును తోసివేయడానికి యత్నించారు. పోలీసులు వలయంగా ఏర్పడి వారిని లోపలికి రాకుండా నిలువరించడంతో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు..బీఆర్‌ఎస్ నేతలకు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు గేటు వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు నచ్చచెప్పినా వినలేదు. ఈఎన్‌సీ హెడ్ అమ్జద్ హుస్సేన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. వారంలోగా మోటార్లు ఆన్ చేసి రైతులకు నీరందించకపోతే దశల వారీగా పంపుహౌస్‌ను ముట్టడించి మోటార్లు ఆన్ చేసి రైతులకు నీటిని అందజేస్తామని తెలిపారు. మాజీమంత్రి ఈశ్వర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌లు మాట్లాడుతూ మంత్రి శ్రీధర్‌బాబు రైతులకు నీరందించే దిశగా సీఎంతో చర్చించాలని అన్నారు.

# మళ్లీ సుంకాలు పెంచుతా!

**రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లతో చిర్రెత్తిపోయిన ట్రంప్**

- అక్కసుతో భారత్‌పై మరోసారి దిగుమతి సుంకాలు పెంచుతానని ప్రకటన
- ట్రంప్ వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టిన భారత్
- అమెరికా, యురోపియన్ యూనియన్ కక్షగట్టాయన్న కేంద్ర ప్రభుత్వం

**న్యూయార్క్/వాషింగ్టన్/ న్యూఢిల్లీ:** భారతీయ సరకులపై కొత్తగా 25 శాతం దిగుమతి సుంకాల మోత మొదలై వారమన్నా గడవకముందే ట్రంప్ తన తెంపరితనాన్ని మరోసారి బయటపెట్టారు. ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య బెదిరింపులకు చిరునామాగా మారిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి భారత్‌పై తన ఆగ్రహజ్వాలలను టారిఫ్‌ల రూపంలో వెళ్లగక్కనున్నారు. చమురును రష్యా నుంచి భారత్ విపరీతంగా కొనుగోళ్లు చేస్తుండటంతో రష్యాకు లాభాల పంట పండుతోందని, ఇందుకు భారతే ప్రధాన కారణమని ట్రంప్ మరోమారు ఆరోపించారు. రష్యా లాభాలకు కారణమవుతున్న భారత్‌పై మళ్లీ టారిఫ్‌లను విధిస్తానని ట్రంప్ సోమవారం తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'ఖాతాలో ఒక సుదీర్ఘ పోస్ట్‌చేశారు. భారత్‌పై 25 శాతం దిగుమతి సుంకాలు ఐదు రోజుల క్రితమే అమల్లోకి వచ్చిన విషయం తెల్సిందే. ''రష్యా నుంచి భారత్ విపరీతంగా భారీ ఎత్తున ముడి చమురును కొనుగోలుచేస్తోంది. సొంత అవసరాల కోసం మాత్రమే కాదు ఇతర దేశాలకు తిరిగి రీసేల్ చేసేందుకూ రష్యా నుంచి ఆయిల్‌ను కొంటోంది. ఇలా కొన్న ఆయిల్‌ను అక్రమంగా ఓపెన్‌మార్కెట్ పద్ధతిలో విదేశాలకు అమ్ముకుని లాభాలు గడిస్తోంది. భారత్ తన లాభాలను చూసుకుంటోందిగానీ రష్యా ఏ స్థాయిలో లాభాల పంట పండిస్తోందో భారత్ పట్టించుకోవట్లేదు. భారత్‌కు ముడి చమురును విక్రయించడం ద్వారా వచ్చిన నగదు ఆదాయాన్ని నేరుగా ఉక్రెయిన్ యుద్ధం కోసం మంచి నీళ్లలా ఖర్చు పెడుతోంది. దీంతో రష్యా దాడుల్లో ఉక్రెయిన్‌లో లెక్కలేనంత మంది ప్రాణాలు కోల్పోతున్నారు. రష్యా ఒక యుద్ధ యంత్రంలా మారిపోయింది. భారత్‌కు ఇవేం పట్టవు. అందుకే భారత్‌పై మళ్లీ దిగుమతి సుంకాలను పెంచుతా''అని ట్రంప్ ప్రకటించారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి పూర్వం భారత చమురు దిగుమతుల్లో రష్యావాటా కేవలం 0.2 శాతం కాగా ఆతర్వాతి రోజుల్లో అది 35 నుంచి 40 శాతానికి ఎగబాకడం విశేషం. ఈ నేపథ్యంలోనే రష్యా, భారత్ చమురు వాణిజ్య బంధాన్ని తెంపేందుకు ట్రంప్ కంకణం కట్టుకున్నారు. జూలైలో భారత్ మొత్తం ముడి చమురు దిగుమతుల్లో రష్యా వాటా 36 శాతంగా ఉండటం గమనార్హం.




**తీవ్రంగా ప్రతిస్పందించిన భారత్**

మరోమారు దిగుమతి టారిఫ్‌ల మోత మోగిస్తానన్న ట్రంప్ వ్యాఖ్యలపై మోదీ సర్కార్ తీవ్రంగా స్పందించింది. ఏ దేశం నుంచి ఏమేం కొనాలి, ఎంత కొనాలి అని నిర్ణయించుకునే స్వేచ్ఛ... సార్వభౌమత్వ దేశమైన భారత్‌కు ఉందని కేంద్ర ప్రభుత్వం సోమవారం స్పష్టంచేసింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదలచేసింది. ''ఉక్రెయిన్ యుద్ధానికీ భారత చమురు కొనుగోళ్లకు ఎలాంటి సంబంధం లేదు. అయినాసరే ఉక్రెయిన్ సమరం మొదలయ్యాక రష్యా నుంచి మేం చమురును దిగుమతి చేసుకుంటుంటే అమెరికా, యురోపియన్ యూనియన్లు ఉద్దేశపూర్వకంగా భారత్‌ను లక్ష్యంగా చేసుకున్నాయి. ఉక్రెయిన్ యుద్ధం మొదలయ్యాక భారత్‌కు విదేశాల నుంచి దిగుమతి కావాల్సిన ముడి చమురు సరఫరాలో ఆటంకాలు తలెత్తాయి. దీంతో చమురు తక్షణ అవసరాల కోసం రష్యా నుంచి దిగుమతులను పెంచుకున్నాం. భారతీయ వినియోగదారుల ఇంధన అవసరాలు తీర్చేందుకు, అనువైన ధరలకు ఇంధనాలను అందించేందుకు రష్యాపై ఆధారపడాల్సి వచ్చింది. అంతర్జాతీయంగా చమురు సరఫరాలో అస్థిరత ఏర్పడిన సందర్భాల్లో దిగుమతి సంక్షోభం తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది. అయినా రష్యాతో మా వాణిజ్యంపై ఇష్టారీతిగా మాట్లాడే ఇవే దేశాలు రష్యాతో వాణిజ్యంచేస్తున్నాయికదా. స్వయంగా అమెరికా సైతం రష్యాపై ఆధారపడుతోంది. అమెరికా తమ అణువిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల కోసం యురేనియం హెగ్జాఫ్లోరైడ్‌ను, విద్యుత్‌వాహనాలు, ఎరువుల పరిశ్రమల్లో వాడేందుకు పల్లాడియంను రష్యా నుంచి అమెరికా ఇప్పటికీ దిగుమతి చేసుకుంటోంది. 2024లో రష్యాతో యురోపియన్ యూనియన్ ఏకంగా 67.5 బిలియన్ యూరోల వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఇలాంటి దేశాలు కేవలం భారత్‌ను మాత్రమే లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించడం సహేతుకం అనిపించుకోదు. ప్రపంచంలోని ప్రధానమైన ఆర్థికవ్యవస్థల్లో ఒకటైన భారత్ సైతం తన సొంత జాతీయ ప్రయోజనాలు, ఆర్థిక భద్రత కోసం స్వీయ నిర్ణయాలు గతంలో తీసుకుంది. ఇకమీదటా ఇదే ఒరవడి కొనసాగిస్తుంది''అని భారత్ తెగేసి చెప్పింది.

మన భూభాగాన్ని చైనా ఆక్రమించుకుందని

# మీకెవరు చెప్పారు?

**మీరు చూశారా?**

- భారతీయుడెవరూ ఇలా మాట్లాడరు
- రాహుల్ గత వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ:** లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీపై సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నల వర్షం కురిపించింది. మూడేళ్ల క్రితం భారత్ జోడో యాత్ర సందర్భంగా చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై నమోదైన కేసు విచారణ సందర్భంగా రాహుల్‌గాంధీని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసీహ్‌ల ధర్మాసనం పలు అంశాలపై ప్రశ్నించింది. ''మీరు లోక్‌సభలో విపక్ష నేత. ఇంతటి బాధ్యతాయుతమైన హోదాలో ఉన్న మీరు అంతే కీలకమైన అంశాలను పార్లమెంట్‌లో ఎందుకు ప్రస్తావించట్లేరు? 'ఎక్స్'వంటి సోషల్‌మీడియా ఖాతాల్లో మాత్రమే ఎందుకు ప్రస్తావిస్తున్నారు? సామాజిక మాధ్యమాల్లో మాత్రమే ఎందుకు చర్చను లేవనెత్తుతున్నారు? గల్వాన్ లోయలో భారత్, చైనా సైనికుల ముష్టిఘాతాలు, ఘర్షణల సమయంలో ఏకంగా 2,000 చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని చైనా ఆక్రమించుకుందని మీరెలా చెబుతున్నారు? మీరు స్వయంగా చూశారా? ఆ సమయంలో మీరు అక్కడ ఉన్నారా? ఈ దురాక్రమణకు సంబంధించిన బలమైన సాక్ష్యాధారాలు మీ వద్ద ఉన్నాయా? ఆధారాల లేనప్పుడు అలా ఎలా మాట్లాడతారు? మీరు నిజంగా భారతీయుడు అయితే ఇలా నిరాధారంగా మాట్లాడబోరు''అని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తంచేసింది. దీంతో రాహుల్ గాంధీ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ కల్పించుకుని తన వాదనలను వినిపించారు. ''ఇలాంటి కీలకమైన అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయకపోతే ఆయన విపక్ష నేత ఎలా అవుతారు? ఆయన నిజమైన భారతీయుడు కాబట్టే ఆనాడు చైనాతో ఘర్షణల్లో 20కిపైగా భారతీయ సైనికులు వీరమరణం పొందారని అందరి ఎదుట ప్రస్తావించారు. ఇది తీవ్రమైన అంశమేకదా''అని సంఘ్వీ వాదించారు. దీనిపై కోర్టు స్పందించింది. ''సరిహద్దు వెంట ఉద్రిక్త పరిస్థితులు తలెత్తినప్పుడు ఇరు వైపులా నష్టం జరుగుతుందికదా?''అని కోర్టు వ్యాఖ్యానించింది. ''ఇలాంటి పరిస్థితుల్లో వాస్తవిక గణాంకాలు వెల్లడయ్యేలా చేసేందుకు రాహుల్‌గాంధీ ఇలా మాట్లాడారు''అని న్యాయవాది వాదించారు. ''అయితే ఇలాంటి అంశాలను లేవనెత్తే వేదికలు వేరేఉంటాయి'' అని ధర్మాసనం అభిప్రాయపడింది. చైనా సైనికులతో ఘర్షణల్లో భారత సైనికులు ఆధిపత్యం చూపించలేకపోవడంతోనే మన సైనికులు చనిపోయారని, భారత ప్రతిష్టను దిగజార్చేలా రాహుల్ వ్యాఖ్యలు న్నాయని ఉదయ్ శంకర్ శ్రీవాస్తవ అనే వ్యక్తి రాహుల్‌పై ఈ కేసు వేశారు.

**విదేశీ శక్తుల చేతుల్లో రాహుల్ రిమోట్: బీజేపీ**

నిజమైన భారతీయుడు ఇలా మాట్లాడరంటూ రాహుల్‌పై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను బీజేపీ సమర్థించింది. ''కోర్టు వ్యాఖ్యానాలతో రాహుల్‌గాంధీ జాతివ్యతిరేక అని స్పష్టమైంది. భారత్‌ను మరింత బలహీనపరిచి చైనాకు మరింత శక్తివంతంచేసేందుకు రాహుల్ కృషిచేస్తున్నారు. రాహుల్ రిమోట్ కంట్రోల్ విదేశీ శక్తుల చేతుల్లో ఉంది. లోక్‌సభలో విపక్షనేతను సుప్రీంకోర్టు ఇలా తీవ్రస్థాయిలో మందలించడం భారత పార్లమెంటరీ చరిత్రలోనే తొలిసారి''అని బీజేపీ నేత ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యానించారు. చైనాపై ప్రేమను ఒలకబోసేలా సోనియా గాంధీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సమక్షంలో కాంగ్రెస్, కమ్యూనిస్ట్ చైనా పార్టీల మధ్య రాహుల్ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేస్తున్నట్లు ఒక ఊహాత్మక కామిక్ ఫొటోను బీజేపీ ఐటీ విభాగం తమ 'ఎక్స్'ఖాతాలో ఒక పోస్ట్ పెట్టింది.

# ఎస్‌ఐఆర్‌పై చర్చకు పట్టు స్తంభించిన లోక్‌సభ

- బిహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ఆపాలని విపక్ష సభ్యుల డిమాండ్
- అర్ధంతరంగా మంగళవారానికి వాయిదా

**న్యూఢిల్లీ:** అత్యంత వివాదాస్పదంగా మారిన బిహార్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అంశం మరోసారి పార్లమెంట్‌ను స్తంభింపజేసింది. పార్లమెంట్ ఉభయ సభల సభాకార్యకలాపాలకు బదులు ఎస్ఐఆర్ అంశంపైనే చర్చకు విపక్ష సభ్యులు పట్టుబట్టడంతో లోక్‌సభ అర్ధంతరంగా మంగళవారానికి వాయిదాపడింది. వర్షాకాల సమావేశాలు మొదలయ్యాక లోక్‌సభలో విపక్షసభ్యుల నిరసనల కారణంగా కనీసం ఒక్క బిల్లు కూడా సభామోదానికి నోచుకోలేదని అధ్యక్షస్థానంలో ఉన్న స్పీకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. నినాదాలు మాని విపక్షసభ్యులు తమ తమ సీట్లలో కూర్చోవాలని విజ్ఞప్తిచేసినా ఎవరూ పట్టించుకోలేదు. సోమవారం ఉదయం లోక్‌సభ మొదలు కాగానే విపక్ష సభ్యులు తమ సీట్లలోంచి లేచి వెల్‌లోకి దూసుకొచ్చారు. ఎస్ఐఆర్‌పై చర్చించాలని నినాదాలుచేశారు. ప్రభుత్వ వ్యతిరేక, ఎస్ఐఆర్ వ్యతిరేక ప్లకార్డులు చేతబూని ఆందోళన కొనసాగించారు. దీంతో సభను మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదావేశారు. తర్వాత సభ మొదలవగానే కాంగ్రెస్ సభ్యులు మళ్లీ ఇదే అంశంపై చర్చకు మొండిపట్టుబట్టారు. దీంతో సభాధ్యక్షస్థానంలో కూర్చున్న జగదాంబికాపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ''ఈరోజు రెండు కీలక క్రీడా బిల్లులను సభలో చర్చించి, ఆమోదించాల్సి ఉంది. ఇలా నినాదాలు, ఆందోళన చేయడంతో భారతీయ క్రీడాకారులకు అన్యాయం చేసినవాళ్లమవుతాం''అని ఆయన వ్యాఖ్యానించారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు, క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ సైతం ఇదే తరహాలో తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ నినాదాల హోరు మధ్యే ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి కస్టమ్స్ సుంకాలకు సంబంధించిన తీర్మానాన్ని చేశారు. ఈ తీర్మానం సభ మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. ''వర్షాకాల సమావేశాలు జూలై 21వ తేదీన మొదలైనప్పటి నుంచీ మీరు సభ జరక్కుండా ఆటంకం కల్గిస్తున్నారు. ఇలా వరసగా గత మూడు వారాలుగా అవరోధాలు సృష్టిస్తున్నారు''అని జగదాంబికాపాల్ వ్యాఖ్యానించి సభను మంగళవారానికి వాయిదావేశారు. ''తమ ఆశలు, ఆకాంక్షలు నెరవేరుస్తున్నారన్న ఆశతో మిమ్మల్ని లక్షలాది మంది ఓటర్లు ఎన్నుకుని లోక్‌సభకు పంపించారు. మీరేమో ఇలా నినాదాలు చేస్తూ ముఖ్యమైన బిల్లులు చర్చకు రాకుండా, సభామోదం పొందకుండా అడ్డుకుంటున్నారు. సభా గౌరవాన్ని మీరంతా కించపరుస్తున్నారు''అని ఓం బిర్లా సైతం వ్యాఖ్యానించడం తెల్సిందే.



**సొరెన్ మరణంతో రాజ్యసభ వాయిదా**

రాజ్యసభ సభ్యుడు, మాజీ ముఖ్యమంత్రి శిబు సొరెన్ మరణానికి సంతాప సూచికగా రాజ్యసభలో ఎలాంటి అంశాలను చర్చకు స్వీకరించలేదు. బిల్లులనూ ప్రవేశపెట్టలేదు. రాజ్యసభ సోమవారం ఉదయం ప్రారంభంకాగానే సొరెన్ మరణ వార్త, సంతాప సందేశాన్ని సభ డెప్యూటీ చైర్మన్ హరివంశ్ సభ్యులందరికీ చదివి వినిపించారు. ''గిరిజనుల హక్కుల కోసం అవిశ్రాంతంగా సొరెన్ పోరాడారు''అని సొరెన్‌ను హరివంశ్ గుర్తుచేసుకున్నారు. ఆయన మృతికి గౌరవ సూచికగా సభలో ఎలాంటి చర్చను డెప్యూటీ చైర్మన్ అనుమతించలేదు. సభను మంగళవారానికి వాయిదావేశారు. 2020 జూన్‌లో సొరెన్ రాజ్యసభకు ఎన్నికయ్యారు. అప్పటి నుంచి సిట్టింగ్ ఎంపీగా కొనసాగుతున్నారు.

# దిగంతాలకు దిషోం గురు

**శిబూ సొరెన్ కన్నుమూత**

- చిరకాల పోరుతో రాష్ట్రం సాధించుకున్న నేత
- శోకసంద్రంలో జార్ఖండ్
- దేశవ్యాప్తంగా సంతాపాలు




**రాంచీ:** జార్ఖండ్ రాజకీయాల్లో ఒక శకం ముగిసింది. ఆ రాష్ట్ర పితామహుడు, జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) వ్యవస్థాపకుడు, ప్రత్యేక రాష్ట్ర సాధకుడు, మాజీ ముఖ్యమంత్రి శిబూ సొరెన్ అనారోగ్యంతో కన్నుమూశారు. మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న 81 ఏళ్ల సొరెన్ గత జూన్‌లో ఢిల్లీలోని గంగారాం ఆసుపత్రిలో చేరారు. ఇటీవల ఆయనకు స్ట్రోక్ రావడమే గాక బైపాస్ సర్జరీ కూడా జరిగింది. జూలైలో ఆరోగ్యం కాస్త మెరుగుపడ్డా నాలుగు రోజులుగా పరిస్థితి మళ్లీ విషమించింది. అప్పటినుంచి వెంటిలేషన్‌పైనే ఉన్న ఆయన, పరిస్థితి మరింత విషమించి సోమవారం ఉదయం గంగారాం ఆస్పత్రిలోనే తుదిశ్వాస విడిచారు. ఆ సమయంలో కుమారుడు, జార్ఖండ్ సీఎం హేమంత్ సొరెన్ దంపతులు సహా కుటుంబమంతా ఆయన చెంతే ఉంది. ''గౌరవనీయులైన దిషోం గురూ (గొప్ప నాయకుడు) మనందరినీ వీడి వెళ్లారు. నాన్న మృతితో సర్వం కోల్పోయి శూన్యంలా మిగిలా' అంటూ ఎక్స్ వేదికగా ఆవేదన పంచుకున్నారు. సొరెన్ మరణ వార్తతో జార్ఖండ్ శోకసంద్రంలో మునిగిపోయింది. దేశవ్యాప్తంగా సంతాప సందేశాలు వెల్లువెత్తాయి.

**ఆద్యంతం పోరాటమయమే...**

భారత రాజకీయాల్లో అగ్రశ్రేణి నేతల్లో సొరెన్ అగ్రగణ్యులు. మూడుసార్లు జార్ఖండ్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. కేంద్ర మంత్రిగానూ సేవలందించారు. జేఎంఎం వ్యవస్థాపక వ్యక్తుల్లో ఒకరైన సొరెన్ దాదాపు 40 ఏళ్లపాటు పార్టీకి సారథిగా కొనసాగారు. 1987లో పార్టీ పగ్గాలు చేపట్టి 2025 ఏప్రిల్ దాకా కొనసాగారు. ప్రత్యేక జార్ఖండ్ రాష్ట్ర సాధనోద్యమంలో సొరెన్‌ది వెలకట్టలేని పాత్ర. ఆయన 1977లో తొలిసారి లోక్‌సభకు పోటీ చేశారు. అప్పుడు ఓడినా 1980లో దుంకా నుంచి గెలిచి లోక్‌సభలో అడుగుపెట్టారు. 1989,1991, 1996ల్లో వరుస విజయాలు సాధించారు. 2002లో రాజ్యసభకు నామినేటయ్యారు. 2004లో నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ మంత్రివర్గంలో బొగ్గు గనుల మంత్రిగా పనిచేశారు. 2005లో, 2008 నుంచి 2009 జనవరి దాకా, మళ్లీ 2009 డిసెంబర్ నుంచి 2010 మే దాకా మూడుసార్లు సీఎంగా చేశారు. రాజకీయ సంక్షోభాల కారణంగా ఒక్కసారి కూడా ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేయలేకపోయారు. తొలిసారి మెజారిటీ లేక తొమ్మిది రోజులకే గద్దె దిగాల్సి వచ్చింది. నిజానికి సొరెన్ రాజకీయ ప్రయాణం ఆద్యంతం వివాదాలు, న్యాయ తదితర పోరాటాలతోనే సాగింది. వాటిలో 1975 చిరుదిహ్ ఊచకోత, 1994లో సొరెన్ వ్యక్తిగత కార్యదర్శి శశినాథ్ ఝా హత్య తదితర తీవ్ర అభియోగాలున్నాయి. ఝాను కిడ్నాప్ చేసి కిరాతకంగా చంపిన కేసులోనైతే సొరెన్ ఏకంగా జైలుపాలయ్యారు. ఆ కేసులో సొరెన్‌తో పాటు మరో నలుగురిని ఢిల్లీ కోర్టు దోషులుగా తేల్చి 2006లో శిక్షలు కూడా విధించింది. కానీ ఢిల్లీ హైకోర్టు సొరెన్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పు ఇచ్చింది. దాన్ని సుప్రీంకోర్టు 2018లో సమర్థించింది. కొంతకాలంగా సొరెన్ క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ప్రస్తుతం రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు.



శిబూ సొరెన్‌కు నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి ముర్ము

హేమంత్ సొరెన్‌ను ఓదారుస్తున్న ప్రధాని మోదీ

**ప్రముఖుల సంతాపం**

సొరెన్ మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ సహా పలువురు రాజకీయ తదితర ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. మోదీ గంగారాం ఆసుపత్రికి వెళ్లి ఆయనకు నివాళులర్పించారు. సొరెన్ కుటుంబ సభ్యులతో ఉన్న చిత్రాలను ఎక్స్‌లో పంచుకున్నారు. ''మహా యోధుడు, దేశం గర్వించదగ్గ నాయకుడైన సొరెన్‌కు నివాళులర్పించడానికి గంగారాం ఆస్పత్రికి వెళ్లా. ఆయన కుటుంబీకులను కలిశా. ఈ సమయంలో నా ఆలోచనలన్నీ హేమంత్, కల్పన (భార్య), సొరెన్ అభిమానులతోనే ఉన్నాయి'' అని పేర్కొన్నారు.

**పీడనపై బిగించిన పిడికిలి**

- సంతాల్ యోధుడు, రాష్ట్ర సాధకుడు!
- సొరెన్... జార్ఖండ్ అంతటికీ 'గురూజీ'

శిబు సొరెన్. జార్ఖండ్ రాజకీయాల్లో గురూజీగా మన్నన పొందిన అగ్ర నేత. పిన్నలు, పెద్దలంతా ఆయనను ప్రేమాదరాలతో 'గురూజీ' అనే పిలుచుకునేవారు. నాటి ఉమ్మడి బిహార్ రాష్ట్రంలోని రాంఘడ్‌లో నెమ్రా గ్రామంలో సంతాల్ గిరిజన కుటుంబంలో 1944 జనవరి 11న సొరెన్ జన్మించారు. గిరిజన సమాజమంతా వడ్డీ వ్యాపారుల చేతుల్లో ఆజన్మాంతం నలిగిపోతున్న రోజులవి. పండించిన పంటలో వారికి ఒక వంతు మాత్రమే మిగిల్చి మిగిలిందంతా వడ్డీ వ్యాపారులే కాజేసేవారు. వారి గూండాల చేతుల్లోనే సొరెన్ తండ్రి హత్యకు గురయ్యారు. ఆ ఘటనే సొరెన్‌ను ఆలోచనలో పడేసింది. సామాజిక, రాజకీయ పోరాట బాటన నడిపింది. ప్రత్యేక జార్ఖండ్ రాష్ట్ర ఏర్పాటుకు ఒక రకంగా అప్పుడే బీజం పడింది. గిరిజన సమాజాన్ని వడ్డీ వ్యాపారుల దోపిడీ నుంచి విముక్తం చేసేందుకు 1970లలో సొరెన్ పెను ఉద్యమం ప్రారంభించారు. 18 ఏళ్ల వయసులోనే సంతాల్ నవ యువక్ సంఘ్‌ను స్థాపించారు. భూస్వాముల దోపిడీని వ్యతిరేకిస్తూ గిరిజన హక్కుల న్యాయవాదిగా ఎదిగారు. వారికి భూమి హక్కుల కోసం రాజీలేని పోరాటం చేశారు. ఆయన పోరాట ప్రభావం పొరుగు రాష్ట్రాలైన ఒడిశా, పశ్చిమ బెంగాల్‌పైనా పడిందంటే అతిశయోక్తి కాదు. 1972లో బెంగాలీ మార్క్సిస్ట్ కార్మికోద్యమ నేత ఏకే రాయ్, కుర్మి-మహతో నాయకుడు బినోద్ బిహారీ మహతో తదితరులతో కలిసి సొరెన్ జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) స్థాపించారు. పార్టీకి తొలుత మహతో అధ్యక్షుడిగా ఉన్నారు. తర్వాత ముగ్గురు నేతలు విడిపోయారు. తర్వాత సొరెన్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. నాటి నుంచి 2025 ఏప్రిల్ దాకా చీఫ్‌గా కొనసాగారు. ప్రత్యేక జార్ఖండ్ రాష్ట్రం కోసం అలుపెరుగని పోరు సాగించారు. ఎట్టకేలకు 2000లో అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో ప్రత్యేక జార్ఖండ్ ఏర్పాటుతో ఆయన కల నెరవేరింది.

చీఫ్ విప్ పదవికి

# కల్యాణ్ బెనర్జీ రాజీనామా

**టీఎంసీలో అంతర్గత విభేదాలు**

**కోల్‌కతా:** లోక్‌సభ ఎంపీ కల్యాణ్ బెనర్జీ టీఎంసీ చీఫ్ విప్ పదవికి రాజీనామా చేశారు. సభలో ఎంపీల మధ్య సమన్వయం లేదంటూ అన్యాయంగా తనను నిందిస్తున్నారంటూ ఆవేదన చెందారు. పార్టీకి చెందిన చాలా మంది ఎంపీలు లోక్‌సభ సమావేశాలకు రావడమే అరుదని చెప్పారు. టీఎంసీ చీఫ్, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సోమవారం పార్టీ ఎంపీలతో వర్చువల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె పార్లమెంటరీ విభాగంలో సమన్వయం కొరవడిందంటూ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. అనంతరం కల్యాణ్ బెనర్జీ మీడియాతో మాట్లాడారు. 'పార్లమెంటరీ పార్టీలో సమన్వయం లేదంటూ వర్చువల్ మీటింగ్‌లో దీదీ(మమత)అన్నారు. అందుకు నేనే కారణం. అందుకే, రాజీనామా చేస్తున్నా'అని వివరించారు. పార్లమెంట్‌కు తరచూ డుమ్మాకొట్టే వారిని, క్రమశిక్షణను ఉల్లంఘించే వారిని వదిలేసి ప్రతిదానికీ తననే తప్పుపట్టడంపై కల్యాణ్ బెనర్జీ ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, పార్టీ ఎంపీ మహువా మొయిత్రా, కల్యాణ్ బెనర్జీ మధ్య తరచూ విభేదాలు తలెత్తుతున్నట్లు విశ్వసనీయ వర్గాలు అంటున్నాయి. ఇంతకుముందు, మరో ఎంపీ కీర్తి ఆజాద్‌తో కల్యాణ్ బెనర్జీ వివాదం పార్టీ నాయకత్వానికి తలనొప్పిగా మారాయని చెబుతున్నారు. ఇటీవల జరిగిన ఓ ఘటనే తాజా పరిణామాలకు దారి తీసిందని చెబుతున్నారు. ఓ ఎంపీ తనను వ్యక్తిగతంగా అవమానించినా పార్టీ నాయకత్వం మౌనందాల్చిందంటూ పరోక్షంగా మహువా మొయిత్రా నుద్దేశించి వ్యాఖ్యానించారు. 'లోక్‌సభ ఎంపీల మధ్య పోట్లాటలు, తగవులు జరుగుతున్నాయని దీదీ అంటున్నారు. నన్ను దూషించిన వారిని వదిలేయాలా? ఈ విషయం నేను నాయకత్వానికి చెప్పినా, నాదే తప్పంటున్నారు. మమతా బెనర్జీని ఆమె ఇష్టమొచ్చినట్లుగా పార్టీని నడుపుకోనివ్వండి'అంటూ నిర్వేదం చెందారు.

**టీఎంసీ పార్లమెంటరీ పార్టీలో కీలక మార్పు**

తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధిష్టానం పార్లమెంటరీ పార్టీ నాయకత్వంలో కీలక మార్పులు జరిగాయి. టీఎంసీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న అభిషేక్ బెనర్జీకి లోక్‌సభ నేతగా బాధ్యతలు అప్పగించారు. కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ నేత ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ తిరిగి వచ్చే వరకు ఆయన స్థానంలో అభిషేక్ కొనసాగనున్నారు.

# శ్రీకృష్ణుడి బాటలో నడవండి!

- మధ్యవర్తిత్వం ద్వారా తేల్చుకోండి
- ఆలయాన్ని తమ అధీనంలోకి తెచ్చుకునేందుకు ఆర్డినెన్స్ తీసుకురావడంపై యోగి సర్కార్ వైఖరిని తప్పుబట్టిన సుప్రీం
- శ్రీ బాంకే బిహారీ టెంపుల్ ట్రస్ట్ వివాదంలో కోర్టు వ్యాఖ్య

**న్యూఢిల్లీ:** గోస్వామి వర్గీయుల అధీనంలో శతాబ్దాలుగా నడుస్తున్న ప్రముఖ ఠాకూర్ శ్రీ బాంకే బిహారీ జీ మహరాజ్ ఆలయ ట్రస్ట్ వివాదంలో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వ వైఖరి సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పుబట్టింది. ఆలయాన్ని తమ పరిధిలోకి తెచ్చుకునేందుకు అత్యవసరంగా ఏకంగా ఆర్డినెన్స్ తీసుకురావాల్సిన అవసరమేమొచ్చిందని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ''శ్రీకృష్ణుడు నడయాడిన నేల ఇది. ప్రపంచంలో మొట్టమొదటి మధ్యవర్తి ఆయనే. ఆయన చూపిన బాటలోనే మీరూ పయనించండి. ముందుగా మధ్యవర్తిత్వం ద్వారా సమస్య పరిష్కారానికి కృషిజరగాలి. ఇలాంటి అత్యంత రద్దీ అయిన ఆధ్యాత్మిక ప్రాంతాలను కోట్లాది మంది భక్తులు సందర్శిస్తారు. ఆధ్యాత్మిక పర్యాటకం అనేది అతిపెద్ద ఆదాయ వనరుగా మారిన ఈ రోజుల్లో భక్తుల అవసరాలు తీర్చేలా మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉంది. ఇందు కోసం బృందావనంలోని శ్రీ బాంకే బిహారీ టెంపుల్ కారిడార్ నిర్మించాల్సిందే. ఇందుకోసం ఈ ఆలయ మేనేజ్‌మెంట్ హక్కులు తమ వశమయ్యేలా హడావిడిగా ఆర్డినెన్స్ ఎందుకు తీసుకొచ్చారు?'' అని యూపీ సర్కార్‌ను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీల సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. కారిడార్ నిర్మాణానికి అనువుగా గతంలో యూపీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల అమలును మే 15వ తేదీదాకా తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్లు ధర్మాసనం స్పష్టంచేసింది.

# ఉగ్రవాద శిబిరాల పునర్నిర్మాణానికి పాక్ సాయం

**న్యూఢిల్లీ:** ఓవైపు భారత దళాలు ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలను ముమ్మరం చేస్తుండగా.. మరో వైపు సరిహద్దు ఉగ్రవాదానికి పాకిస్తాన్ మద్దతు కొనసాగిస్తోంది. ఇటీవల భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో ధ్వంసమైన మౌలిక సదుపాయాలను పునర్నిర్మించడంలో ప్రధాన ఉగ్రవాద సంస్థలకు పాకిస్తాన్ చురుకుగా సహాయం చేస్తోంది. గత 90 రోజుల్లోనే, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) అంతటా 15కి పైగా ఉగ్రవాద శిబిరాలు, లాంచ్ ప్యాడ్‌లు ఏర్పాటయ్యాయి. పాకిస్తాన్ ఇంటర్-సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ), ఇతర ప్రభుత్వ సంస్థల సహాయంతో ఈ శిబిరాలను పునర్నిర్మిస్తున్నట్లు నిఘా వర్గాలు చెబుతున్నాయి. ఇవి భారత దాడుల్లో మరణించిన ఉగ్రవాదుల పట్ల సానుభూతి చూపడమే కాకుండా, ఇప్పుడు వారి నెట్‌వర్క్‌లను పునరుద్ధరించేందుకు పూర్తిగా మద్దతు ఇస్తున్నాయి. కెల్, షార్ది, దుధ్నియల్, అత్ముకం, జురా, లిపా వ్యాలీ, తండపాణి, నయ్యాలి, జాంకోట్, చకోఠి వంటి కీలక ప్రదేశాలలో శిబిరాలను పునర్నిర్మిస్తున్నారు. అదనంగా, జమ్మూ ప్రాంతంలోని మస్రూర్, చాప్రార్ వెంట అంతర్జాతీయ సరిహద్దు వెంబడి నాలుగు లాంచ్‌ప్యాడ్‌లు, షకర్‌గఢ్‌లోని డ్రోన్ సెంటర్ కూడా పునరుద్ధరిస్తున్నట్టు నివేదికలు చెబుతున్నాయి.

**90 రోజుల్లో పీవోకేలో 15కి పైగా ఉగ్రవాద శిబిరాలు, లాంచ్ ప్యాడ్‌ల ఏర్పాటు**

**చిన్న శిబిరాల ఏర్పాటు..**

భారత దళాల దెబ్బకు తీవ్రంగా దెబ్బతిన్న ఈ ఉగ్రవాదులు ఇప్పుడు నిఘా నుంచి తప్పించుకోవడానికి, ఉగ్రవాద సామర్థ్యాలను బలోపేతం చేయడానికి కొత్త పద్ధతులు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని భారత్ ప్రకటిస్తుండటంతో భద్రతా బలగాల నుంచి మరిన్ని దాడులు జరుగుతాయని ఉగ్రవాదులు భయపడుతున్నారు. భారీ ప్రాణనష్టాన్ని నివారించడానికి, ఉగ్రవాదులు ఇప్పుడు ఒక శిబిరంలో దాదాపు రెండు డజన్ల మంది ఉగ్రవాదులకు వసతి కల్పించే చిన్న శిబిరాలను నిర్మిస్తున్నారు. గతంలో ఒకే శిబిరంలో ఈ సంఖ్య ఐదు రెట్లు ఎక్కువగా ఉండేది.

**అధునాతన సాధనాలతో పునరుద్ధరణ..**

ఉగ్రవాదుల కదలికల సరళి కూడా మారిందని వర్గాలు చెబుతున్నాయి. వారు ఇప్పుడు కవచాలుగా ఉపయోగించుకునేందుకు తమ శిబిరాల్లో ఎక్కువ మంది మహిళలు, పిల్లలను చేర్చుకుంటున్నారు. డ్రోన్లు, నిఘా పరికరాల వాడకంతో శిక్షణ సాంకేతికంగా మరింత అభివృద్ధి చెందింది. ఈ శిబిరాలు దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఉన్నాయి. రాడార్‌ను మభ్యపెట్టడం, ఉపగ్రహ మాస్కింగ్, ఇతర అధునాతన సాధనాలను ఆయా శిబిరాల్లో ఏర్పాటు చేస్తున్నారని సమాచారం. నిఘా వర్గాల అంచనాల ప్రకారం, ఈ పునర్నిర్మాణానికి ఐఎస్ఐ 100 కోట్లకు పైగా పాకిస్తాన్ రూపాయలను కేటాయించింది.

సాక్షి
హైదరాబాద్
మంగళవారం । 5 । ఆగస్టు । 2025



| వర్షపాతం ఇలా (ప్రాంతం / సెంటీ మీటర్లు) | కుత్బుల్లాపూర్ | బంజారాహిల్స్ | యూసుఫ్‌గూడ | శ్రీనగర్ | కూకట్‌పల్లి | ఖైరతాబాద్ | అమీర్‌పేట్ | గణాంకభవన్ | బాలానగర్ |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | 15.1 | 12.4 | 11.7 | 10.6 | 10.2 | 9.9 | 9.2 | 8.9 | 8.4 |

| రాత్రి 9 గంటల వరకు నమోదైన వర్షపాతం ఇలా | బహదూర్‌పురా | ఫస్ట్‌లాన్సర్ | అత్తాపూర్ | గాజులరామారం | నాంపల్లి | బండ్లగూడ | విజయనగర్‌కాలనీ | శివరాంపల్లి | హిమాయత్‌నగర్ |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | 7.9 | 7.9 | 7.9 | 7.5 | 7.1 | 7.0 | 6.8 | 6.5 | 6.4 |


అమీర్‌పేటలో వృద్ధురాలికి సాయం చేస్తున్న యువకులు


హైదర్‌గూడలో..


ఎస్సార్‌నగర్‌లో..

# దంచికొట్టింది!

## భారీ వర్షంతో నగరం అతలాకుతలం ముంచెత్తిన వరద




బేగంపేటలోని శ్యామ్‌లాల్ బంగ్లా వద్ద


పాతబస్తీలో పసి పిల్లలతో ఓ మహిళ ఇబ్బందులు


అమీర్‌పేటలో ప్రధాన రహదారిపై భారీ వరద..


నిమ్స్ ఎదురుగా కూలిన భారీ చెట్టు


చార్మినార్ వద్ద..


అమీర్‌పేటలో..

- నదులను తలపించిన రహదారులు
- పలు ప్రాంతాల్లో నేలకొరిగిన చెట్లు
- ఎక్కడికక్కడ నిలిచిపోయిన వాహనాలు
- నలుదిక్కులా కిలో మీటర్ల కొద్దీ ట్రాఫిక్ జామ్
- విద్యార్థులు, ఉద్యోగుల నరకయాతన
- అత్యధికంగా 15 సెం.మీ వర్షపాతం నమోదు



సాక్షి, సిటీబ్యూరో

మహానగరంలో సోమవారం భారీ వర్షం బీభత్సం సృష్టించింది. ఏకధాటిగా మూడుగంటల పాటు కుంభవృష్టితో జనజీవనం అతలాకుతలమైంది. లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధమయ్యాయి. రోడ్లన్నీ నదులను తలపించాయి. పలు ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచి నలుదిక్కులా కిలో మీటర్ల కొద్దీ ట్రాఫిక్ స్తంభించింది. విద్యార్థులు, ఉద్యోగులు, వాహనదారులు నరక యాతన పడ్డారు. ముందుకు సాగేందుకు గంటల కొద్దీ సమయం పట్టింది. పలు ప్రాంతాల్లో మెట్రో స్టేషన్లు, ఫ్లైఓవర్ల కింద భారీ ఎత్తున వర్షపు నీరు నిలిచింది. రోడ్లపై భారీ వరద నీరు చేరడంతో వాహనాలు నీటమునిగాయి. ఓపెన్ నాలాలు, మ్యాన్‌హోళ్లు పొంగిపోర్లాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సాయంత్రం ఏడు గంటల వరకు అత్యధికంగా కుత్బుల్లాపూర్‌లో 15 సెంటీ మీటర్లు, బంజారాహిల్స్‌లో 12, యూసుఫ్ గూడలో 11 సెం.మీ వర్షపాతం నమోదైంది.

### రోడ్లన్నీ జలమయం..

సోమవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఏకధాటి వర్షం కురవడంతో వరద నీరు రోడ్లపై భారీగా వచ్చి చేరింది. మోకాళ్లలోతు నీరు ఆగడంతో వాహనాలు నీటమునిగాయి. ప్రధానంగా ఖైరతాబాద్, అమీర్‌పేట మెట్రో స్టేషన్ కింద భారీగా వర్షం వర్షపు నీరు చేరింది. ఇదే పరిస్థితి పలు ప్రాంతాల్లో నెలకొంది. ఖైరతాబాద్‌లోని ఒక ప్రైవేట్ స్కూల్ నీట మునిగింది. వందలాది మంది విద్యార్థులు స్కూల్లోనే చిక్కుకు పోయారు.

### విద్యుత్ సరఫరాలో అంతరాయం

భారీ వర్షం ప్రభావంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బంజారాహిల్స్, హైదరాబాద్ సెంట్రల్, మేడ్చల్ సర్కిల్ ప్రాంతాల్లోని 56 /11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో సమస్యలు ఏర్పడ్డాయి. వైశాలినగర్, నవీన్ నగర్, ఓయూ కాలనీ, మూన్ కేఫ్ ఫీడర్, ఐడీపీఎల్, వసుధ, మధురా నగర్ వంటి ప్రాంతాల్లో విద్యుత్ లైన్లపై ఫారిన్ మెటీరియల్స్ పడటంతో బ్రేక్ డౌన్ అయ్యాయి.

### నిమ్స్ జలమయం.. కూలిన భారీ వృక్షం

లక్డీకాపూల్: కుండపోతగా కురిసిన వర్షానికి నిమ్స్ ఆస్పత్రి అతలాకుతలమైంది. ఆస్పత్రి ప్రాంగణంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. సోమవారం సాయంత్రం కురిసిన ఈ భారీ వర్షానికి మిలీనియం బ్లాక్ వద్ద రహదారి వర్షం నీటితో చెరువును తలపించింది. దీంతో ఓపీడీ బ్లాక్ నుంచి స్పెషాలిటీ బ్లాక్ వైపు వెళ్లేందుకు రోగులు, ఆస్పత్రి సిబ్బంది తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఇక బంజారా హిల్స్ రోడ్ నెం.1లోని నిమ్స్ గేట్ సమీపంలో ఎడతెరిపిలేని వర్షానికి భారీ వృక్షం కూలింది. ఆ సమయంలో రోడ్డుపై వెళ్లుతున్న నీళ్ల ట్యాంకర్, ఓ కారుపై ఒరిగిపోయింది. ఈ ప్రమాదంలో చెట్టు వద్ద నిలిపిన ద్విచక్రవాహనం పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనతో మాసాబ్‌ట్యాంక్ వైపు సుమారు నాలుగు గంటలపాటు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. లక్డీకాపూల్ చౌరస్తా రోడ్లన్నీ జలాశయాన్ని తలపించడంతో వాహనదారులు సతమతమయ్యారు. ఫలితంగా కూడలిలో ట్రాఫిక్ స్తంభించిపోయింది.

### హాట్‌స్పాట్లపై జలమండలి దృష్టి

భారీ వర్షాల నేపథ్యంలో హాట్ స్పాట్లపై జలమండలి ప్రత్యేక దృష్టి సారించింది. వర్షాలతో ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని రకాలుగా చర్యలు చేపట్టేందుకు ఈఆర్‌టీ బృందాలను రంగంలోకి దింపింది. సమస్యలుంటే జలమండలి కస్టమర్ కేర్ 155313కి కాల్ చేయాలి.

### జల దిగ్బంధంలో స్వర్ణజయంతి కాంప్లెక్స్

అమీర్‌పేట్‌లోని హెచ్‌ఎండీఏ ప్రధాన కార్యాలయం స్వర్ణజయంతి కాంప్లెక్స్ చుట్టూ పెద్ద ఎత్తున వరదనీరు వచ్చి చేరింది. దీంతో సుమారు రెండు గంటల పాటు హెచ్‌ఎండీఏ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, వివిధ పనులపైన స్వర్ణజయంతి కాంప్లెక్స్‌కు వచ్చిన వ్యక్తులు అక్కడి నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కాంప్లెక్స్‌లోని సెల్లార్‌లోకి సైతం వరదనీరు వచ్చిచేరింది.

### సారీ...నో క్యాబ్స్

భారీ వర్షంతో నగరంలో రవాణా సేవలు నిలిచి పోయాయి. గంటలతరబడి క్యాబ్‌లు, ఆటోలకు బుకింగ్‌లు కూడా స్తంభించాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. క్యాబ్ అగ్రిగేటర్లు వర్షాన్ని సాకుగా చేసుకొని ఆటోలు, క్యాబ్‌లలో చార్జీలను రెట్టింపు చేశాయి. ముఖ్యంగా హైటెక్‌సిటీ, మాదాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ తదితర ప్రాంతాల్లోని ఐటీ కారిడార్‌ల నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు క్యాబ్‌లపైన ఆధారపడిన ఐటీ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ నిపుణులు సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు సకాలంలో క్యాబ్‌లు లభించక, ఒక వేళ బుక్ అయినా అత్యధిక చార్జీలను చెల్లించవలసి వచ్చింది.

### మెట్రో రైళ్లు..సిటీబస్సులు కిటకిట

భారీ వర్షం కారణంగా సిటీ బస్సులు, మెట్రో రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. రోడ్లపై ట్రాఫిక్ స్తంభించడంతో వివిధ మార్గాల్లో సిటీబస్సులు ఆలస్యంగా నడిచాయి. మెట్రో రైళ్లు, మెట్రోస్టేషన్లు సైతం ప్రయాణికులతో కిటకిటలాడాయి. ఒక్కో ట్రిప్పులో కనీసం రెండు మెట్రో సర్వీసుల ప్రయాణికులు బయలుదేరినట్లు అంచనా. ఎల్బీనగర్–మియాపూర్, నాగోల్–రాయదుర్గం కారిడార్‌లలో రద్దీ భారీగా నమోదైంది. సోమవారం అన్ని రూట్లలో కలిపి సుమారు 5 లక్షల మందికిపైగా పయనించినట్లు అంచనా.

### విమానాల రాకపోకలకు ఇబ్బందులు

శంషాబాద్: భారీ వర్షంలో శంషాబాద్ విమానాశ్రయానికి రాకపోకలు సాగించే పలు విమానాల్లో అంతరాయంతో పాటు ఇబ్బందులు తలెత్తినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి. సోమవారం సాయంత్రం 6.25 గంటలకు హైదరాబాద్ నుంచి రాంచి బయలుదేరాల్సిన విమానం 6ఈ –186 భారీ వర్షం కారణంగా రద్దు చేశారు. తిరిగి ఈ విమానాన్ని రాత్రి పదిగంటల తర్వాత రీ షెడ్యూల్ చేసి పంపారు. అదే విధంగా వారణాసి నుంచి హైదరాబాద్‌కు చేరుకోవాల్సిన ఐఎక్స్ –2834 విమానాన్ని ప్రతికూల వాతావరణం కారణఃగా బెంగళూరు విమానాశ్రయానికి మళ్లించినట్లు ఎయిర్‌పోర్టు అధికారులు వెల్లడించారు.

### ఖాజాగూడలో పిడుగుపాటు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడ–ల్యాంకో హిల్స్ మధ్య సోమవారం సాయంత్రం భారీ వర్షం తోపాటు ఖాళీ స్థలంలో ఉన్న ఓ తాటిచెట్టుపై పిడుగు పడి భారీ శబ్దం రావడంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ల్యాంకోహిల్స్ సర్కిల్ హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న రోడ్డు సమీపంలోని స్థలంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో అక్కడున్న వారంతా ఉరుకులు పరుగులు పెట్టారు. కొద్దిసేపటికి తాటిచెట్టుపై మంటలు కన్పించాయి. ఎవరికీ ప్రమాదం జరగలేదు.


తాటిచెట్టుపై మంటలు


బేగంపేటలో భారీగా ట్రాఫిక్

# నగరం.. నిలిచిపోయింది!

## భారీ వర్షంతో సిటీ ట్రాఫిక్‌కు తీవ్ర విఘాతం

- జలమయమైన రోడ్లు... కూలిన చెట్లు
- పదకొండు గంటలకూ 'దారికి' రాని వైనం

సాక్షి, సిటీబ్యూరో: హఠాత్తుగా కురిసిన భారీ వర్షానికి సోమవారం నగరం నిలిచిపోయింది. రోడ్లన్నీ జలమయం కావడంతో పాటు అనేక ప్రాంతాల్లో చెట్లు కూలడంతో ఎక్కడిక్కడ ట్రాఫిక్ ఆగిపోయింది. కొన్ని ప్రాంతాల్లో కిలో మీటరు దూరం దాటడానికి కనీసం అరగంటకు పైగా పట్టింది. ఇంకొన్ని చోట్ల గంటల తరబడి వాహనాలు ముందుకు కదలనే లేదు. వర్షం నేపథ్యంలో ద్విచక్ర వాహనచోదకులు మెట్రో రైల్ స్టేషన్ల కింద ఆగిపోవడంతో ఆ ప్రాంతాలు బాటిల్ నెక్స్‌గా మారి మరిన్ని ఇబ్బందులు తెచ్చాయి. సాధారణంగా మిగిలిన రోజుల కంటే మొదటి పని దినమైన సోమవారం ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. దీనికి తోడు సోమవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో పరిస్థితి చేతులు దాటింది. ట్రాఫిక్ పోలీసులతో పాటు హైడ్రా, జీహెచ్‌ఎంసీ సిబ్బంది శ్రమించినా వాహనచోదకుడిని నరకం తప్పలేదు. నగర వ్యాప్తంగా దాదాపు 140 ప్రాంతాల్లో ఉన్న వాటర్ లాగింగ్ ఏరియాల కారణంగా రోడ్లన్నీ చెరువులుగా మారాయి. వర్షానికి రోడ్లన్నీ నీళ్ల నిండటంతో ఏది గొయ్యో, ఏది రోడ్డో అర్థంకాక వాహనచోదకులు తమంతట తామే వాహన వేగాలను తగ్గించుకున్నారు. దీంతో ఎక్కడికక్కడ రహదారులపై వాహన శ్రేణులు నిలిచిపోయాయి. కీలక మార్గాల్లోనూ అత్యంత నెమ్మదిగా ముందుకు సాగాయి. నాగోల్–మెట్టుగూడ, సికింద్రాబాద్–బేగంపేట్, ఎల్బీనగర్–చాదర్‌ఘాట్, ఎంజే మార్కెట్–నాంపల్లి, పంజగుట్ట–కూకట్‌పల్లి, పంజగుట్ట–మాసబ్‌ట్యాంక్, లక్డీకాపూల్–మెహదీపట్నం ప్రాంతాల్లో వాహనాలు భారీగా ఆగిపోయాయి. రోడ్లన్నీ జామ్ కావడంతో గంటల తరబడి వాహనాలు రోడ్ల పైనే ఉండిపోయాయి. కేబుల్ బ్రిడ్జి నుంచి ఐకియా వెళ్లే దారిలోనూ ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

### స్వయంగా రంగంలోకి దిగిన హైడ్రా కమిషనర్...



సోమవారం నాటి పరిస్థితుల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్వయంగా రంగంలోకి దిగారు. కేవలం గంట వ్యవధిలో ఏకంటా ఏడు నుంచి ఎనిమిది సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షం పడే అవకాశం ఉందని రెండు గంటల ముందుగానే సమాచారం అందుకున్న హైడ్రా కమిషనర్ క్షేత్ర స్థాయిలో ఉండే అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఆయన కూడా స్వయంగా ముంపు ప్రాంతాలకు వెళ్లారు. లక్డీకాపూల్, ఖైరతాబాద్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఎక్కడైనా వరద ముప్పు ఉంటే హైడ్రా కంట్రోల్ రూమ్‌కు (9000113667) ఫిర్యాదు చేయాలని సూచించారు.

### కంట్రోల్ రూమ్‌ను సందర్శించిన కర్ణన్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో భారీ వర్షం కురిసిన నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ క్షేత్రస్థాయిలోని పరిస్థితుల్ని తెలుసుకునేందుకు సోమవారం రాత్రి జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. వాటర్‌లాగింగ్స్, కూలిన చెట్లకు సంబంధించి అందిన ఫిర్యాదుల గురించి కంట్రోల్‌రూమ్ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. వాటర్‌లాగింగ్స్‌కు సంబంధించి 164 ఫిర్యాదులందినట్లు వారు వివరించారు. గాజులరామారం సర్కిల్ మహాదేవపురంలో అత్యధికంగా 15 సెం.మీ. జూబ్లీహిల్స్‌లో 12 సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కంట్రోల్‌రూమ్‌కు అందిన ఫిర్యాదుల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ప్రజలు జీహెచ్‌ఎంసీ హెల్ప్‌లైన్ నెం. 040-21111111 సంప్రదించాలి.
అత్యవసర పరిస్థితుల్లో 100కు డయల్ చేయాలి.


ఎస్సార్‌నగర్ మెట్రో స్టేషన్‌లో..


సోమాజిగూడ బస్టాప్ వద్ద..

## దుకాణంలో రూ.9 లక్షల నగదు చోరీ

**సుల్తాన్‌బజార్:** సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగలు రెచ్చిపోయారు. గుజరాతీ గల్లీలో ఓ మొబైల్ దుకాణం తాళాలు పగులగొట్టి అందులోని రూ.9 లక్షల నగదుతో పాటు సీసీ కెమెరాల డీవీఆర్‌ను సైతం ఎత్తుకెళ్లారు. సోమవారం సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నర్సింహా తెలిపిన మేరకు.. హనుమాన్‌టేక్డీకి చెందిన మాసరా రామ్ దేవశి గుజరాతీ గల్లీలో వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి దుకాణానికి తాళాలు వేసి వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం దుకాణానికి రావడంతో షట్టర్ తాళాలు పగలగొట్టి ఉండడంతో అనుమానం వచ్చిన రామ్ దేవశి లోపలికి వెళ్లి చూడగా క్యాష్ కౌంటర్‌లో పెట్టిన రూ.9 లక్షల నగదు దొంగతనం జరిగినట్లు గుర్తించాడు. కనీసం దుకాణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాను చూద్దామని డీవీఆర్ దగ్గరకు వెళితే దొంగలు డీవీఆర్‌ను సైతం ఎత్తుకెళ్లారని వ్యాపారి వాపోయాడు. సుల్తాన్‌బజార్ పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## బాలికపై లైంగిక దాడి నిందితుడికి 25 ఏళ్ల జైలు

- మరో ముగ్గురు మైనర్లకు మూడేళ్ల చొప్పున
- బాధితురాలికి రూ.5 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని ఆదేశం



**చిలకలగూడ:** బాలికపై సామూహిక లైంగిక దాడి కేసులో నేరం నిరూపితమైంది. మాయమాటలతో బాలికను గదికి తీసుకువెళ్లి గ్యాంగ్‌రేప్‌కు పాల్పడిన వారికి జైలుశిక్ష, జరిమాన విధిస్తు న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రధాన నిందితునికి పోక్సో, ఐటీ చట్టాల ప్రకారం 25 ఏళ్ల జైలు, రూ. 5 వేల జరిమాన, మరో ముగ్గురు మైనర్లకు మూడేళ్ల చొప్పున జైలుశిక్ష విధించారు. బాధిత బాలికకు రూ. 5 లక్షల నష్టపరిహారం చెల్లించేలా ఆదేశాలు జారీ చేశారు. చిలకలగూడ ఎస్‌హెచ్‌ఓ అనుదీప్ తెలిపిన మేరకు.. సికింద్రాబాద్ నామాలగుండుకు చెందిన కమలాకర శివ కుమార్ అలియాస్ శివ (19) ప్రైవేటు ఉద్యోగి. అదే ప్రాంతానికి చెందిన ఓ బాలికతో స్నేహం నటించి పరిచయం పెంచుకున్నాడు. 2021 జనవరి నెలలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో మరో ముగ్గురు స్నేహితులతో కలిసి బాలికను తన గదికి తీసుకువెళ్లి తీవ్రంగా కొట్టి, బెదిరించి లైంగిక దాడి చేశారు. ఆ సమయంలో సెల్‌ఫోన్‌లో ఫొటోలు, వీడియోలు తీసి, ఎవరికైనా చెబితే వీటిని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తానని బెదిరించారు. తీవ్ర భయాందోళనకు గురైన బాలిక అస్వస్థతకు గురైంది. వైద్యసేవలు అందించిన తర్వాత ఆరా తీయగా విషయం వివరించింది. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోక్సో, ఐటీ చట్టాల ప్రకారం కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. వాదోపవాదాలు విన్న తర్వాత నాంపల్లి 12వ అదనపు సెషన్స్ న్యాయమూర్తి అనిత సోమవారం తీర్పు వెలువరించారు. నేరం నిరూపణ కావడంతో ప్రధాన నిందితుడు కమలాకర శివకుమార్‌కు పోక్సోచట్టం కింద 25 సంవత్సరాల జైలుశిక్ష, రూ. 5 వేల జరిమాన, జరిమాన చెల్లించకుంటే మరో 6 నెలల జైలు, ఐటీచట్టం ప్రకారం రెండేళ్ల కఠిన కారాగారం, రూ.5 వేల జరిమాన, చెల్లించకుంటే మరో 3 నెలల సాధారణ జైలుశిక్ష విధిస్తు న్యాయమూర్తి తీర్పు చెప్పడంతో శివకుమార్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ కేసులో మరో ముగ్గురు మైనర్లకు మూడేళ్ల చొప్పున జైలుశిక్ష విధించడంతో వారిని జ్యువెనల్‌హోంకు తరలించారు. బాధిత బాలికకు రూ. 5 లక్షల నష్టపరిహారం చెల్లించేలా ఉత్తర్వులు జారీ చేశారు.



# 'ముద్ర' పేరుతో ముంచాడు!

### కేంద్రం నుంచి రుణాలు ఇప్పిస్తానంటూ టోకరా

- 500 మంది నుంచి రూ.3 కోట్లకు పైగా వసూలు
- నిందితుడిపై మూడు కమిషనరేట్లలో పలు కేసులు
- వలపన్ని పట్టుకున్న మధ్య మండల టాస్క్‌ఫోర్స్



**సాక్షి, సిటీబ్యూరో:** చిన్న చిన్న దుకాణాల్లో వస్త్ర వ్యాపారాలు చేస్తున్న మహిళల్ని టార్గెట్‌గా చేసుకుని... కేంద్రం అందించే 'ముద్ర' రుణాల పేరుతో ఎర వేసి... తన కమీషన్ ముందే చెల్లించాలని షరతు విధించి...అందినకాడికి దండుకుంటున్న ఘరానా మోసగాడు షేక్ జానీని మధ్య మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఇతడిపై హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలో కలిపి ఏడు కేసులు నమోదై ఉన్నట్లు ఇప్పటి వరకు గుర్తించామని డీసీపీ వైవీఎస్ సుధీంద్ర సోమవారం వెల్లడించారు. ఈ నిందితుడిని ఐఎస్ సదన్ పోలీసులతో కలిసి అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

#### యూ ట్యూబ్‌లో చూసిన వీడియోలతో...

నకిరేకల్‌కు చెందిన జానీకి హరినాథ్ రావు అనే మారుపేరు కూడా ఉంది. ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన ఇతగాడు బతుకుతెరువు కోసం 2011లో హైదరాబాద్‌కు వలసవచ్చాడు. భార్య, పిల్లలతో కలిసి సరూర్‌నగర్ వెంకటేశ్వర కాలనీలో ఉంటూ కొన్ని ప్రైవేట్ ఉద్యోగాలు చేశాడు. కోవిడ్ ఎఫెక్ట్‌తో 2020లో నిరుద్యోగిగా మారాడు. సొంతంగా వ్యాపారం పెట్టుకోవాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రుణాల వివరాల కోసం యూ ట్యూబ్‌లో సెర్చ్ చేశాడు. అందులో కేంద్రం అందించే ముద్ర రుణాల మంజూరుకు సంబంధించిన పూర్తి సమాచారం తెలుసుకున్నాడు. రుణం కోసం దరఖాస్తు చేయడానికి బదులు ఆ పేరుతో మోసాలు చేయాలని 2021లో నిర్ణయించుకున్నాడు.

#### భార్యకు ఏమాత్రం అనుమానం రాకుండా...

నగరంలోని చైతన్యపురి, సరూర్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, వనస్థలిపురం, ఐఎస్ సదన్, అల్వాల్ సహా వివిధ ప్రాంతాల్లో సంచరించే జానీ చిన్న చిన్న వస్త్ర దుకాణాలు, బొటిక్‌లను గుర్తిస్తాడు. ప్రధానంగా మహిళలు నిర్వహించే వాటిని ఎంచుకుంటాడు. ఆ దుకాణాల బోర్డులపై ఉన్న యజమాని పేరు, ఫోన్ నెంబర్ నమోదు చేసుకుంటాడు. తాను ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నానని చెప్పుకునే జానీ తన మోసాల విషయం భార్యకు తెలియకూడదని భావించాడు. ఈ నేపథ్యంలోనే ఉద్యోగానికి వెళ్తున్నట్లు తయారై ఇంటి నుంచి బయటకు వచ్చేవాడు. పార్కులు లేదా నిర్మానుష్య ప్రాంతాలకు వెళ్లి ఆయా ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి ముద్ర లోన్ల విభాగం నుంచి మాట్లాడుతున్నట్లు నమ్మించే వాడు. ఇతగాడు ఎదుటి వారిని పేరు పెట్టి సంబోధించడంతో పూర్తిగా నమ్మేసే వాళ్లు. తన ఉనికి బయటపడకుండా బోగస్ వివరాలతో తీసుకున్న సిమ్‌కార్డులు వాడేవాడు.

#### ఏటీఎం కేంద్రాల దగ్గర కాపుకాసి...

ఆ బాధితుల నుంచి రుణం దరఖాస్తుకు అవసరమైన పత్రాలను వాట్సాప్ ద్వారా పొందేవాడు. ఆపై రూ.10 లక్షల రుణం మంజూరైందని, అది ఖాతాలో పడే ముందే తన కమీషన్ చెల్లించాలని షరతు పెట్టేవాడు. ఇలా రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు డిమాండ్ చేసేవాడు. ఇతడి మాటలు నమ్మిన వాళ్లు ఆ మొత్తం చెల్లించడానికి అంగీకరిస్తే మళ్లీ ఫోన్ చేసి బ్యాంకు ఖాతా వివరాలు చెప్తానని చెప్పేవాడు. తన బ్యాంకు ఖాతా వివరాలు ఇస్తే చిక్కుతాననే ఉద్దేశంతో సమీపంలో ఉన్న ఏటీఎం కేంద్రం వద్దకు వెళ్లి వేచి చూసేవాడు. అక్కడకు డబ్బు డిపాజిట్/డ్రా చేయడానికి వచ్చే వారితో మాట కలిపి తన కుటుంబీకులు ఆస్పత్రిలో ఉన్నారని, తన మిత్రుడు డబ్బు పంపిస్తున్నాడని చెప్పేవాడు. తన బ్యాంకు ఖాతా బ్లాక్ అయిందని, అందుకు మీ ఖాతాలో వేస్తాడని, ఆ మొత్తం డ్రా చేసి ఇవ్వాలని కోరే వాడు. కొందరికి రూ.100 నుంచి రూ.500 కమీషన్ ఎర చూపేవాడు.

#### ముమ్మరంగా గాలించి పట్టుకున్న టాస్క్‌ఫోర్స్..

ఇలా వారి బ్యాంక్ ఖాతా, వాలెట్స్ వివరాలను బాధితులకు ఫోన్ చేసి చెప్పి... వాటిలో డబ్బు డిపాజిట్ చేయించేవాడు. ఆ మొత్తాన్ని అక్కడిక్కడే డ్రా చేయించి తీసుకుని ఉండాయించే వాడు. డబ్బు చెల్లిస్తున్న సమయంలో పది నిమిషాల్లో రుణం మొత్తం మీ ఖాతాలో పడుతుందంటూ నమ్మించి ఆ సిమ్ ధ్వంసం చేసే వాడు. ఇలా మూడు కమిషనరేట్లలో 500 మంది నుంచి రూ.3 కోట్ల వరకు కాజేసి కుటుంబ పోషణకు వాడటంతో పాటు రెండు కార్లు, బైక్, రెండు ప్లాట్లు ఖరీదు చేసుకున్నాడు. ఇతడి చేతిలో మోసపోయిన వారిలో అనేక మంది ఫిర్యాదులకు వెనుకడుగు వేశారు. భారీ మొత్తం కోల్పోయిన ఏడుగురు పోలీసులకు ఆశ్రయించడంతో కేసులు నమోదయ్యాయి. ఇతడి కదలికలపై సమాచారం అందుకున్న మధ్య మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని రెండు కార్లు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని ఐఎస్ సదన్ అధికారులకు అప్పగించారు.

## వీధి కుక్కల దాడిలో నలుగురికి గాయాలు

**శంషాబాద్ రూరల్:** కుక్కల దాడిలో ఇద్దరు బాలురితో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని మదన్‌పల్లిలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామంలోని వీధిలో ఆడుకుంటున్న కె.రియాన్(3)పై వీధి కుక్కలు దాడి చేశాయి. అతని మొఖానికి తీవ్ర గాయాలవడంతో అతన్ని చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. వి.కోటేశ్(9), కె.హేమ్లు(17), వి.శివమ్మ(50) కుక్క కాటుకు గురయ్యారు. గత కొన్ని రోజులు కుక్కల బెడదతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

## అనుమతులు లేకుండా క్లినిక్‌లు

**ఇద్దరు నకిలీ వైద్యులపై కేసు నమోదు**

**అడ్డగుట్ట:** అనుమతులు లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తున్న ఇద్దరు వైద్యులపై కేసు నమోదు చేసిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన మేరకు.. అడ్డగుట్టలో కొంత కాలంగా సలీముద్దిన్, బాలరాజులు ఎటువంటి మెడికల్ ప్రాక్టీస్ చేయకుండా చక్రవర్తి క్లినిక్, శ్వేత క్లినిక్‌లు నడుపుతున్నారు. అయితే, పలువురి ఫిర్యాదు మేరకు గత నెల 24న తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారులు ఈ రెండు క్లినిక్‌లపై దాడులు నిర్వహించారు. వైద్యుల పేరుపై చలామణి అవుతున్న సలీముద్దిన్, బాలరాజులు ఎటువంటి మెడికల్ ప్రాక్టీస్ చేయకుండా క్లినిక్‌లు నిర్వహిస్తున్నట్లు వారి విచారణలో తేలింది. ఈ మేరకు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారుల ఫిర్యాదు మేరకు ఈ నెల 2న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ మృతి



వెంకటేష్ (ఫైల్)

**కీసర:** లారీ, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం ఉదయం కీసర లో చోటు చేసుకుంది. కీసర సీఐ ఆంజనేయులు తెలిపిన మేరకు.. ప్రకారం యాదాద్రి- భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన వెంకటేష్(56) ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ద్విచక్ర వాహనంపై ఈసీఐఎల్‌కు వెళుతున్నాడు. కీసరలోని థియేటర్ వద్ద ఎదురుగా వచ్చిన లారీ ఢీ కొట్టింది. తీవ్ర గాయాలకు గురైన అతన్ని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్లకు డిమాండ్ ఫుల్

**- కుర్మల్‌గూడలో 15 ప్లాట్లకు రూ.9.6 కోట్ల మేర ఆదాయం**

**సాక్షి, సిటీబ్యూరో:** నగర శివారులో రాజీవ్ స్వగృహకు చెందిన ఓపెన్ ప్లాట్ల కొనుగోలుకు పోటీ పెరిగింది. సోమవారం బహిరంగ వేలం ద్వారా విక్రయించే ప్రక్రియ ప్రారంభమైంది. రంగారెడ్డి జిల్లా శ్రీశైలం హైవే తుక్కుగుడ సమీపంలోని కుర్మల్ గూడలో 15 ప్లాట్లు అమ్ముడు పోయాయి. 260 చదరపు గజాల నుంచి 300 చదరపు గజాల విస్తీర్ణంలోని ప్లాట్ల కొనుగోలుకు పలువురు పోటీ పడ్డారు. చదరపు గజానికి రూ.20 వేలు ఆఫ్‌సెట్ ధరగా నిర్ణయించగా వేలం పాటలో చదరపు గజం రూ.28,500కు కొనుగోలు చేశారని రాజీవ్ స్వగహ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో 34 మంది పాల్గొన్నరని, ఈ భూముల విక్రయాల ద్వారా రూ.9.6 కోట్ల మేర ఆదాయం వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. మంగళవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బహదూర్‌పల్లిలోని 68 ఓపెన్ ప్లాట్లు, బుధవారం రంగారెడ్డి జిల్లా తొర్రూర్‌లోని 200-500 చదరపు గజాల విస్తీర్ణంలోని ఓపెన్ ప్లాట్ల బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

### స్నాప్‌చాట్ లో పరిచయం..

# ప్రేమపేరుతో సహజీవనం

**యువకుడిపై పోక్సో కేసు నమోదు**



నిందితుడు పరిగి రవితేజ్

**మేడిపల్లి:** యువకుడిపై పోక్సో కేసు నమోదైన సంగటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిదిలో చోటు చేసుకుంది.పోలీసులు తెలిన వివరాల ప్రకారం.. మేడిపల్లి కి చెందిన బాలిక(17)ను చిన్నతనంలోనే తన అక్కకు, బావకు పిల్లలు లేకపోవడంతో బాలికను దత్తత ఇచ్చారు. అప్పటినుంచి బాలిక వారితోనే మేడిపల్లిలో పెరిగింది.పెంపుడు తల్లి సంవత్సరం క్రితం జబ్బుపడి మరణించగా అప్పటినుంచి బాలిక చదువు మానేసి తండ్రితోనే ఉంటోంది. ఈ సందర్భంగా బాలికకు ఒక సంవత్సర కాలంగా స్నాప్ చాట్ అనే యాప్‌లో అలియాబాద్‌కు చెందిన యువకుడు పరిగి రవితేజ్(23)తో పరిచయం ఏర్పడింది. కాగా బాలిక తండ్రి అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న నిందితుడు అదునుగా చేసుకుని ప్రేమ పేరుచెప్పి మాయమాటలతో బాలికను లోబర్చుకుని గత రెండునెలలుగా బాలిక ఇంట్లోనే సహజీవనం చేస్తున్నాడు. విషయం తెలుసుకున్న బాలిక కన్నతల్లి మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసింది. తల్లి పిర్యాదుమేరకు నిందితుడిపై పోక్సోకేసును నమోదు చేసి నిందితున్ని రిమాండ్‌కు తరలించినట్లు మేడిపల్లి సీఐ గోవింద రెడ్డి తెలిపారు.

## బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్

**సాక్షి, రంగారెడ్డిజిల్లా:** జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా కె.చంద్రారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు కొంగర సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్‌కు చేరుకున్న ఆయనకు ఏఓ సునిల్‌కుమార్ స్వాగతం పలికి పరిచయం చేసుకున్నారు. గతంలో ఇక్కడ అదనపు కలెక్టర్‌గా పని చేసిన ఎంవీ భూపాల్ రెడ్డి ఏసీబీ కేసులో అరెస్ట్ కావడం తెలిసిందే. అప్పటి నుంచి ఆ స్థానంలో అదనపు (స్థానిక సంస్థలు) కలెక్టర్ ప్రతిమా సింగ్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న విషయం విదితమే. ప్రస్తుతం ప్రతిమా సింగ్ మెటర్నిటీ సెలవులో వెళ్లడంతో ప్రభుత్వం హెచ్‌ఎండీఏ బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు ఓఎస్డీగా పని చేస్తున్న కె.చంద్రా రెడ్డిని అదనపు కలెక్టర్‌గా బదిలీ చేసింది. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు.

## ఫార్మా భూ సర్వేకు సహకరించాలి



ఫార్మాసిటీకి సేకరించిన భూములను పరిశీలిస్తున్న డీసీపీ సునీతారెడ్డి

**యాచారం:** ఫార్మాసిటీకి పరిహారం అందజేసి సేకరించిన భూముల సర్వేకు రైతులు సహకరించాలని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి అన్నారు. మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లిలో అధికారులు చేపట్టిన రైతుల కబ్జా భూముల సర్వేను సోమవారం ఆమె పరిశీలించారు. సర్వేలో ఏమైనా అభ్యంతరాలుంటే అధికారులకు వినతిపత్రాలు అందజేయాలని సూచించారు. డీసీపీ వెంట ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, గ్రీన్ ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ ఉన్నారు. కాగా, తాడిపర్తిలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి పర్యటించారు. గ్రామంలోని కొందరు రైతులు పట్టా భూములు ఇవ్వడానికి ముందుకు రాగా వాటిని పరిశీలించారు. ఫార్మా భూముల సర్వే లో అభ్యంతరాలుంటే యాచారం తహసీల్దార్ అయ్యప్పకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

## నేటినుంచి పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

**మహేశ్వరం:** మహేశ్వరం ప్రభుత్వ పాలిటెక్నినిక్ కళాశాలలో ఈ నెల 5 నుంచి 10వ తేది వరకు స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్ కోర్సుల్లో మొత్తం 45 సీట్లు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. పదో తరగతి పాసైన వారు, పాలిటెక్నినిక్ అర్హత పరీక్ష రాసిన వారు సర్టిఫికెట్లతో కళాశాలలో ఉదయం 9.45 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సంప్రదించాలన్నారు. ఈ నెల 11న మూడు కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు చెప్పారు. వివరాలకు 94901 20175 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# నివాస ప్రాంతాలకు పార్కులతోనే ఊపిరి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

- లేఔట్ ప్రకారం పరిరక్షిస్తామన్న హైడ్రా కమిషనర్
- ప్రజావాణిలో 58 ఫిర్యాదులు

**సాక్షి, సిటీబ్యూరో:** అనుమతించే సమయంలో పరిగణనలోకి తీసుకున్న లేఔట్‌నే ప్రామాణికంగా తీసుకుని పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను పరిరక్షిస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. నివాస ప్రాంతాలకు పార్కులే స్వచ్ఛమైన గాలిని అందిస్తూ ఊపిరి పోస్తాయని స్పష్టం చేసింది. ఆక్రమణలు, ఉల్లంఘనలపై నేరుగా తమకు ఫిర్యాదు చేయాలని కోరారు. సోమవారం హైడ్రా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి ద్వారా 58 ఫిర్యాదులు అందాయి. ఇందులో అత్యధికం పార్కుల కబ్జా, రహదారుల ఆక్రమణ, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల కాజేసే ప్రయత్నాలకు సంబంధించినవే. బోయిగూడ సమీపంలో సికింద్రాబాద్ మున్సిపాలిటీ ఉన్న సమయంలో కురుమ శ్మశానవాటిక కోసం ప్రత్యేకంగా 2 వేల గజాల స్థలాన్ని కేటాయించారు. ఇప్పుడది నామ రూపాలు లేకుండా కబ్జాలకు గురైందని కురుమ సంఘం ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. అక్కడ షెడ్లు వేసి ఆక్రమించారని, ఇప్పటికీ నిర్మాణాలు జరుగుతున్నాయని రాంగోపాల్‌పేట కార్పొరేటర్ చీర సుచిత్ర పేర్కొన్నారు. బాచుపల్లి శ్రీ సాయి కృష్ణ కాలనీలో 1700 గజాల పార్కు స్థలాన్ని కాపాడాలంటూ అక్కడి నివాసితులు కోరారు. 4.8 ఎకరాల లేఔట్‌లో ఈ స్థలాన్ని పార్కు కోసం కేటాయించారని, నిజాంపేట మున్సిపల్ అధికారులు ఫెన్సింగ్ వేస్తుండగా కబ్జాదారులు కోర్టుకు వెళ్లి ఆ పనులు ఆపేశారని ఆరోపించారు. గతంలో దాన్ని పార్కుగా వినియోగిస్తూ బతుకమ్మ ఉత్సవాలు కూడా నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఇటీవల కొంతమంది రియల్టర్లు కంచె తొలగించి, గేట్‌ను ధ్వంసం చేయడానికి ప్రయత్నించారని ఫిర్యాదు చేశారు. గండిపేట్ పరిధిలోని సర్వే నం.69లో లే ఔట్ ప్రకారం 25 అడుగుల రహదారి ఉండగా దానిని కబ్జా చేశారని హైడ్రా దృష్టికి తెచ్చారు. కుత్బుల్లాపూర్ మండలం భగత్ సింగ్ నగర్‌లో ప్రజావసరాలకు కేటాయించిన 3500 గజాల స్థలం కబ్జా అవుతోందని ప్రభుత్వ ఆసుపత్రి స్థల పరిరక్షణ కమిటీ ఫిర్యాదు చేసింది.

## మూడు రైళ్లల్లో చోరీలు

**కాచిగూడ:** రైలు ప్రయాణికులు ఆదమరచి ఉన్నపుడు దొంగలు చేతివాటం చూపారు. వేర్వేరు రైళ్లల్లో మూడు చోరీలు జరిగాయి. కాచిగూడ రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. బేగంపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న హరిప్రసాద్ మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైల్లో రాజమండ్రి నుంచి హైదరాబాద్ వస్తున్నాడు. రైలు రాయనపాడు వచ్చే సరికి గుర్తు తెలియని వ్యక్తి హరిప్రసాద్ బ్యాగు దొంగిలించి పారిపోయాడు. బ్యాగులో 5 గ్రాముల గోల్డ్ ఆభరణాలు, రూ.6వేలు నగదు, ఒక ఫోను ఉంది.

- ◆ అకోలాకు చెందిన సోనల్ నిరాజ్ జైపూర్‌లో అకోలా రైలు ఎక్కాడు. నాందేడ్ వద్దకు రాగానే గుర్తుతెలియని వ్యక్తి నిరాజ్ బ్యాగును దొంగిలించుకుని పారిపోయాడు. బ్యాగులో 15 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.4వేలు నగదు, సెల్‌ఫోన్ ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నాడు.
- ◆ బెంగుళూర్‌కు చెందిన సంగీత నగరానికి ఎలంకీ ఎక్స్‌ప్రెస్ రైల్లో వస్తోంది. రైల్లోనే బ్యాగు మర్చిపోయి ఇంటికి వెళ్లింది. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బ్యాగులో 47 గ్రాముల బంగారు ఆభరణాలు, పట్టు చీరలు ఉన్నాయని పేర్కొంది.

# సిలిండర్ పేలి కూలిన భవనం

**రోడ్డుపై వెళుతున్న వ్యక్తిపై పడ్డ శిథిలాలు**

- తీవ్ర గాయాలతో మృతి
- పలువురికి గాయాలు



మేడ్చల్‌లో సిలిండర్ పేలడంతో కుప్పకూలిన భవనం



మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

**మేడ్చల్ రూరల్ :** మేడ్చల్‌లో గ్యాస్ సిలిండర్ పేలడంతో ఓ భవనం కూలిపోయింది. ఈ ధాటికి మూడు దుకాణాలు ధ్వంసమయ్యాయి. ఎగిరిపడిన భవన శకలాలు తగిలి, రోడ్డుపై నడుచుకుంటున్న వెళ్తున్న వ్యక్తి తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఇంట్లో ఉన్న వృద్ధురాలు, మొబైల్ దుకాణం నిర్వాహకుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన మేడ్చల్ పట్టణంలో సోమవారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో జరిగింది. స్థానికులు తెలిపిన మేరకు.. మేడ్చల్ పట్టణంలో మార్కెట్ రోడ్డు పక్కన చెందిన శ్రీరాములు గౌడ్‌కు భవనం ఉంది. పాతకాలం నాటి భవనంలో రోడ్డు వైపునకు రెండు పూల దుకాణాలు, ఒక మొబైల్ దుకాణం ఉంది. ఆ వెనుకాల ఉన్న నివాస గృహంలో శ్రీరాములు గౌడ్ చెల్లెలు తిరుపతమ్మ (55) నివాసం ఉంటుంది. సోమవారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ భారీ శబ్దంతో పేలింది. ఆ శబ్దానికి ఆ భవనంలో ఉన్న మూడు దుకాణాలు ధ్వంసం కావడంతో భవన శిథిలాలు చుట్టు పక్కల ప్రాంతాల్లో ఎగిరి పడ్డాయి. అదే సమయంలో రోడ్డు మీద నడుచుకుంటున్న వెళ్తున్న గుర్తు తెలియని(40) వ్యక్తికి భవన శకలాలు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కాగా భవన శకలాల్లో కూరుకుపోయిన తిరుపతమ్మకు ఒళ్లు కాలిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆమెతో పాటు భవన పక్కన ఉన్న స్టేషనరీ దుకాణంలో పని చేసే రఫిక్ (23) కూలిపోయిన గోడ శకలాల కింద చేయిపడటంతో చేయి విరిగిపోయింది. అలాగే మొబైల్ దుకాణంలో పని చేసే దినేష్(25)కు గాయాలయ్యాయి. పోలీసు సిబ్బంది ప్రమాద స్థలికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

## పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లో ఆగస్టు 17న జరిగే గంగ తెప్పోత్సవ వేడుకలను పోస్టర్‌ను సోమవారం ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆవిష్కరించారు. ప్రతి యేటా ఖైరతాబాద్‌లో గంగపుత్రులు ఘనంగా నిర్వహించే గంగ తెప్పోత్సవ ఉత్సవాలకు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున గంగ పుత్రులు తరలివస్తారు. ఈ సంవత్సరం కూడా వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహేందర్‌బాబు, మంగలి పెల్లి రాజు, పూస నరసింహ, గుండు జగదీష్, పూస మురళి, బాబూరావు, విశాల్ పాల్గొన్నారు.

## కబ్జా చేసిన భూమిని స్వాధీనం చేసుకోవాలి


వివరాలు వెల్లడిస్తున్న సుదర్శన్, సురేష్ బాబు

హిమాయత్‌నగర్: కబ్జా కోరల్లోంచి శివాలయం భూమిని కాపాడాలని తెలంగాణ శివసేన పార్టీ విజ్ఞప్తి చేసింది. రెవెన్యూ అధికారులు వెంటనే సర్వే చేయించి తప్పుడు పత్రాలు సృష్టించి శివాలయం భూమిని కబ్జా చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరింది. సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శివసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌తో కలిసి హైకోర్టు న్యాయవాది సురేష్ బాబు మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, తారామతిపేట గ్రామానికి చెందిన పలు సర్వే నెంబర్ల భూమిని కబ్జాచేశారని తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలన్నారు.

## సృజనాత్మక ఆలోచనలపై వర్క్‌షాప్


వర్క్‌షాప్‌కు హాజరైన విద్యార్థులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-45లోని భారతీయ విద్యాభవన్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో ప్రముఖ రచయిత్రి ఇలికా రంజన్ రచనల్లోని సృజనాత్మక ఆలోచనలపై సోమవారం ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రశంసలు పొందిన సీక్రెట్స్ ఆఫ్ జిన్‌సాగువా పుస్తకంపై కథన సెషన్, ఈ సిరీస్‌లోని పాత్రలు, దృష్టాంతాలతో కూడిన బుక్‌మార్క్‌లను ఈ సందర్భంగా విద్యార్థులకు పంపిణీ చేశారు. సృజనాత్మక, ఊహాత్మక మార్గాల్లో పుస్తకాలు రచించడంపై విలువైన చిట్కాలను ఈ సందర్భంగా విద్యార్థులకు వివరించారు.

## అగర్వాల్ సమాజ్ బలోపేతానికి జిల్లాల్లో పర్యటన


మాట్లాడుతున్న అనిరుధ్ గుప్తా

హిమాయత్‌నగర్: అగర్వాల్ సమాజ్ బలోపేతానికి త్వరలో తెలంగాణలోని జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలంగాణ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా వెల్లడించారు. సోమవారం జరిగిన అగర్వాల్ సమాజ్ కమిటీ సభ్యుల కార్య నిర్వాహక కమిటీ సమావేశంలో సమాజ్‌లోని సభ్యులందరితో కలిసి పనిచేస్తున్న ఉద్యోగుల కోసం ప్రివిలేజ్ కార్డును అందించడంతో పాటు అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధికారిక వెబ్‌సైట్ ప్రారంభంపై చర్చించారు. అగర్వాల్ సమాజ్ బలోపేతానికి రాష్ట్రంలోని 33 జిల్లాల్లో విడతల వారీగా పర్యటించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపడతామన్నారు.

## లారీ డ్రైవర్ దారుణ హత్య


మృతి చెందిన బస్వరాజ్

రహమత్‌నగర్: చిన్న గొడవ దారుణహత్యకు దారి తీసిన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఇందిరానగర్ ఫేజ్-1 బస్తీకి చెందిన బస్వరాజ్(21) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇదే బస్తీకి చెందిన ప్రేమ్‌రాజ్‌తో ఆదివారం రాత్రి పర్వత్‌నగర్ అడ్డా వద్ద గొడవ జరిగింది.దీంతో బస్వరాజ్‌పై కక్ష పెంచుకున్న ప్రేమ్ సోమవారం తెల్లవారుజామున ఇందిరానగర్‌లో తన నివాసంలో నిద్రిస్తున్న బస్వరాజ్ తలపై బండరాయితో మోదడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బంధువులు వెంటనే సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యు పేర్కొన్నారు.


యశోద ఆస్పత్రి రోడ్డులో..


పంజగుట్ట మోడల్‌హౌస్ వద్ద వరద బీభత్సం


రాజ్‌భవన్ రోడ్డులో..


శ్రీకృష్ణానగర్‌లో రోడ్లపై పారుతున్న వరద

# 90 నిమిషాలు.. 12 సెంటీ మీటర్లు

## బంజారాహిల్స్‌లో వరద బీభత్సం

- చెరువులను తలపించిన రహదారులు
- జాడలేని మాన్సూన్ బృందాలు


బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12 ఎమ్మెల్యే కాలనీలో ఇళ్లల్లోకి చేరిన నీరు

బంజారాహిల్స్: బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం గంటన్నర వ్యవధిలో 12 సెంటి మీటర్ల వర్షపాతం నమోదైంది. ఉన్నట్టుండి ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి వరద బీభత్సం వాహనదారులకు చుక్కలు చూపించింది.పంజగుట్టలోని మోడల్‌హౌస్, సోమాజీగూడ మెర్క్యూరీ హోటల్, రాజ్‌భవన్ రోడ్డు, బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12, అమీర్‌పేట, ఎల్లారెడ్డిగూడ, శ్రీనగర్‌కాలనీ, శ్రీకృష్ణానగర్, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, ఫిలింనగర్, వెంకటగిరి, చింతల్‌బస్తీ, ఖైరతాబాద్, లక్డీకాపూల్, సోమాజీగూడ తదితర ప్రాంతాలన్నీ నీటమునిగాయి. భారీ వర్షంతో ప్రధాన, అంతర్గత రహదారులపై నడుం లోతు నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది.


అమీర్‌పేట-ఎల్లారెడ్డిగూడకు వెళ్లే రోడ్డులో..

◆ వరద బీభత్సం, వాహనదారులకు ప్రత్యక్ష నరకాన్ని చూపించింది. అయితే వరదనీరు వెళ్లే మార్గాలు ఎక్కడికక్కడ మూసుకుపోవడంతో రోడ్లన్నీ గంటల తరబడి వరదతో నిండిపోయాయి. జీహెచ్ఎంసీ, హైడ్రా మాన్సూన్ యాక్షన్ టీమ్‌లు ఒకట్రెండు చోట్ల మాత్రమే కనిపించాయి. కరెంటు మోటార్లు తీసుకుని వరదనీరు నిలిచిన ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయత్నించిన హైడ్రా వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి.



**శ్రీకృష్ణానగర్‌లో..**

వెంగళరావునగర్: చిన్న పాటి వర్షానికే శ్రీకృష్ణానగర్ జలమయమైంది. ఇందిరానగర్ నుంచి వరదనీరు రావడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా స్కూల్ విడిచిన సమయం కావడంతో విద్యార్థులు నానా ఇక్కట్లు పడుతూ ఇళ్లకు చేరుకున్నారు. రహదారి మధ్యలో ఉన్న మ్యాన్‌హోల్ వ్యాను ఇరుక్కోవడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి.


సోమాజీగూడ కేసీపీ జంక్షన్‌లో..

**ఖైరతాబాద్‌లో..**

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లోని పలు ప్రాంతాల్లోని రోడ్లను వరదనీరు ముంచేసింది. ఓల్డ్ సీఐబి క్వార్టర్స్‌లో రోడ్లపై వరదనీరు భారీగా చేరడంతో ఇళ్లలోని వారు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. దశాబ్దాలుగా ఖైరతాబాద్ ఓల్డ్‌సీఐబీ క్వార్టర్స్ ముంపునకు గురవుతున్నా పట్టించుకునే నాథుడే లేరని స్థానికులు మండిపడుతున్నారు.


ఖైరతాబాద్ ఓల్డ్ సీఐబి క్వార్టర్స్‌లో రోడ్డుపై నడుం లోతు వరద నీరు

## ఉప ఎన్నికలో గులాబీ జెండా ఎగరేస్తాం


మౌనం పాటిస్తున్న నాయకులు

రహమత్‌నగర్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మరోసారి గులాబీ జెండా ఎగరేసి దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆశయాన్ని నెరవేస్తామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బోరబండ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్ వివేకానంద్ స్పష్టం చేశారు. బోరబండ డివిజన్ పీజేఆర్ గ్రౌండ్‌లో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన మాగంటి గోపీనాథ్, డివిజన్ మైనారిటీ నాయకుడు సర్దార్‌ల సంతాప సభలో వివేకానంద్ మాట్లాడారు. అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీజేపీ పార్టీల నాయకులు ఎన్ని ప్రయత్నాలు చేసినా జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమన్నారు. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చేసిన అభివృద్ధి పనులే పార్టీని గెలిపిస్తాయన్నారు. ఎమ్మెల్సీ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అధికార కాంగ్రెస్ పార్టీ హడావుడిగా అభివృద్ధి పనులు ప్రారంభిస్తూ, మంత్రులు, ఎమ్మెల్యేలను రంగంలోకి దించుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి మహమూద్ అలీ, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు రావుల శ్రీధర్ రెడ్డి, గోపీనాథ్ సతిమణీ సునిత, కార్పొరేటర్ దేదివ్య, మాజీ కార్పొరేటర్ శ్యాంరావు, నాయకులు సోహైల్, విజయ్, ఖదీర్, జేఎల్‌మేరి, ధర్మ పాల్గొన్నారు.అంతకు ముందు గోపీనాథ్, సర్దార్ చిత్రపటాలకు నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

## ముగిసిన ఫెహ్మికాన్ కాన్ఫరెన్స్




సాక్షి సిటీ బ్యూరో: ఫెహ్మికేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడలోని ఎన్ ఐ-ఎమ్ఎస్ఎమ్ఈ ఆడిటోరియం వేదికగా వార్షిక సమావేశం ఫెహ్మికాన్ కాన్ఫరెన్స్ 2025 నిర్వహించింది. ప్రసూతి, గైనకాలజీలో సమస్యలు, నివారణ, నిర్వహణ అనే థీమ్‌తో రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో దేశంతో పాటు విదేశాల నుంచి 450 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో ప్రత్యక్ష శస్త్రచికిత్స వర్క్‌షాప్‌లు, ప్యానెల్ చర్చలు, కేస్-ఆధారిత ట్రైనింగ్ సెషన్ నిర్వహించారు. ఈ సదస్సును వినూత్నంగా హ్యూమనాయిడ్ రోబో హోస్ట్ అయిన ఫెమీ (ఎఫ్ఈఎంఐ) ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ డాక్టర్ ఎల్. ఫహ్మిదా బాను, లాపరోస్కోపిక్ సర్జన్ డాక్టర్ హఫీజ్ రెహమాన్ పాడియాత్ పాల్గొన్నారు.

## ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

బంజారాహిల్స్: నిబంధనలకు విరుద్ధంగా వాహనాలకు భారీ శబ్దాలు వచ్చే సైలెన్సర్లు అమర్చిన వారిపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే ఆధ్వర్యంలో వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్‌తో పాటు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టి సైలెన్సర్లు మార్చి తిరుగుతున్న వాహనాలను గుర్తించి వాటిని తొలగించారు.



## నిత్యావసర సరుకుల పంపిణీ


నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఇర్ఫాన్

రహమత్‌నగర్: పేద ప్రజలకు సేవందించడమే ప్రముఖ సంఘ సేవకుడు,హెచ్‌వైసీ వ్యవస్థాపకులు సల్మాన్‌ఖాన్ లక్ష్యమని ఆ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. సోమవారం బోరబండ డివిజన్‌లో పలువురికి నిత్యావసర సరుకులు అందజేశారు.ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ హెచ్‌వైసీ ఇన్‌చార్జి ఇర్ఫాన్ మాట్లాడుతూ.. సల్మాన్‌ఖాన్ అన్ని వర్గాల పేద ప్రజలకు అండగా ఉంటున్నారన్నారు.

## ఆరు గ్యారెంటీలపై విస్తృత ప్రచారం

రహమత్‌నగర్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల జరగనున్న నేపథ్యంలో రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజారం జోరందుకుంది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఆరు గ్యారంటీలపై నియోజకవర్గ వ్యాప్తంగా వాల్‌పోస్టర్లు వేయించారు.



## నివాళి

సనత్‌నగర్: సనత్‌నగర్: మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సోమవారం సనత్‌నగర్‌లో పర్యటించి మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. దాసారం బస్తీ మాజీ అధ్యక్షుడు యాదగిరి, బీఆర్ఎస్ నాయకుడు కుమార్ సోదరుడు సతీష్‌లు ఆదివారం రాత్రి మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ వారి వారి నివాసాలకు వెళ్లి పార్థివ దేహాల వద్ద నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ శేషకుమారి, బీఆర్ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, హన్మంతరావు, అశోక్‌యాదవ్, కూతురు నర్సింహ, కట్ట బలరాం, వనం శ్రీనివాస్, కొలను భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.



## సేనాధిపతికి దళిత సేవా రత్న అవార్డు



ఉస్మానియాయూనివర్సిటీ: ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి 20ఏళ్లుగా పనిచేస్తున్న సరిగోమ్ముల సేనాధిపతి దళిత సేవారత్న అవార్డు అందుకున్నారు. ఓయూ క్యాంపస్ మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన సేనాధిపతి దళితుల్లో చైతన్యం, వారి అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల కోసం సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసి దళితులకు ప్రభుత్వం నుంచి లభించే పథకాలపై వారికి ఎప్పటికప్పుడు అవగాహన కల్పించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గకరణ కోసం దండోర ఉద్యమం, ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర డా.బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ ఇటుక రాజు మాదిగ దళిత సేవారత్న అవార్డును సేనాధిపతికి అందజేశారు.

## తాజ్‌బంజారా లేక్‌లో మట్టి డంపింగ్ చేస్తున్న కాంట్రాక్టర్‌పై కేసు

సాక్షి ఎఫెక్ట్..

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-1లోని తాజ్ బంజారా చెరువులో 'ఒకవైపు గుర్రపు డెక్క తొలగింపు..మరోవైపు డంపింగ్' శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనం పట్ల జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ సీనియర్ ఎంటమాలజిస్ట్ గంగప్ప స్పందించారు. చెరువులో గుర్రపుడెక్క తొలగిస్తుండగా ఇంకోవైపు సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వకుండా ఎఫ్‌టీసీ మిషన్ కాంట్రాక్టర్ మట్టిని డంప్ చేస్తున్నారని, ఈ విషయంపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో సదరు కాంట్రాక్టర్‌పై కేసు కూడా నమోదైందన్నారు. అలాగే బంజారాహిల్స్, ప్రేమ్‌నగర్ వాసులకు దోమల బెడద తీవ్రంగా ఉండడంతో ఈ లేక్‌లో యాంటీ లార్వా ఆపరేషన్ ముమ్మరం చేశామన్నారు. వారంలో మూడుసార్లు డ్రోన్లతో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్నామన్నారు. అలాగే డ్రైనేజీ, వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద రెగ్యులర్‌గా ఆయిల్ బాల్స్ వేస్తున్నామన్నారు. దోమల నివారణ కోసం ఫాగింగ్ కూడా చేపడుతున్నామన్నారు. తాజ్‌బంజారా చెరువు చుట్టుపక్కల ప్రేమ్‌నగర్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో దోమల నివారణ మందు పిచికారి చేయడంతో పాటు ఫాగింగ్ కూడా చేపడుతున్నామన్నారు.



## వ్యాయామంతో ఆరోగ్యం పదిలం

వెంగళరావునగర్: నిరంతరం వ్యాయామం చేస్తే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని టీజీఎస్పీ అడిషనల్ డీజీపీ సంజయ్‌జైన్, డీఐజీ సన్నీ పేర్కొన్నారు. యూసుఫ్‌గూడలోని టీజీఎస్పీ ఫస్ట్ బెటాలియన్‌లో నూతనంగా నిర్మించిన పికిల్ బాల్ కోర్టును సోమవారం అధికారులు ప్రారంభించారు. నూతనంగా ఏర్పాటు చేసిన కోర్టును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ టి.నరేందర్ సింగ్, రామకృష్ణ, అసిస్టెంట్ కమాండెంట్స్ రాంబాబు, కెవివి ప్రసాద్, అప్పారాయ్, ఏ.నరసింహారావు పాల్గొన్నారు.


పికిల్ బాల్‌కోర్టు ప్రారంభిస్తున్న సంజయ్‌కుమార్ జైన్, సన్నీ

## వసతి గృహానికి టీవీ వితరణ



వెంగళరావునగర్: ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటూ విద్యనభ్యసించే చిన్నారులకు ఆదివారం, ఇతర సెలవు రోజుల్లో ఆట విడుపు ఎంతో అవసరమని యూసుఫ్‌గూడ మాజీ కార్పొరేటర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మురళీగౌడ్ పేర్కొన్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహానికి ఆదివారం ఆయన టీవీ అందజేశారు. ఇటీవల జవహర్‌నగర్‌లో పర్యటించిన సందర్భంగా వార్డెన్ సిద్ది రామయ్య తమ హాస్టల్ పిల్లలకు సెలవు దినాల్లో ఆట విడుపు కోసం టీవీని బహూకరించాలని కోరడంతో అందజేశామన్నారు. వార్డెన్ రామయ్య, నాయకులు టి.వినోద్‌కుమార్, ఎండి గౌస్, వెంకట్‌రెడ్డి, ముత్యాలు, యాదగిరి, చంద్రమౌళి పాల్గొన్నారు.

## యువత ఆర్థికాభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలు

పద్మారావునగర్: కేంద్ర ప్రభుత్వ పథకాలను యువతీ, యువకులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ అన్నారు. సికింద్రాబాద్ బోట్స్ క్లబ్ యూత్ హాస్టల్ ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన వర్క్‌షాప్ ఆన్ గవర్నమెంట్ ఫ్లాగ్‌షిప్ స్కీమ్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యువతీ, యువకుల కోసం కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తోందని చెప్పారు. స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా, ఆయుష్మాన్ భారత్ వంటి అనేక కార్యక్రమాలను కేంద్రం అమలు చేస్తోందని వివరించారు. విద్యాభివృద్ధితోనే యువత జీవితాలు బంగారుమయం అవుతాయన్నారు.

## 'గాంధీ' నుంచి రోగి సహాయకుడి అదృశ్యం


విస్లావత్ రాజు

గాంధీఆస్పత్రి: రోగి సహాయకుడు అదృశ్యమైన ఘటన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో జరిగింది. చిలకలగూడ పోలీసుల వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా క్యాసంపల్లితండాకు చెందిన విస్లావత్ రాజు(40) వనిత భార్యభర్తలు. గర్భవతి అయిన వనిత అస్వస్థతకు గురికాగా నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. మరింత మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి రెఫర్ చేయగా గతనెల 25న వనితను గాంధీ ఫిమేల్‌వార్డులో చేర్పించగా, భర్త రాజు వెయిటింగ్ హాలులో ఉంటున్నాడు. రాజుకు ప్రతిరోజూ కల్లు తాగే అలవాటు ఉంది. మూడు రోజుల పాటు కల్లు తాగకపోవడంతో మతిస్థితిమితం కోల్పోయి పిచ్చిగా ప్రవర్తించసాగాడు. గతనెల 28వ తేదీన రాజు గాంధీ వెయిటింగ్ హాలు నుంచి అదృశ్యమయ్యాడు. పరిసర ప్రాంతాలతో పాటు స్వగ్రామంలో గాలించినా ఫలితం లేకపోవడంతో సోదరుడు విస్లావత్ రెడ్యా సోమవారం పోలీసులను ఆశ్రయించగా, మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నగరంలో నేడు

- సీనియర్ సంపాదకుడు ఇనగంటి వెంకట్రావు రాసిన 'విలీనం – విభజన'పుస్తకావిష్కరణ శివసాయి గ్రాఫిక్స్, మోనిక బుక్స్ సహకారంతో ఉదయం 10 గంటలకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరుగుతుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో గణేష్ చతుర్థి స్పెషల్ పేరిట ఏర్పాటు చేసిన ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు నేషనల్ సిల్క్ ఎక్స్‌పో అందుబాటులో ఉంటుంది.
- సిరి ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ల్యాండ్ స్కేప్స్ పెయింటింగ్ ఎగ్జిబిషన్ మాసబ్ ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూ కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో గణేష్ చతుర్థి స్పెషల్ పేరిట నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

## ఆలయం కూల్చివేతపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

**బంజారాహిల్స్:** బంజారాహిల్స్ ఎన్‌బీటీనగర్ పెద్దమ్మ గుడి ఆలయం కూల్చివేతలో జరిగిన సంఘటనపై ఆలయ ప్రతినిధులతో కలిసి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సోమవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనకు ఫిర్యాదు చేశారు. దేవాలయం కూల్చివేత జరిగిన అనంతరం సంఘటన స్థలంలో అమ్మవారి ఆలయం సందర్శించిన హిందూ సోదరులపై పోలీసులు అన్యాయంగా కేసు నమోదు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, అలాగే కూల్చివేసిన చోటే వెయ్యి గజాల స్థలంలో ఆలయం నిర్మించి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిగేలా ప్రభుత్వం చొరవ తీసుకునేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రవణ్‌యాదవ్, రాఘవరెడ్డి, ఆలయం ప్రతినిధులు అమర్నాథ్‌యాదవ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పీజీ ప్రవేశ పరీక్షలు ప్రారంభం

**ఉస్మానియా యూనివర్సిటీ:** పీజీ ప్రవేశ పరీక్షలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, ఓయూ వీసీ ప్రొ.కుమార్ ప్రవేశ పరీక్షల ప్రశ్నపత్రాల పాస్‌వర్డ్‌ను విడుదల చేసి పరీక్షలను ప్రారంభించారు. తొలిరోజు 7 పీజీ సబ్జెక్టులకు జరిగిన పరీక్షలకు 6,491 (84.93 శాతం) మంది విద్యార్థులు హాజరైనట్లు సీపీగెట్–2025 కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి తెలిపారు. ఈ నెల 11 వరకు జరిగే ప్రవేశ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 27 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ అవిశ్రాంత పోరు

**మైలార్‌దేవ్‌పల్లి:** ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు బీఆర్ఎస్ పార్టీ అవిశ్రాంత పోరు చేస్తుందని ఆ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జనావాసల మధ్యలో ఎస్‌టీపీ ప్లాంట్ పెట్టకూడదంటూ సోమవారం ఆ ప్రాంత వాసులతో కలిసి కొంగరకలాన్‌లోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్‌లో ఆయన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ... బండ్లగూడ మున్సిపల్‌లో కాలనీల మధ్యలో ఎస్‌టీపీ ప్లాంట్ పెట్టకూడదని కాలనీ వాసులు చాలా రోజులుగా ధర్నా చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణంగా ఉందన్నారు. అదే విధంగా టీఎన్‌జీవోలోని పేదలకు చెందాల్సిన భూమి ఎవరు కబ్జా చేసినా ఉపేక్షించేది లేదన్నారు. రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమని ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. కబ్జా చేసి దొంగ సర్టిఫికెట్లు తయారు చేసి అమ్మే వారి దగ్గర కొని నష్టపోవద్దని ప్రజలకు సూచించారు. పార్టీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్, అక్కెం రాఘవేందర్ యాదవ్, విద్యా విభాగం అధ్యక్షుడు మధుచారి, మైసిరెడ్డి, సోమ శ్రీనివాస్‌గుప్తా, కాంతు, దుర్గేష్, భూదేవి, సరిత, అరుణరెడ్డి, శంకర్‌నాయక్, గుమ్మడి కుమార్, రాజేష్‌యాదవ్, జగన్, బాలరాజుయాదవ్, సునీల్, సింహాద్రి, బొంబాయి రవి, అశోక్‌కుమార్, సందీప్‌గుప్తా, దుర్గాప్రసాద్, శ్రీకాంత్,భిక్షు, వెంకటేష్, చందు, కిరణ్, పరమేష్, భమిని, మల్లేష్, పట్టియానాయక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రేటర్.. ఇక జెన్ ఏఐ సిటీ

- ఆధునిక సాంకేతికతతో సమస్యల పరిష్కారానికి ప్రణాళిక
- గూగుల్ భాగస్వామ్యంతో పైలట్ ప్రాజెక్ట్
- సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనకు అనుగుణంగా అడుగులు



సమావేశంలో మాట్లాడుతున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్

**సాక్షి, సిటీబ్యూరో:** ఇప్పటికే వివిధ అంశాల్లో సాంకేతికతను అందిపుచ్చుకున్న జీహెచ్‌ఎంసీ మరో ముందడుగు వేసింది. హైదరాబాద్‌ను అత్యాధునిక సాంకేతికతతో కూడిన నగరంగా తీర్చిదిద్దే దిశగా గూగుల్‌తో చేతులు కలిపింది. నగర పాలనను పునర్నిర్వచించడానికి, పౌర సేవలను మెరుగుపరచడానికి, ప్రధాన సమస్యలను సమర్థవంతంగా సత్వరం పరిష్కరించడానికి జెన్ ఏఐ(జనరేటివ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత పైలట్ ప్రాజెక్ట్‌ను అమలు చేసేందుకు సిద్ధమైంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కంటే అడ్వాన్స్‌డ్ అయిన జెన్ ఏఐని వినియోగించుకోవాలనుకోవడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనకు అనుగుణంగా ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన రోడ్‌మ్యాప్‌పై చర్చించడానికి సోమవారం సాయంత్రం గూగుల్ క్లౌడ్ ప్లాట్‌ఫాం టీమ్‌తో గూగుల్ మీట్ ద్వారా వర్చువల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మునిసిపల్ పరిపాలన శాఖ కార్యదర్శి ఇలంబర్తి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, అడిషనల్ కమిషనర్(ఐటీ) అనురాగ్ జయంతి, గూగుల్ సంస్థ సీనియర్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ జెన్ ఏఐ పైలట్ ప్రాజెక్ట్ ద్వారా భవిష్యత్‌లో టెక్ ఆధారిత పరిష్కారాలను కనుగొని పౌర సమస్యలపై సత్వరమే స్పందించేలా, స్మార్ట్‌గా కొత్త అధ్యాయాన్ని ప్రారంభించనున్నారు. దీని ప్రధాన లక్ష్యం సత్వరం స్పందించడం, ఇంటెలిజెంట్ నగర పాలనను అమలు చేయడం.

### ఈ ప్రాజెక్ట్‌లోని కీలకాంశాలు:

**ఏఐ ఎనేబుల్డ్ సేవలు:** ప్రభుత్వ వెబ్‌సైట్‌ల కోసం జెన్ ఏఐతో నడిచే సెర్చ్ బార్, ప్రభుత్వ ఉద్యోగుల కోసం సంభాషణాత్మక చాట్‌బోట్‌లు, ఏఐ సెర్చ్ టూల్స్.

### పౌర విచారణ వర్గీకరణ వ్యవస్థ:

గవర్నమెంట్ టు సిటిజన్(జీ2సీ) సేవల కోసం బ్లాక్ చెయిన్ ఆధారిత ధ్రువీకరణ క్రెడెన్షియల్స్, ఏఐ ఆధారిత టెండర్ మూల్యాంకన వ్యవస్థ.

### నిఘా, నిర్వహణ:

ఏఐ ఆధారిత టెండర్ మూల్యాంకన వ్యవస్థ, స్మార్ట్ పార్కింగ్ నిర్వహణ, సమర్థంగా ఘనవ్యర్థాల నిర్వహణ.

### రవాణా:

గూగుల్ మ్యాప్స్ ద్వారా పబ్లిక్ బస్సుల రియల్–టైమ్ ట్రాకింగ్, ఏఐ ఆధారిత రోడ్డు. భద్రత, ట్రాఫిక్ మోడల్స్.

### ఆరోగ్య సంరక్షణ:

ఎఫ్‌హెచ్ఐఆర్ కంప్లైంట్ హెల్త్ రికార్డ్స్ కోసం గూగుల్ క్లౌడ్ ఏఐలు, నగరవ్యాప్త ఆరోగ్య విశ్లేషణ ప్లాట్‌ఫామ్, వెక్టర్ బోర్న్ వ్యాధుల గుర్తింపు, నివారణ కోసం ఏఐ, ఆశా వర్కర్ల కోసం ''మాన్య'' అనే ఏఐ అసిస్టెంట్.

**పర్యావరణం:** సరస్సుల్లో చెత్త, సీఅండ్‌డీ వేస్ట్‌ని డంప్ చేయకుండా నివారించేందుకు ఏఐ సాంకేతికతతో పర్యవేక్షణ.

**ఇతర సేవలు:** ప్రజల అప్లికేషన్ల కోసం ఆటోమేటెడ్ ఫారమ్ ఫిల్లింగ్.

ఈ భాగస్వామ్యం ఏఐ డిజిటల్ పరివర్తనలో ముఖ్యమైన మైలురాయిగా నిలవనుంది. గూగుల్ భాగస్వామ్యంతో ఈ పైలట్ ప్రాజెక్ట్ కేవలం సాంకేతిక ప్రయోగం మాత్రమే కాదని, పౌరులందరికీ, ఆరోగ్యకరమైన.. ఫ్రెండ్లీ, స్మార్ట్ హైదరాబాద్‌ను నిర్మించే దిశగా ముందడుగు అని జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ అన్నారు. పైలట్‌గా పరీక్షలు, పరిశీలనలు విజయవంతమయ్యాక నగరవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. తద్వారా హైదరాబాద్ దేశంలోనే స్మార్ట్‌గా, సాంకేతికంగా శక్తివంతమైన నగర జీవితానికి ఆదర్శంగా మారనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## రాజకీయాల్లో లోపించిన నైతిక విలువలు

హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



మండలి వెంకటకృష్ణారావు జయంతి వేడుకల్లో భువన విజయం ప్రదర్శించిన కళాకారులు

**చిక్కడపల్లి:** నేటి రాజకీయాల్లో నైతిక విలువలు లేకుండా పోయాయని హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రపంచ తెలుగు మహాసభల సూత్రధారి, మాజీమంత్రి మండలి వెంకటకృష్ణారావు శతజయంతి మహోత్సవాలు సోమవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ సాధారణ కార్యకర్తగా సేవా కార్యక్రమాలు నిర్వహించిన గాంధేయవాది వెంకటకృష్ణారావు అని అన్నారు. ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ వెంకటకృష్ణారావు నిస్వార్థ రాజకీయవేత్త అని, తెలుగు భాషపై అభిమానంతో ప్రపంచ తెలుగు మహాసభలను ఘనంగా నిర్వహించారన్నారు. అనంతరం ప్రదర్శించిన భువనవిజయం సాహిత్య రూపకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో కిన్నెర రఘురాం, నాటక రచయిత విజయభాస్కర్, ఉషా గాయత్రి తదితరులు పాల్గొన్నారు. తొలుత ప్రముఖ నాట్య గురువు ఉషాగాయత్రి శిష్య బృందం మా తెలుగు తల్లికి మల్లెపూదండ నృత్య రూపకాన్ని కన్నుల పండుగగా ప్రదర్శించారు. అనంతరం అభ్యుదయ కళావికాస్ వారిచే భువన విజయం సాహిత్య రూపకం ఆసక్తిగా జరిగింది.

## ఫిష్ వెంకట్ కుటుంబాన్ని పరామర్శించిన సోనూసూద్



ఫిష్ వెంకట్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న సినీనటుడు సోనూసూద్

**అడ్డగుట్ట:** ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందిన ఫిష్ వెంకట్ కుటుంబాన్ని ప్రముఖ సినీ నటుడు సోనూ సూద్ పరామర్శించారు. సోమవారం అడ్డగుట్టలోని ఫిష్ వెంకట్ నివాసంలో ఆయన కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా సోనూ సూద్ మాట్లాడుతూ ఫిష్ వెంకట్ మరణం బాధ కలిగించిందన్నారు. వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఫిష్ వెంకట్ మరణం సినీ పరిశ్రమకు తీరని లోటని, తనతో అత్యంత ఆప్యాయంగా ఉండేవారని ఆయన గుర్తు చేసుకున్నారు. విలన్‌గా, హాస్యనటుడిగా వివిధ క్యారెక్టర్లు చేస్తూ తన నటనతో అందరినీ అలరించేవాడని పేర్కొన్నారు. తెలంగాణ యాసతో తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు ఫిష్ వెంకట్ అని అన్నారు.

## కాంగ్రెస్‌తోనే నగరంలో ప్రశాంతత



పనులు ప్రారంభిస్తున్న మంత్రులు తుమ్మల, వివేక్

**శ్రీనగర్‌కాలనీ:** హైదరాబాద్ మహానగరం దేశానికే తలమానికంగా మారిందని, నగరం ప్రశాంతంగా, పరిశుభ్రంగా ఉండాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ అన్నారు. సోమవారం జయప్రకాష్ నగర్ కాలనీలో కోటి 11 లక్షల రూపాయలతో సీసీరోడ్డు నిర్మాణ పనులు, అంబేడ్కర్ నగర్‌లో రూ.44 లక్షలతో సీవరేజీ పనులకు శంకుస్థాపన చేశారు. కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. సారథి కళాబృందం పథకాలపై చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, మాజీ ఎంపీ అజహరుద్దీన్, నవీన్ యాదవ్, కార్పొరేటర్లు వనం సంగీత, సీఎన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సంజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు రెండు లక్షల కోట్లు కేటాయించాలి

– కేంద్రాన్ని డిమాండ్ చేసిన ఆర్.కృష్ణయ్య



**ముషీరాబాద్:** పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్ర బడ్జెట్‌లో బీసీ అభివృద్ధి, సంక్షేమానికి రెండు లక్షల కోట్ల రూపాయలు కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 18, 19వ తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు తరలిరానున్నట్లు చెప్పారు. పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలని గత 30 ఏళ్లలో ఢిల్లీలో 102 సార్లు ధర్నాలు చేశామని, 66 సార్లు ప్రధానమంత్రులను కలిసి చర్చలు జరిపామన్నారు. కేంద్ర ప్రభుత్వానికి 18 డిమాండ్లు సమర్పించగా రెండు డిమాండ్లకు సుముఖత వ్యక్తం చేసిందని, జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగబద్ధమైన హోదా, కేంద్ర ఓబీసీ రిజర్వేషన్లను గ్రూపులుగా వర్గీకరించడానికి అంగీకరించిందని తెలిపారు. బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, ప్రతి విద్యార్థికి రూ.20 వేల స్కాలర్‌షిప్ ఇవ్వాలని కోరారు. నాణ్యమైన విద్య కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ రెసిడెన్షియల్ పాఠశాల స్కీం, హాస్టళ్లు మంజూరు చేయాలని, ప్రతి బీసీ కుటుంబానికి రూ.10 లక్షల సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో నీల వెంకటేష్, గుజ్జ కృష్ణ, జిల్లపల్లి అంజి, వేముల రామకృష్ణ, అనంతయ్య, నందగోపాల్, రాజేందర్, శివకుమార్‌యాదవ్, శివముదిరాజ్, సాయియాదవ్, నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు సత్వర పరిష్కారం

– జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్

**లక్డీకాపూల్:** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ రఘుప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై అదనపు కమిషనర్లకు ఫిర్యాదులు, విజ్ఞాపన పత్రాలను అందించారు. ఫిర్యాదులను అదనపు కమిషనర్లు క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారానికి సంబంధిత విభాగాల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని విభాగాల అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్జీల పరిష్కారంలో జాప్యం చేస్తే దరఖాస్తుదారుడు అదే పనిగా ప్రజావాణి పలు మార్లు వచ్చే అవకాశం ఉంటుందని, అందుకే ప్రతి అర్జీని జాగ్రత్తగా పరిశీలించి గుణాత్మక, సత్వర పరిష్కారం చూపాలనీ హెచ్‌ఓడీలను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఈ కార్యక్రమానికి మొత్తం 60 విన్నపాలు వచ్చాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 88 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు వేణుగోపాల్, సత్యనారాయణ, పద్మజ, గీతా రాధిక, సీఈ సహదేవ్ రత్నాకర్, అడిషనల్ సీసీపీ గంగాధర్, వెంకన్న, చీఫ్ వెటర్నరీ అధికారి డా.అబ్దుల్ వకీల్, చీఫ్ మెడికల్ అధికారి డా.పద్మజ, డిప్యూటీ సీఈఓ పససరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గెస్ట్ ఫ్యాకల్టీ రిక్రూట్‌మెంట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

**విజయనగర్‌కాలనీ:** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మాసబ్ ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాసబ్‌ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, వడ్డేపల్లి, జోగిపేట, నాగార్జునసాగర్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ సబ్జెక్ట్‌లలో బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ ఉద్యోగుల కోసం బీఈ, బీటెక్ ఫస్ట్‌క్లాస్‌లో ఉత్తీర్ణులైనవారు అర్హులని పేర్కొన్నారు. ఎంటెక్ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుంది. సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగంలో సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీ ఫస్ట్‌క్లాస్ అర్హత ఉండాలన్నారు. ఆసక్తి, అర్హత గల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## వాట్సాప్ అర్జీలకు సమాన ప్రాధాన్యం

– కలెక్టర్ హరిచందన దాసరి

**సాక్షి,సిటీబ్యూరో:** వికలాంగులు, వయోవృద్ధుల కోసం ప్రవేశపెట్టిన వాట్సాప్ నెంబరు ద్వారా వచ్చే అర్జీలకూ సమాన ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను కలెక్టర్ హరిచందన దాసరి ఆదేశించారు. ప్రజల అర్జీలపై సత్వరమే అధికారులు స్పందించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ వాల్ పోస్టర్‌ను అధికారులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఈ.వెంకటాచారి, సీపీఓ డాక్టర్ ఎస్.సురేందర్, డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటి, వివిధ శాఖల జిల్లా అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

## అసాధారణ కమ్యూనిస్టు అచ్యుతానందన్

– సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు



అచ్యుతానందన్ సంస్మరణ సభలో మాట్లాడుతున్న రాఘవులు

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** సీపీఐ(ఎం) మాజీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్.అచ్యుతానందన్ అసాధారణ కమ్యూనిస్టు అని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. అచ్యుతానందన్ 7వ తరగతి వరకే చదివినా పార్టీ పొలిట్‌బ్యూరో స్థాయికి ఎదిగారని, ముఖ్యమంత్రి పదవిని కూడా చేపట్టారని కొనియాడారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అచ్యుతానందన్ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ ప్రజలను చదవడం, వారి సమస్యలను అర్థం చేసుకోవడం, పోరాటాలు నిర్మించడంలో అచ్యుతానందన్ కీలకపాత్ర పోషించారని అన్నారు. ఆయన నిరాడంబర జీవితం అందరికీ ఆదర్శప్రాయమని కొనియాడారు. 17 ఏళ్ల వయసులోనే కమ్యూనిస్టు పార్టీలో చేరి తన చివరి శ్వాస వరకు ప్రజల కోసం పనిచేశారని అన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అధికార వికేంద్రీకరణను ప్రణాళికాబద్ధంగా చేపట్టడంతోపాటు గ్రామాలను స్వతంత్ర ప్రభుత్వాలుగా మార్చారని అన్నారు. ఫ్రీ సాఫ్ట్‌వేర్‌ను అన్ని పాఠశాలలో అమలు చేసి కంప్యూటర్ విజ్ఞానం ప్రజలంతా వినియోగించుకునేలా కృషి చేశారని గుర్తు చేశారు. దేశంలో హిందూత్వ రాజ్యస్థాపన కోసం బీజేపీ మత విద్వేషాలను రెచ్చగొడుతోందని విమర్శించారు. అమెరికా అల్లకల్లోలం అవుతుందని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బాధపడుతున్నారని, అందుకే వివిధ దేశాలపై సుంకాలు విధిస్తున్నారని విమర్శించారు. అచ్యుతానందన్ స్ఫూర్తితో పోరాటం చేయడమే ఆయనకిచ్చే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు టి.జ్యోతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారు రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ శ్రేణుల ఢిల్లీబాట

- రైలులో బయలుదేరిన మీనాక్షి, పొన్నం, వాకిటి
- 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధన కోసం మూడు రోజుల ధర్నా



చర్లపల్లి నుంచి రైల్‌లో బయలుదేరిన మీనాక్షి నటరాజన్, మహేశ్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీహరి తదితరులు

**కుషాయిగూడ:** బీసీ రిజర్వేషన్ సాధన నిమిత్తం కాంగ్రెస్ శ్రేణులు ఢిల్లీకి తరలివెళ్లారు. చర్లపల్లి రైల్వేస్టేషన్ నుంచి సోమవారం బయలుదేరిన ప్రత్యేక రైలును తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ ఏఐసీసీ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు ఢిల్లీ వెళ్తున్నానని చెప్పారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును రాష్ట్రపతి ఆమోదించాలన్న డిమాండ్‌తో మూడు రోజులపాటు నిర్వహించ తలపెట్టిన ధర్నాలో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ముస్లిం కార్డు ముందుంచి రిజర్వేషన్లు ఎత్తేయాలని బీజేపీ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. మంత్రి కిషన్‌రెడ్డి బీసీల వ్యతిరేకి అని, అందుకే ముస్లిం కార్డును ముందుకు తీసుకువచ్చి బీసీ రిజర్వేషన్ అమలుకు అడ్డుపడుతున్నారని విమర్శించారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ 'ఢిల్లీలో బీసీ రిజర్వేషన్‌పై నిర్ణయం జరుగుతుంది. హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దీక్ష చేస్తున్నారు. ఢిల్లీకి దీక్షను మార్చి తెలంగాణ ఉద్యమం తరహాలో మరో ఉద్యమం చేయాలి' అని అన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుల సాధనకు అన్ని కుల సంఘాలు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. మంత్రి శ్రీహరి మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్లు అమలు జరిగితే కాంగ్రెస్‌తోపాటుగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలో బీసీ బిడ్డలకు మేలు జరుగుతుందన్న వాస్తవాన్ని అన్ని పార్టీలు గ్రహించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు వజ్రేష్ యాదవ్, బొంతు రాంమోహన్, మందముల పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, స్వర్ణరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆ మూడు పార్టీలవి నాటకాలే..

కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లపై తీన్మార్ మల్లన్న ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న

**పంజగుట్ట:** బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు మరోమారు బీసీలను మోసగించాలని చూస్తున్నాయని ఎమ్మెల్సీ, తెలంగాణ బీసీ పొలిటికల్ జేఏసీ వ్యవస్థాపకుడు తీన్మార్ మల్లన్న ఆరోపించారు. ఇప్పటికే 45 శాతం బీసీలు సర్పంచ్, ఎంపీటీసీలుగా ఉన్నారని, ఇప్పుడు 42 శాతం కోసం పోరాడటం విడ్డూరంగా ఉందన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'ఇటీవల కాంగ్రెస్ జరిపిన కుల సర్వేలో అగ్రవర్ణాల జనాభా 15 శాతమని చూపించారు కదా. 15 శాతం మీరు తీసుకుని మిగిలినవి మాకు వదిలెయ్యాలి' అని అన్నారు. బీజేపీ అక్రమంగా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తీసుకువస్తే, గత బీఆర్ఎస్ ప్రభుత్వం దాన్ని వెంటనే అమలు చేసి బీసీలకు తీరని అన్యాయం చేసిందని, ఈ పార్టీలు బీసీలకు న్యాయం చేస్తాయనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ఆమరణ నిరాహారదీక్ష చేస్తే మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు.

**నిరుద్యోగుల నిరసన..**

తీన్మార్ మల్లన్న సమావేశం జరుగుతుండగానే డీఎస్సీ 2024 స్పోర్ట్స్ కోటా సెకండరీ గ్రేడ్ టీచర్ల అభ్యర్థులు తమకు న్యాయం చేయాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభా ప్రాంగణంలోకి వచ్చారు. తమ ఓట్లతో గెలిచి సమస్యలను పట్టించుకోవడం లేదని కొంతమంది నిరుద్యోగులు తీన్మార్ మల్లన్న వద్దకు వెళ్లి నినాదాలు చేశారు. దీంతో మల్లన్న అనుచరులకు, నిరుద్యోగులకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. కాగా, సమావేశాన్ని అడ్డుకున్న వారికి, డీఎస్సీ అభ్యర్థులకు సంబంధం లేదని తెలుసుకున్న పోలీసులు గొడవ చేసిన వారిని అక్కడ నుంచి పంపించారు.

## వైభవంగా బోనాల శోభాయాత్ర



బోనాల శోభాయాత్రలో పిల్లి శంకర్, కేశవ్ కుమార్ తదితరులు

**అబిడ్స్:** గంగపుత్రులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తుందని రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి వాకాటి శ్రీహరి అన్నారు. ఆదివారం అఫ్జల్‌గంజ్‌లో తెలంగాణ నగర గంగపుత్ర సంఘం అధ్యక్షుడు చాట్ల సదానంద్, ప్రధాన కార్యదర్శి పిల్లి శంకర్ ఆధ్వర్యంలో మహంకాళి అమ్మవారి మూడో వార్షికోత్సవ బోనాల శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీహరి, మెట్టు సాయికుమార్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్ యాదవ్, బీజేపీ జీహెచ్‌ఎంసీ ఫ్లోర్‌లీడర్ జి.శంకర్‌యాదవ్, కార్పొరేటర్ శైలజ, రాష్ట్ర ప్రజా సంఘం అధ్యక్షుడు శ్రీహరి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 160 సామూహిక బోనాల ఊరేగింపు ప్రారంభమైంది. పోతరాజుల విన్యాసాలతో బోనాల శోభాయాత్ర కనుల పండువ జరిగింది. ఈ కార్యక్రమంలో అమృత్‌రాజ్, ధన్‌రాజ్, గులాబ్ శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ ఉమేష్‌కుమార్, అశోక్, పురుషోత్తమ్, కేశవ్‌కుమార్, వేణుగోపాల్‌రావు, శివ, మహిళా అధ్యక్షురాలు భగవతి, ప్రధాన కార్యదర్శి రాజశ్రీ, యూత్ అధ్యక్షుడుఎ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్యూబాపై అమెరికా ఆంక్షలు తగదు



కరపత్రాలను విడుదల చేస్తున్న ప్రొ.కాశీం

**ఉస్మానియా యూనివర్సిటీ:** క్యూబాపై అమెరికా ఆంక్షలు తగదని నేషనల్ కమిటీ ఫర్ సాలిడారిటీ విత్ క్యూబా నేత ఆర్ఎల్ మూర్తి అన్నారు. ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న క్యూబా ప్రజల కోసం సోమవారం ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ డీజీ నర్సింహారావు ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీంతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం నర్సింహారావు మాట్లాడుతూ అమెరికా విధించిన ఆంక్షల వల్ల క్యూబా ప్రజలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచంలో కమ్యూనిజాన్ని అంతం చేయాలనే లక్ష్యంతో క్యూబాపై అమెరికా పగబట్టి ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేసిందని ఆరోపించారు. మానవతా దృక్పథంతో క్యూబా ప్రజలకు ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు అశోక్, మహేందర్, లెనిన్, అజయ్, శ్రీను, ఉదయ్, అంజి, నీకేష్ తదితరులు పాల్గొన్నారు.



# పటోలా ఆర్ట్‌ వస్త్ర ప్రదర్శన

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్డు నెంబర్‌–1లోని లేబుల్స్‌ పాప్‌–అప్‌ స్పేస్‌లో కొలువుదీరిన డీ సన్స్‌ పటోలా ఆర్ట్‌ వస్త్ర ప్రదర్శన సోమవారం ప్రారంభమైంది. సెలబ్రిటీ కోచ్‌, నగర సోషలైట్‌ డాక్టర్‌ సంగీత కోసూరు దీనిని ప్రారంభించారు. విభిన్నమైన పటోలా ఆర్ట్‌ చీరలు, పటోలా హ్యాండ్లూమ్‌, సిల్క్‌ వస్త్ర ఉత్పత్తులను ఒకే వేదికపై ప్రదర్శించడం అభినందనీయమని అన్నారు. నేరుగా వీవర్స్‌ నుంచి వినియోగదారునికి అందించేందుకు ఏర్పాటైన ఈ ప్రదర్శన ప్రతిఒక్కరూ సందర్శించి మరింత ప్రోత్సహించాలన్నారు. డీ సన్స్‌ పటోలా ఆర్ట్స్‌ నిర్వాహకులు భవిన్‌ మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ వరకూ కొనసాగుతున్న ఈ ప్రదర్శనలో ప్రత్యేక కలెక్షన్స్‌ కొలువుదీరాయని తెలిపారు. పటోలా, బంధాని, పైథాని, బనారసి, జరీకోట, చందేరి, మహేశ్వరి, కశ్మీరి నేత వస్త్రాలు, లక్నోవి, కంచిపట్టు, వెంకటగిరి, డ్రెస్‌ మెటీరియల్స్‌, అజ్రక్‌ చీరలు, కుర్తీలు, బెడ్‌షీట్లతో పాటు ఆభరణాలు వంటి 10 వేల రకాల వస్త్ర ఉత్పత్తుల అందుబాటులో ఉన్నాయి.

# బీ డివిజన్‌ క్రికెట్‌ లీగ్‌లో కమల్‌ స్వరూప్‌ ప్రతిభ



సీజన్‌లో మొత్తం 14 వికెట్లతో టాప్‌లో

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌ క్రికెట్‌ అసోసియేషన్‌ బీ డివిజన్‌ లీగ్‌లో సలీం నగర్‌ తరపున ఆడుతున్న కమల్‌ స్వరూప్‌ తటవర్తి మరోసారి తన ప్రతిభతో మెరిశాడు. మాంచెస్టర్‌ జట్టుపై జరిగిన మ్యాచ్‌లో ఐదు వికెట్లను పడగొట్టి సలీం నగర్‌ను ఏడు వికెట్ల తేడాతో విజయపథాన నడిపించాడు. ప్రస్తుత సీజన్‌లో కమల్‌ స్వరూప్‌ మొత్తం 14 వికెట్లతో టాప్‌లో ఉన్నాడు. అంతకుముందు మ్యాచ్‌లో కూడా మూడు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు.

# యువత కోసం.. బ్యూటీ వెల్‌నెస్‌ కోర్సులు..

సాక్షి, సిటీబ్యూరో: భారత ప్రభుత్వం ప్రతిపాదించిన స్కిల్‌ ఇండియా మిషన్‌కు అనుగుణంగా సౌందర్య చికిత్స రంగంలో యువతకు ఉపాధిని ఇచ్చేందుకు ప్రముఖ సంస్థ వీఎల్‌సీసీ ఇండియా కొత్త ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. ఈ విషయాన్ని సంస్థ సీఈఓ, ఎండీ వికాస్‌ గుప్తా తెలిపారు. వేలాది మంది యువతకు ఆర్థిక స్వాతంత్య్రాన్ని అందిస్తూ ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా స్కూల్‌ ఆఫ్‌ బ్యూటీ ఇన్‌స్టిట్యూట్స్‌ ఏర్పాటు చేస్తున్నామని, ఏక కాలంలోనే 14 నగరాల్లో వీటిని నెలకొల్పామని వివరించారు. అర్హత కలిగిన విద్యార్థులకు 100 శాతం ఉపకార వేతనాలు, జాబ్‌ గ్యారెంటీ కోర్సులు.. వంటివి ఇందులో భాగమన్నారు.





# అరచేతిలో అనర్థం!

గ్యాడ్జెట్లకు దూరంగా ఉండలేని పరిస్థితి

- 'మొబైల్‌ ఫోబియా'పై నిపుణుల ఆందోళన
- పెరుగుతున్న బాధితుల సంఖ్య
- పలు అధ్యయన ఫలితాల్లో వెల్లడైన వాస్తవం
- వ్యసనం నుంచి బయటపడేందుకు ప్రయత్నాలు

40% మందికి 'నో మొబైల్‌ ఫోబియా': తేల్చిన సర్వే



అరచేతిలో అద్భుతాన్ని చూపించే స్మార్ట్‌ఫోన్లు.. అనర్థాలకు దారి తీస్తోంది.. ప్రపంచాన్ని మన గుప్పిట్లోకి తెచ్చిన టెక్నాలజీ.. చివరికి మనల్నే తన గుప్పిట్లో బంధీగా చేస్తోంది. రోజువారీ అవసరాలు తీర్చడం తోపాటు.. రోజువారీ సమస్యలనూ తెచ్చిపెడుతోంది.. సరదాగా కాలక్షేపం కోసం మొదట్లో వినియోగంలోకొచ్చి.. ఇప్పుడు అదే కాలక్షేపంగా మారిపోయింది.. అనేక సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చి సమయాన్ని ఆదా చేస్తుందనుకున్న మొబైల్‌ నేడు మన సమయాన్ని వృథా చేస్తోంది.. నెమ్మదిగా దానికి బానిసలుగా మార్చేసుకుంటోంది.. మొబైల్‌ వినియోగించకుండా ఉండలేకపోవడాన్ని సైంటిఫిక్‌గా నోమోఫోబియా అంటున్నారు. ప్రస్తుతం ఈ ఫోబియాకు గురవుతున్నవారి సంఖ్య క్రమంగా పెరుగుతోందని ఓ సంస్థ నిర్వహించిన సర్వేలో ఫలితాలు చెబుతున్నాయి.

– సాక్షి, హైదరాబాద్‌



ఒకప్పుడు కేవలం సమాచారానికి, అవసరమైన కమ్యూనికేషన్‌కు మాత్రమే ఉపయోగించుకున్న మొబైల్‌ ఫోన్లు.. ఇప్పుడు మన జీవితాల్లో ప్రధాన భాగమైపోయాయి. సోషల్‌ మీడియా, గేమ్స్‌, షార్ట్‌ వీడియోలు, అరచేతిలో టిక్‌ టిక్‌ మంటూ వచ్చే నోటిఫికేషన్లతో.. అసలు మొబైల్‌ను మనమే పట్టించుకోవడం లేదు.. అది మనల్ని పట్టేసింది! ఒక ప్రైవేట్‌ సర్వే ప్రకారం.. హైదరాబాద్‌లోని విద్యార్థుల్లో 62% మందికి పైగా రోజుకు సగటున 6–8 గంటలు మొబైల్‌లో గడుపుతున్నారని తేలింది. అయితే వ్యసనంలా మారిన ఈ మొబైల్‌ అడిక్షన్‌ నుంచి బయటపడటానికి కొందరు మాత్రం ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతున్నారు.

## నగర యువతపై ప్రభావం..

హైదరాబాద్‌ వంటి మహానగరాల్లో మొబైల్‌ యూజర్ల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. టెక్‌ జాబ్స్‌, మెట్రో జీవితం, ఒంటరి అపార్ట్‌మెంట్‌ కల్చర్‌ తదితర కారణాలతో మొబైల్‌ను ఓ సాధనంగా కాకుండా ఒక సహజీవిగా మార్చేశాయి. ప్రత్యేకించి 15–30 ఏళ్ల వయసులో ఉన్న యువతలో ఇది తీవ్రమైన డిజిటల్‌ డిపెండెన్సీగా మారింది. ముఖ్యంగా రాత్రిపూట స్క్రోల్‌ చేస్తూ నిద్రపోయే వరకూ ఫోన్‌ చూస్తుండటం వల్ల నిద్రలేమి, తలనొప్పి, ఏకాగ్రత లోపం, డిప్రెషన్‌ వంటి మానసిక, శారీరక రుగ్మతలకు లోనవుతున్నారు.


## సర్వేలు ఏమంటున్నాయంటే..

నిమాన్స్‌ (ఎన్‌ఐఎంహెచ్‌ఏఎన్‌ఎస్‌) చేసిన అధ్యయనంలో దాదాపు 40% మందికి 'నో మొబైల్‌ ఫోబియా' (నోమోఫోబియా) ఉందని వెల్లడైంది. తెలంగాణ సైకలాజికల్‌ అసోసియేషన్‌ అధ్యయనం ప్రకారం, 18–25 ఏళ్ల మధ్య వయస్కుల్లో ప్రతి 10 మందిలో ఏడుగురు మొబైల్‌ లేని జీవితాన్ని ఊహించలేకపోతున్నారని తేలింది. హైదరాబాద్‌లోని విద్యా సంస్థలు తాము నిర్వహించిన అంతర్గత సర్వేల్లో విద్యార్థులు చదువుపై ఫోకస్‌ కోల్పోతున్నారని స్పష్టంగా పేర్కొన్నాయి.



## చిన్నారుల్లో దీని ప్రభావం..

పిల్లలు ఆహ్లాదంగా ఆడుకోవాల్సిన వయసులో మొబైల్‌ స్క్రీన్‌కి అలవాటుపడుతున్నారు. తల్లిదండ్రులు తాత్కాలికంగా వారి తలనొప్పి తగ్గించుకోవాలనే ఉద్దేశంతో మొబైల్‌ అందిస్తుంటే.. అది శాశ్వతంగా పిల్లల అభివృద్ధికి అడ్డుగోడవుతోంది. స్పీచ్‌ డిలే, అటెన్షన్‌ డెఫిసిట్‌, హైపర్‌ యాక్టివిటీ వంటి సమస్యలు పిల్లల్లో గణనీయంగా పెరిగిపోతున్నాయి.




## విముక్తి మార్గాలు..

- డిజిటల్‌ డీటాక్స్‌ ఛాలెంజ్‌ : ప్రతి వారం ఒక రోజు లేదా ప్రతి రోజు ఒక నిర్ణీత సమయం మొబైల్‌కి బ్రేక్‌ ఇవ్వడం.
- ఆఫ్‌లైన్‌ హాబీస్‌ : పుస్తక పఠనం, ఆర్ట్‌, గార్డెనింగ్‌, యోగా వంటి కార్యకలాపాలు మొబైల్‌ డిపెండెన్సీని తగ్గించడంలో సహాయపడతాయి.
- సోషల్‌ మీడియా మేనేజ్మెంట్‌ : సోషల్‌ మీడియా అకౌంట్స్‌ డిలీట్‌ చేయడం కాదు, వాటిని 'లిమిటెడ్‌ యూజ్‌' మోడ్‌లో పెట్టడం, నోటిఫికేషన్లు ఆఫ్‌ చేయడం.
- డిజిటల్‌ వెల్‌ బీయింగ్‌ యాప్స్‌ : స్క్రీన్‌ టైమ్‌ ట్రాకింగ్‌, రిమైండర్లు ఇవ్వగల యాప్స్‌ ఉపయోగించడం.
- ఫ్యామిలీ టైమ్‌..: ప్రతి రోజు 1–2 గంటలు కుటుంబ సభ్యులతో గడిపేందుకు ప్రయత్నించాలి.

## హైదరాబాద్‌ స్పెషల్‌ ఇన్షియేటివ్స్‌..

- కొన్ని కార్పొరేట్‌ కంపెనీలు ఉద్యోగులకు నెల్లో ఒక్కరోజు 'నో మొబైల్‌ డే' పాటిస్తున్నారు.
- బంజారాహిల్స్‌లోని ఓ స్కూల్‌ 'టెక్‌ ఫ్రీ అవర్‌' అంటూ రోజుకు ఒక పిరియడ్‌ను స్క్రీన్‌ లేని యాక్టివిటీలకు కేటాయిస్తోంది.
- సైకలాజికల్‌ వెల్‌ బీయింగ్‌ సెంటర్స్‌ ఆధ్వర్యంలో మొబైల్‌ డిపెండెన్సీకి కౌన్సెలింగ్‌ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తున్నారు.

## స్మార్ట్‌ యూజ్‌..

ప్రస్తుత అధునాతన జీవన శైలిలో టెక్నాలజీని వదిలేయమనడం సాధ్యం కాదు.. కానీ మనమే నియంత్రించలేకపోతే అది మనల్ని నియంత్రించడం ఖాయం. మొబైల్‌ అనేది ఓ సాధనం మాత్రమే, జీవితం కాదు. ప్రత్యేకించి యువత.. కెరీర్‌, మానసిక ఆరోగ్యం, రిలేషన్‌షిప్స్‌ అన్నింటినీ తారుమారు చేసే ఈ డిజిటల్‌ బానిసత్వం నుంచి బయటపడితేనే నిజమైన 'స్మార్ట్‌ యూజ్‌' అవుతుంది.

# 9వ యూజెనిక్స్‌ ఫిల్మ్‌ఫేర్‌

- గ్లామర్‌ – స్టైల్‌ అవార్డ్స్‌ సౌత్‌ 2025
- అవార్డుల్లో సినిమా, ఫ్యాషన్‌ సమ్మేళనం

సాక్షి, సిటీబ్యూరో: సినిమా ఫ్యాషన్‌ ప్రపంచాలను ఒకచోట చేర్చి, వినోద పరిశ్రమలో ప్రతిభను గుర్తించే లక్ష్యంతో 'ఫిల్మ్‌ఫేర్‌ గ్లామర్‌ అండ్‌ స్టైల్‌ అవార్డ్స్‌ సౌత్‌ 2025' నిర్వహణకు రంగం సిద్ధమైంది. ఫిల్మ్‌ఫేర్‌, యూజెనిక్స్‌ ఆధ్వర్యంలో ఆగస్టు 9వ తేదీన బంజారాహిల్స్‌ హోటల్‌ రెసిడెన్స్‌ పార్క్‌ హయత్‌లో అవార్డుల ప్రదానం చేయనున్నట్లు జేఈఎన్‌ఎల్‌, బీసీసీఎల్‌ టీవీ, డిజిటల్‌ నెట్వర్క్‌ డైరెక్టర్‌ రోహిత్‌ గోపాకుమార్‌ తెలిపారు. ముంబయితో పాటు ఇటీవల కాలంలో పశ్చిమ బెంగాల్‌లో విజయవంతంగా నిర్వహించిన తర్వాత ఈ అవార్డులను దక్షిణాదిన అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మొట్టమొదటి సదరన్‌ ఎడిషన్‌ దక్షిణ భారత సినిమా శైలి, ఫ్యాషన్‌ను గౌరవిస్తుందన్నారు. ఫిలింఫేర్‌ హెడ్‌ జితేష్‌ పిళ్లై మాట్లాడుతూ.. యూజెనిక్స్‌తో కలిసి, ఫిల్మ్‌ఫేర్‌ గ్లామర్‌ ప్రతిబింబించే ప్రదర్శన అందించడానికి తాము ఎదురుచూస్తున్నామన్నారు. నగరంలో సినిమాటిక్‌ స్టైల్‌ ఎక్సలెన్స్‌ ఈ తొలి గ్లామర్‌ – స్టైల్‌ అవార్డులతో మరింత గుర్తింపు పొందనుందని పేర్కొన్నారు.

EUGENIX HAIR SCIENCES FILMFARE Glamour & Style awards SOUTH 2025



# పాలిటిక్స్‌ కన్నా.. పిజ్జాయే మిన్న

ఇండియా ఓవర్‌ థింకింగ్‌ రిపోర్టులో వెల్లడి

సామాన్య విషయాల్లోనూ అతిగా ఆలోచన



సాక్షి, సిటీబ్యూరో: పాలిటిక్స్‌ కంటే పిజ్జా గురించే మన వాళ్లు ఎక్కువగా ఆలోచిస్తున్నారని 'ఇండియా ఓవర్‌ థింకింగ్‌ రిపోర్ట్‌' పేరిట సెంటర్‌ ఫ్రెష్‌ యూ గోవ్‌ సంయుక్తంగా నిర్వహించిన తాజా జాతీయ స్థాయి అధ్యయనం వెల్లడైంది. ఈ రిపోర్ట్‌ ప్రకారం.. ఓవర్‌ థింకింగ్‌లో ముందున్న మన దేశవాసులు రాజకీయాల కంటే పిజ్జా గురించే ఎక్కువగా ఆలోచిస్తున్నట్టు తేలింది. దేశవాసుల ఆలోచనల్లోనూ, రోజువారీ జీవనశైలిలోనూ అతి ప్రభావితం చేస్తోందని, సమస్యలు ఉన్నప్పుడు మాత్రమే కాకుండా, అత్యంత సాధారణమైన విషయాలకు సంబంధించిన నిర్ణయాల్లోనూ, ఆలోచనల్లోనూ అతి కనిపిస్తోందని ఈ నివేదిక చెబుతోంది.

## 81 శాతం మందిలో..

దేశంలో 81 శాతం మందికి రోజుకి మూడు గంటలకు పైగా ఓవర్‌థింకింగ్‌ అలవాటైంది. వాట్సాప్‌ మెసేజ్‌కి ఎలా స్పందించాలో, భోజనానికి ఏం తినాలో, లేదా ఇన్‌స్టాగామ్‌లో ఏ ఫొటో పోస్ట్‌ చేయాలో అనేటటువంటి ప్రతి చిన్న విషయంలోనూ ప్రజలు ఆలోచనల ఊబిలో మునిగిపోతున్నారని నివేదిక స్పష్టం చేస్తోంది. రెస్టారెంట్‌లో డిష్‌ ఎంపిక చేయడం అనేది రాజకీయ నాయకుడిని ఎంచుకోవడంకన్నా ఎక్కువ ఒత్తిడిని కలిగిస్తోందని 63% మంది చెప్పడం విశేషం.

# జయహో జకీయుద్దీన్‌..



సైకిల్‌పై ట్రాఫిక్‌ పోలీసు విధులు

మెచ్చుకుంటున్న సికింద్రాబాద్‌ ప్రజలు

బన్సీలాల్‌పేట్‌ : అతనో ట్రాఫిక్‌ కానిస్టేబుల్‌.. ప్రభుత్వం కేటాయించిన బ్యాటరీ సైకిల్‌పై విధులు నిర్వహిస్తూ సికింద్రాబాద్‌ ప్రజల మన్ననలు పొందుతున్నాడు.. సందులు, గల్లీల్లో ట్రాఫిక్‌ క్రమబద్ధీకరిస్తూ శభాష్‌ అనిపించుకుంటున్నాడు. ఆయనే సికింద్రాబాద్‌ మహంకాళి ట్రాఫిక్‌ పోలీసు స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్‌ ఎండీ జకీయుద్దీన్‌. 2014 బ్యాచ్‌కు చెందిన జకీయుద్దీన్‌ ఇతర ఉద్యోగులకు స్ఫూర్తిగా నిలుస్తున్నాడు..స్టేషన్‌ పరిధిలోని మోండా మార్కెట్‌, పాట్‌ మార్కెట్‌, ఓల్డ్‌గాస్‌ మండీ తదితర ప్రాంతాల్లో సైకిల్‌పై విధులు నిర్వహిస్తున్నాడు. నగరంలో ట్రాఫిక్‌ పోలీసులు విధులు నిర్వహించడానికి వీలుగా ప్రభుత్వం బ్యాటరీ సైకిళ్లను అందజేసింది. అయితే చాలా స్టేషన్లలో వీటిని మూలనపడేశారు. విధుల కోసం డిపార్టుమెంట్‌ ప్రతి నెలా ఇచ్చే 25 లీటర్ల పెట్రోల్‌తో బైక్స్‌ వినియోగిస్తుంటారు.. అయితే ఇంధనం ఆదా చేయడంతో పాటు వాహన కాలుష్యాన్ని తగ్గించడానికే తాను బ్యాటరీ సైకిల్‌ వినియోగిస్తున్నానని జకీయుద్దీన్‌ చెబుతున్నాడు. తాను క్రీడాకారుడిని కాబట్టి సైకిల్‌ వినియోగం ఆరోగ్యానికీ ఉపయుక్తమవుతుందని, పర్యావరణానికీ మేలు కలుగుతుందని సాక్షితో పంచుకున్నాడు.

# స్కాలర్‌షిప్స్‌ ఎంపికకు.. అంథే పరీక్ష

సాక్షి, సిటీబ్యూరో: ప్రవేశ పరీక్షల అభ్యర్థులకు శిక్షణా సంస్థ ఆకాశ్‌ ఎడ్యుకేషనల్‌ సర్వీసెస్‌ లిమిటెడ్‌ (ఎఇఎస్‌ఎల్‌) తమ 16వ వార్షికోత్సవం సందర్భంగా అంథే–2025 (ఆకాష్‌ నేషనల్‌ టాలెంట్‌ హంట్‌ ఎగ్జామ్‌ను ప్రారంభించింది. ఈ విషయాన్ని ఎఇఎస్‌ఎల్‌ సీఈఓ దీపక్‌ మెహ్రోత్రా తెలిపారు. దీనిలో భాగంగా 9 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు 100% వరకూ స్కాలర్‌షిప్స్‌తో పాటు రూ.2.5 కోట్ల నగదు బహుమతులు అందిస్తామని, అర్హుల ఎంపికకు ఆన్‌లైన్‌ పరీక్షలు అక్టోబర్‌ 4 నుంచి 12 వరకూ, ఆఫ్‌లైన్‌ పరీక్షలు అక్టోబర్‌ 5 నుంచి 12 వరకూ జరుగుతాయని, ఫలితాలు అక్టోబర్‌ 24 నుంచి నవంబర్‌ 4 మధ్య దశలవారీగా విడుదలవుతాయన్నారు. అదనంగా, 'ఇన్విక్టస్‌ ఎస్‌' పేరుతో జేఈఈ అడ్వాన్స్‌డ్‌ కోసం ప్రత్యేక స్కాలర్‌షిప్‌ టెస్ట్‌ ఆగస్టు 24, 31, సెప్టెంబర్‌ 7 తేదీల్లో నిర్వహిస్తామని తెలిపారు. దరఖాస్తులు anthe. aakash. ac. inలో లేదా ఆకాష్‌ సెంటర్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు.

## మార్గదర్శి పిటిషన్లను అనుమతించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి ఫైనాన్షియర్స్ దాఖలు చేసిన పిటిషన్లను అనుమతిస్తూ తెలంగాణ హైకోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. చట్టాన్ని ఉల్లంఘించినందుకు మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని కర్త రామోజీరావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ హైదరాబాద్ నాంపల్లి కోర్టులో 2008లో ఫిర్యాదు దాఖలైంది. దీనిపై రామోజీరావు హైకోర్టును ఆశ్రయించగా, ఆ ఫిర్యాదును ఉమ్మడి హైకోర్టు 2018, డిసెంబర్ 31న కొట్టివేసింది. దీనిని ఏపీ ప్రభుత్వంతోపాటు మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ సుప్రీంకోర్టులో సవాల్‌చేశారు. దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. హైకోర్టు ఇచ్చిన తీర్పును 2024, ఏప్రిల్ 9న కొట్టేసింది. ఉండవల్లి, ఏపీ ప్రభుత్వం సహా అందరి వాదనలు వినాలని చెప్పింది. ఈ క్రమంలో రామోజీ మృతిచెందిన నేపథ్యంలో విచారణను ముగించాలని ఆ సంస్థ జనవరి 29న హైకోర్టులో మధ్యంతర అప్లికేషన్ (ఐఏ) దాఖలు చేసింది. దీనిపై విచారించిన జస్టిస్ శామ్ కోషి ధర్మాసనం సోమవారం మార్గదర్శి పిటిషన్లను అనుమతిస్తూ సోమవారం తుది ఉత్తర్వులు వెలువరించింది.

## బలిపీఠంపై విద్యార్థుల భవిష్యత్

- తెలంగాణలో ఇంటర్ చదివిన ఏపీ విద్యార్థులను స్థానికేతరులుగా పరిగణించడంపై హైకోర్టు విస్మయం
- ఏపీలో పుట్టిపెరిగిన విద్యార్థులను స్థానికులుగానే చూడాలని తీర్పు
- ఫలితంగా ఈఏపీసెట్ రెండో దశ కౌన్సెలింగ్‌లో సీట్ల కేటాయింపు నిలుపుదల
- ఇప్పటికే తొలిదశ సీట్ల కేటాయింపు పూర్తవగా.. కోర్టు ఆదేశాలతో మల్లగుల్లాలు
- తొలిదశ కౌన్సెలింగ్‌లో సీట్ల కేటాయింపును కొత్తగా చేపట్టాలంటున్న విద్యావేత్తలు
- పీజీఈసెట్ సీట్ల కేటాయింపునకు బ్రేక్
- ఈసెట్, ఐసెట్ సీట్ల కేటాయింపుపై మార్పులుంటాయా?.. 'స్థానిక' సర్దుబాటు ఎలా చేస్తారని మీమాంస

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

# సూత్రధారి చంద్రబాబే..

## పాత్రధారులు టీడీపీ వర్గీయులే! ఇదీ రెడ్‌బుక్ కుట్ర కపట నాటకం

సాక్షి, అమరావతి : 'అవసరాల కోసం అడ్డదారులు తొక్కే పాత్రలే అన్నీ' అని ప్రస్థానం సినిమాలో సాయి కుమార్ పాపులర్ డైలాగ్ ఉంటుంది.. 'స్వార్థం అన్నది నిజం.. నిస్వార్థం దాని కవచం' అని కూడా చెబుతాడు. ప్రస్తుతం రాష్ట్రంలో చంద్రబాబు రెడ్‌బుక్ అక్రమ కేసు నాటకం అంతకు మించిన కుట్ర స్క్రిప్ట్‌తో సాగుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో లేని కుంభకోణాన్ని ఉన్నట్టుగా చూపించేందుకు వివిధ పాత్రలు హఠాత్తుగా తెరపైకి వస్తున్నాయి. అన్నీనూ చంద్రబాబు తన అవసరాల కోసం ప్రవేశ పెడుతున్న పాత్రలే. హఠాత్తుగా నోట్ల కట్టలు ప్రత్యక్షం అవుతున్నాయి.. ఆడియోలు, వీడియోలు ఎల్లో మీడియాలో వైరల్ అవుతున్నాయి.. కానీ న్యాయస్థానం క్రియాశీలత, అదే ఆడియో వీడియో ఆధారాలతో ఆ కుట్రలు బెడిసి కొడుతున్నాయి. ఈ రెడ్‌బుక్ కుట్ర నాటకంలో విలన్ మాత్రం కచ్చితంగా చంద్రబాబేనన్నది అంతిమంగా నిగ్గు తేలుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పారదర్శకంగా నిర్వహించిన మద్యం విధానంపై చంద్రబాబు ప్రభుత్వం నమోదు చేసిన అక్రమ కేసు వేధింపులు బెడిసి కొడుతున్నాయి. దాదాపు ఏడాదిగా సీఐడీ, సిట్‌లు దర్యాప్తు ముసుగులో వేధింపులకు పాల్పడుతున్నా, ఒక్క ఆధారం కూడా చూపించలేకపోయారు. దాంతో న్యాయస్థానాలు సంధించే ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక సిట్ చేతులెత్తేస్తోంది. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు తన కుట్రలకు మరింత పదును పెడుతున్నారు. లేని కుంభకోణాన్ని ఉన్నట్టుగా చూపించేందుకు తన రెడ్‌బుక్ కుట్ర నాటకంలో కొత్త పాత్రధారులను పక్కా పన్నాగంతో ప్రవేశ పెడుతున్నారు. టీడీపీ మూలాలు ఉన్న వారు, సీనియర్ టీడీపీ నేతల కుటుంబ సభ్యులు, తమ ప్రభుత్వ హయాంలో ఆర్థికంగా లబ్ధి పొందిన వారిని ఏరికోరి తెరపైకి తెస్తున్నారు. వారందరినీ వైఎస్సార్‌సీపీ నేతలకు సన్నిహితులుగా ముద్ర వేస్తూ.. టీడీపీ అనుకూల మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తూ ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు యత్నిస్తున్నారు. అందుకోసం టీడీపీ వీర విధేయ సిట్ అధికారులే స్వయంగా నోట్ల కట్టల జప్తు డ్రామాకు పాల్పడుతున్నారు. తద్వారా పాత్రధారులు టీడీపీ వర్గీయులే.. నోట్ల కట్టలు టీడీపీ వర్గీయులవే.. సిట్ అధికారులూ టీడీపీ వీర విధేయులే.. సూత్రధారి చంద్రబాబేనని స్పష్టమవుతోంది. అయితే ఇంత చేసినా, టీడీపీ కూటమి ప్రభుత్వ తాజా కుట్రలు కూడా బెడిసికొట్టాయి. సిట్ తాజాగా తెరపైకి తెచ్చిన వారందరూ చంద్రబాబు, లోకేశ్‌లతోపాటు టీడీపీ సీనియర్ నేతలకు అత్యంత సన్నిహితులన్నది ఫొటో, వీడియో ఆధారాలతో సహా బట్టబయలైన వైనం ఇలా ఉంది.

**టీడీపీ నేత తీగల కృష్ణారెడ్డి సోదరుని కుమారుడే తీగల విజయేందర్‌రెడ్డి**

- మద్యం విధానంపై అక్రమ కేసులో ఏడాదిగా ఎలాటి ఆధారాలు సేకరించని సీఐడీ, సిట్.. వారం రోజుల క్రితం ఒక్కసారిగా హడావుడి చేశాయి. హైదరాబాద్ శివారులోని ఓ ఫామ్‌హౌస్‌లో రూ.11 కోట్లు జప్తు చేసినట్టు కనికట్టు చేసింది. ఈ కేసులో సిట్ అక్రమంగా అరెస్టు చేసిన రాజ్ కేసిరెడ్డి వర్ధమాన్ ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన ఆ ఫామ్‌హౌస్‌లో 2024 జూన్‌లో ఆ నగదును దాచిపెట్టినట్టు చెప్పుకొచ్చింది. సిట్ అధికారులే ఆ రూ.11 కోట్లు తెప్పించి ఈ జప్తు కట్టుకథ వినిపించారు.
- ఈ హైడ్రామాకు సిట్‌కు పూర్తిగా సహకరించింది వర్ధమాన్ ఇంజినీరింగ్ కాలేజి యజమాని తీగల విజయేందర్ రెడ్డి. తమ ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన రూ.11 కోట్లను అట్ట పెట్టెల్లో అదే కాలేజీకి ఎదురుగా ఉన్న తమ ఫామ్‌హౌస్‌లో పెట్టించారు. అనంతరం ఆ నగదునే సిట్ జప్తు చేసినట్టు కథ నడిపించారు. ఇంతగా విజయేందర్ రెడ్డి ఈ కుట్రలో చంద్రబాబు ప్రభుత్వానికి ఎందుకు సహకరించారని సందేహం రావచ్చు. ఎందుకంటే ఈయన చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు, టీడీపీ తరఫున హైదరాబాద్ మేయర్‌గా, ఎమ్మెల్యేగా చేసిన తీగల కృష్ణా రెడ్డి సోదరుని కుమారుడు.
- తీగల విజయేందర్ రెడ్డికి చంద్రబాబు, లోకేశ్‌లతోపాటు టీడీపీ సీనియర్ నేతలతో, టీడీపీ అనుకూల మీడియా అధిపతులతో అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నది బహిరంగ రహస్యం. ఈ రెడ్‌బుక్ కుట్ర కేసు వీగిపోతోందన్న ప్రమాద ఘంటికలు మోగగానే చంద్రబాబు పక్కా పన్నాగంతో విజయేందర్ రెడ్డిని తెరపైకి తీసుకువచ్చారు. ఆయన సహకారంతోనే రూ.11 కోట్ల నగదు జప్తు డ్రామాకు సిట్ పాల్పడింది.
- కాగా, ఆ నగదును ఆర్‌బీఐతో తనిఖీ చేయించాలని రాజ్ కేసిరెడ్డి న్యాయస్థానంలో పిటిషన్ వేయడంతో చంద్రబాబు నోట్లో పచ్చి వెలక్కాయ పడింది. ఎందుకంటే ఆర్‌బీఐ అధికారులు వచ్చి తనిఖీ చేస్తే.. ఆ నోట్ల కట్టల మీద ఉన్న బ్యాచ్ నంబర్లు, సీరియల్ నంబర్లు ఏమిటన్నది వెల్లడవుతుంది. ఆ నోట్లను ఆర్‌బీఐ ఎప్పుడు ముద్రించింది.. వాటిని ఎవరు, ఎప్పుడు డ్రా చేశారు.. ఏ బ్యాంకు ఖాతాల నుంచి డ్రా చేశారన్న వివరాలు వెలుగులోకి వస్తాయి.
- 2024 జూన్ తర్వాత ఆ నోట్ల కట్టలు అన్నీ గానీ, వాటిలో కొన్నిగానీ ముద్రించినట్టు వెల్లడైతే.. సిట్ చెప్పింది అంతా కట్టుకథేనని తేలి పోతుంది. ఆ నోట్లను 2024 జూన్ తర్వాత ఏదైనా బ్యాంకు నుంచి డ్రా చేశారని నిగ్గు తేలితే.. ఆ బ్యాంకు ఖాతాదారుడు ఎవరన్నది వెలుగులోకి వస్తుంది. దాంతో ఈ జప్తు కట్టుకథ వెనుక ఉన్న టీడీపీ పెద్దల పాత్ర బట్టబయలవుతుంది.
- అందుకే ఆ నోట్ల కట్టలను న్యాయస్థానం అనుమతి లేకుండానే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)లో డిపాజిట్ చేసేయాలని సిట్ అధికారులు యత్నించారు. కాగా రాజ్ కేసిరెడ్డి పిటిషన్‌పై సత్వరం న్యాయస్థానం స్పందించంతో సిట్ కుట్ర విఫలమైంది. ఆ నోట్ల కట్టలను విడిగా భద్రపరచాలని.. బ్యాచ్ నంబర్లు, సీరియల్ నంబర్లతో సహా పంచనామా నిర్వహించాలని.. మొత్తం ప్రక్రియను వీడియో తీయాలని న్యాయస్థానం ఆదేశించింది. దాంతో రూ.11 కోట్ల జప్తు హైడ్రామాతో కనికట్టు చేయాలన్న చంద్రబాబు కుట్ర పూర్తిగా బెడిసి కొట్టింది.

**చంద్రబాబు, లోకేశ్‌ల సన్నిహితుడే వెంకటేశ్ నాయుడు**

- ఫామ్‌హౌస్‌లో రూ.11 కోట్ల జప్తు హైడ్రామా విఫలమవడంతో చంద్రబాబు మరో దుష్ప్రచార కుతంత్రం రచించారు. ఈ కుట్ర కేసులో మరో పాత్రధారిగా వెంకటేశ్ నాయుడు వ్యవహారాన్ని తెరపైకి తెచ్చారు. ఆయన హైదరాబాద్‌లో రూ.5 కోట్ల నగదును పరిశీలిస్తున్న వీడియోలను టీడీపీ అనుకూల మీడియాకు లీక్ చేశారు. ఆ రూ.5 కోట్లు నగదు అంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మద్యం కుంభకోణం డబ్బులేనని... 2024 ఎన్నికల్లో వెచ్చించేందుకే హైదరాబాద్ నుంచి రాష్ట్రానికి తరలించేందుకు సిద్ధం చేసినవని ప్రజల్ని నమ్మించేందుకు యత్నించారు.
- కాగా, ఆ రూ.5 కోట్లలో 2023 మే లోనే ఆర్‌బీఐ ఉపసంహరించిన రూ.2 వేల నోట్ల కట్టలు ఉండటాన్ని పరిశీలకులు ప్రధానంగా ప్రస్తావించారు. దీంతో ఆ వీడియో 2023 మే కంటే ముందు తీసిందేనని స్పష్టమైంది. తద్వారా 2024 ఎన్నికల్లో వెచ్చించేందుకు వైఎస్సార్‌సీపీ ఆ నోట్లను తరలించడం అంతా కనికట్టేనని తేటతెల్లమైంది. మరోవైపు వెంకటేశ్ నాయుడు రెండు తెలుగు రాష్ట్రాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఆయన వ్యాపార వ్యవహారాలకు చెందిన నగదును వైఎస్సార్‌సీపీకి ఆపాదిస్తూ చంద్రబాబు ప్రభుత్వం దుష్ప్రచారానికి పాల్పడిందన్నది బట్టబయలైంది.

**పారని బాబు తాజా పాచిక**

- అయినా సరే పట్టు వదలని చంద్రబాబు ఎల్లో మీడియా ద్వారా మరో కట్టుకథను వ్యాప్తిలోకి తెచ్చారు. వెంకటేశ్ నాయుడు చార్టెడ్ విమానాల్లో ప్రయాణిస్తున్న ఫొటోలు, వీడియోలు, హీరోయిన్ తమన్నా పక్క సీట్లోనే కూర్చున్న ఫొటోలు ఎల్లో మీడియాకు విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మద్యం కుంభకోణానికి పాల్పడిన డబ్బుతోనే వెంకటేశ్ నాయుడు ఇంతటి జల్సాలు చేశారని.. విచ్చలవిడిగా డబ్బులు వెదజల్లారని రకరకాల కట్టు కథలను టీడీపీ సోషల్ మీడియాతోపాటు టీడీపీ అనుకూల ఎల్లో మీడియా వినిపించింది.
- కానీ ఈ కుట్ర పాచిక కూడా విఫలమైంది. ఎందుకంటే వెంకటేశ్ నాయుడు చంద్రబాబు, లోకేశ్‌లకు అత్యంత సన్నిహితుడన్నది ఫొటో ఆధారాలతోసహా బట్టబయలైంది. వారిద్దరికి ఆయన అత్యంత సన్నిహితుడనే నిజాన్ని ఆ ఫొటోలు బయటపెట్టాయి. టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, టీడీపీ తరఫున కేంద్ర మంత్రులుగా ఉన్న కింజారపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌లతోపాటు పలువురితో సన్నిహితంగా ఉన్న ఫొటోలు, వీడియోలు బయటకు రావడంతో మొత్తం కుట్ర డ్రామా బట్టబయలైంది.
- వెంకటేశ్ నాయుడు ప్రయాణించిన చార్టెడ్ ఫ్లైట్ ఎవరిదో తెలుసా.. చంద్రబాబు బీజేపీలోకి పంపిన నేత, ప్రస్తుత ఎంపీ సీఎం రమేశ్ కంపెనీది. టీడీపీ నేతలతో కలిసే వెంకటేశ్‌నాయుడు ఆ ఫ్లైట్‌లో హైదరాబాద్ నుంచి చెన్నై, కోయంబత్తూరు తదితర నగరాలకు వెళ్లారు. హీరోయిన్ తమన్నా కూడా అదే ప్రత్యేక విమానంలో ప్రయాణించారు. కానీ టీడీపీ నేతలతో వెంకటేశ్ నాయుడు ఉన్న ఫొటోలు కాకుండా తమన్నా పక్క సీట్లో కూర్చున్న ఫొటోనే సిట్ విడుదల చేసి ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు యత్నించింది. కానీ పూర్తి ఫొటోలు బయట పడటంతో సిట్ కుట్ర బెడిసి కొట్టింది.



లోకేశ్‌తో వెంకటేశ్‌నాయుడు

### లోకేశ్ బినామీ ఎంపీ కేశినేని చిన్ని వ్యాపార భాగస్వామే రాజ్ కేసిరెడ్డి

- లేని కుంభకోణం ఉన్నట్టుగా చూపించే ఈ భేతాళ కుట్ర కథకు చంద్రబాబు పక్కాగా స్క్రిప్ట్ రచించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐటీ సలహాదారుగా కేవలం రెండేళ్లపాటు చేసిన రాజ్ కేసిరెడ్డికి ముడి పెడుతూ ఈ అక్రమ కేసు నమోదు చేశారు. తాము చెప్పమన్నట్టు అబద్ధపు వాంగ్మూలం ఇవ్వాలని రాజ్ కేసిరెడ్డిని వేధించారు. అందుకు ఆయన తిరస్కరించడంతోనే నిందితుడిగా పేర్కొంటూ అరెస్టు చేశారు. విచారణలో రాజ్ కేసిరెడ్డి చెప్పని విషయాలు కూడా చెప్పినట్టుగా అబద్ధపు వాంగ్మూలంతో రిమాండ్ నివేదిక రూపొందించారు. కానీ ఆ వాంగ్మూల పత్రంపై సంతకం చేసేందుకు రాజ్ కేసిరెడ్డి తిరస్కరించారు. ఆ విషయాన్ని సిట్ న్యాయస్థానానికి సమర్పించిన రిమాండ్ నివేదికే వెల్లడించింది.
- అసలు రాజ్ కేసిరెడ్డిని ఈ కపట నాటకంలో ప్రధాన పాత్రధారిగా చేసుకోవాలని చంద్రబాబు ఎందుకు భావించారంటే.. రాజ్ కేసిరెడ్డి.. మంత్రి నారా లోకేశ్ బినామీగా ఉన్న విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) వ్యాపార భాగస్వామి కనుక. కేశినేని చిన్ని లోకేశ్ బినామీ అన్నది బహిరంగ రహస్యమే.
- రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగానే అంటే 2021లోనే రాజ్ కేసిరెడ్డి ప్రస్తుత విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)తో భాగస్వామిగా వ్యాపారాలు నిర్వహించారు. రాజ్ కేసిరెడ్డికి చెందిన 'ప్రైడే ఇన్‌ఫ్రాకాన్ ఎల్‌ఎల్‌పీ'లో కేశినేని చిన్ని దంపతులు వాటాదారులుగా ఉన్నారు. అక్రమంగా నిధులు తరలించారని ప్రస్తుతం సిట్ అధికారులు చెబుతున్న ఇషన్వీ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రైడే ఇన్‌ఫ్రా ఎల్‌ఎల్‌పీ హైదరాబాద్‌లోని ఒకే చిరునామా(జూబ్లీ హిల్స్, సర్వే నంబర్ 403, ప్లాట్ నంబర్ 9)తో రిజిస్టర్ అయ్యాయి.
- ఈ రెండు కంపెనీలు ఒకే మెయిల్ ఐడీ ( accounts@wshanviinfraprojects.com)నే ఉపయోగిస్తుండటం గమనార్హం. కేశినేని చిన్ని ఏకంగా 12 రియల్ ఎస్టేట్, విదేశీ కంపెనీల ద్వారా భారీగా నల్లధనాన్ని అమెరికా, దుబాయ్‌లకు తరలించి భారీ పెట్టుబడులు పెట్టారు. లోకేశ్ తన బినామీ అయినందునే కేశినేని చిన్నికి విజయవాడ ఎంపీ టికెట్ ఇప్పించారు. అనంతరం ఆంధ్రా క్రికెట్ అసోషియేషన్ అధ్యక్షుడిని చేశారు.
- కేశినేని చిన్ని బినామీ కంపెనీ ఉర్సా ఐటీ సొల్యూషన్స్‌కు విశాఖపట్నంలో అత్యంత విలువైన 60 ఎకరాలను కారుచౌకగా కట్టబెట్టారు. కేశినేని చిన్ని ముసుగులో లోకేశ్ ఇలా దోపిడీకి పాల్పడుతున్నారు. అటువంటి కేశినేని చిన్నితో రాజ్‌కేసిరెడ్డి వ్యాపార భాగస్వామి. అంటే బినామీ దందా ముసుగు తొలగిస్తే లోకేశ్, రాజ్ కేసిరెడ్డి వ్యాపార భాగస్వాములు అన్నది స్పష్టమవుతోంది.

# భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

## విద్య, ఉద్యోగ సమాచారం

### ఐబీపీఎస్‌లో క్లర్క్ పోస్టులు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్).. దేశవ్యాప్తంగా 2026–27 సంవత్సరానికి సంబంధించి కామన్ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్ (సీఆర్‌పీ)–కస్టమర్ సర్వీస్ అసోసియేట్(సీఎస్‌ఏ)–XV ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో క్లర్క్ పోస్టుల భర్తీకి ఐబీపీఎస్ ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తుంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 10,277.
» (తెలంగాణ–261, ఆంధ్రప్రదేశ్–367 ఖాళీలు).
» **అర్హత:** పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు కంప్యూటర్ నాలెడ్జ్ ఉండాలి. స్థానిక భాషలో చదవడం, రాయడం వచ్చి ఉండాలి. **వయసు:** 01.08.2025 నాటికి 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.24,050 నుంచి 64,480.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్స్ పరీక్ష, స్థానిక భాష పరీక్షలు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 01.08.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.08.2025
» **ప్రిలిమినరీ ఆన్‌లైన్ పరీక్ష:** అక్టోబర్ 2025.
» **మెయిన్ ఆన్‌లైన్ పరీక్ష:** నవంబర్ 2025.
» **ఫలితాలు తేది:** మార్చి 2026.
» **వెబ్‌సైట్:** https://www.ibps.in

### వెస్ట్రన్ రైల్వేలో 64 గ్రూప్‌-సీ, డీ పోస్టులు

వెస్టన్ రైల్వే ముంబైలో వివిధ విభాగాల్లో స్పోర్ట్స్ కోటాలో గ్రూప్–సీ, గ్రూప్–డీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 64.
» **పోస్టుల వివరాలు:**గ్రూప్–సీ–21,గ్రూప్–డీ–43
» **క్రీడలు:** ఆర్చరీ, అథ్లెటిక్స్, బాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, గోల్ఫ్, కబడ్డీ, రెజ్లింగ్, షూటింగ్, సైక్లింగ్, హాకీ, క్రికెట్, వాలీబాల్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్ నుంచి డిగ్రీ, ఇంటర్, పదో తరగతి, ఐటీఐలో ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 01.01.2026 నాటికి 18 నుంచి 25 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** డాక్యుమెంట్ వెరిఫికేషన్, క్రీడా ప్రదర్శన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 29.08.2025
» **వెబ్‌సైట్:** https://rrcwr.com

### ఏఐసీటీఈ-ప్రగతి, సాక్ష్యం-స్వనాథ్ స్కాలర్‌షిప్-2025

భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ).. ప్రగతి స్కాలర్‌షిప్(అమ్మాయిల విద్యార్థుల కోసం), సాక్షం స్కాలర్‌షిప్(వికలాంగుల విద్యార్థుల కోసం), స్వనాథ్ స్కాలర్‌షిప్(అనాథలు, సాయుధ దళాల వీరమరణం పొందిన సైనికుల పిల్లలు, కోవిడ్–19 వల్ల తల్లిదండ్రులు కోల్పోయిన విద్యార్థులు)కు 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి డిప్లొమా, డిగ్రీ చదువుతున్న విద్యార్థుల స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తులు కోరుతోంది.

**స్కాలర్‌షిప్ వివరాలు**

» **ఏఐసీటీఈ ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్:** ఏఐసీటీఈ గుర్తించిన డిగ్రీ/డిప్లొమా కోర్సుల్లో చదువుతున్న అమ్మాయిల కోసం.
» **ఏఐసీటీఈ సాక్షం స్కాలర్‌షిప్ స్కీమ్:** కనీసం 40 శాతం అంగవైకల్యం కలిగిన విద్యార్థులు(డిగ్రీ/డిప్లొమా).
» **ఏఐసీటీఈ స్వనాథ్ స్కాలర్‌షిప్ స్కీమ్:** అనాథలు, సాయుధ దళాల వీరమరణం పొందిన సైనికుల పిల్లలు, కోవిడ్–19 వల్ల తల్లిదండ్రులు కోల్పోయిన విద్యార్థులు.
» **అర్హత:** ఏఐసీటీఈ గుర్తించిన డిగ్రీ లేదా డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం ఉండాలి. ఒక కుటుంబానికి గరిష్ఠంగా ఇద్దరు అమ్మాయిలు మాత్రమే అర్హులు. సాక్షంకు కనీసం 40 శాతం అంగవైకల్యం ఉన్నట్లు సర్టిఫికేట్ అవసరం.
» **వయసు:**డిగ్రీ/డిప్లొమా చదువుతున్న విద్యార్థులకు 17నుంచి 24ఏళ్ల మధ్య ఉండాలి. సాక్షం, స్వనాథ్ కేటగిరీలకు ప్రత్యేక రాయితీలు ఉంటాయి.
» **దరఖాస్తు విధానం:** నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్(ఎన్‌ఎస్‌పీ) ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.10.2025
» **ఐఎన్‌వో వెరిఫికేషన్‌కు చివరితేది:** 15.11.2025
» **రాష్ట్ర నోడల్ ఆఫీసర్ వెరిఫికేషన్‌కు చివరితేది:** 30.11.2025.
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.aicte.gov.in

## ఐఐటీలకు మరో మార్గం.. జామ్

» ఐఐటీ జామ్ 2026 నోటిఫికేషన్ విడుదల
» 22 ఐఐటీల్లో సైన్స్ పీజీ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశాలు
» సెప్టెంబర్ 5వ తేదీ నుంచి దరఖాస్తులు ప్రారంభం

**జామ్(జేఏఎమ్).. జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్! దేశంలోని ప్రతిష్టాత్మక ఐఐటీల్లో సైన్స్‌లో ఉన్నత విద్యకు మార్గం.. జామ్. వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి తాజాగా జామ్ 2026 నోటిఫికేషన్ విడుదలైంది. గత రెండు దశాబ్దాలుగా జామ్ పరీక్ష ద్వారా ఐఐటీల్లో ఎమ్మెస్సీ, ఎమ్మెస్సీ పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. ఐఐటీ జామ్ 2026 ప్రత్యేకత, ప్రవేశం కల్పించే కోర్సులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు తదితర సమాచారంతో కథనం..**

సైన్స్ రంగంలో ఉజ్వల కెరీర్ కోరుకునే వారికి చక్కటి మార్గం.. ఐఐటీ జామ్. దీని ద్వారా టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌లో సైన్స్ విభాగాల్లో ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం లభిస్తుంది. నాణ్యమైన పీజీ ప్రోగ్రామ్స్‌లో చేరేందుకు ఈ పరీక్ష ఉపకరిస్తుంది. ఈ ఇన్‌స్టిట్యూట్స్ ఇంటర్‌డిసిప్లినరీ విధానంలో అందించే పీజీ, పీహెచ్‌డీ కోర్సుల ద్వారా ప్రాక్టికల్ నాలెడ్జ్‌ని సొంతం చేసుకొని.. సైన్స్ రంగంలో ఉన్నత కెరీర్ అవకాశాలు అందుకోవచ్చు. జామ్ 2026కు ఐఐటీ బాంబే నిర్వాహక ఇన్‌స్టిట్యూట్‌గా ఉంది.

**22 ఐఐటీలతోపాటు మరెన్నో**

జామ్ 2026 స్కోర్ ఆధారంగా 22 ఐఐటీలతో పాటు ఐఐఎస్సీ బెంగళూరు, నిట్‌లు, ఐఐఎస్‌ఈఆర్ పుణె,భోపాల్; ఐఐఈఎస్‌టీ, డీఐఏటీ, ఐఐపీఈ, జేఎన్‌సీఏఎస్‌ఆర్, ఎస్‌ఎల్‌ఐఈటీ, ఇతర సీఎఫ్‌టీఐ(సెంట్రల్లీ ఫండెడ్ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్)ల్లో ప్రవేశాలు కల్పిస్తారు. నాన్ ఐఐటీ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశాల కోసం ప్రత్యేకంగా సెంట్రల్ కౌన్సెలింగ్ ఫర్ ఎమ్మెస్సీ/ఎమ్మెస్సీ(టెక్) అడ్మిషన్స్ సీసీఎంఎన్‌ని నిర్వహిస్తారు.

**జామ్ స్కోర్‌తో ప్రవేశం కల్పించే కోర్సులు**

ఎమ్మెస్సీ, ఎమ్మెస్సీ (టెక్), ఎంఎస్ (రీసెర్చ్), ఎమ్మెస్సీ–ఎంటెక్ డ్యూయెల్ డిగ్రీ, జాయింట్ ఎమ్మెస్సీ–పీహెచ్‌డీ, ఎమ్మెస్సీ–పీహెచ్‌డీ డ్యూయెల్ డిగ్రీ, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ(ఐ–పీహెచ్‌డీ).

**సీట్లు-ప్రవేశాలు**

22 ఐఐటీల్లోని దాదాపు 3వేల సీట్లతోపాటు నాన్ ఐఐటీ విద్యాసంస్థల్లో మరో 2300 సీట్ల వరకు అందుబాటులో ఉన్నాయి. జామ్ 2026 స్కోర్ ఆధారంగా ఆయా ఇన్‌స్టిట్యూట్‌లకు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకొని ప్రవేశం పొందొచ్చు.

**ఏడు టెస్ట్ పేపర్లు**

బయోటెక్నాలజీ(బీటీ), కెమిస్ట్రీ(సీవై), ఎకనామిక్స్(ఈఎన్), జియాలజీ(జీజీ), మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్(ఎంఎస్), మ్యాథమెటిక్స్(ఎంఏ), ఫిజిక్స్(పీఎస్)ల్లో జామ్ పరీక్ష నిర్వహిస్తారు.

**అర్హతలు**

సంబంధిత విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణులు లేదా 2026లో డిగ్రీ కోర్సు ఉత్తీర్ణులయ్యే అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులు. జామ్ 2026కు దరఖాస్తు చేసుకునేందుకు ఎలాంటి గరిష్ఠ వయోపరిమితి నిబంధన లేదు. భారతీయ డిగ్రీలు ఉన్న విదేశీయులు కూడా దరఖాస్తుకు అర్హులే.

**పరీక్ష విధానం**

- జామ్ పరీక్షను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు.
- ప్రతి టెస్ట్ పేపర్‌లో మల్టిపుల్ ఛాయిస్ కొశ్చన్స్(ఎంసీక్యూలు), మల్టిపుల్ సెలెక్ట్ కొశ్చన్స్(ఎంఎస్‌క్యూలు), న్యూమరికల్ ఆన్సర్ టైప్(ఎన్‌ఏటీ) ప్రశ్నలు ఉంటాయి.
- అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలో ఏడు టెస్టు పేపర్లలో ఈ పరీక్ష నిర్వహిస్తారు. అభ్యర్థులు తమ అర్హతలకు అనుగుణంగా వీటిల్లో ఒకటి లేదా రెండు పేపర్లకు హాజరుకావచ్చు. రెండు పేపర్లకు హాజరయ్యే అభ్యర్థులు.. ఒకే సమయంలో పరీక్ష సెషన్ లేని విధంగా రెండో టెస్ట్ పేపర్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది.
- జామ్ 2026 మెరిట్ లిస్ట్‌లో నిలిచిన అభ్యర్థులు దేశవ్యాప్తంగా ఉన్న 22 ఐఐటీల్లోని మూడు వేల పోస్ట్‌గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు.
- అకడెమిక్ ప్రోగ్రామ్స్, సీట్ల సంఖ్య, అర్హత ప్రమాణాలు(ఎలిజిబిలిటీ రిక్వైర్‌మెంట్స్ –ఈఆర్స్), కనీస విద్యార్హతలు(మినిమమ్ ఎడ్యుకేషనల్ క్వాలిఫికేషన్స్ –ఎంఈక్యూస్), ప్రభుత్వ రిజర్వేషన్ విధానం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని తుది ప్రవేశం ఖరారు చేస్తారు.




**ముఖ్య సమాచారం**

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:** 05.09.2025
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 12.10.2025
- **జామ్ అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్:** 05.01.2026 నుంచి
- **జామ్ పరీక్ష తేది:** 15.02.2026
- **ఫలితాల వెల్లడి:** 20.03.2026
- **వెబ్‌సైట్:** https://jam2026.iitb.ac.in

## డీఎస్‌ఎస్‌ఎస్‌బీలో కొలువులు

» మొత్తం 2119 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
» టీచింగ్, మెడికల్ పోస్టులకు దరఖాస్తులు
» ఆన్‌లైన్ రాత పరీక్ష ద్వారా ఎంపిక

**న్యూఢిల్లీలోని ఢిల్లీ సబ్ ఆర్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డ్(డీఎస్ఎస్ఎస్‌బీ).. 2025 సంవత్సరానికి సంబంధించి ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా ఢిల్లీలోని వివిధ మంత్రిత్వ శాఖలు, స్వయం ప్రతిపత్తి ఉన్న సంస్థలు, స్థానిక సంస్థల్లో ఖాళీగా ఉన్న 2119 టీచింగ్, మెడికల్(గ్రూప్ బి, సి) పోస్టులకు ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఈ నేపథ్యంలో.. డీఎస్ఎస్ఎస్‌బీలో ఉద్యోగాలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాలు...**

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 2119
- **పోస్టుల వివరాలు:** మలేరియా ఇన్స్‌పెక్టర్–37 పోస్టులు, ఆయుర్వేదిక్ ఫార్మసిస్ట్–8, పీజీటీ ఇంజనీరింగ్ గ్రాఫిక్స్(మేల్)–4, పీజీటీ ఇంజనీరింగ్ గ్రాఫిక్స్(ఫిమేల్)–3, పీజీటీ ఇంగ్లిష్(మేల్)–64, పీజీటీ ఇంగ్లిష్(ఫిమేల్)–29, పీజీటీ సంస్కృతం(మేల్)–6, పీజీటీ సంస్కృతం(ఫిమేల్)–19, పీజీటీ హార్టికల్చర్ (మేల్)–1, పీజీటీ అగ్రికల్చర్ (మేల్)–5, డొమెస్టిక్ సైన్స్ టీచర్–26, అసిస్టెంట్(ఆపరేషన్ థియేటర్ సంబంధిత విభాగాలు)–120, టెక్నీషియన్(ఆపరేషన్ థియేటర్ సంబంధిత విభాగాలు)–70, ఫార్మసిస్ట్(ఆయుర్వేద)–19, వార్డెన్(పురుషులు మాత్రమే)–1676, ల్యాబొరేటరీ టెక్నీషియన్–30, సీనియర్ సైంటిఫిక్ అసిస్టెంట్(కెమిస్ట్రీ)–1, సీనియర్ సైంటిఫిక్ అసిస్టెంట్(మైక్రోబయాలజీ)–1 పోస్టు ఉన్నాయి.

**అర్హతలు**

07.08.2025 నాటికి పోస్టును అనుసరించి గుర్తింపు పొందిన యూనివర్సిటీ /ఇన్‌స్టిట్యూట్ నుంచి టెన్త్, సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ/పీజీ డిగ్రీ, బీఈడీ/బీఏఈడీ/బీఎస్సీ ఈడీ/ఎంఈడీ ఉత్తీర్ణతతోపాటు అనుభవం ఉండాలి.

**వయసు**

07.08.2025 నాటికి పోస్టును అనుసరించి 18–32 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీల అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధన ప్రకారం గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

**వేతనం**

పోస్టును అనురించి నెలకు లెవెల్ 2(రూ.19,900–రూ.63,200) నుంచి లెవెల్ 8 (రూ.47,600–రూ.1,51,000) వేతన శ్రేణి లభిస్తుంది.

**ఎంపిక విధానం**

- ఆయా పోస్టులను అనుసరించి వన్ టైర్ (జనరల్ పోస్టులు), వన్ టైర్(టెక్నికల్ పోస్టులు), వన్ టైర్ (టెక్నికల్/టీచింగ్ పోస్టులు) నిర్వహిస్తారు.
- ఈ పరీక్షల్లో జనరల్ అవేర్‌నెస్, లాజికల్ రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీ, హిందీ, ఇంగ్లిష్ లాంగ్వేజ్, సబ్జెక్ట్ సంబంధిత ప్రశ్నలు ఉంటాయి. ఈ పరీక్షలో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కులు తగ్గిస్తారు.
- కొన్ని పోస్టులకు ఫిజికల్ టెస్ట్/ స్కిల్ టెస్ట్/ట్రేడ్ టెస్ట్‌లు కూడా నిర్వహిస్తారు.




**ముఖ్య సమాచారం**

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 07.08.2025
- **వెబ్‌సైట్:** https://dsssbonline.nic.in

**కెరీర్ కౌన్సెలింగ్**
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

**నేటి భవిత ఈ పేపర్‌లో..**
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-జాగ్రఫీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-కంప్యూటర్ అవేర్‌నెస్



● తల్లిపాల వారోత్సవాలు

**వ్యాధులు దరిచేరకుండా శిశువులకు వ్యాక్సిన్లు వేయించడం తెలిసిందే. ప్రసవం అయిన మొదటి గంటలోనే తల్లిపాలు పట్టడం అంటే శిశువుకు మొదటి వ్యాక్సిన్ వేయించినట్టే అని చెబుతుంది భారత ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ప్రసవం తర్వాత మొదటి గంట ఎంత కీలకమైనదో తల్లికి- బిడ్డకి ఎన్ని విధాల మేలు చేస్తుందో తెలుసుకోవడం, అవగాహన పెంచుకోవడమనేది కాబోయే తల్లులు తప్పక తెలుసుకోవాల్సినదే.**

# అమృత ఘడియలవి!

అమ్మపాలే తన బిడ్డకు ఇచ్చే అమృతం. ఔషధం కూడా. నవజాత శిశువులకు మొదటి గంటలోనే రొమ్ము పాలు పట్టించడాన్ని ఓ మంచి ప్రారంభంగా చెప్పవచ్చు. తల్లిపాలు పిల్లలకు సహజ పోషకాహారం, సురక్షితమైనవి, ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని తెలిసినా.. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది పిల్లలు మొదటి ఆరు నెలల్లో తల్లిపాలు తాగడం లేదు అని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. దీని వల్ల పిల్లల ఆరోగ్యకరమైన భావి జీవితం సమస్యాత్మకంగా ఉంటుందనేది ఆ నివేదికల సారాంశం. తల్లిపాలు తాగని పిల్లల్లో అనారోగ్యం, ఆకస్మిక మరణం, నేర్చుకునే సామర్థ్యం తగ్గడం, యుక్తవయస్సులో ఆరోగ్య సమస్యల ప్రమాదాలు పెరుగుతున్నాయని ఆ నివేదికలు ఆందోళనను వ్యక్తం చేస్తున్నాయి.

### బిడ్డకు తల్లి ఇచ్చే మొదటి బహుమతి

ముర్రుపాలుగా పిలిచే మొదటి పాలను కొలెస్ట్రామ్ అంటారు. 'ప్రీ మిల్క్' అనే ఈ పాలలోని పోషకాలు యాంటీబాడీలుగా శిశువుకు మొదటి సహజ టీకాగా పనిచేస్తాయి. ఎన్నో రకాల ఇన్ఫెక్షన్ల నుండి రక్షణ కల్పిస్తాయి. రోగనిరోధక శక్తిని, వ్యాధుల నుంచి రక్షణను ఏకకాలంలో అందజేస్తాయి. అంతేకాదు, ప్రసవం అయిన మొదటి గంటలో తల్లి హృదయానికి హత్తుకున్న బిడ్డ స్కిన్ టు స్కిన్ కాంటాక్ట్ వల్ల పిల్లల చర్మంలో మంచి బాక్టీరియా వృద్ధి చెంది, తల్లీ-బిడ్డల బంధాన్ని మెరుగుపరుస్తుంది. అందువల్ల అప్పుడే పుట్టిన శిశువుకు తల్లి పాలు ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా ఇవ్వాలని, మొదటి గంట మరీ కీలకం అని యునిసెఫ్, డబ్ల్యూహెచ్‌వోతో పాటు ఎన్నో పరిశోధనలు తెలియజేస్తున్నాయి.

బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల తల్లికి కూడా ఆరోగ్యపరంగా ఎంతో మేలు జరుగుతుంది. ప్రసూతి అనారోగ్య భారం తగ్గుతుంది. ఆరోగ్యకరమైన కుటుంబాల సృష్టికి మూలం అవుతుంది. బిడ్డకు అందమైన భవిష్యత్తును కానుకగా ఇవ్వాలని తపించే ప్రతి తల్లి మొదటగా అందివ్వాల్సింది తల్లిపాలే.



మొదటి గంటలో తల్లి తన బిడ్డకు ఇచ్చే ప్రతి పాల చుక్క అనారోగ్యకారకమైన బాక్టీరియాతో పోరాడే శక్తి ప్రదాయిని. సాధారణ, సిజేరియన్ ఏ ప్రసవం అయినా మొదటి తల్లిపాలు శిశువుకు తప్పక ఇవ్వాలి. ఈ విషయాన్ని తల్లికాబోయే ప్రతి ఒక్కరికీ చెబుతుంటాం. పాలు ఎలా పట్టాలి, శుభ్రత విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, పాలు వృద్ధి చెందడానికి ఎలాంటి పోషకాలు గల ఆహారాన్ని తీసుకోవాలో వివరిస్తాం. ప్రతీ తల్లి తన బిడ్డ ఆరోగ్య భవిష్యత్తుకు తీసుకోవాల్సిన మొదటి జాగ్రత్త ఇదే. కుటుంబ సభ్యులు కూడా ఈ విషయం లో తప్పనిసరి అవగాహన పెంచుకోవాలి. తల్లికి తగినంత మద్దతునివ్వాలి.

– డాక్టర్ శిరీష, గైనకాలజిస్ట్

### మరెన్నో ప్రయోజనాలు

● ప్రసవం అయిన కొన్ని రోజుల వరకే కొలొస్ట్రామ్ ఉత్పత్తి అవుతుంది. అందుకే ఈ రోజుల్లో తప్పక పాలు ఇవ్వాలి. మరీ ముఖ్యంగా పుట్టిన మొదటి గంటలోపు తల్లి పాలు ఇవ్వడం వల్ల బిడ్డ మనుగడ అవకాశాలు 14 రెట్లు పెరుగుతాయని నివేదికలు చెబుతున్నాయి.

● తల్లిపాలలో ఆరోగ్యకరమైన మెదడు అభివృద్ధికి, చురుకైన పనితీరుకు తోడ్పడే పోషకాలు ఉంటాయి. ప్రొటీన్, ఐరన్, కాల్షియం, విటమిన్లు సమృద్ధిగా, చక్కెరపాళ్లు తక్కువగా ఉండే తల్లి పాలు శిశువుకు మొదటి ఆరు నెలలు పూర్తి ఆహారం.

● తల్లిపాలు కాకుండా ఇతర ఆహారాన్ని అంటే.. చాలా వరకు ప్రసవం అయ్యాక శిశువుకు తేనె నాకించడం, డబ్బా పాలు పడుతుంటారు. ఈ విధానం చాలా ప్రమాదకరమైనది. దీని వల్ల తల్లిలోనూ పాల ఉత్పత్తి ఆలస్యం కావచ్చు. బిడ్డకు ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం కూడా ఉంది. చెవి ఇన్ఫెక్షన్లు, విరేచనాలు, న్యుమోనియా వంటి అనారోగ్యాల బారిన పడే అవకాశాలూ ఉన్నాయి. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లి శరీర వేడి ద్వారా బిడ్డను రక్షించడమే కాకుండా తల్లీ బిడ్డ మధ్య బంధం బలపడుతుంది.

### ఆరు నెలలు... ఆ తర్వాత...

ఆరు నెలల తర్వాత ఇంట్లో వండిన పోషకాలు ఉండే మెత్తని ఆహారాన్ని ఇవ్వాలి. అలాగే, వయస్సుకు తగిన విధంగా, పోషకాలు ఉండే ఆహారాన్ని ఇస్తూ ఉండాలి. అదే సమయంలో రెండేళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు వరకు కూడ తల్లిపాలు ఇవ్వచ్చు. బిడ్డ క్రమంగా ఘన, ద్రవ, వైవిధ్యమైన ఆహారాన్ని తగు మోతాదులో తీసుకోగలుగుతుందా లేదా అని దృష్టి పెట్టాలి.

బిడ్డ తొలినాళ్ల నుంచే తీసుకున్న శ్రద్ధ ఆ బిడ్డ పెరుగుదల, అభివృద్ధికి పునాది వేస్తుంది. తొలి బాల్య దశలోనే బిడ్డ ఏం నేర్చుకుంటుంది, ఎలా ప్రవర్తిస్తుంది.. అనే వాటిని నిర్ణయిస్తుంది. జీవితంలో విజయాలు సాధించేలా వారి సామర్థ్యాన్ని ఆ తొలిదశే నిర్ణయిస్తుంది. పిల్లల మనుగడ, ఆరోగ్యకరమైన అభివృద్ధికి తల్లిపాలు కీలకపాత్ర పోషిస్తాయి.



● మధుర శ్రీధరన్

# టాలెంట్ వదిలేసి బొట్టుపై ట్రోల్స్

ముఖం చూసి బొట్టు పెట్టడమనేది స్థాయీభేదాలను సూచించే సామెత! ఇప్పుడు ఆ బొట్టు అమెరికాలోనూ ఆక్షేపణీయమైంది.. సొలిసిటర్ జనరల్ పదవికి!

దాంతో ఆధునిక నాగరికతకు ఆనవాలంగా భ్రమపడే అమెరికా మరొక్కసారి తన జాత్యహంకారాన్ని చాటుకుంది. భారతీయ మూలాలున్న మధుర శ్రీధరన్ అమెరికాలోని ఒహైయో రాష్ట్ర 12వ సొలిసిటర్ జనరల్‌గా నియమితులయ్యారు. ఈ విషయాన్ని అటార్నీ జనరల్ ఆఫీస్ ఎక్స్ (ట్విటర్) వేదికగా ప్రకటించింది. అంతే నిరసనలు, ట్రోల్స్‌తో నిండిపోయింది ఎక్స్. మధుర ప్రజ్ఞాపాటవాల మీద సందేహంతో కాదు, ఆమె భారతీయ మూలాల మీద ఆక్షేపణ.. ఆమె పేరు, ఒంటి రంగు, పెట్టుకున్న బొట్టు మీద వ్యతిరేకతతో! 'సొలిసిటర్ జనరల్‌గా ఒక ఇండియన్ ఏంటీ? ఒహైయోలో అమెరికన్స్ కరువయ్యారా?' అంటూ ఒకరు, 'నుదుటన పర్మినెంట్ చుక్క పెట్టుకుని మరీ వచ్చిందండీ కొలువుకి' అంటూ మరొకరు, 'జాబ్స్ లేకుండా స్థానికులు అల్లాడుతుంటే ఈ విదేశీయులకు ఉద్యోగం ఏంటీ?' అంటూ ఇంకొకరు, 'బొట్టు పెట్టుకోవడం స్థానికులకు చేత కాదు కాబట్టి వాళ్లకు కొలువుల్లేమో' అంటూ వేరొకరు ఎక్స్‌లో కామెంట్లు గుప్పించారు. ఆమెకున్న క్వాలిఫికేషన్స్, శక్తిసామర్థ్యాల గురించి మాత్రం ఎవ్వరూ మాట్లాడలేదు. అయితే.. ఆ ట్రోల్స్, కామెంట్స్‌కి జవాబుగా ఒహైయో అటార్నీ జనరల్ డేవ్ యోస్ట్ స్పందిస్తూ 'చాలామంది మధుర శ్రీధరన్ అమెరికన్ కాదనే అపోహలో ఉన్నారు. కానీ ఆమె అమెరికా పౌరులకు పుట్టిన అమ్మాయి. అమెరికా పౌరురాలే! అంతే కాదు అమెరికా పౌరుడినే పెళ్లాడారు. అన్నిటికీ మించి ఆమె చాలా బ్రిలియంట్, సొలిసిటర్ జనరల్ హోదాకు అన్ని అర్హతలున్న పర్‌ఫెక్ట్ అభ్యర్థి. ఆ బాధ్యతలను చక్కగా నిర్వర్తించగలరు కూడా! ఇవికాక మిమ్మల్ని ఆమె పేరు, రంగు ఇబ్బందిపెడుతున్నట్లయితే ప్రాబ్లం ఆమెలో లేదు.. మీ మెదళ్లలో ఉంది' అని పోస్ట్ చేశారు.

మధుర శ్రీధరన్.. ఎమ్ఐటీ (మాసచ్యూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)లో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ అండ్ కంప్యూటర్ సైన్స్ పోస్ట్‌గ్రాడ్యుయేట్. తర్వాత న్యూయార్క్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లాలో చేరి జ్యూరిస్ డాక్టర్ (జేడీ) పట్టా పొందారు. చక్కటి వాగ్ధాటి, అద్భుతమైన వాదనా పటిమ ఆమె సొంతం. ఆ ప్రతిభే ఆమెను సొలిసిటర్ జనరల్ పదవి వరించేలా చేసింది.



బ్యూటిప్స్

## మేకప్ లేకున్నా...

● ముఖం శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. శుభ్రంగా ఉన్నప్పుడు అందంగా కనిపిస్తుంది. ముఖాన్ని శుభ్రం చేసుకునేందుకు సహజసిద్ధమైన లేదా తేలికపాటి క్లెన్సర్స్, ఫేస్ వాష్‌లను వాడాలి. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడే గాక, బయట నుంచి ఇంటికి వచ్చాక కూడా ముఖాన్ని శుభ్రంగా కడిగితే మొటిమలు లేకుండా ముఖం తేటగా కనిపిస్తుంది.

● వారానికి రెండుసార్లు సున్నిపిండి, స్క్రబ్బర్‌లను వాడడం ద్వారా ముఖం మీద పేరుకుపోయిన మృత కణాలు వదిలిపోయి ముఖం కాంతిమంతంగా కనిపిస్తుంది.

● ముఖం అందంగా కనిపించాలంటే జుట్టు కూడా ఆరోగ్యంగా ఉండాలి. చుండ్రు రాకుండా జుట్టుని కాపాడుకోవాలి. జుట్టు మృదువుగా, మెరిసిపోవడానికి తగిన జాగ్రత్తలు పాటిస్తే ముఖం మరింత అందంగా కనిపిస్తుంది.

**బులియన్** (బంగారం 10 గ్రా.: వెండి కిలో) ఆగస్ట్ 4న ముగింపు రూ.లలో


| | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | రాజమండ్రి | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|---|
| బంగారం (24 క్యారెట్లు) | 1,00,610 | 1,02,850 | 1,01,400 | 1,02,850 | 1,00,200 | 1,01,400 |
| బంగారం (22 క్యారెట్లు) | 93,560 | 92,950 | 92,950 | 95,740 | 92,180 | 92,950 |
| వెండి | 1,15,000 | 1,14,900 | 1,23,000 | 1,14,900 | 1,14,800 | 1,23,000 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## సాగుబడి

ఆశ్లేష కార్తె: ఆగస్టు 16 వరకు

## 9,10 తేదీల్లో మైసూరులో దేశీ వరి మేళా





ఔషధ గుణాలు కలిగిన ఎరుపు, నలుపు, గోధుమ రంగుల దేశీ బియ్యం రకాలు.. సువాసన గల దేశీ వరి బియ్యం రకాలతో కూడిన మెడిసినల్ రైస్ మేళాను సేవ్ అవర్ రైస్, సహజ సమృద్ధ సంస్థలు ఆగస్టు 9, 10 తేదీల్లో మైసూరులోని నంజన్‌రాజ్ బహదూర్ ఛాత్రలో నిర్వహిస్తున్నాయి. కొన్ని దేశీ రకాల వరి బియ్యం తింటే మధుమేహం, కీళ్ల నొప్పులు, ఊబకాయం, మూర్ఛ, విరోచనాలు వంటి ఆరోగ్య సమస్యలు నయమవుతాయని మేళా నిర్వాహకులు చెబుతున్నారు. ప్రకృతి ప్రసాదించిన సహజ వంగడాల ప్రత్యేక గుణాలే ఇందుకు దోహదం చేస్తున్నాయి. వారసత్వ వరి వంగడాల గురించి లోతుగా తెలుసుకోవాలనుకునే వారందరికీ ఆహ్వానం. **వివరాలకు.. 70900 09944, 70900 09911.**

● పండ్ల తోటల్లో చెట్టు చుట్టూ ట్రాక్టర్ సాయంతో పాదులు చేసే యంత్ర పరికరం రూపకల్పన

● చెట్టు చుట్టూతా 1.5 నిమిషాల్లో పాదు తవ్వుతుంది

● 5 లీటర్ల డీజిల్ ఖర్చుతో గంటకు 35 పాదుల తవ్వకం

● సంప్రదాయ పద్ధతితో పోల్చితే 45% ఖర్చు, 30% సమయం ఆదా..



# చిటికెలో చెట్టు చుట్టూ పాదు!

(బిజివేముల రమణారెడ్డి, సాక్షి ప్రతినిధి, బాపట్ల)

మామిడి, జామ, బత్తాయి, సన్న నిమ్మ, పెద్ద నిమ్మ.. తదితర తోటల్లో మొక్కలు నాటిన తర్వాత 5-10 ఏళ్ల వరకు పసిబిడ్డల్లా పెంచుకోవాలి. మొదళ్లలో కలుపు తీయటం, పాదులు చేయటం, ఎరువులు వేసి మట్టిని కలియబెట్టటం.. వంటి పనులన్నీ అధిక శారీరక శ్రమతో కూడుకున్నవే. వ్యవసాయ కార్మికులు నడుము వంచి, చెమట చిందిస్తే తప్ప ఈ పనులు సజావుగా సాగవు. ఈ తోటల్లో చెట్ల దగ్గర కలుపు తీయటం, పాదులు చేయటం, ఎరువులు వేయటం రైతులకు నిత్యకృత్యం. అయితే, ఈ పనులను సులువుగా చేసే యంత్రపరికరాలు రైతులకు అందుబాటులో లేవు. వ్యయ ప్రయాసలకోర్చి స్వయంగా చేసుకోవటమో, ఎక్కువ ఖర్చు పెట్టి కూలీలతోనో చేయించుకుంటున్నారు.

అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం సుండుపల్లి మండలం పింఛ గ్రామానికి చెందిన రైతు కుటుంబంలో పుట్టిన డా. మూడె వినాయక్ ఈ కష్టాలన్నీ చూస్తూ పెరిగారు. మడకశిర అగ్రి ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ చేశారు. బాపట్ల అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంటెక్, పీహెచ్‌డీ చదివారు. డా.హరిబాబు మార్గనిర్దేశకత్వంలో తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం ప్రధాన శాస్త్రవేత్త డా.సి.రమణ పర్యవేక్షణలో వినాయక్ పీహెచ్‌డీ పూర్తి చేశారు. పరిశోధనల్లో భాగంగానే పండ్ల చెట్ల చుట్టూ ట్రాక్టర్ సహాయంతో సులువుగా పాదులు చేసే యంత్ర పరికరాన్ని గత ఏడాది రూపొందించారు. ప్రస్తుతం ఆదిత్య యూనివర్సిటీ(కాకినాడ)లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.



ఉద్యాన తోటల రైతులకు ఉపయోగపడే యంత్ర పరికరాన్ని రూపొందించిన డా. వినాయక్‌ను 'సాక్షి' పలుకరించింది. 'మా ప్రాంతంలో దాదాపుగా అన్ని పొలాల్లోనూ పండ్ల తోటలే కనిపిస్తాయి. ఓపిక ఉన్నంత వరకూ నాన్నే ఈ పనులు చేసేవారు. భారమనుకున్నప్పుడు కూలీలను పెట్టి చేయించేవారు. చిన్న నాటి నుంచి మా నాన్నతో పాటు ఇతర రైతులు చెట్ల చుట్టూ పాదులు చేయటంలో సహాయ పడే యంత్ర పరికరాలు లేక పడే కష్టాలను కళ్లారా చూస్తూ పెరిగా. పరిశోధక విద్యార్థిగా ఈ సమస్యపై దృష్టి పెట్టా. ఆ కృషి ఫలితంగానే పండ్ల తోటల్లో పాదులు చేసే యంత్రం రూపొందించా'నని అన్నారు.

### పాదులు తవ్వే యంత్రం ఎలా పనిచేస్తుంది?

చెట్ల చుట్టూ పాదులు తవ్వే యంత్రపరికరాన్ని ట్రాక్టర్‌కు అనుసంధానం చేస్తే.. హైడ్రాలిక్ సిస్టం ద్వారా పాదులు చేస్తుంది. ఇందులో ప్రధానమైనది బెవెల్ గేర్ (గుండ్రంగా ఉండే పళ్ల చక్రం). ఇది అర్ధ చంద్రాకారంలో రెండు భాగాలుగా ఉంటుంది. వీటికి ఊతంగా ఇనుప చక్రం అమర్చి ఉంటుంది. ట్రాక్టర్ చెట్టు దగ్గరకు వెళ్లి ఈ బెవెల్ గేర్ రెండు భాగాలను చెట్టు చెట్టూ పెట్టి, చక్రాన్ని బిగిస్తే పాదు పని జరుగుతుంది. చక్రం కింద వైపు రెండు నాగళ్లు, వాటికి రెండు కర్రులు ఉంటాయి. 40 హెచ్‌పీ, అంతకన్నా ఎక్కువ అశ్వశక్తి కలిగిన ట్రాక్టర్ ఇంజన్‌కు ఈ యంత్ర పరికరాన్ని అనుసంధానం చేస్తే హైడ్రాలిక్ మోటార్ ద్వారా పనిచేస్తుంది. ట్రాక్టర్ నుంచి 6 హైడ్రాలిక్ పైపులు అమర్చి ఉంటాయి. రెండు పైపులు హైడ్రాలిక్ మోటార్‌కు ఆయిల్ వెళ్లడానికి, తిరిగి ఆయిల్ వెనక్కు రావడానికి ఉపయోగపడతాయి. వీటిని పవర్‌లైన్, రిటర్న్‌లైన్ అంటారు. మిగతా 4 పైపులను రెండు సిలిండర్లకు అమరుస్తారు. బెవెల్ గేర్ తెరచుకోవటానికి, మూసుకోవటానికి ఇవి ఉపయోగపడతాయి. వీటితోపాటు 3 కంట్రోల్ లివర్స్ ఉంటాయి. హైడ్రాలిక్ వ్యవస్థ ద్వారా దీన్ని ఆపరేట్ చేసినప్పుడు.. బెవెల్‌గేర్ ఫ్రేమ్ రెండుగా విడిపోయి చెట్టు కాండం చుట్టూ అల్లుకుంటుంది. ఫ్రేమ్ కింద అనుసంధానమై వున్న రెండు నాగళ్లు, వాటికున్న కర్రులతో చెట్టు చుట్టూతా తవ్వి పాదును ఏర్పాటు చేస్తాయి. కాండం చుట్టుకొలత మీటరు కన్నా తక్కువ గల చెట్టు చుట్టూ పాదు చేసుకోవచ్చు.

### గంటకు 32-35 పాదులు

పాదులు తీసే యంత్రం ద్వారా చెట్టు చుట్టూ 1.75 మీటర్ల వ్యాసార్ధం, 15 సెంటీ మీటర్ల లోతులో పాదును చేసుకోవచ్చు. ఒక చెట్టు చుట్టూ పాదు చేయటానికి ఒకటిన్నర నిమిషాల సమయం పడుతుంది. ట్రాక్టర్‌కు ఒక గంటకు 5 లీటర్ల డీజిల్‌తో 32 నుంచి 35 పాదులు చేసుకోవచ్చు. గంటకు రూ. 690 చొప్పున హెక్టారు తోటలో పాదులు పూర్తి చేయటానికి రూ. 4,615 ఖర్చవుతాయని, రైతులకు 30 శాతం సమయం, 45 శాతం ఖర్చు ఆదా అవుతాయని అంచనా.

### రైతుల శ్రమ, ఖర్చు తగ్గుతాయి



ఏవైనా పెద్ద కంపెనీలు ముందుకు వచ్చి, ఈ యంత్ర పరికరాన్ని పెద్ద సంఖ్యలో తయారు చేసి విక్రయిస్తే విస్తృతంగా రైతులకు అందుతుంది. ఈ యంత్ర పరికరం రూపకల్పనతో మా అమ్మానాన్నలతో పాటు పండ్ల తోటలు పెంచే ప్రతి రైతు శ్రమ, ఖర్చు చాలామటుకు తగ్గుతాయి. నా కృషి త్వరగా ఫలిస్తే అంతకు మించిన సంతోషం ఏముంటుంది?

– డా. మూడె వినాయక్ (91330 86832), పాదులు చేసే యంత్ర పరికరం రూపశిల్పి.

### ఎక్కడ దొరుకుతుంది?

డాక్టర్ వినాయక్ తాను రూపొందించుకున్న డిజైన్ మేరకు పాదులు చేసే యంత్ర పరికరాన్ని ప్రైవేటు వర్క్‌షాపులో తయారు చేయించి, ప్రయోగాత్మకంగా పరిశీలించారు. ఏవైనా కంపెనీలు ముందుకు వచ్చి ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ అనుమతితో ఈ పరికరాన్ని పెద్ద సంఖ్యలో తయారుచేసి రైతులకు అందించాల్సి వుంది. ఈ పాదుల యంత్ర పరికరం త్వరలో రైతులకు ఉపయోగంలోకి వస్తుందని ఆశిద్దాం. ప్రస్తుత ధర రూ. 80 వేలు. కావాల్సిన వారు బాపట్లలోని డాక్టర్ ఎన్‌టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో వ్యవసాయ పనిముట్లు, యాంత్రీకరణ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్. రాజ్‌కిరణ్ (91773 45631)ను సంప్రదించాలని కళాశాల అసోసియేట్ డీన్ డీడీ స్మిత్ తెలిపారు.

# జూన్‌లోనే కోతకొచ్చే సీతాఫలం 'అర్క సహన్'!

అధిక దిగుబడినివ్వటంతో పాటు 2 నెలల ముందే కాపునిచ్చే హైబ్రిడ్ సీతాఫలం | అక్టోబర్‌లో ప్రూనింగ్ చేస్తే 8-9 వారాల ముందే కాపు | అన్ని విధాలా మెరుగైన ఫలితాలనిస్తోందంటున్న ఐఐహెచ్ఆర్

### అర్క సహన్ రైతులకు వరం!

అర్క సహన్ సీతాఫలం మెరుగైన హైబ్రిడ్ రకం చిన్న సన్నకారు రైతులకు, ముఖ్యంగా వర్షాధార వ్యవసాయం చేసే రైతులకు వరంలాంటిది. వాతావరణ ఒడిదుడుకుల్ని దీటుగా తట్టుకుంటూ గ్రామీణుల జీవనోపాధులను పెంపొందించే క్లైమెట్ స్మార్ట్ పండ్ల రకాల్లో ఇది కూడా ఒకటి. చిన్న సన్నకారు రైతుల తలరాతను మార్చే శక్తి అర్క సహన్‌కు ఉంది. ఏ వాతావరణానికైనా ఇట్టే సర్దుకుంటుంది. పండు నాణ్యత అద్భుతంగా ఉంది. వినియోగదారుల మన్ననలు కూడా చూరగొనటం వల్ల అర్క సహన్ సీతాఫలం తోటల ద్వారా రైతులకు దీర్ఘకాలంలో స్థిరమైన ఆదాయం చేకూరుతుందని చెప్పగలను.

– డా. తుసార్ కాంతి బెహెర, సంచాలకులు, భారతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ (ఐఐహెచ్ఆర్), బెంగళూరు

వర్షాకాలపు అద్భుత ఫలాల్లో సీతాఫలం ముఖ్యమైనది. వర్షాధారపు సేద్య భూములు, బంజరు భూముల్లో సీతాఫలం విరివిగా పండుతుంది. సాధారణంగా ఆగస్టు-సెప్టెంబర్ నెలల్లో శీతాఫలాలు మార్కెట్‌లోకి వస్తుంటాయి. అయితే, ప్రూనింగ్ చేయటం ద్వారా జూన్ నెలలోనే సీతాఫలాల కాపు చేతికి తెచ్చుకోవచ్చంటున్నారు బెంగళూరులోని భారతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్ - ఐఐహెచ్ఆర్) శాస్త్రవేత్తలు. ఆరేడేళ్ల క్రితమే ఐఐహెచ్ఆర్ రూపొందించిన ఈ ఇంప్రూవ్డ్ హైబ్రిడ్ రకాన్ని ఉద్యాన రైతు మరిబసవయ్య గత ఆరేళ్లుగా సాగు చేస్తూ చక్కని ఫలితాలు సాధిస్తున్నారు. సౌత్ బెంగళూరు తాలూకాలోని సులివర గ్రామంలో ఆయన అర్క సహన్ రకం సీతాఫలం తోటను సాగు చేస్తున్నారు.



ఐఐహెచ్ఆర్ ఈ తోట సందర్శన కార్యక్రమాన్ని జూలై 31న నిర్వహించింది. రైతులు, శాస్త్రవేత్తలు, వ్యాపారులు పెద్దసంఖ్యలో పాల్గొని అర్క సహన్ సీతాఫల క్షేత్ర విశేషాలను తెలుసుకున్నారు. అర్క సహన్ సాగు చేసే అభ్యుదయ రైతులు బెల్గావికి చెందిన మహంతేశ్, మహేంద్ర మాట్లాడుతూ స్థానిక మార్కెట్లతో పాటు దూర ప్రాంత మార్కెట్లలో కూడా అర్క సహన్ రకం పండ్లకు మంచి ధర వచ్చిందని చెప్పారు. కరువు పీడిత ప్రాంతాల రైతులు కూడా ఈ వంగడం పనితీరుపై సంతోషాన్ని వ్యక్తం చేశారని ఐఐహెచ్ఆర్ ఫల విభాగం అధిపతి డాక్టర్ ఎం. శంకరన్ తెలిపారు.

**అక్టోబర్‌లో ప్రూనింగ్.. జూన్‌లో దిగుబడి..**

ఇసుక, రాళ్ల, గ్రావెల్ కలిసిన తేలిక నేలలతో పాటు బరువైన నేలలు కూడా ఈ రకానికి అనుకూలమే. అయితే, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవటం చాలా ముఖ్యం. 6-7.5 మధ్య ఉదజని సూచిక ఉన్న నేలలు అనుకూలమని ఐఐహెచ్ఆర్ చెబుతోంది. సాధారణ సీతాఫలం రకాల చెట్లు వర్షాలు కురిసే ఆగస్టు-సెప్టెంబర్ నెలల్లో సీతాఫలాలు కోతకు వస్తాయి. వర్షాల కారణంగా ఆంత్రాక్నోజ్, పండీగ తదితర చీడపీడల బెడద ఎక్కువగా ఉంటున్నది. అయితే, అర్క సహన్ చెట్లకు అక్టోబర్ నెలలో కొమ్మ కత్తిరింపులు (ప్రూనింగ్) చెయ్యాలి. గత ఏడాది చెట్టు పెరిగిన దాంట్లో 75% మేరకు ప్రూనింగ్ చెయ్యాలి. దీని కారణంగా, పూత, కాత 8-9 వారాల ముందే వస్తుంది. జూన్‌లో పండ్లు కోతకు వస్తాయని, పండు నాణ్యతతో పాటు ముందుగానే మార్కెట్‌లోకి రావటం వల్ల రైతుకు మంచి ఆదాయం వస్తున్నదని ఐఐహెచ్ఆర్ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

### ఏపీ, తెలంగాణకూ అనువైనదే!

అర్క సహన్ సీతాఫలం హైబ్రిడ్ రకం కర్ణాటకతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని వర్షాధార ప్రాంతాల్లో సాగుకు కూడా అనువైనదే. ఈ రకం సీతాఫలాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. పండ్ల సైజు పెద్దగా, గింజలు తక్కువ, గుజ్జు ఎక్కువగా, తియ్యగానూ ఉంటుంది. సాధారణ రకాలతో పోల్చితే అర్క సహన్ హైబ్రిడ్ సాగు మెరుగైన ఫలితాలనిస్తున్నదనటానికి దీనిపై పెరుగుతున్న ఆసక్తే నిదర్శనం. ఎకరానికి 160 మొక్కలు వేసుకోవాలి. మొక్క ధర రూ. 70. బెంగళూరులోని ఐఐహెచ్ఆర్ నర్సరీలో మొక్కలు దొరుకుతాయి. మొబైల్: 70192 30983.

– డాక్టర్ టి. శక్తివేల్, ప్రధాన శాస్త్రవేత్త, ఐఐహెచ్ఆర్, బెంగళూరు

**23** సిరాజ్ పడగొట్టిన వికెట్లు. ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన బుమ్రాతో సిరాజ్ సమంగా నిలిచాడు. 2021–22లో ఇంగ్లండ్‌తో సిరీస్‌లోనూ బుమ్రా 23 వికెట్లు తీశాడు.

**6** పరుగుల పరంగా భారత్‌కు ఇదే అత్యల్ప తేడాతో గెలిచిన టెస్టు! 2004లో ముంబైలో ఆసీస్‌పై 13 పరుగుల తేడాతో గెలిచిన అత్యల్ప తేడా అటకెక్కింది.

**1** ఈ సిరీస్ మొత్తంలో భారత్ 3809 పరుగులు చేసింది. ఐదు టెస్టుల సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన ఏకైక జట్టుగా నిలిచింది.

**4** ద్వైపాక్షిక టెస్టుల్లో 2018 నుంచి భారత్ నాలుగోసారి ఇంగ్లండ్‌కు సిరీస్ విజయం లేకుండా చేసింది. ఇలాగే 1996–2011 వరకు టీమిండియా ఐదు సిరీస్‌ల్లో విజయం దక్కకుండా చేసింది.

**754** టెస్టు క్రికెట్‌లో ఒక సిరీస్‌లో అత్యధిక పరుగులు (754) చేసిన కెప్టెన్‌గా శుబ్‌మన్ గిల్ నిలిచాడు. ఈ క్రమంలో భారత మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ (732), ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ గ్రాహమ్ గూచ్ (752)లను వెనక్కి నెట్టాడు.

**2** ఒక టెస్టులోని రెండు ఇన్నింగ్స్‌లలో నాలుగు అంతకంటే ఎక్కువ వికెట్లు తీసుకున్న రెండో భారత బౌలింగ్ జోడీగా సిరాజ్, ప్రసిధ్ కృష్ణ గుర్తింపు పొందింది. 1969లో ఆస్ట్రేలియాతో ఢిల్లీలో జరిగిన టెస్టులో బిషన్ సింగ్ బేడీ, ఎరాపల్లి ప్రసన్న తొలిసారి ఈ ఘనత సాధించారు.

# సమంగా... సగర్వంగా...

## చివరి టెస్టులో భారత్ అద్భుత విజయం ● 6 పరుగులతో ఓడిన ఇంగ్లండ్

### రెండో ఇన్నింగ్స్‌లో 367 ఆలౌట్ ● గెలిపించిన సిరాజ్ ● 2–2తో ముగిసిన సిరీస్



35 పరుగులా... 4 వికెట్లా... ఓవల్ మైదానంలో అన్ని వైపులా తీవ్ర ఉత్కంఠ... ప్రసిధ్ కృష్ణ వేసిన తొలి రెండు బంతుల్లో ఒవర్టన్ 2 ఫోర్లు కొట్టడంతో చేయాల్సిన దాంట్లో 20 శాతం పరుగులు ఇంగ్లండ్‌కు వచ్చేశాయి... కానీ ఆ తర్వాత సిరాజ్ బౌలింగ్ మొదలు పెట్టడంతో ఆట మళ్లీ మలుపు తిరిగింది. లక్ష్యం ఛేదించగల సత్తా ఉన్న జేమీ స్మిత్‌తోపాటు ఒవర్టన్‌ను వరుస ఓవర్లలో సిరాజ్ వెనక్కి పంపాడు. ఒకవైపు వాన పెద్దదిగా మారుతోంది... మళ్లీ ఆట ఆగిపోతుందా అనే సందేహాల నడుమ జోష్ టంగ్‌ను ప్రసిధ్ అవుట్ చేశాడు.

తప్పనిసరి పరిస్థితుల్లో జట్టును కాపాడేందుకు వోక్స్ చేతికి కట్టుతోనే క్రీజ్‌లోకి వచ్చాడు. ఒంటిచేత్తో సహచరుడికి అండగా నిలిచేందుకు అతను సిద్ధమయ్యాడు. సిరాజ్ ఓవర్లో అట్కిన్సన్ కొట్టిన బంతిని బౌండరీ వద్ద ఆకాశ్‌దీప్ సరిగా అంచనా వేయక పోవడంతో అది సిక్స్‌గా మారింది. తర్వాతి ఓవర్లో మరో 3 పరుగులు రావడంతో లక్ష్యం ఇంకా తగ్గిపోయింది. కానీ మరుసటి ఓవర్ వేసిన సిరాజ్ తొలి బంతికే అద్భుతం చేశాడు. లో ఫుల్‌టాస్ బంతి అట్కిన్సన్ స్టంప్‌ను పడగొట్టడంతో భారత బృందం సంబరాల్లో మునిగిపోయింది.

లార్డ్స్ టెస్టులో 23 పరుగులు చేయాల్సిన సమయంలో అనూహ్య రీతిలో చివరి వికెట్‌గా అవుటై గుండె పగిలిన సిరాజ్ ఇప్పుడు విజయానికి బాగా చేరువైన ప్రత్యర్థిని చివరి వికెట్‌గా అవుట్ చేసి జట్టును గెలిపించడం సినిమా స్క్రిప్ట్‌కు ఏమాత్రం తగ్గని క్లైమాక్స్... సిరీస్ ఆద్యంతం 25 రోజుల పాటు (ఐదు టెస్టులు) రసవత్తరంగా సాగిన పోరును భారత్ సగర్వంగా ముగించింది. ఎన్నో మలుపులతో ఆధిపత్యం చేతులూ మారుతూ వచ్చిన 73 సెషన్లలో చివరి క్షణాల్లో ఒత్తిడిని అధిగమించిన టీమిండియా ఈ సిరీస్‌ను సమం చేయడం విశేషం.

**లండన్:** ఇంగ్లండ్ పర్యటనను భారత్ ఘనంగా ముగించింది. ఐదు టెస్టుల సుదీర్ఘ సిరీస్‌ను 2–2తో సమం చేసింది. సోమవారం ఓవల్ మైదానంలో ముగిసిన చివరిదైన ఐదో టెస్టులో భారత్ 6 పరుగుల అతి స్వల్ప తేడాతో ఇంగ్లండ్‌పై విజయం సాధించింది. విజయం కోసం రెండో ఇన్నింగ్స్‌లో 374 పరుగులు చేయాల్సిన ఇంగ్లండ్.. ఓవర్‌నైట్ స్కోరు 339/6తో చివరి రోజు ఆటలో బరిలోకి దిగింది. అయితే ఆ జట్టు మరో 8.5 ఓవర్ల ఆటలో మరో 28 పరుగులు చేసి మిగిలిన వికెట్లు కోల్పోయింది. చివరకు 85.1 ఓవర్లలో 367 పరుగులకు ఆలౌటైంది. చివరి నాలుగు వికెట్లలో మూడు వికెట్లు తీసి భారత్ విజయంలో హైదరాబాద్ పేసర్ మొహమ్మద్ సిరాజ్ కీలక పాత్ర పోషించాడు. ఈ టెస్టులో 9 వికెట్లు పడగొట్టిన సిరాజ్‌కే 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. భారత్ తరఫున శుబ్‌మన్ గిల్ (754 పరుగులు), ఇంగ్లండ్ తరఫున హ్యారీ బ్రూక్ (481 పరుగులు) 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' పురస్కారాలు అందుకున్నారు. ఈ సిరీస్‌లో లీడ్స్‌లో జరిగిన తొలి టెస్టులో, లార్డ్స్‌లో జరిగిన మూడో టెస్టులో ఇంగ్లండ్ గెలవగా... బర్మింగ్‌హామ్‌లో జరిగిన రెండో టెస్టును భారత్ గెలుచుకుంది. మాంచెస్టర్‌లో జరిగిన నాలుగో టెస్టు 'డ్రా'గా ముగిసింది.

**స్కోరు వివరాలు**

**భారత్ తొలి ఇన్నింగ్స్:** 224; **ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్:** 247; **భారత్ రెండో ఇన్నింగ్స్:** 396; **ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్:** క్రాలీ (బి) సిరాజ్ 14; డకెట్ (సి) రాహుల్ (బి) ప్రసిధ్ 54; పోప్ (ఎల్బీ) (బి) సిరాజ్ 27; రూట్ (సి) జురేల్ (బి) ప్రసిధ్ 105; బ్రూక్ (సి) సిరాజ్ (బి) ఆకాశ్‌దీప్ 111; బెతెల్ (బి) ప్రసిధ్ 5; స్మిత్ (సి) జురేల్ (బి) సిరాజ్ 2; ఒవర్టన్ (ఎల్బీ) (బి) సిరాజ్ 9; అట్కిన్సన్ (బి) సిరాజ్ 17; టంగ్ (బి) ప్రసిధ్ 0; వోక్స్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 23; **మొత్తం (85.1 ఓవర్లలో ఆలౌట్) 367. వికెట్ల పతనం:** 1–50, 2–82, 3–106, 4–301, 5–332, 6–337, 7–347, 8–354, 9–357, 10–367.

**బౌలింగ్:** ఆకాశ్‌దీప్ 20–4–85–1, ప్రసిధ్ కృష్ణ 27–3–126–4, సిరాజ్ 30.1–6–104–5, వాషింగ్టన్ సుందర్ 4–0–19–0, రవీంద్ర జడేజా 4–0–22–0.



రెండు జట్లూ తమ అత్యుత్తమ ఆటతీరును కనబరుస్తూ అద్భుతంగా ఆడాయి. సిరాజ్, ప్రసిధ్‌లాంటి బౌలర్లు జట్టులో ఉంటే కెప్టెన్సీ సులువవుతుంది. వీరిద్దరు ఈ రోజు చాలా బాగా బౌలింగ్ చేశారు. ఇంగ్లండ్ ఒత్తిడిలో ఉందని మాకు నాలుగో రోజే తెలుసు. దానినే కొనసాగించాలని భావించాం. సిరీస్‌లో ఆట జరిగిన తీరును బట్టి చూస్తే 2–2 సరైన ఫలితం. బ్యాటర్‌గా నేను అత్యధిక పరుగులు చేయాలని సిరీస్‌కు ముందు లక్ష్యంగా పెట్టుకున్నాను. దానిని సాధించడం కూడా సంతృప్తిగా ఉంది. ఎన్నడూ ఓటమిని అంగీకరించకూడదని ఈ సిరీస్ జరిగిన ఆరు వారాల్లో నేర్చుకున్నాను.

– శుబ్‌మన్ గిల్, భారత జట్టు కెప్టెన్



విజయం కోసం ఇరు జట్లూ మరోసారి తీవ్రంగా పోరాడాల్సి వచ్చింది. ఇక్కడ గెలవలేకపోవడం నిరాశ కలిగించినా మా జట్టు ప్రదర్శన పట్ల సంతృప్తిగా ఉన్నా. సిరీస్ మొత్తం చాలా గొప్పగా సాగింది. ప్రతీ ఒక్కరూ ఎన్నో సందర్భాల్లో తమ భావోద్వేగాలు ప్రదర్శించారు. ఆరంభంలోనే ఒక బౌలర్ తప్పుకున్నా రెండో ఇన్నింగ్స్‌లో మిగతా వారు ఎంతో పోరాటపటిమ కనబర్చారు. ఇలా జరిగి ఉంటే బాగుండేదనే క్షణాలు గత ఐదు రోజుల్లో ఎన్నో వచ్చాయి. ఇవన్నీ ఆటను గొప్పగా మార్చాయి. అయితే మీ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వమని మాత్రమే మా ఆటగాళ్లకు చెప్పాం. ఆ విషయంలో సంతృప్తిగా ఉంది.

– బెన్ స్టోక్స్, ఇంగ్లండ్ జట్టు కెప్టెన్



మొదటి రోజు నుంచి ఎంతో పోరాటపటిమ కనబర్చాం. ఇలాంటి ఫలితం రావడం చాలా సంతోషంగా ఉంది. సరైన చోట నిలకడగా బంతులు వేసి ఒత్తిడి పెంచాలనేదే నా వ్యూహం. 'నిన్ను నువ్వు నమ్ము' అని రాసి ఉన్న ఒక ఫోటోను గూగుల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్నాను. నాలుగో రోజు బ్రూక్ క్యాచ్ వదిలేయడం ఆటను మార్చింది. నేను దానిని పట్టి ఉంటే ఐదో రోజు మైదానానికి రావాల్సి వచ్చేది కాదు.

– సిరాజ్

# జో జీతా వహీ సిరాజ్

- ఇంగ్లండ్‌తో సిరీస్‌లో చిరస్మరణీయ ప్రదర్శన
- టీమిండియా విజయాల్లో కీలకపాత్ర
- బుమ్రా నీడను వీడిన హైదరాబాద్ పేసర్

సాక్షి క్రీడా విభాగం



సిరీస్‌లో ఐదు టెస్టులూ చివరి వరకు ఆడిన ఏకైక పేస్ బౌలర్. ఏకంగా 1113 బంతులు... సిరీస్ తొలిరోజు నుంచి చివరిరోజు వరకు బౌలింగ్‌లో అదే వేగం, అంతే తీవ్రత... ప్రతీ బంతి వేసే సమయంలో 100 శాతం ఇవ్వాలనే తపన... చేసే పని భారంగా అనిపించలేదు... సుదీర్ఘ సిరీస్‌లో విశ్రాంతి తీసుకోలేదు. గాయంతో తప్పుకోలేదు, మ్యాచ్ మధ్యలో ఫిట్‌నెస్ సమస్యలతో ఒక్కసారి కూడా బౌలింగ్‌కు దూరం కాలేదు... చివరకు అద్భుత రీతిలో మ్యాచ్‌ను గెలిపించే వరకు ఆగిపోలేదు... ఇలాంటి పోరాటతత్వం, పట్టుదల హైదరాబాదీ పేసర్ మొహమ్మద్ సిరాజ్‌కే సాధ్యమైంది. 185.3 ఓవర్ల బౌలింగ్ తర్వాత కూడా అతను అలసిపోకుండా ఇప్పుడు మళ్లీ బౌలింగ్ చేసేందుకు సిద్ధంగా ఉండి 'సై' అంటున్నాడు. ఈ సిరీస్‌లో అతని ప్రదర్శనను ప్రశంసించనివారు లేరు. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్లు అథర్టన్, మైకేల్ వాన్, నాసిర్ హుస్సేన్ మాటల్లో చెప్పాలంటే సిరాజ్ సింహంలా పోరాడిన ఒక 'లయన్ హార్ట్' బౌలర్. అసలు అతను సిరీస్ ఆసాంతం ఒకే తరహాలో అంతే దూకుడుతో ఎలా బౌలింగ్ చేస్తున్నాడో వారికి కూడా ఆశ్చర్యపర్చింది. 'దేశం తరఫున ఆడటం అనేదే ఒక ఆటగాడికి లభించే ఎంతో గొప్ప అవకాశం. అలాంటప్పుడు నేను ఎన్ని ఓవర్లు వేశాను, ఎంత ఎక్కువగా కష్టపడుతున్నాను అన్నది అస్సలు పట్టించుకోవాల్సిన విషయమే కాదు. నాలో సత్తా ఉన్నంత వరకు బౌలింగ్ చేస్తూనే ఉంటాను. అదృష్టవశాత్తూ ఇప్పుడు కూడా నేను ఫిట్‌గా ఉన్నాను'... చివరి టెస్టు ముగిసిన తర్వాత భారత పేసర్ మొహమ్మద్ సిరాజ్ వ్యాఖ్య ఇది.

### ముందుండి నడిపిస్తూ...

**టాప్** పేసర్ బుమ్రా మూడు టెస్టులే ఆడతాడని ఖాయమయ్యాక సహజంగానే సీనియర్ అయిన సిరాజ్‌పై ఎక్కువ బాధ్యత నిలిచింది. దానిని అతను సమర్థంగా నిర్వర్తించాడు. జట్టుకు అవసరమైన ప్రతీ సందర్భంలోనూ సిరాజ్ నేనున్నానంటూ ముందుకు వచ్చాడు. కొత్త బంతి ఇస్తే దానిని సమర్థంగా ఉపయోగించాడు. కాస్త పాతబడిన బంతిని అప్పగిస్తే డ్యూక్ బంతులను వాడుకుంటూ స్వింగ్‌లో చెలరేగడం అతనికే చెల్లింది. కెప్టెన్ గిల్ అయితే ఇక చాలు బౌలింగ్ చేయలేడు అనిపించిన సమయాల్లో కూడా మళ్లీ సిరాజ్‌కే బంతిని అప్పగించాడు. కాస్త ఘాటుగా చెప్పాలంటే చెరకు మిషన్‌లో చెరకు గడను చివరి వరకు వాడుతూ పిప్పి చేసినట్లుగా సిరాజ్‌ను గిల్ ఉపయోగించుకున్నాడు. అయినా సరే ఎక్కడా తగ్గకుండా కీలక సమయాల్లో కీలక వికెట్లతో భారత్ మ్యాచ్‌లో పైచేయి సాధించేలా చేశాడు. బుమ్రా ఆడని రెండు టెస్టుల్లో భారత్ గెలిచింది. ఎడ్జ్‌బాస్టన్‌లో 7 వికెట్లు తీసిన సిరాజ్, ఓవల్‌లో 9 వికెట్లు పడగొట్టాడు. సిరీస్‌లో అతను రెండుసార్లు ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల ప్రదర్శన నమోదు చేశాడు. రెండో టెస్టులో వరుస బంతుల్లో రూట్, స్టోక్స్‌లను అవుట్ చేయడం, క్రాలీని డకౌట్ చేయడం కీలక మలుపులు కాగా... ఓవల్ తొలి ఇన్నింగ్స్‌లో అతను తీసిన పోప్, రూట్, బ్రూక్ వికెట్లతోనే తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్‌కు భారీ ఆధిక్యం దక్కలేదు. మూడో రోజు క్రాలీని బౌల్డ్ చేసిన బంతిని ఎవరూ మర్చిపోలేరు. చివరి రోజు బౌలింగ్ గురించైతే ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.



తన ఫోన్ వాల్ పేపర్‌ను (బిలీవ్) చూపిస్తూ...

### నిలకడగా సత్తా చాటుతూ...

**మాంచెస్టర్** టెస్టులో 30 ఓవర్లలో 140 పరుగులు ఇచ్చి ఒకటే వికెట్ తీసినప్పుడు సిరాజ్ బౌలింగ్‌లో పదును తగ్గినట్లు అనిపించింది. అయితే తర్వాతి మ్యాచ్‌తోనే అతను తనపై వచ్చిన సందేహాలను పటాపంచలు చేశాడు. చాలా సందర్భాల్లో బుమ్రా నీడలో ఉన్నట్లుగా కనిపించిన సిరాజ్ అవకాశం దక్కిన ప్రతీసారి తానేంటో చూపిస్తున్నాడు. బుమ్రాతో కలిసి ఆడిన టెస్టుల్లోకంటే అతను లేని టెస్టుల్లో చెలరేగిపోతున్నాడు. ఏడాదిన్నర క్రితం కేప్‌టౌన్ టెస్టులో దక్షిణాఫ్రికాపై 15 పరుగులే ఇచ్చి 6 వికెట్లు తీసినప్పుడే టెస్టు బౌలర్‌గా సిరాజ్ స్థాయి ఎంతో పెరిగింది. ఆస్ట్రేలియాతో సిరీస్‌లోనూ 20 వికెట్లు పడగొట్టినా... బుమ్రా అసాధారణ 32 వికెట్ల బౌలింగ్‌తో పాటు భారత్ సిరీస్ ఓడటంతో అతని ప్రదర్శనకు గుర్తింపు రాలేదు. కానీ ఇప్పుడు ఓడిపోతుందనుకున్న సిరీస్‌ను సమం చేయడంలో సిరాజ్ పోషించిన పాత్ర అతడిని మరో మెట్టు పైకి ఎక్కించింది. చివరగా... నాలుగో రోజు హ్యారీ బ్రూక్ క్యాచ్ వదిలేయడంతో సిరాజ్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. అతని అద్భుత బౌలింగ్‌నూ పట్టించుకోకుండా కొందరు వ్యాఖ్యలు చేశారు. ఈ మ్యాచ్ ఓడి ఉంటే అది అతడిని ఎప్పటికీ వెంటాడేది. కానీ ఆత్మవిశ్వాసం మెండుగా ఉన్న ఈ బౌలర్ అలాంటి అవకాశం ఇవ్వకుండా ఒంటిచేత్తో మ్యాచ్‌ను ముగించాడు. భారత్‌ను గెలిపించాడు. తానూ గెలిచాడు.

## ప్రశంసల వెల్లువ

టెస్టు క్రికెట్‌కు వన్నెతెచ్చిన సిరీస్ ఇది. ఆఖరి మ్యాచ్ అయితే అద్భుతం. నిజంగా రోమాలు నిక్కబొడుచుకునేలా చేసింది. సిరీస్ ఫలితం 2–2 అయి వుండొచ్చు. కానీ... ప్రదర్శనతో 10కి 10 మార్కులు తెచ్చుకున్నారు. టీమిండియన్స్ అంతా సూపర్‌గా ఆడారు.

–భారత దిగ్గజం సచిన్ టెండూల్కర్

భారత జట్టు అద్భుత విజయం సాధించింది. సిరాజ్, ప్రసిధ్ కృష్ణ బౌలింగ్‌లో కనబరిచిన నిబద్ధత, అంకితభావానికి హ్యాట్సాఫ్. సిరాజ్‌కు నా ప్రత్యేక అభినందనలు. జట్టు కోసం ఏదైనా చేసేందుకు ముందువరుసలో సిద్ధంగా ఉంటాడు.


–విరాట్ కోహ్లి

సంప్రదాయ క్రికెట్‌కు ఉన్న మ్యాజిక్‌ను ఆవిష్కరించిన మ్యాచ్ ఇది. ఓవల్ క్రికెట్ చరిత్రలోనే నిలిచిపోయే మ్యాచ్‌కు ఆతిథ్యమిచ్చింది. అసాధారణ ఆటతీరుతో టెస్టు ఇమేజ్ పెంచిన భారత్, ఇంగ్లండ్ జట్ల సభ్యులకు నా ప్రత్యేక ప్రశంసలు.

–ఐసీసీ చైర్మన్ జై షా

అసాధారణ సిరీస్. అమోఘమైన ఫలితం. జడేజా, వాషింగ్టన్ సుందర్, రిషభ్ పంత్, సిరాజ్... అందరూ నిలకడగా ఆడారు. భారత జట్టు విజయాల ఆకలితో ఉన్నట్లు మనవాళ్లు తమ ఆటతీరుతో నిరూపించారు.

–మాజీ కెప్టెన్ గంగూలీ



మేం కొన్ని గెలిచాం. కొన్ని ఓడాం. కానీ ఏ మ్యాచ్‌లోనూ, ఏ దశలోనూ ప్రత్యర్థికి తలొగ్గలేదు. ప్రతీ మ్యాచ్‌లోనూ పోరాడాం. ఫలితం కోసమే శ్రమించాం. ఆటగాళ్లందరికీ అభినందనలు.

–టీమిండియా హెడ్ కోచ్ గంభీర్

'డ్రా'లోనూ డబుల్ ఆనందం...
మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి బిజినెస్
మంగళవారం
5-8-2025

## స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ ▲ | నిఫ్టీ ▲ |
|---|---|
| 419 | 157 |
| 81,019 | 24,723 |

**విదేశీ సూచీలు**

| | | | |
|---|---|---|---|
| ● నాస్‌డాక్ | 21,028 | ▲ | 378 |
| ● డోజోన్స్ | 44,082 | ▲ | 493 |
| ● ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 9,124 | ▲ | 55 |
| ● డాక్స్ | 23,761 | ▲ | 335 |
| ● షాంఘై | 3,583 | ▲ | 23 |
| ● నికాయ్ | 40,291 | ▼ | 509 |

●అమెరికా ●బ్రిటన్ ●జర్మనీ ●చైనా ●జపాన్

## ఫారెక్స్ రేట్లు (రూ. లలో)

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 86.80 | 86.82 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 114.50 | 117.45 |
| € | యూరో | ఎస్‌బీఐ | 96.38 | 99.09 |
| ¥ | జపాన్ యెన్ (100) | ఎస్‌బీఐ | 58.38 | 58.88 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 54.84 | 57.06 |
| S$ | సింగపూర్ డాలర్ | థామస్‌కుక్ | 65.81 | 69.45 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 22.50 | 23.99 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 22.97 | 24.22 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 11.34 | 13.16 |

## డీఎల్‌ఎఫ్ లాభం అప్

**క్యూ1లో రూ. 763 కోట్లు**



**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికంలో రియల్టీ రంగ దిగ్గజం డీఎల్‌ఎఫ్ లిమిటెడ్ ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 18 శాతం ఎగసి రూ. 763 కోట్లకు చేరింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 645 కోట్లు మాత్రమే ఆర్జించింది. హౌసింగ్‌కు నెలకొన్న పటిష్ట డిమాండ్ ఇందుకు సహకరించింది. ఈ కాలంలో అమ్మకాల బుకింగ్స్ 78 శాతం దూసుకెళ్లి రూ. 11,425 కోట్లను తాకాయి. గురుగ్రామ్‌లో కొత్తగా విడుదల చేసిన లగ్జరీ హౌసింగ్ ప్రాజెక్ట్ ఇందుకు కారణమైనట్లు కంపెనీ పేర్కొంది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,730 కోట్ల నుంచి రూ. 2,981 కోట్లకు జంప్ చేసింది. ఆర్థిక వ్యవస్థలో నిలకడ, వృద్ధి ఆధారిత విధానాలు, గృహాల కొనుగోలుపట్ల ఆసక్తి తదితర అంశాలు ప్రోత్సాహాన్నిస్తున్నట్లు కంపెనీ పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో డీఎల్‌ఎఫ్ షేరు బీఎస్‌ఈలో 2.2 శాతం లాభపడి రూ. 794 వద్ద ముగిసింది.

## పాన్ 2.0 ప్రాజెక్ట్ వచ్చేస్తోంది..

- వచ్చే ఏడాది నుంచి అమల్లోకి..
- ఎల్‌టీఐ మైండ్ ట్రీ ఎంపిక



**న్యూఢిల్లీ:** ఆదాయపన్ను శాఖ పాన్ 2.0 ప్రాజెక్టు అభివృద్ధి బాధ్యతను ఎల్‌టీఐ మైండ్‌ట్రీకి అప్పగించింది. ఈ ప్రాజెక్టు వచ్చే ఏడాది నుంచి అమల్లోకి రానుంది. పాన్, టాన్, కేటాయింపులు, అప్‌డేట్‌లు/దిద్దుబాట్లు, ఆధార్–పాన్ అనుసంధానం, తిరిగి జారీ అభ్యర్థనలు, ఆన్‌లైన్ పాన్ వ్యాలిడేషన్ ఇలా పాన్‌కు సంబంధించి అన్ని రకాల సేవలను అందించే విధంగా పాన్ 2.0 ప్రాజెక్టు ఉంటుంది. ప్రజలకు మెరుగైన పాన్ సేవలు, ఫిర్యాదుల పరిష్కార సేవలకు వీలుగా ఈ ప్రాజెక్టు ఉంటుందని ఓ అధికారి తెలిపారు. ప్రస్తుతం పాన్‌కు సంబంధించిన పలు రకాల సేవలు ఈ–ఫైలింగ్ పోర్టల్, యూటీఐఐటీఎస్‌ఎల్, ప్రొటీన్ ఈ–గోవ్ పోర్టల్ మధ్య వేర్వేరుగా ఉన్నాయి. పాన్ 2.0 అమల్లోకి వస్తే అన్ని రకాల సేవలు ఒకే వేదిక నుంచి అందనున్నాయి.

## టెస్లా తొలి చార్జింగ్ స్టేషన్ రెడీ..




**ముంబై:** ఎలాన్ మస్క్ ఎలక్ట్రిక్ కార్ల సంస్థ టెస్లా తన మొదటి చార్జింగ్ స్టేషన్‌ను ముంబైలోని బాంద్రా కుర్లా కాంపెక్స్‌లో ఏర్పాటు చేసింది. ఇందులో నాలుగు వీ4 సూపర్‌చార్జింగ్ స్టాల్స్(డీసీ చార్జింగ్), నాలుగు డెస్టినేషన్ చార్జింగ్ స్టాల్స్(ఏసీ చార్జింగ్) ఉన్నాయి. వీ4 సూపర్‌చార్జర్‌లు కిలోవాట్‌కి రూ.24, డెస్టినేషన్ చార్జర్‌లు కిలోవాట్‌కి రూ.14 చెల్లించాల్సి ఉంటుంది. ఈ సెప్టెంబర్ చివరి కల్లా ముంబైలోని లోయర్ పరేల్, థానే, నవీ ముంబై ప్రాంతాల్లో కొత్త చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామని కంపెనీ వివరించింది.

**ఢిల్లీలో రెండో షోరూం:** టెస్లా తన రెండో షోరూంను ఢిల్లీలోని ఏరోసిటీ(వరల్డ్ మార్క్ 3)లో ఆగస్టు 11న రెండో షోరూం ప్రారంభించనుంది. కాగా తొలి షోరూంను జూలై 15న ముంబైలోని బాంద్రా కుర్లా కాంపెక్స్‌లో ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

## అమెరికాకు ఎగుమతుల్లో 30 శాతం కోత!

**టారిఫ్ వార్ దెబ్బ**

- 2025–26లో రూ.5.27 లక్షల కోట్లు
- జీటీఆర్ఐ సంస్థ అంచనా
- రాయితీ రుణాలతో ఆదుకోవాలని సూచన

**న్యూఢిల్లీ:** భారత్‌పై 25 శాతం టారిఫ్‌లు విధించడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025–26) అమెరికాకు ఎగుమతులు 30 శాతం తగ్గి 60.6 బిలియన్ డాలర్లుగా (రూ.5.27 లక్షల కోట్లు) ఉండొచ్చని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) అంచనా వేసింది. 2024–25లో అమెరికాకు ఎగుమతులు 86.5 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఇంటరెస్ట్ ఈక్వలైజేషన్ స్కీమ్ (తక్కువ వడ్డీపై రుణ సాయం)ను పునరుద్ధరించాలని ప్రభుత్వానికి సూచించింది. అలాగే, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి, వాణిజ్య ఒప్పందాలను వ్యూహాత్మకంగా ఉపయోగించుకోవడం, కొత్త ఎగుమతిదారులను నమోదు చేయించాలని పేర్కొంది. ఆసియాలో పోటీ ఎగుమతిదేశాలైన వియత్నాంపై 20%, బంగ్లాదేశ్‌పై 18%, ఇండోనేషియా, మలేషియా, ఫిలిప్పీన్స్‌పై 19%, దక్షిణ కొరియాపై 15% చొప్పున అమెరికా సుంకాలు విధించడం గమనార్హం. కనుక ఈ దేశాలతో పోటీ పడడం భారత ఎగుమతిదారులకు కష్టమవుతుందని జీటీఆర్ఐ తెలిపింది. అమెరికా టారిఫ్‌ల నుంచి ఫార్మాస్యూటికల్స్, ఇంధన ఉత్పత్తులు, కీలక ఖనిజాలు, సెమీ కండక్టర్లకు మినహాయింపు ఉంది. కనుక ఇతర ఎగుమతులకు ఒత్తిళ్లు ఎదురవుతాయని పేర్కొంది.

**గార్మెంట్స్, రత్నాభరణాల పరిశ్రమలకు ఇబ్బందులు**

గార్మెంట్స్ (వస్త్రాలు) తయారీదారులపై ఎక్కువ ప్రభావం ఉంటుందని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ తెలిపారు. అల్లిన, నేత వస్త్రాలపై వరుసగా 38.9%, 35.3% చొప్పున టారిఫ్‌లు ఎదుర్కోవాల్సి వస్తుందని.. దీంతో వీటికి సంబంధించి 2.7 బిలియన్ డాలర్ల ఎగుమతులకు ఆటంకాలు ఎదురవుతాయన్నారు. టవల్స్, బెడ్‌షీట్‌లు వంటి 3 బిలియన్ డాలర్ల టెక్స్‌టైల్స్ ఎగుమతులు 34% టారిఫ్‌లను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. పాకిస్తాన్, వియత్నాం కంపెనీలకు ఈ విభాగంలో ప్రయోజనం లభిస్తుందన్నారు. అమెరికాకు ఎగుమతి అయ్యే 2 బిలియన్ డాలర్ల రొయ్యల ఎగుమతుల పైనా ప్రభావం పడుతుందని చెప్పారు. 10 బిలియన్ డాలర్ల రత్నాభరణాలు 27% టారిఫ్‌లు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. 'ఇంటరెస్ట్ ఈక్వలైజేషన్ స్కీమ్‌ను గతేడాది నిలిపివేశారు. రూ.15,000 కోట్ల వార్షిక బడ్జెట్‌తో దీన్ని తిరిగి ప్రారంభించాలని జీటీఆర్ఐ సూచించింది. ఐదేళ్ల పాటు సబ్సిడీపై రుణాన్ని ఎగుమతిదారులకు, ముఖ్యంగా ఎంఎస్‌ఎంఈలకు అందించాలి. దీనివల్ల రుణ వ్యయాలు తగ్గి ఎగుమతిదారుల పోటీతత్వం పెరుగుతుంది' అని శ్రీవాస్తవ వివరించారు.

**రంగంలోకి దిగిన ప్రభుత్వం**

అమెరికా టారిఫ్‌ల ప్రభావాన్ని ఎక్కువగా ఎదుర్కొనే టెక్స్‌టైల్స్, కెమికల్స్ తదితర రంగాలకు చెందిన ఎగుమతిదారులను ఆదుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వం దృష్టి సారించినట్టు ఓ అధికారి తెలిపారు. స్టీల్, ఫుడ్ ప్రాసెసింగ్, ఇంజనీరింగ్, మెరైన్, వ్యవసాయం తదితర రంగాలకు చెందిన ఎగుమతిదారులతో వాణిజ్య శాఖ సమావేశం నిర్వహించినట్టు చెప్పారు. ఆర్థిక సాయంతోపాటు చౌక రేట్లపై రుణ సాయాన్ని సమకూర్చాలని ఎగుమతిదారులు ప్రభుత్వాన్ని కోరారు.



'సాక్షి ప్లస్' ఈ–పేపర్‌లో ..

| అక్జో నోబెల్ భారీ డివిడెండ్ | జేఎల్‌ఆర్ తొలి భారత సీఈవోగా పీబీ బాలాజీ |
|---|---|

## స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ లాభం 38 శాతం జూమ్

**క్యూ1లో రూ. 21 కోట్లు**



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ నికర లాభం రూ. 21 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం క్యూ1లో నమోదైన రూ. 15 కోట్లతో పోలిస్తే సుమారు 38 శాతం పెరిగింది. ఇక ఆదాయం దాదాపు రూ. 144 కోట్ల నుంచి 24 శాతం వృద్ధితో రూ. 178 కోట్లకు చేరింది. సింగపూర్‌కి చెందిన బయోకాన్ సొల్యూషన్స్‌తో దీర్ఘకాలిక ఒప్పందం కుదుర్చుకున్నట్లు సంస్థ తెలిపింది. అలాగే, ఉత్తర అమెరికా మార్కెట్లో అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా అమెరికాలోని సౌత్ కెరోలినాలో స్టాండర్డ్ ఇంజినీరింగ్ సంస్థను ఏర్పాటు చేసినట్లు వివరించింది. ఆదాయం, లాభదాయకత మార్జిన్ల దన్నుతో క్యూ1లో పటిష్టమైన పనితీరు కనబర్చగలిగామని సంస్థ ఎండీ కందుల నాగేశ్వరరావు తెలిపారు. గ్లోబల్ ఫార్మా, కెమికల్ కంపెనీలు నాణ్యమైన ఇంజినీరింగ్ ఉత్పత్తుల కోసం భారత్ వైపు చూస్తున్న నేపథ్యంలో మరిన్ని వ్యాపార అవకాశాలను దక్కించుకోగలమని ఆయన పేర్కొన్నారు.

సోమవారం బీఎస్‌ఈలో కంపెనీ షేరు సుమారు 2% పెరిగి రూ. 187.55 వద్ద క్లోజయ్యింది.

## మెటల్, ఆటో షేర్లు రయ్

- ప్రపంచ మార్కెట్ల సానుకూలతలు
- మళ్లీ 81వేల స్థాయిపైకి సెన్సెక్స్
- నిఫ్టీ లాభం 157 పాయింట్లు



**ముంబై:** మెటల్, ఆటో షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు సోమవారం అరశాతం లాభపడ్డాయి. ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు అంచనాలతో అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న సానుకూలతలు కలిసొచ్చాయి. సెన్సెక్స్ 419 లాభపడిన 81,019 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 157 పాయింట్లు పెరిగి 24,723 వద్ద నిలిచింది. దీంతో సూచీల రెండు రోజుల నష్టాలకు బ్రేక్ పడింది. ఉదయం సానుకూలంగా మొదలైన సూచీలు తరువాత ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 493 పాయింట్లు బలపడి 81,093 వద్ద, నిఫ్టీ 171 పాయింట్లు ఎగసి 24,736 వద్ద గరిష్టాలు తాకాయి. అమెరికా జూలై ఉద్యోగ గణాంకాలు అంచనాలకు కంటే తక్కువగా నమోదవడంతో ఫెడరల్ రిజర్వ్ సెప్టెంబర్‌లో వడ్డీరేట్ల తగ్గింపుపై ఆశలు పెరిగాయి. దీంతో దీంతో ఆసియా, యూరప్ మార్కెట్లు 1–2% లాభపడ్డాయి. అమెరికా మార్కెట్లు అరశాతం లాభాల్లో ట్రేడవుతున్నాయి.

➡ బీఎస్‌ఈలో రంగాల వారీగా ఇండెక్సుల్లో మెటల్ 2.58%, రియల్టీ, కమోడిటీస్, సర్వీసెస్ 2%, ఆటో, ఐటీ, టెక్, ఐటీ సూచీలు 1.50% పెరిగాయి. మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 1.11%, 0.76 శాతం లాభపడ్డాయి.

## ఆల్‌టైమ్ కనిష్టానికి చేరువలో రూపాయి

**48 పైసలు పతనమై 87.66 వద్ద ముగింపు**



రూపాయి మళ్లీ బక్కచిక్కుతోంది. డాలర్ మారకంలో దేశీ కరెన్సీ విలువ సోమ వారం 48 పైసలు బలహీనపడి 87.66 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 55 పైసలు క్షీణించి 87.73 వద్ద కనిష్టాన్ని తాకింది. వాణిజ్య సుంకాల అనిశ్చితులు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు దేశీ కరెన్సీ కోతకు కారణమయ్యాయి. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడమూ ఒత్తిడిని పెంచిందని నిపుణులు తెలిపారు. కాగా, ఈ ఏడాది ఫిబ్రవరి 10న రూపాయి 87.95 వద్ద జీవిత కాల కనిష్టాన్ని నమోదు చేసిన సంగతి తెలిసిందే.

# సాక్షి సినిమా

## లవ్... ఎమోషన్‌కి శ్రీకారం



● దుల్కర్, నాని

తెలుగులోనూ వరుస విజయాలతో దూసుకెళుతున్న మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్ తాజాగా ఓ తెలుగు సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రవి నేలకుదిటిని దర్శకుడిగా పరిచయం చేస్తూ సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవంలో చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు బుచ్చిబాబు సానా కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో నాని క్లాప్ కొట్టారు. గుణ్ణం సందీప్, నాని, రమ్య గుణ్ణం స్క్రిప్ట్‌ను టీమ్‌కు అందజేశారు. ''చక్కని లవ్‌స్టోరీతో పాటు అద్భుతమైన హ్యూమన్ డ్రామాగా పాన్ ఇండియా స్థాయిలో రూపొందిస్తున్నాం. తెలుగు, మలయాళ, కన్నడ, తమిళ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, కెమెరా: అనయ్ ఓం గోస్వామి.



● లోకేశ్ కనగరాజ్, నాగార్జున, శ్రుతీహాసన్

## కథ చెబుతుంటే తొలిసారి రికార్డు చేసుకున్నా!

**- నాగార్జున**

''ఖైదీ, విక్రమ్' నాకు ఇష్టమైన చిత్రాలు. ఆ సినిమాలు చూసిన తర్వాత లోకేశ్‌తో పని చేయాలని బలంగా అనుకున్నాను. ఒకరోజు నన్ను కలిసిన లోకేశ్ 'మీరు విలన్‌గా చేస్తానంటే కథ చెబుతా' అన్నారు. తను కథ చెబుతుంటే నా కెరీర్‌లో మొదటిసారి రికార్డు చేసుకున్నాను. ఇంటికి వెళ్లాక మళ్లీ మళ్లీ విని, కొన్ని మార్పులు చెప్పాను. వాటిని తీసుకుని 'సైమన్' (నాగార్జున పాత్ర)ను లోకేశ్ తీర్చిదిద్దిన విధానం నచ్చింది'' అని నాగార్జున చెప్పారు. రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహించిన చిత్రం 'కూలీ'. నాగార్జున విలన్‌గా, ఆమిర్ ఖాన్, సత్యరాజ్, సౌబిన్ షాహిర్, ఉపేంద్ర, శ్రుతీహాసన్ ముఖ్య పాత్రలు చేశారు. కళానిధి మారన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలకానుంది. డి. సురేష్ బాబు, 'దిల్' రాజు, సునీల్ నారంగ్, భరత్ నారంగ్ యాజమాన్యంలోని ఏషియన్ మల్టీప్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా తెలుగులో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్‌లో నాగార్జున మాట్లాడుతూ– ''నేను ఈ చిత్రంలో విలన్ పాత్ర చేసినా ఆ క్యారెక్టర్ చేసిన అనుభూతి మాత్రం పాజిటివ్‌గా ఉంది. 'కూలీ' షూటింగ్‌లో రజనీగారు నన్ను కలిసినప్పుడు కొద్దిసేపు అలా చూస్తుండిపోయారు. 'మీరు ఇలా ఉన్నారని తెలిస్తే మన సినిమాలో నాగార్జున వద్దని లోకేశ్‌కు చెప్పేవాడిని' అన్నారాయన (నవ్వుతూ). ఈ సినిమా చేస్తూ ఒక బెటర్ యాక్టర్‌గా ఫీల్ అయ్యాను'' అని చెప్పారు. స్పెషల్ వీడియో బైట్‌లో రజనీకాంత్ మాట్లాడుతూ– ''కూలీ' నా డైమండ్ జూబ్లీ పిక్చర్. నాగార్జున, నేను 33 ఏళ్ల కిందట ఓ చిత్రం చేశాం. అప్పటి కంటే ఇంకా యంగ్‌గా కనిపిస్తున్నారాయన'' అన్నారు. ''కూలీ' వంటి పెద్ద ప్రాజెక్ట్‌ని నాకు ఇచ్చిన నిర్మాతలకు ధన్యవాదాలు'' అన్నారు లోకేశ్.

## మేలో మిషన్ ఫిక్స్



● అడివి శేష్

వెండితెరపై గూఢచారిగా అడివి శేష్ టేకప్ చేసిన మిషన్ ఏంటో ప్రేక్షకులు చూసే తేదీ ఫిక్స్ అయింది. వచ్చే ఏడాది మే 1న ఈ మిషన్‌ని చూపించనున్నట్లు 'జీ 2' చిత్రబృందం ప్రకటించింది. 'గూఢచారి'కి సీక్వెల్‌గా రూపొందుతున్న చిత్రం 'జీ 2'. తొలి భాగంలో ఏజెంట్ గోపి పాత్ర చేసిన అడివి శేష్ ఈ సీక్వెల్‌లోనూ ఆ పాత్ర చేస్తున్నారు. వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ఏజెంట్ 116 పాత్రను వామికా గబ్బి చేస్తున్నారు. అలాగే ఓ కీలక పాత్రను ఇమ్రాన్ హష్మీ, ఇతర ముఖ్య పాత్రల్లో మురళీ శర్మ, సుప్రియ యార్లగడ్డ, మధు శాలిని నటిస్తున్నారు. ''తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియాగా ఈ చిత్రాన్ని 2026 మే 1న రిలీజ్ చేస్తాం'' అని నిర్మాతలు పేర్కొన్నారు.

## ఆ తర్వాత ప్రశాంతంగా నిద్రపోయాను

**- గౌతమ్ తిన్ననూరి**



''కింగ్‌డమ్' చిత్రం విడుదలకు ముందు చివరి నిమిషం వరకూ తుది మెరుగులు దిద్దడానికి ప్రయత్నించాం. దాని వల్ల నిద్ర కూడా సరిగ్గా ఉండేది కాదు. విడుదల తర్వాత ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన చూశాక ప్రశాంతంగా నిద్రపోయాను. ఏ కథైనా, సన్నివేశమైనా అందులో ఉన్న భావోద్వేగాలు ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా చేయగలగాలి. 'కింగ్‌డమ్' విషయంలో కూడా అదే సూత్రం ఫాలో అయ్యాను. ఇందులో యాక్షన్ ఉన్నప్పటికీ దాని చుట్టూ బలమైన ఎమోషన్ ఉంటుంది. ఆ భావోద్వేగాలు ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యాయి కాబట్టే యాక్షన్ వర్కౌట్ అయింది'' అని డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి తెలిపారు. విజయ్ దేవరకొండ హీరోగా నటించిన చిత్రం 'కింగ్‌డమ్'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా జూలై 31న విడుదలైంది. సోమవారం గౌతమ్ తిన్ననూరి విలేకరులతో మాట్లాడుతూ– ''నిజానికి విజయ్ దేవరకొండతో చేద్దామనుకున్న కథ వేరు. కానీ, మా ప్రయాణం మొదలైన తర్వాత 'కింగ్‌డమ్' కథ ఆయనకి సరిగ్గా సరిపోతుందని భావించి చెప్పగానే ఒప్పుకున్నారు. వెంకటేశ్‌ని ఆడిషన్ చేసినప్పుడు సినిమా పట్ల, నటన పట్ల తన తపన చూసి మురుగన్ పాత్రకి తీసుకున్నాం. శివ పాత్ర నచ్చడంతో వెంటనే ఒప్పుకున్నారు సత్యదేవ్. 'కింగ్‌డమ్' నుంచి 'హృదయం లోపల...' పాటని తొలగించాం. కథా గమనానికి అడ్డంకిగా ఆ పాట ఉందనిపించి నేను, ఎడిటర్ నవీన్ నూలిగారు, నాగవంశీగారు, విజయ్‌గారు.. ఇలా అందరం చర్చించుకొని తొలగించాం. ఓటీటీ వెర్షన్‌లో ఆ సాంగ్‌తో పాటు కొన్ని సన్నివేశాలు కూడా జోడించే ఆలోచన ఉంది. 'కింగ్‌డమ్' రెండో భాగం మూల కథ ఉంది. స్క్రిప్ట్ వర్క్ త్వరలో ప్రారంభిస్తాం. ఈలోపు ఓటీటీ కోసం ఓ వెబ్ ఫిల్మ్ చేస్తాను'' అని తెలిపారు.

## ఎమోషనల్ చిదంబరం



● వినయ్ రత్నం, కార్తికేయ, వినీషా రెడ్డి, వంశీ తుమ్మల

కిరణ్ అబ్బవరం హీరోగా సూపర్ హిట్ మూవీ 'క' ని నిర్మించిన శ్రీ చక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ తాజాగా 'శ్రీ చిదంబరం' చిత్రాన్ని నిర్మిస్తోంది. చింతా వరలక్ష్మీ సమర్పణలో చింతా వినీషా రెడ్డి, చింతా గోపాలకృష్ణా రెడ్డి నిర్మిస్తున్నారు. వినయ్ రత్నం దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ఠ హీరో, హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రం టైటిల్ గ్లింప్స్‌ను సోమవారం హీరో కార్తికేయ విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ– ''మెల్లకన్ను ఉన్న ఓ యువకుడు అభద్రతాభావంతో కళ్లద్దాలు పెట్టుకుని మేనేజ్ చేస్తుంటాడు. ఆ అబ్బాయి లవ్‌లో పడితే ఏం జరుగుతుంది? అనే అంశం చుట్టూ తిరిగే విలేజ్ డ్రామా ఇది. మంచి ఎమోషన్స్ ఉన్న ఈ చిత్రంలో ప్రతి పాత్ర, ప్రతి సన్నివేశం సహజంగా ఉంటుంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: చందు–రవి, కెమెరా: అక్షయ్ రామ్ పొడిశెట్టి.

## గమ్యం ఎటు...



● కృష్ణ సాయి

కృష్ణసాయి హీరోగా పీఎస్ నారాయణ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'డేంజర్'. పూజిత, మేకా రామకృష్ణ, రమేశ్ గుత్తుల, వెంకటేశ్వరరావు, నితీష్ ఇతర పాత్రధారులు. కృష్ణసాయి చారిటబుల్ ట్రస్ట్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. శంభు ప్రసాద్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'ఓ యువతా... నీ గమ్యం ఎటు వైపు?' అంటూ సాగే పాటను విడుదల చేశారు. ఈ పాటకి డైరెక్టర్ పీఎస్ నారాయణ సాహిత్యం అందించగా, రమణ సీలం పాడారు. ''తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిగారి పిలుపు మేరకు మా బాధ్యతగా డ్రగ్స్ వాడొద్దంటూ యువతలో చైతన్యం కలిగించేలా మా 'డేంజర్' సినిమాలో 'ఓ యువతా... నీ గమ్యం ఎటు వైపు?' పాటని చిత్రీకరించాం'' అన్నారు కృష్ణసాయి.

## తెలుగులోనే అధిక వేతనాలు చెల్లిస్తున్నాం

**● తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి**

''మిగతా మెట్రోపాలిటన్ పట్టణాలతో పోలిస్తే హైదరాబాద్‌లో కాస్ట్ ఆఫ్ లివింగ్ తక్కువ. అయినప్పటికీ ఇతర రాష్ట్రాల చిత్ర పరిశ్రమలో ఇచ్చే వేతనాల కంటే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని కార్మికులకు అధిక వేతనాలు ఇస్తున్నాం'' అని తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి పేర్కొంది. తెలుగు చిత్ర పరిశ్రమలో పని చేస్తున్న కార్మికుల వేతనాలు 30 శాతం పెంచాలంటూ తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేస్తూ, సోమవారం నుంచి బంద్ చేపట్టిన సంగతి తెలిసిందే. కార్మికుల బంద్ కారణంగా పలు సినిమాల చిత్రీకరణలు ఆగిపోయాయి. తాజా పరిస్థితులపై తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి గౌరవ కార్యదర్శి కేఎల్ దామోదర్ ప్రసాద్ పేరుతో సోమవారం ఓ లేఖ విడుదల చేశారు. ఆ లేఖలోని సారాంశం ఏంటంటే...

● చిన్న నిర్మాతలు భరించలేని స్థాయిలో వేతనాలు పెంపును యూనియన్స్ డిమాండ్ చేయటం ఆమోదయోగ్యం కాదు. కనీస వేతనాల చట్టం ప్రకారం కనీస వేతనాలు చెల్లించి ఏ కార్మికుడినైనా నియమించుకునే హక్కు నిర్మాతలకు ఉందని కార్మిక శాఖ కమిషనర్ స్పష్టం చేశారు. కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కూడా నిర్మాతల స్వయంప్రతిపత్తిని సమర్థిస్తూ ఒక ఉత్తర్వును జారీ చేసింది. ● ఈ పరిస్థితుల నేపథ్యంలో తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఒక తీర్మానం చేసింది. నిర్మాతలు ఇవ్వగలిగే వేతనానికి పని చేయాలనుకున్న వర్కర్స్.. యూనియన్‌లో లేకపోయినా వారితో షూటింగ్ చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. యూనియన్లలో సభ్యత్వం కోసం లక్షలు డిమాండ్ చేస్తున్నారు. ఇది ఎంతోమంది కార్మికుల పొట్ట కొట్టడమే. నైపుణ్యం ఉన్న కార్మికులకు పని కల్పించడమే మా ధ్యేయం. నిర్మాత లేనిదే సినిమా పరిశ్రమ లేదు.

### ఆగిన ఉస్తాద్ భగత్ సింగ్ షూట్

పవన్ కల్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా షూటింగ్‌ని హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో జరిపారు. ముంబై, చెన్నై నుంచి వచ్చిన కార్మికులతో షూటింగ్ చేస్తుండగా.. తెలుగు సినీ కార్మికులు ఆందోళనకు దిగారు. ఈ సినిమా డ్యాన్సర్స్ లోపలికి వెళ్లకుండా గేట్ వద్దే అడ్డుకున్నారు. మేము సమ్మె చేస్తుంటే పవన్ కల్యాణ్ షూటింగ్ చేస్తారా? కార్మికుల కష్టం ఆయనకు తెలియదా..? అంటూ మండిపడ్డారు. బయటి కార్మికులతో సినిమా షూటింగ్ చేయొద్దంటూ చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ప్రతినిధి చెర్రీతో కార్మిక సంఘాల నాయకులు వాగ్వాదానికి దిగారట. దాంతో ఈ చిత్రం షూటింగ్ ఆగింది. ఇదిలా ఉంటే... 30 శాతం వేతనాలు పెంపునకు అంగీకరించిన నిర్మాతలకు చెందిన చిత్రాల షూటింగ్స్ జరిగాయి. కాగా తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ బంద్‌కు ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్ మద్దతు పలికింది.




అవయవదానం.. ఆరోగ్యంగా ఉన్నవారైనా లేదా తాము చనిపోతూ.. మరొకరికి చేసే జీవదానం. కాలేయం, కిడ్నీ, క్లోమం (పాంక్రియాస్), గుండె, ఊపిరితిత్తులు, పేగు (ఇంటెస్టైన్).. ఇలాంటి అనారోగ్య సమస్యలు ఉన్నవారికి చేసే అవయవదానం వారి జీవితాన్ని నిలబెడుతుంది. ఇటీవలి కాలంలో అవయవదానంపై అవగాహన బాగా పెరిగింది. నేషనల్ ఆర్గాన్, టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ (నోటో) 2024–25 నివేదిక ప్రకారం.. 2013లో దేశంలో 4,990 అవయవ మార్పిడులు జరగ్గా.. 2023లో ఈ సంఖ్య 18,378కి పెరిగింది. 2024లో ఏకంగా 18,911కి పెరిగింది. తెలుగు రాష్ట్రాల్లోనూ అవయవదాతలు భారీగా పెరిగారు. - సాక్షి, స్పెషల్ డెస్క్

అత్యధిక కిడ్నీ మార్పిడులు జరిగిన రాష్ట్రాలు... ఢిల్లీ, తమిళనాడు, మహారాష్ట్ర. తెలంగాణ 7వ స్థానంలో, ఏపీ 10వ స్థానంలో ఉన్నాయి.

అత్యధిక కాలేయ మార్పిడులు జరిగిన రాష్ట్రాలు.. ఢిల్లీ, తమిళనాడు, మహారాష్ట్ర. తెలంగాణ 5వ స్థానంలో ఉంది.

అత్యధిక గుండె మార్పిడులు జరిగిన రాష్ట్రాలు.. తమిళనాడు, కర్ణాటక, గుజరాత్. తెలంగాణ 4వ స్థానంలో, ఏపీ 7వ స్థానంలో ఉన్నాయి.

ఊపిరితిత్తుల మార్పిడిలో తమిళనాడు తరువాత తెలంగాణ రెండో స్థానంలో ఉంది.

# అవయవదానం.. ప్రాణదానమే!

మనదేశం 'మొత్తం అవయవ మార్పిడుల సంఖ్య'లో ప్రపంచంలో మూడో స్థానంలో ఉంది. కాగా, బతికున్నవాళ్లు అవయవదానం చేయగా అవయవ మార్పిడులు అత్యధికంగా జరిగిన దేశాల్లో మనదేశమే అగ్రస్థానంలో ఉంది. నేషనల్ ఆర్గాన్, టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ (నోటో) వెబ్‌సైట్ ప్రకారం.. 2025 జూలై 25 నాటికి 3.2 లక్షల మంది అవయవదానం చేస్తామని ప్రతిన బూనారు. 2024లో అత్యధిక దానాలు, అవయవ మార్పిడులు జరిగిన రాష్ట్రాలు ఢిల్లీ, తమిళనాడు, మహారాష్ట్ర. తెలంగాణలో 1,386, ఏపీలో 480 మంది అవయవ మార్పిడి ద్వారా లబ్ధిపొందారు.

## ఆరోగ్యంగా ఉన్నవారైనా, మరణిస్తూ కూడా చేయొచ్చు

**2013తో పోలిస్తే మూడున్నర రెట్లకుపైగా పెరుగుదల**

**2024లో రికార్డు స్థాయిలో 18,911 మందికి జీవదానం**

**తెలుగు రాష్ట్రాల్లోనూ భారీగా ముందుకొస్తున్న దాతలు**

2024లో

| | |
|---|---|
| అవయవ దాతలు (బతికున్నవారు) | 15,505 |
| దాతలు (మరణించినవారు) | 1,128 |
| అవయవదానం పొంది, దానం చేసినవాళ్లు | 3 |
| మొత్తం | 16,636 |
| మొత్తం ఇచ్చిన అవయవాలు | 18,911 |
| అవయవ మార్పిడి జరిగినవారు | 18,811 |



**ఏయే అవయవం.. ఎంతమంది దాతలు?**

- కిడ్నీ.................. 13,476
- కాలేయం.......... 4,901
- గుండె............... 253
- ఊపిరితిత్తులు..... 228


**అవయవ దాన రేటు**

అవయవదాన రేటు మాత్రం మనదేశంలో ఇప్పటికీ తక్కువగానే ఉంది. సగటున ప్రతి 10 లక్షల మందికీ ఒకరి కంటే తక్కువే (0.81) దానం చేస్తున్నారు. ఇది స్పెయిన్‌లో అత్యధికంగా 48గా ఉంది.

అవయవ దానం కోసం రిజిస్టర్ చేసుకోవాలనుకుంటే..: notto.abdm.gov.in
టోల్‌ఫ్రీ నంబర్ 1800114770

**తాము చనిపోతూ...**

తాము మరణించి మరొకరికి అవయవ దానం చేసేవారి సంఖ్య ఇటీవలి కాలంలో పెరిగింది. 2023తో పోలిస్తే ఈ సంఖ్య ఏకంగా 16 శాతం పెరగడం విశేషం. 2024లో ఇలాంటివారు అత్యధికంగా (268) తమిళనాడు నుంచి ఉంటే, రెండో స్థానంలో (188) తెలంగాణ ఉంది. ఆంధ్రప్రదేశ్ (66) ఆరో స్థానంలో నిలిచింది.




**మహిళలే ముందువరుసలో..**

మరణానంతరం అవయవ మార్పిడికి పురుషుల కంటే మహిళలే ముందుండటం విశేషం. లెర్నర్ / డ్రైవింగ్ / డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్ అప్లికేషన్ ఫారాల్లో అడిగిన 'నా మరణానంతరం నా శరీరంలోని అవయవాలను దానం చేయడానికి అంగీకరిస్తున్నాను' అనే హామీ ఆధారంగా ఈ సమాచారాన్ని సేకరించారు. దేశంలో 8.9 శాతం పురుషులు ఇందుకు సిద్ధంగా ఉంటే, మహిళల సంఖ్య 9.8 శాతం కావడం విశేషం.

**మొత్తం జరిగిన అవయవదానాలు**

| | |
|---|---|
| 2020 | 7,443 |
| 2021 | 12,259 |
| 2022 | 16,041 |
| 2023 | 18,378 |
| 2024 | 18,811 |



## పోలీసు ఉన్నట్టు.. అంతా కనికట్టు..

ఆదిలాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీస్ శాఖ వినూత్న కార్యక్రమాలను చేపడుతోంది. రవాణా శాఖ అధికారులతో కలిసి ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో వాహనదారులను ఆకట్టుకునేలా ప్రత్యేక కటౌట్లను ఏర్పాటు చేస్తోంది. పోలీస్ అధికారులు అచ్చం పహారా కాస్తున్నట్లు ఉండేలా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని గుడిహత్నూర్, నేరడిగొండ మండలం కుప్టి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కటౌట్లు ఆలోచింపజేస్తున్నాయి.



సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



## 3 నెలల ముచ్చట..

యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండలంలోని చాడ–పిట్టలగూడెం రోడ్డు ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి తెగిపోయింది. వరద తాకిడికి చాడ గ్రామం సమీపంలోని కల్వర్టు పూర్తిగా కొట్టుకుపోయింది. ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ రోడ్డును మూడు నెలల కిందటే నిర్మించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతోనే రోడ్డు తెగిపోయిందని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. రోడ్డు తెగడంతో వరద నీరు వరి చేల నుంచి ప్రవహించింది. దీంతో పొలాల్లో ఇసుక మేట వేసింది.

మోటకొండూర్



## అమ్మ పాలు అమృతం

పెద్దపల్లి జిల్లా కేంద్రంలో స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా సంక్షేమ శాఖాధికారి వేణుగోపాల్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూప.. తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. గర్భిణులకు చీర, సారె అందజేసి సీమంతం జరిపించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రు పాలు పట్టించాలని, ఆరు నెలల వరకు తల్లిపాలే సంపూర్ణ ఆహారమని అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాశన చేశారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

## క్లుప్తంగా...



### పవిత్రోత్సవాలకు శ్రీకారం

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో అర్చకులు సోమవారం పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారం పవిత్రోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఉదయం ఆలయ ముఖ మండపంలో శ్రీస్వామి వారికి ప్రత్యేక తిరుమంజనం నిర్వహించారు. రాత్రి విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మృత్స్యంగ్రహణం, అంకురార్పణ, కుంభస్థాపన, మంత్ర పుష్ప నీరాజనం పూజలు చేపట్టారు. అమ్మవారికి ఉదయం కుంకుమార్చన, రాత్రి సహస్ర నామార్చన చేశారు.

### సిరాజ్‌కు సీఎం అభినందన

సాక్షి, హైదరాబాద్: ఇంగ్లండ్‌తో ఉత్కంఠ భరితంగా సాగిన ఐదో టెస్టులో రెండు ఇన్నింగ్స్‌లో 9 వికెట్లు పడగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డును అందుకున్న మహ్మద్ సిరాజ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. ఇంగ్లండ్ గడ్డపై భారత జట్టు మరపురాని విజయం సాధించడాన్ని 'ఎక్స్' వేదికగా ప్రశంసించారు.

### దక్షిణ మధ్య రైల్వే అదనపు జీఎంగా సత్యప్రకాశ్

సాక్షి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్‌గా ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ ఇంజనీర్స్‌కు చెందిన సత్య ప్రకాశ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆయన ఇక్కడే చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (కన్‌స్ట్రక్షన్)గా పనిచేశారు. ఐఐటీ ఢిల్లీ విద్యార్థి అయిన సత్య ప్రకాశ్‌కు రైల్వేలో 35 ఏళ్ల పాటు వివిధ స్థాయిల్లో పనిచేసిన అనుభవం ఉంది.

## ఇలాగైతే ఎలా?

**పలు అంశాలపై అటవీ అధికారులను నిలదీసిన ఎమ్మెల్యేలు!**

సాక్షి, హైదరాబాద్: అటవీ ప్రాంతాల్లో గిరిజనుల ఆవాసాలున్న చోట్ల బోర్లు వేసేందుకు అటవీశాఖ అధికారులు అనుమతించి, విద్యుత్ కనెక్షన్లకు అనుమతినివ్వకపోతే ఎలా అని ఎమ్మెల్యేలు ప్రశ్నించినట్టు తెలిసింది. సోమవారం సచివాలయంలో జరిగిన రాష్ట్ర వన్యప్రాణి సంరక్షణ బోర్డు సమావేశంలో అధికారుల తీరును ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, వెడ్మా బొజ్జు తదితరులు గట్టిగా ఎండగట్టినట్టు సమాచారం. అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, మురళీనాయక్, రాందాస్ నాయక్, వెడ్మా బొజ్జు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 'కొమురం భీం కన్జర్వేషన్ రిజర్వ్'గా ప్రకటిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేసిన అంశం కూడా చర్చకు వచ్చింది. పెద్దగట్టు ఎత్తిపోతల ప్రాజెక్ట్ (నల్లగొండ)కు నేషనల్ బోర్డ్ ఆఫ్ వైల్డ్‌లైఫ్ ఆమోదం లభించినట్టు అధికారులు తెలిపారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో భారీ వాహనాల కదలికల వల్ల ఏర్పడే ప్రభావాన్ని పరిశీలించేందుకు అధ్యయనం చేపట్టనున్నారు

**వాటికి అభ్యంతరాలెందుకు?**

'అడవులతో ఆదివాసీల జీవితం ముడిపడి ఉంది. వారి అభివృద్ధికి చట్టాలు అడ్డుకారాదు. పోడు భూములకు సరైన సరిహద్దులు గుర్తించాలి. మా ప్రాంతాల్లో రోడ్లు లేకపోతే అభివృద్ధి సాధ్యం కాదు' అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. రిజర్వ్ ఫారెస్ట్‌లోని ఆవాసాలకు విద్యుత్, ఆస్పత్రి వంటి మౌలిక వసతులు కల్పించడానికి అభ్యంతరాలు ఎందుకని అటవీ అధికారులను ఆమె ప్రశ్నించారు. పోడు భూముల సాగుకు అవసరమయ్యే విద్యుత్ కనెక్షన్ల మంజూరును అడ్డుకోవద్దని సూచించారు. పోడు రైతుల అభ్యంతరాలు తెలుసుకునేందుకు జిల్లా ఫారెస్ట్ అధికారులతో భేటీ ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రి ప్రతిపాదనలపై బోర్డు సానుకూలంగా స్పందించింది. ములుగు జిల్లాలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు సమస్యకు పరిష్కారం లభించడం పట్ల మంత్రి సీతక్క హర్షం వ్యక్తంచేశారు.

- కంతనపల్లి, లవ్వాల్, కొండపర్తి, కొడిశెల, ఐలాపురం, పాకాల కొత్తగూడెం–దుబ్బగూడెం వరకు రహదారుల నిర్మాణానికి అనుమతులు, పాకాల కొత్తగూడెంలో 30 పడకల ఆస్పత్రి నిర్మాణానికి క్లియరెన్స్ తాద్వాయి, ఏటూరునాగారం ప్రాంతాల్లో ఎకో టూరిజం అభివృద్ధికి ప్రత్యేక సఫారీ వాహనాల కేటాయింపుపై నిర్ణయం తీసుకున్నారు.



బోర్డు సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, సీతక్క

## కైలాస్‌కు రాష్ట్రపతి ఆహ్వానం



ఆదిలాబాద్ రూరల్: ఆదిలాబాద్ జిల్లా మావల మండలం వాఘాపూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు తొడసం కైలాస్ దంపతులను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విందుకు ఆహ్వానించారు. ఈ మేరకు రాష్ట్రపతి కార్యాలయం నుంచి వచ్చిన ఆహ్వాన పత్రాన్ని పోస్టల్ అధికారులు సోమవారం ఆయన ఇంటికి వెళ్లి అందజేశారు. గల్లీ నుంచి ఢిల్లీ స్థాయికి తమ గ్రామం పేరు, మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ నోట వినిపించారని గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కైలాస్ దంపతులను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అంతరించిపోతున్న గోండు, కొలామి భాషల పరిరక్షణకు తొడసం కైలాస్ కృషి చేస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను ఉపయోగించి రోబోటిక్ టెక్నాలజీ కంప్యూటర్ ద్వారా యాంకర్‌ను తయారు చేసి గోండు భాషలో వార్తలు చదివిస్తున్నారు.

## 'హౌసింగ్'లో ఆక్రమణల కూల్చివేతకు హైడ్రా!

- లీజు స్థలాల పర్యవేక్షణకు హెచ్‌ఎండీఏ తరహా విభాగం
- రాష్ట్ర ప్రభుత్వానికి బోర్డు ప్రతిపాదన

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గృహనిర్మాణ మండలి (హౌసింగ్ బోర్డు)కి చెందిన లీజు స్థలాల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేత, లీజు గడువు ముగిసినా ఖాళీ చేయని ప్రైవేటు భవనాల తొలగింపు బాధ్యతను హైడ్రాకు అప్పగించే యోచనలో ప్రభుత్వం ఉంది. ప్రస్తుతం ఆ బాధ్యతను గృహనిర్మాణ మండలే చూసుకుంటోంది. కానీ మండలికి రాష్ట్రవ్యాప్తంగా కేవలం 34 మంది సొంత సిబ్బందే ఉన్నారు. కూల్చివేతలు, లీజు స్థలాలను ఖాళీ చేయించడానికి ప్రత్యేకంగా సిబ్బంది లేరు. దీంతో అన్ని విభాగాల సిబ్బంది పనులకు వెళ్లాల్సి వస్తోంది. వారంతా సాధారణ ఉద్యోగులే కావడంతో లీజుదారులు వారిని ఖాతరు చేయట్లేదు. వారం క్రితం మెహిదీపట్నంలో హౌసింగ్ బోర్డుకు చెందిన స్థలంలో ఉన్న ఫంక్షన్ హాలు లీజు గడువు ముగియడంతో దాన్ని ఖాళీ చేయించేందుకు వెళ్లిన బృందంలో అసిస్టెంట్ ఎస్టేట్ ఆఫీసర్ ప్రైవేటు వ్యక్తులతో జరిగిన వాగ్వాదంతో గుండెపోటుకు గురై అక్కడికక్కడే మరణించారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన గృహనిర్మాణ మండలి సిబ్బంది, ఇకపై అలాంటి స్థలాలను ఖాళీ చేయించే విధుల్లో తాము ఉండబోమని ప్రభుత్వానికి తేల్చిచెప్పారు. ప్రభుత్వానికి ప్రత్యామ్నాయ విధానాలను ప్రతిపాదించారు. ఈ సందర్భంగా హైడ్రాకు బాధ్యతలు అప్పగింత తెరపైకి వచ్చింది.

**పర్యవేక్షణకు హెచ్‌ఎండీఏ తరహా విభాగం..**

తెలంగాణ హౌసింగ్ బోర్డుకు సంబంధించిన దాదాపు 100 ఎకరాలు లీజుల్లో ఉండగా వాటికి సంబంధించి సుమారు రూ. 100 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. చాలా మంది లీజుదారులు బకాయిలు చెల్లించట్లేదు. అలాగే గడువు ముగిసినా స్థలాలను ఖాళీ చేయట్లేదు. దీంతో ఇప్పుడు ఆ వ్యవహారాలను పర్యవేక్షించేందుకు హెచ్‌ఎండీఏ తరహాలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని బోర్డు ప్రభుత్వానికి ప్రతిపాదించింది. లీజు స్థలాల వ్యవహారాలను ఈ విభాగం పర్యవేక్షించి స్థలాలను ఖాళీ చేయించడం, నిర్మాణాలను కూల్చడం లాంటి పనులను హైడ్రాకు అప్పగించాలన్నది యోచన. దీనిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

మధ్యాహ్న భోజనం లేక ఇంటికి వెళ్తున్న విద్యార్థులు



## కార్మికులు సమ్మెలో.. పిల్లలు పస్తుల్లో..

పెండింగ్‌లో ఉన్న బిల్లులు, గౌరవ వేతనాలను చెల్లించాలనే డిమాండ్‌తో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు నిరవధిక సమ్మెకు దిగడంతో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిలిచిపోయింది. ముందస్తు సమాచారంతో కొంతమంది విద్యార్థులు ఇంటి నుంచి టిఫిన్లు తెచ్చుకున్నారు. అది సరిపోకపోవడంతో.. సగం కడుపుతో ఆకలితో గడుపాల్సి వచ్చింది. చాలా మంది విద్యార్థులు విషయం తెలియక.. బడికి వచ్చి మధ్యాహ్న సమయంలో కిలోమీటర్ల దూరంలో ఉన్న తమ ఇళ్లకు ఇబ్బంది పడుతూ వెళ్లాల్సి వచ్చింది.



సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

## విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తున్నాం..

**స్టీలు పాత్రల్లో వంటావార్పు కార్యక్రమం ప్రారంభోత్సవంలో మంత్రి అడ్లూరి**


సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తోందని, ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో విద్యాప్రమాణాలు పెంచేందుకు అనేక సంస్కరణలు చేపట్టిందని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. కరీంనగర్ జిల్లా అలుగునూరులోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో స్టీలు పాత్రల్లో వంటావార్పు కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. పాఠశాలలో వంటకు కావాల్సిన స్టీలు పాత్రలను అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని 700 గురుకులాల్లో స్టీలు పాత్రల్లో వంట చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. విద్యార్థుల, సంక్షేమం ఆరోగ్యం, బలవర్ధక ఆహారం నాణ్యమైన విద్యలే లక్ష్యంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని లక్ష్మణ్ చెప్పారు. పాఠశాలలలో బోధనా సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి సూచించారు. స్టీల్ పాత్రల్లో వంటావార్పు విధానాన్ని కరీంనగర్‌లో ప్రారంభించామని, 3 నెలల్లో రాష్ట్రంలోని అన్ని గురుకులాల్లో అమలు చేస్తామని వర్షిణి తెలిపారు. అలుగునూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు పలు రంగాల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రశంసించారు. విద్యా వాహిని యూట్యూబ్ చానల్ ద్వారా మరిన్ని మంచి కార్యక్రమాలు నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో భోజనం చేస్తున్న మంత్రి అడ్లూరి, సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణి

## ఐటీ రిటర్న్‌లంటూ సైబర్ మోసాలు

- నకిలీ వెబ్ లింకులు పంపి ఖాతాల్లోని సొమ్ము కొట్టేస్తున్న నేరగాళ్లు.. జూలైలో రాష్ట్రవ్యాప్తంగా 78 కేసులు నమోదు



సాక్షి, హైదరాబాద్: 'మీరు సమర్పించిన రూ. 20 వేల ఐటీ రిటర్న్‌లను ఆమోదించాం. ఈ మొత్తం మీ బ్యాంక్ ఖాతాలకు జమ చేస్తాం. వివరాలను నిర్ధారించడానికి మేం పంపిన లింక్‌పై క్లిక్ చేయండి' అంటూ వేణుగోపాల్ అనే ఉద్యోగికి ఈ–మెయిల్ వచ్చింది. అది ఆదాయపన్ను శాఖ నుంచి వచ్చిందనుకున్న అతను వెబ్‌లింక్‌పై క్లిక్ చేయడంతో ఫోన్ మొత్తం సైబర్ నేరగాళ్ల అధీనంలోకి వెళ్లిపోయింది. నిమిషాల వ్యవధిలోనే అతని బ్యాంకు ఖాతాలోని డబ్బంతా ఖాళీ అయింది. ఇలా ఐటీ రిటర్న్‌ల రీఫండ్ పేరిట సైబర్ మోసాలు పెరుగుతున్నాయని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) అధికారులు అప్రమత్తం చేశారు. సాధారణ ఎస్‌ఎంఎస్‌లలో, వాట్సాప్ మెసేజ్‌లలో, ఈ–మెయిల్స్‌లో ఇలాంటి ఫిషింగ్ లింక్‌లు పెట్టి పంపుతున్నారని, ఐటీ పేరిట వచ్చే మెసేజ్‌ల విషయంలో జాగ్రత్త వహించాలని సూచించింది. అనుమానాస్పద లింక్‌లపై ఎట్టిపరిస్థితుల్లోనూ క్లిక్ చేయొద్దని హెచ్చరించింది. రాష్ట్రవ్యాప్తంగా జూలైలో ఈ తరహా 78 కేసులు నమోదైనట్లు తెలిపింది.

**ఐటీఆర్ రీఫండ్ స్కామ్ నుంచి ఎలా రక్షించుకోవాలి?**

- మీకు వచ్చిన ఈ–మెయిల్ చిరునామాను జాగ్రత్తగా తనిఖీ చేయాలి. ఆదాయపు పన్ను శాఖ అధికారిక ఈ–మెయిల్ ద్వారా మాత్రమే మిమ్మల్ని సంప్రదిస్తుందని మరవొద్దు. అది కాకుండా ఏ ఇతర ఈ–మెయిల్ నుంచి ఈ తరహా మెసేజ్‌లు వచ్చినా అది సైబర్ మోసమని గ్రహించాలి.
- ఈ–మెయిల్ ఐడీలో కొద్దిపాటి తేడాలతో ప్రజల్ని బురిడీ కొట్టించేందుకు నేరగాళ్లు ప్రయత్నిస్తారని మరవొద్దు. ఉదాహరణకు, ITR. help desk@incometax.gov.inకు బదులుగా ITR. helpdesk @incommetax. gov.inను (ఎం అనే అక్షరం అదనంగా వాడారు) ఉపయోగించవచ్చు.
- లింక్‌పై క్లిక్ చేశాక తర్వాత మీ బ్యాంకు ఖాతాలు, వ్యక్తిగత వివరాలడిగితే మోసంగా గుర్తించాలి.
- అనుమానాస్పద వెబ్‌లింక్‌లపై క్లిక్ చేసి ఎలాంటి యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవద్దు.

**మోసపోతే ఏం చేయాలి?**

- ఒకవేళ మీరు ఐటీ రిటర్న్‌ల పేరిట సైబర్ మోసానికి గురైతే వెంటనే అనుమానాస్పద ఈ–మెయిల్ లేదా నకిలీ వెబ్‌సైట్ యూఆర్‌ఎల్‌లను ebmanager@incometax.gov.inకు సమాచారం ఇవ్వాలి.
- ఇతర సహాయం కోసం 1800 103 0025 లేదా 1800 419 0025 నంబర్లలో హెల్ప్‌లైన్‌కు కాల్ చేయవచ్చు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



సాలూరు మండలం కుద్దరాజపేటలో నీరు లేకపోవడంతో ఎండిపోయే స్థితిలో వరినాట్లు



గరుగుబిల్లిలో ఎండిపోయిన వరిపంట

# వర్షించని సాగు

వర్షాలు కురవాల్సిన సమయంలో ఎండలు భగ్గుమంటున్నాయి. చినుకు జాడ కనిపించడం లేదు. ఖరీఫ్ ఆరంభంలో కురిసిన వర్షాలకు వేసిన నాట్లు ఎండిపోతున్నాయి. ప్రాజెక్టుల నుంచి శివారు భూములకు సాగునీరు అందడం లేదు. కొన్నిచోట్ల వర్షం కురుస్తుందన్న ఆశతో రైతులు తడిపొడి నేలలోనే వరినాట్లు పూర్తి చేస్తున్నారు. కాలువలు అధ్వానంగా ఉండడంతో తోటపల్లి ప్రాజెక్టు నుంచి నీరు విడుదలచేసి 16 రోజులు అవుతున్నా పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ పరిధిలోని పొలాలకు చేరలేదు. వర్షాధారంగానే సాగుకు రైతులు ఉపక్రమించారు. ఖరీఫ్ వరినాట్లు వేసే సమయం సగం గడిచినా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టామని, నష్టం తప్పేలా లేదంటూ ఎండుతున్న పొలాలను చూసి కన్నీరుపెడుతున్నారు.

- పాలకొండ రూరల్/గరుగుబిల్లి/సాలూరు రూరల్



వర్షం కురవక.. దమ్ములు సాగక ముదురుతున్న వరి నారు



వర్షం కురుస్తుందన్న ఆశతో పాలకొండలో బురదలోనే వరి నాట్లు వేస్తున్న మహిళలు

# పట్టాలెక్కని ట్రంప్ కార్డు!

## పరుగులు తీస్తున్న ఈబీ–5

**అమెరికాలో శాశ్వత నివాసం కోసం ఇస్తున్న ఈబీ-5 వీసా స్థానంలో ట్రంప్ తెస్తానన్న 'గోల్డ్ కార్డ్' నేటికీ పట్టాలెక్కలేదు. కానీ, అమెరికాలో పెట్టుబడులు పెట్టేందుకు భారతీయులు గతంలో ఎన్నడూ లేనంతగా ఆసక్తి చూపుతున్నారు. ఇందుకోసం చేసే ఈబీ-5 దరఖాస్తులు రయ్యిన దూసుకుపోవడమే ఇందుకు నిదర్శనం. గతంలో ఎన్నడూ లేనంతగా మనదేశం నుంచి ఎక్కువ సంఖ్యలో ఈబీ-5 వీసాకు దరఖాస్తులు వెళ్లాయి.**

**- సాక్షి, స్పెషల్ డెస్క్**

డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడు అయ్యాక విద్యార్థి, తాత్కాలిక వర్క్ వీసాలపై నియంత్రణలు కఠినతరం కావటానికి ముందు.. 2024 ఏప్రిల్ నుండే ఈబీ–5 వీసాలకు డిమాండ్ పెరిగినట్లు వాషింగ్టన్‌లోని అమెరికన్ ఇమిగ్రెంట్ ఇన్వెస్టర్ అలయెన్స్ (ఎ.ఐ.ఐ.ఎ.) డేటా చెబుతోంది. 2025 ఆర్థిక సంవత్సరం మొదటి నాలుగు నెలల్లోనే (2024 అక్టోబర్–2025 జనవరి. అమెరికాలో ఆర్థిక సంవత్సరం అక్టోబరు 1న ప్రారంభమై సెప్టెంబరు 30తో ముగుస్తుంది) 1,200 మందికి పైగా భారతీయులు ఈబీ–5 వీసా కోసం ఫామ్ ఐ–526ఈ దరఖాస్తు చేశారు. ఈ సంఖ్య 2023 మొత్తం ఏడాది సంఖ్య కంటే కూడా ఎక్కువ కావడం విశేషం.

### శాశ్వత నివాసానికి హామీ

ఈబీ–5 వీసాకు డిమాండు పెరగటానికి హెచ్1–బి, గ్రీన్ కార్డ్ సహా ఇతర ఇమిగ్రేషన్ కేటగిరీల్లో రికార్డు స్థాయిలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటమూ ఒక కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. పలు అంచనాల ప్రకారం, ప్రస్తుతం యూఎస్‌లో కోటీ 10 లక్షలకు పైగా ఇమిగ్రేషన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో శాశ్వత నివాసానికి ఈబీ–5 వీసా ఒక వేగవంతమైన, నమ్మకమైన హామీగా మారిందని ఇమిగ్రేషన్ అధికారులు అంటున్నారు. ఇన్వెస్ట్ ఇన్ ది యూఎస్ఏ (ఐ.ఐ.యూఎస్ఏ) ఆధ్వర్యంలోని వాషింగ్టన్ ప్రాంతీయ ఇమ్మిగ్రేషన్ కార్యాలయం సమాచారం ప్రకారం 2024 ఆర్థిక సంవత్సరంలో (2023 అక్టోబర్ –2024 సెప్టెంబర్) భారతీయులకు 1,428 ఈబీ–5 వీసాలు జారీ అయ్యాయి. 2023లో ఈ సంఖ్య 815 మాత్రమే.



### అమెరికాలో పెట్టుబడులకు భారతీయుల ఆసక్తి

### ఈబీ-5 వీసా దరఖాస్తుల్లో భారీ పెరుగుదల

### దీన్ని రద్దు చేసే ఎత్తుగడతోనే 'ట్రంప్ కార్డు'

**ప్రాంతాన్ని బట్టి పైకం**

1992 నుంచి అమెరికా ఈబీ–5 వీసాలను ఇవ్వటం ప్రారంభించింది. అమెరికన్లకు ఉద్యోగాల సృష్టి కోసం వీటిని సృష్టించారు. అమెరికాలోని గ్రామీణ ప్రాంతం లేదా నిరుద్యోగులు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో (టార్గెటెడ్ ఎంప్లాయ్‌మెంట్ ఏరియా - టి.ఇ.ఎ.) 8 లక్షల డాలర్లు (సుమారు రూ. 6.88 కోట్లు), తక్కిన ప్రాంతాల్లో కనీసం 10.50 లక్షల డాలర్లు (సుమారు రూ. 9 కోట్లు) పెట్టుబడి పెట్టే వలసదారులకు ఈబీ–5 వీసా (గ్రీన్ కార్డులు) ఇస్తారు. ఈ వీసా ఉంటే.. పెట్టుబడి పెట్టేవాళ్లు, వారి జీవిత భాగస్వామి, 21 ఏళ్లలోపు ఉండే వారి పెళ్లికాని పిల్లలకు అమెరికాలో ఉండేందుకు అనుమతి ఉంటుంది. త్వరలో వీటిని.. ట్రంప్ ప్రకటించిన గోల్డ్ కార్డులతో భర్తీ చేస్తారు.

### అమెరికాలో నుంచే దరఖాస్తు

హెచ్–1బి వీసాలపై ఉన్న విద్యార్థులు, పని చేసే సామర్థ్యం ఉన్న వ్యక్తులు తమ దేశానికి వెళ్లకుండానే ఈబీ–5ను అమెరికాలోనే దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం యూఎస్‌లో హెచ్–1బి లేదా విద్యార్థి వీసా వంటి వలసేతర హోదాలపై ఉన్న భారతీయ పౌరులు, కొత్త నిబంధనల ప్రకారం ఐ–526ఈ ఫారం దాఖలు చేసిన సమయం నుండి 3–6 నెలల్లోపు వర్క్, ట్రావెల్ పర్మిట్లను పొందటం ద్వారా ప్రయోజనం పొందుతారు. ఈ పర్మిట్ సాధారణంగా వారి ఈబీ–5 గ్రీన్ కార్డ్ ఆమోదం పొందేవరకు చెల్లుబాటులో ఉంటుంది.


### ఈబీ-5 వీసా

- కనీస పెట్టుబడి టి.ఇ.ఎ.లకు రూ. 6.88 కోట్లు, నాన్-టి.ఇ.ఎ.లకు రూ.9 కోట్లు
- కనీసం 10 ఫుల్ టైమ్ ఉద్యోగాల కల్పన జరగాలి
- 2027 వరకు చట్టబద్ధమైన భరోసా
- యూఎస్‌లో ఉన్న భారతీయులు అక్కడి నుండే దరఖాస్తు చేసుకోవచ్చు

### ట్రంప్ గోల్డ్ కార్డు

రూ. **43.5** కోట్లు నేరుగా ప్రభుత్వానికి చెల్లించాలి.

విధి విధానాలు ఖరారు కాలేదు. చట్టం రూపొందలేదు.




# మూడు దశల్లో హర్ ఘర్ తిరంగ ప్రచారం

## నోడల్ అధికారిగా మల్లికార్జున రావు

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో మూడు దశల్లో హర్ ఘర్ తిరంగ ప్రచారం జరగనుంది. ఈ ప్రచారానికి రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర నోడల్ అధికారిగా భాష, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లికార్జున రావు నియమితులయ్యారు. సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ) ముఖ్యకార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆగస్టు 15న దేశ వ్యాప్తంగా ఇళ్ళు, కార్యాలయాలు, సంస్థలు, ప్రజా ప్రదేశాలలో జాతీయ జెండాను ఆవిష్కరించేందుకు తొలి దశలో ఈ నెల 2వ తేదీ నుంచి ఈ నెల 8 వరకు, రెండో దశలో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు, మూడో దశలో ఈ నెల 13 నుంచి 15 వరకు హర్ ఘర్ తిరంగ -2025 ప్రచారాన్ని జరపాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ఆధ్వర్యంలో 2022లో హర్ ఘర్ తిరంగ ప్రచారాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఇందుకు అనుగుణంగా రాష్ట్రాలకు సూచనలు చేసింది.

# రూ.లక్ష కోట్లతో రెండేళ్లలో జాతీయ రహదారులు పూర్తి

## మంత్రి బి.సి.జనార్దన్ రెడ్డి

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో రానున్న రెండేళ్లలో రూ.లక్ష కోట్లతో జాతీయ రహదారుల నిర్మాణాల పనులను పూర్తి చేస్తామని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బి.సి.జనార్దన్ రెడ్డి తెలిపారు. సోమవారం సచివాలయంలో మీడియాతో మంత్రి మాట్లాడుతూ ఇటీవల నితిన్ గడ్కరీతో జరిగిన సమావేశంలో రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న పనులకు అదనంగా మరో రూ.లక్ష కోట్ల విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో రూ.70 వేల కోట్లు పనులు జరుగుతున్నాయన్నారు. వాటికి సంబంధించిన భూసేకరణ, అటవీ క్లియరెన్సుల్లో 80 శాతం మేర టాస్క్‌ఫోర్స్ కమిటీ ఇప్పటికే పరిష్కరించిందన్నారు. 9 జాతీయ రహదారుల విస్తరణ ప్రాజెక్టులను కేంద్రం ప్రకటించిందని తెలిపారు. వీటికి సంబంధించి డీపీఆర్‌లను త్వరలో కేంద్రానికి సమర్పిస్తామన్నారు.

# టెక్కలిలో ఐఎంఎల్ కొత్త డిపో వద్దు

## ముఖ్యమంత్రికి సీపీఎం లేఖ

**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బెవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్ శ్రీకాకుళం (ఎచ్చెర్ల) ఐఎంఎల్ డిపోను విడదీసి టెక్కలిలో ప్రైవేటుగా కొత్త డిపో ఏర్పాటు కోసం ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ విషయమై సీఎం చంద్రబాబుకు రాసిన లేఖను శ్రీనివాసరావు సోమవారం మీడియాకు విడుదల చేశారు. దీనివలన గోడౌన్‌కు ప్రతీనెల అద్దె చెల్లింపు, అదనపు సిబ్బంది నియామకం ద్వారా ప్రభుత్వంపై అదనపు భారం పడుతుందన్నారు. దీనికితోడు ఎచ్చెర్ల డిపోపై ఆధారపడిన 80 దళిత, పేద కటుంబాలకు చెందిన హమాలీలు ఆదాయం లేక ఆర్థిక ఇబ్బందులతో రోడ్డున పడతారని శ్రీనివాసరావు వివరించారు.

# ఆరోగ్య అస్థి.. నిజమైన ఆస్తి!

మనిషి ఏ పని చేయాలన్నా శరీరంలోని ఎముకలు పటిష్టంగా ఉండాలి. ఆధునిక జీవన శైలి వల్ల ఆర్థోపెడిక్ సమస్యల బారిన పడుతున్న వారి సంఖ్య ఏటా పెరిగిపోతోంది. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇండియన్ ఆర్థోపెడిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2012 నుంచి ప్రతి ఏడాది ఆగస్టు 4న దేశంలో 'బోన్ అండ్ జాయింట్ డే'ను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న కథనం.

- ఏటికేడు పెరుగుతున్న ఆర్థోపెడిక్ సమస్యలు
- సమతుల ఆహారం, వ్యాయామంతో మేలు
- మారిన జీవనశైలితో యువతలోనూ కీళ్ల సమస్యలు అందుబాటులో అత్యాధునిక వైద్య సేవలు నేడు 'బోన్ అండ్ జాయింట్ డే'



**గుంటూరు మెడికల్ :** గుంటూరుకు చెందిన రోహిత్ పదో తరగతి చదువుతున్నాడు. ఇటీవల ఆటలాడుతూ కింద పడటంతో చెయ్యి విరిగింది. తల్లిదండ్రులు ఆర్థోపెడిక్ వైద్యుల వద్దకు తీసుకెళ్లారు. ఏసీ తరగతి గదుల్లో ఉండటం, చదువుల ఒత్తిడిలో సమతుల ఆహారం కూడా తీసుకోకపోవడం, ముఖ్యంగా క్యాల్షియం సరిపడా ఉంటే ఫుడ్ తీసుకోకపోవడం వల్లే కొద్దిపాటి దెబ్బలకే ఎముకలు విరిగిపోతున్నాయని వెల్లడించారు.

**సమస్యలకు కారణాలివీ....**

ఆధునిక జీవన శైలి వల్ల ఎక్కువ మంది ఏసీలకే పరిమితమై కొంతసేపు కూడా సూర్యరశ్మి సోకకుండా గదుల్లోనే ఉండిపోతున్నారు. దీంతో విటమిన్ 'డి' లోపంతో ఎముకల పటుత్వం తగ్గిపోతోంది. ఫాస్ట్‌ఫుడ్స్ ఎక్కువగా తీసుకోవడం, వ్యాయామం చేయకపోవడం వల్ల కూడా ఊబకాయం పెరిగిపోయి ఆర్థోపెడిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. వయస్సు పైబడిన వారు సహజసిద్ధంగా తమ శరీరంలో తగ్గిపోయే కాల్షియాన్ని తిరిగి భర్తీ చేసుకోవడం లేదు. ఇదీ ఆర్థోపెడిక్ సమస్యలకు కారణం అవుతోంది. స్మోకింగ్ వల్ల కూడా కాల్షియం స్థాయి పెరగకుండా ఎముకల అరుగుదల జరుగుతుంది. జిల్లా వ్యాప్తంగా ఆర్థోపెడిక్ సర్జన్లు 350 మంది ఉన్నారు. రోజూ ఒక్కో వైద్యుడి వద్దకు 50 మంది పలు సమస్యలతో చికిత్స పొందుతున్నారు.

### జీజీహెచ్‌లో ఉచితంగా వైద్యం



గుంటూరు జీజీహెచ్‌లో ఆర్థోపెడిక్ సమస్యలకు రోజూ ఓపీ విభాగంలో ఉచిత సేవలు అందిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి క్యాజువాలిటీలో 24 గంటలూ వైద్యులు అందుబాటులో ఉండి, ఎమర్జన్సీ ఓటీలో ఆపరేషన్లు చేస్తున్నారు. రోజూ 300 మంది ఓపీ విభాగంలో వైద్య సేవలు పొందుతున్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ఆధునిక వసతులు సాధారణ, ఎమర్జెన్సీ ఆపరేషన్లు పదికిపైగా నిత్యం చేస్తున్నారు.

– డాక్టర్ యశస్వి రమణ, సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్, సూపరింటెండెంట్

# 'ఆర్టీఈ అడ్మిషన్ల'తో సర్కారు ఆటలు!

## ఫీజుల ఖరారులో తీవ్ర జాప్యం

- ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత అడ్మిషన్లు ఇవ్వకపోయినా చోద్యం
- పాఠశాలలు ప్రారంభమైన రెండు నెలలకు మూడో విడత అడ్మిషన్లకు శ్రీకారం
- స్కూళ్ల పరిధిని 3 నుంచి 5 కిలో మీటర్లకు పెంపు
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు




**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో నిర్బంధ ఉచిత విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ) కింద ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులతో చంద్రబాబు ప్రభుత్వం ఆటలాడుతోంది. సకాలంలో ఒక్క నిర్ణయం తీసుకోకుండా పేద పిల్లలకు తీవ్ర అన్యాయం చేస్తోంది. ఇప్పటికే ఫీజుల ఖరారులో తీవ్ర జాప్యం చేసింది. ఆ సాకుతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఆర్టీఈ కింద అడ్మిషన్లు నిరాకరించినా చోద్యం చూస్తోంది. ప్రభుత్వ వైఖరిపై విమర్శలు వెల్లువెత్తడంతో మరోసారి ఆర్టీఈ కింద అడ్మిషన్ల పేరుతో కొత్త నాటానికి తెరతీసింది. ఐదు కిలో మీటర్ల పరిధిలో ఉన్న స్కూళ్లలో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సోమవారం నోటిఫికేషన్ ఇచ్చింది. జూన్‌లోనే పూర్తవ్వాల్సిన అడ్మిషన్ల ప్రక్రియను ఆగస్టులోనూ కొనసాగించడం గమనార్హం.

### నష్టం జరిగాక తీరిగ్గా ఫీజుల నిర్ణయం

ఆర్టీఈ చట్టం–2009 కింద ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించాలి. ఈ మేరకు సమగ్ర శిక్ష రాష్ట్ర విభాగం ప్రతి విద్యా సంవత్సరం మే నెలలో నోటిఫికేషన్ ద్వారా ఒకటో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరిస్తుంది. అర్హత గల విద్యార్థులకు లాటరీ పద్ధతిలో సీట్లు కేటాయిస్తుంది. గత మూడు విద్యా సంవత్సరాలు సక్రమంగా జరిగిన ఈ ప్రక్రియ 2025–26లో మాత్రం ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అస్తవ్యస్తంగా మారింది. ఈ ఏడాది మే, జూన్ నెలల్లో రెండు విడతల్లో 31,701 మంది పిల్లలకు ప్రైవేట్ స్కూళ్లలో ఒకటో తరగతిలో సీట్లు కేటాయించారు. అయితే, ప్రభుత్వం చెల్లించే ఫీజులను సకాలంలో ఖరారు చేయలేదు. దీంతో ఆయా స్కూళ్ల యాజమాన్యాలు ఆర్టీఈ కింద అడ్మిషన్లు ఇచ్చేది లేదని తేల్చి చెప్పాయి. పాఠశాలలు ప్రారంభమై నెల గడిచిపోవడంతో జూలైలో కొందరు పూర్తి ఫీజు చెల్లించి అడ్మిషన్లు తీసుకున్నారు. ఆ తర్వాత తీరిగ్గా ప్రభుత్వం జూలై 24వ తేదీన ఫీజులు ఖరారు చేసింది. అప్పటికే విద్యార్థులకు నష్టం జరిగిపోయింది. మొత్తంమీద 31,701 మందిలో సగం మందే ఆర్టీఈ కింద సీట్లు పొందినట్లు సమాచారం.

### ఇప్పుడు అడ్మిషన్లు ఇస్తాం.. ఫీజు కట్టుకోండి..

ఇప్పటి వరకు ఆర్టీఈ కింద సీట్లు పొందేందుకు విద్యార్థుల ఇళ్లకు 3 కి.మీ. పరిధిలోని ప్రైవేటు స్కూళ్లకే అవకాశం ఉంది. ఆ పరిధిని 5 కి.మీ. వరకు పొడిగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఐదు కిలో మీటర్ల పరిధిలోని ప్రైవేటు స్కూళ్లల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు ఆసక్తి చూపేవారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఇప్పుడు ఆర్టీఈ కింద సీట్లు పొందేవారు ఫీజును స్వయంగా చెల్లించుకుంటామని రాసివ్వాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. వాస్తవానికి పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు కావొస్తోంది. ఈ నెల 11వ తేదీ నుంచి ఎఫ్ఏ–1 పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం ఇంకా ఆర్టీఈ ప్రవేశాలను పూర్తి చేయలేకపోవడం విడ్డూరంగా ఉందని విద్యావేత్తలు విమర్శిస్తున్నారు.

# చందన స్వరూపునికి సంపెంగ సుగంధం

- సింహగిరి సంపెంగల విశిష్టతే వేరు...
- ఏటా జూలై, ఆగస్టు నెలల్లో విరివిగా సింహగిరి సంపెంగలు



**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సంపెంగ పుష్పాలంటే ఎంతో ప్రీతి. భక్తసులభుడైన ఆయనకు ఎన్ని రకాల పుష్పాలతో పూజచేసినా...సంపెంగ పుష్పాలతో చేసిన పూజసాటి రాదంటారు. సంపెంగపూలతో పూజ చేస్తే ఆయన ఎంతగానో పరవశించిపోతాడు. సాక్షాత్తూ ఆయన వెలసిన సింహాచలం క్షేత్రంలోనే సంపెంగ పూలు కూడా విరివిగా లభిస్తుంటాయి. ఎన్నిచోట్ల సంపెంగలు లభించినా సింహగిరిపైన లభించే సంపెంగకి ఎంతో విశిష్టత ఉందని అభివర్ణిస్తుంటారు.



తెల్ల సంపెంగ



పసుపు, కాషాయరంగులో సంపెంగలు

సింహాచలం కొండపైన, కొండ దిగువన ఉన్న పూలతోటలో, దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురం గోశాలలో సంపెంగ చెట్లు ఉన్నాయి. ముఖ్యంగా తెలుపు, పసుపు రంగుల సంపెంగ పూల చెట్లు కనువిందు చేస్తుంటాయి. ఈ పుష్పాల నుంచి వెలువడే సువాసనలు ఎంత దూరంలో ఉన్నా ఆకట్టుకుంటాయి. చందన స్వరూపుడైన సింహాచలేశుడు ఏడాది పొడవునా చందనం పరిమళాలను ఆస్వాదిస్తాడు. ఆ చందనం పరిమళాలకు సమానంగా సంపెంగ పరిమళాలను మాత్రమే స్వామి ఆస్వాదిస్తుంటాడని భక్తులు పేర్కొంటారు. సంపెంగ పూలతో స్వామికి ఉన్న బంధం విడదీయరానిదిగా చెబుతారు.



రాజగోపురానికి సమీపంలోని తెల్లసంపెంగ చెట్టు

### శ్రీకాంత కృష్ణమాచార్యులు-సంపెంగ బంధం

తొలి తెలుగు వాగ్గేయకారుడిగా ప్రసిద్ధి చెందిన శ్రీకాంత కృష్ణమాచార్యులు (కృష్ణమయ్య), తిరుమల అన్నమాచార్యుల వలె సింహాచలంలో విశేష కీర్తి ప్రతిష్టలు పొందారు. సింహాచలేశుడిపై ఆయన చాతుర్లక్ష వచన సంకీర్తనలు రచించారని, ఆయన కీర్తిస్తుంటే స్వయంగా స్వామి నృత్యం చేసేవాడని చెబుతారు. కృష్ణమయ్య ప్రతిభను గుర్తించిన ఓరుగల్లు సామ్రాజ్యాధినేత ప్రతాప రుద్రుడు కృష్ణమయ్య దంపతులను తన రాజ్యానికి ఆహ్వానించాడు. అక్కడ రాజమర్యాదలు అందుకున్నప్పటికీ, కృష్ణమయ్య భార్యకు సంతృప్తి కలగలేదు. సింహాచలంలో స్వామిని సంపెంగ పూలతో కొలిచేదానినని, తనకు సంపెంగ పూలు తప్ప మరేమీ వద్దని ఆమె చక్రవర్తిని కోరింది. దీంతో ప్రతాపరుద్రుడు రాజభటులను సింహాచలం పంపి సంపెంగ పుష్పాలను తెప్పించాడని దివంగత నాటక రచయిత విరియాల లక్ష్మీపతి తన నాటకంలో అభివర్ణించారు.

### సంపెంగల సంరక్షణ, వినియోగం

సంపెంగ పుష్పాలను ఎక్కువ రోజులు నిల్వ ఉంచడానికి కొన్ని పద్ధతులున్నాయి. గాజు సీసాలో పువ్వులు వేసి, మంచి నీటితో నింపి, గాలి చొరబడకుండా సీల్ చేస్తే చాలా ఏళ్లు తాజాగా ఉంటాయని చెబుతారు. వీటిని ఇంట్లో అలంకారంగా కూడా ఉపయోగిస్తారు. సంపెంగ పుష్పాలు ముఖ్యంగా జూలై, ఆగస్టు నెలల్లో పెద్ద మొత్తంలో లభిస్తాయి. వర్షాలు ఎక్కువగా పడితే పువ్వుల పరిమాణం కూడా పెద్దదిగా ఉంటుందని అంటారు. సింహగిరికి వచ్చే భక్తులు స్వామికి సంపెంగ పుష్పాలు సమర్పించి, ప్రసాదంగా వాటిని తీసుకునేందుకు పోటీ పడతారు. స్వామికి సమర్పించిన తర్వాత ఆ పుష్పాలను తమ శిరస్సుల్లో ధరించడానికి ఆసక్తి చూపుతారు.

### ఒడిశా భక్తుడు లక్ష్మీకాంత్ నాయిక్ దాస్ సేవలు

ఏటా మూడు నెలల పాటు సింహగిరిపై ఉండి శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి సేవలందించే ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్ నాయక్ దాస్, ఆ కాలంలో స్వామికి పెద్ద మొత్తంలో సంపెంగ పుష్పాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఆయన వస్తున్నారంటే సంపెంగలు వెంట తీసుకొస్తున్నారని నానుడి ఉంది.

### సంపెంగ వ్యాపారం, స్వర్ణ పుష్పార్చన

సింహగిరిపై చిరు వ్యాపారులు సంపెంగ పుష్పాలను విడిగా, దండల రూపంలో విక్రయిస్తుంటారు. డిమాండ్ ఉన్న రోజుల్లో డజను పువ్వులు అరవై రూపాయల వరకు కూడా అమ్ముడవుతాయి. ఒక దాత సింహగిరిపై లభించిన 108 సంపెంగ పుష్పాలను అమెరికా తీసుకెళ్లి బంగారంలో ముంచి స్వర్ణ సంపెంగ పుష్పాలుగా మార్చి, సుమారు ఇరవై ఏళ్ల క్రితం సింహాచలేశుడికి కానుకగా సమర్పించారు. ఆ పుష్పాలతోనే 2019 వరకు స్వామికి ప్రతి గురువారం, ఆదివారం రోజుల్లో స్వర్ణపుష్పార్చన జరిగేది. ఆ తర్వాత కొత్తగా దాతల సహకారంతో మరిన్ని స్వర్ణపుష్పాలను అందుబాటులోకి తెచ్చారు.

### అంతరించిపోతున్న సంపెంగలు

ఒకప్పుడు సింహగిరి కొండల్లో వేలాదిగా సంపెంగ చెట్లు ఉండేవని, రానురాను అవి అంతరించిపోతున్నాయని పలువురు చెబుతున్నారు. దేవస్థానం అధికారులు సంపెంగ చెట్ల పెంపకాన్ని ఎక్కువగా చేపట్టాలని పలువురు సూచిస్తున్నారు.

# తుమ్ములు కుమ్మేస్తున్నాయా?

# వాచ్ ది హాచ్చ్!



**తరచుగా తుమ్ములు రావడం, ఛాతీ అంతా నొక్కేసినట్టుగా అనిపించడం చాలామంది ఎదుర్కొనే సమస్య. సాధారణంగా అలెర్జీలు, జలుబు వంటివి వచ్చినప్పుడు తుమ్ములు ఓ లక్షణంగా కనిపిస్తుంటాయి. కొన్నిసార్లు తుమ్ములు చాలా మామూలు విషయమే గానీ... మరికొన్నిసార్లు అవి మరింత తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు ఓ సూచన కావచ్చు. ఈ నేపథ్యంలో తరచూ కనిపించే తుమ్ములు ఎందువల్ల వస్తాయో, ఏయే సమయాల్లో అవి తీవ్రమైన సమస్యలకు సూచికగా ఉంటాయో అలాంటప్పుడు అవసరమైన సాధారణ ఇంటి చిట్కాలు మొదలుకొని... పెద్ద సమస్యలకు అవసరమైన చికిత్సలేమిటన్న అనేక అంశాలపై అవగాహన కలిగించే కథనమిది...**

ఆవలింతకు అన్న ఉన్నాడుగానీ... తుమ్ముకు తమ్ముడు లేడని ఓ వాడకమాట. అంటే ఒకరు ఆవలించగానే మరొకరికి ఆవలింత వస్తుంది... కానీ తుమ్ము అలాకాదు... సోలోగా వస్తుందని అర్థం. తుమ్ము ఎలాంటి ఆరోగ్య సమస్యలను సూచిస్తుందో చూద్దాం...

## తరచూ వచ్చే తుమ్ములకు సాధారణ కారణాలు



అలెర్జీలు, పుప్పొడి, ధూళిలో ఉండే అతి చిన్న డస్ట్‌మైట్స్, పెంపుడు జంతువుల వెంట్రుకలు (పెట్ డ్యాండర్), బూజు వంటివి ఊపిరితిత్తులను ప్రేరేపించి తుమ్ములొచ్చేలా చేస్తాయి.

- **జలుబు అలాగే ఫ్లూ (కామన్ కోల్డ్ అండ్ ఫ్లూజ్వరం)లో :** వైరల్ ఇన్ఫెక్షన్ల కారణంతో ముక్కు కారుతుండే సమయంలో; దగ్గు, గొంతునొప్పి, జ్వరంతో పాటు తుమ్ములూ వస్తుంటాయి.
- **నాన్-అలెర్జిక్ రైనైటిస్:** ఈ సమస్య ఉన్నప్పుడు అలెర్జీని ట్రిగర్ చేసే కారకాలు లేకుండానే వచ్చే తుమ్ములూ, ముక్కు కారడం వంటి లక్షణాలతో ఉంటాయి. వాతావరణంలో మార్పులు, కొన్ని రకాల వాసనలు, మసాలాలు ఇందుకు కారణమవుతుంటాయి.
- **దుమ్ము, ధూళి, వాతావరణ కాలుష్యాలు (డస్ట్ అండ్ పొల్యూషన్) :** వాతావరణంలోని దుమ్ము, పొగ, వాయుకాలుష్యం వంటి అంశాలు ముక్కులోని అతి సున్నితమైన పొరలను ఇరిటేట్ చేయడం ద్వారా తుమ్ములొచ్చేలా చేస్తాయి.
- **బాగా ఘాటుగా ఉండే వాసనలు (స్ట్రాంగ్ సెంట్స్) :** కొన్ని రకాల సెంట్లూ, పెర్‌ఫ్యూమ్‌లూ, శుభ్రం చేయడానికి వాడే సువాసనగల క్లీనింగ్ ఉత్పత్తులు లేదా కొన్ని రకాల రసాయనాల తాలూకు ఘాటు వాసనలు తుమ్ములను తెప్పిస్తాయి.

## తుమ్ములు వచ్చినప్పుడు ఛాతీ బిగదీసుకుపోయినట్టుగా ఉండటానికి కారణాలు



ఛాతీ బిగుసుకుపోయినట్టు అనిపించేలా చేసే ఈ కారణాలన్నీ తుమ్ములతో సంబంధం ఉన్నవే. చాలాసార్లు తుమ్ములు వస్తున్నప్పుడు ఊపిరితిత్తులపై ఒత్తిడి పడుతున్నట్లుగానూ, ఛాతీ బాగా బిగదీసుకుపోయిన ఫీలింగ్ కలుగుతుంటుంది. ఇలా ఏయే సమయాల్లో జరుగుతుందో తెలుసుకుందాం.

- **తరచుగా వచ్చే దగ్గుతో (ఫ్రీక్వెంట్ కాఫ్ వల్ల) :** తుమ్ములతో పాటు తరచూ వచ్చే దగ్గు వల్ల ఛాతీ కండరాలపై ఒత్తిడి పడుతుంది. దాంతో ఛాతీ బిగుసుకుపోయినట్టు అనిపిస్తుంది.
- **అలెర్జిక్ ఆస్తమా :** అలెర్జీ సమస్య ఉన్న కొందరిలో అదేపనిగా తుమ్ములు వస్తుండటంతో పాటు వాళ్ల శ్వాసనాళాలూ, ఊపిరితిత్తుల్లోని గాలి గొట్టాలూ సంకోచించి సన్నబారిపోతుంటాయి. దాంతో గాలి సాఫీగా ప్రవహించడానికీ / ప్రసరించడానికీ తగినంత స్థలం లేకపోవడంతో శ్వాస తీసుకోవడం కష్టంగా మారడం (ఆస్తమా) జరగవచ్చు. ఆ శ్వాసనాళాలన్నీ సన్నబారి ఊపిరితీసుకోవడం కష్టంగా మారడంతో ఛాతీలోనూ బిగుతుగా అనిపిస్తుంది. పిల్లికూతలతో పాటు ఇలా శ్వాస తీసుకోవడం కష్టం కావడాన్నే ఆస్తమాగా పేర్కొంటారు.
- **సైనస్‌తో పెరిగే ఒత్తిడి (సైనస్ ప్రెషర్):** ముఖం ఎముకల మధ్య ఉండే ఖాళీ ప్రదేశాలను సైనస్ అంటారు. తుమ్ములు, జలుబు లేదా అలెర్జీల వల్ల సైనస్‌లలో ఇన్ఫెక్షన్ (అంటే వాపు వచ్చి) ఆ కారణంగా ఛాతీపై పరోక్షంగా ఒత్తిడి పెరగవచ్చు. ఇలా సైనస్‌లలో పేరుకుపోయిన శ్లేష్మం... ఛాతీపై ఒత్తిడిని పెంచుతుంది.
- **కండరాల నొప్పి (మజిల్ స్ట్రెయిన్):** తరచుగా తుమ్మడం వల్ల ఛాతీ కండరాలపై ఒత్తిడి పడుతుండటం వల్ల ఆ కారణంగా నొప్పిగానూ, ఛాతీ బిగుతుగా అనిపించవచ్చు.



డాక్టర్ నేహా బి.ఎల్
సీనియర్ కన్సల్టెంట్ ఈఎన్‌టీ

## తుమ్ముల నివారణ... అందుకు ఉపకరించే ఇంటి చిట్కాలు

**నివారణకు అనుసరించాల్సిన సూచనలు :**

- అలెర్జీకి కారణమయ్యే కారకాల (అలర్జెన్స్)ను గుర్తించడం, వాటికి దూరంగా ఉండటం. (అంటే మనకు ఏ కారణంగా అలెర్జీ వస్తుందో తెలుసుకుని, వాటి నుంచి దూరంగా ఉండటం, అవి ఎదురుకాకుండా చూసుకోవడం; ఇంట్లో అలెర్జెన్స్ లేకుండా ఇంటిని శుభ్రంగా ఉంచుకోవడం; దుమ్మూ ధూళి లేకుండా జాగ్రత్తపడటం; పెంపుడు జంతువులూ, వాటి వెంట్రుకల నుంచి దూరంగా ఉండటం.
- డాక్టర్లు సూచించిన మేరకు అలర్జీలను నివారించే నేసల్ స్ప్రేలు వాడటం లేదా యోగా ప్రక్రియలో కొమ్ముతో ఉండే చిన్న భరిణె లాంటి ఉద్ధరిణి సహాయంతో 'నేతి' అనే యోగప్రక్రియతో ముక్కు రంధ్రాల్ని శుభ్రం చేసుకోవడం (ఈ నేతి ప్రక్రియ కారణంగా ముక్కులోని అలెర్జీ కారకాలు (అలర్జెన్స్). శ్లేష్మం కొట్టుకుపోయి ముక్కు శుభ్రంగా ఉండటంతో అలెర్జీ, ఆస్తమా నివారితమవుతాయి).
- **ఆవిరి పీల్చడం (స్టీమ్ ఇన్‌హెలేషన్) :** వేడినీటి ఆవిరి పీల్చడం వల్ల ముక్కుదిబ్బడ తగ్గడంతో పాటు శ్వాస తేలిగ్గా అందుతుంది.
- **నీరూ, ద్రవపదార్థాలూ ఎక్కువగా తీసుకోవడం (హైడ్రేటెడ్‌గా ఉండటం) :** నీళ్లు ఎక్కువగా తాగుతుండటం వల్ల శ్లేష్మం (స్ఫుటమ్) పల్చబడి అది తేలిగ్గా బయటకు వస్తుంది. (ఈ శ్లేష్మం ఊపిరితిత్తుల్లోనూ, గొంతులోనూ ఇరుక్కుని ఉన్నప్పుడు శ్వాస సరిగా అందకపోవడం, ఊపిరితీసుకోడానికి అది అడ్డుపడటం వల్ల చికాకుగా ఉండటం వంటివి చాలామందికి అనుభవంలోకి వచ్చే విషయమే).

## ఇంటి చిట్కాలు

**తేనె అల్లం కలిపిన పానియాలు :** తేనె (హనీ), జింజర్ (అల్లం) కలిపి చేసుకున్న పానియాల వల్ల గొంతు నొప్పి తగ్గడం, దగ్గు నుండి ఉపశమనం కలగడం వంటి ఫలితాలుంటాయి. తుమ్ములూ తగ్గుతాయి.

- **తగినంత విశ్రాంతితో :** శరీరానికి తగినంత విశ్రాంతి ఇవ్వడం వల్ల వ్యాధి నిరోధక శక్తి మెరుగవ్వడంతో పాటు త్వరగా కోలుకోవచ్చు.
- **పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండటం :** పొగతాగడం, పొగకు ఎక్స్‌పోజ్ అవుతుండటం వల్ల శ్వాసకోశ సమస్యలు మరింత తీవ్రమవుతాయి. ఇక పొగ ఎక్కువగా వస్తున్నచోట ఉంటే ఊపిరి సలపనట్టుగా అనిపిస్తుండటం అందరికీ అనుభవంలోకి వచ్చే విషయమే. అందుకే పొగ అలవాటుకూ, పొగకూ దూరంగా ఉండటం మేలు.

## తుమ్ములతో ఊపిరితిత్తులపై పడే ప్రభావమిలా...

సాధారణంగా తుమ్మడమనే ప్రక్రియ... ముక్కు లేదా శ్వాసనాళాల్లో అడ్డుగా ఉండి చికాకు కలిగించే కొన్ని వ్యర్థాలనూ, కణాలను బలంగా బయటకు పంపడానికి శరీరం అసంకల్పితంగా చేసే ఓ రక్షణాత్మకమైన ప్రక్రియ. అయితే, తరచుగా, అలాగే తీవ్రంగా, అదేపనిగా తుమ్ములు వస్తున్న కొన్ని సందర్భాల్లో అవి ఊపిరితిత్తులపై కొంత ప్రతికూల ప్రభావం చూపవచ్చు.

## ఆస్తమాను ప్రేరేపించడం లేదా తీవ్రతరం చేయడం



**(ట్రిగరింగ్ / వర్సెనింగ్ ఆస్తమా) :** ఆస్తమా సమస్య ఉన్నవారిలో తుమ్ములు ఆస్తమా అటాక్‌ను ప్రేరేపించగలవు... అంటే ట్రిగర్ చేయగలవు. అలెర్జీని కలిగించే అంశాలను (అలర్జెన్స్‌ను) దేహం ఎదుర్కొన్నప్పుడు యథేచ్ఛగా తుమ్ములు వస్తూ అవి శ్వాసనాళాలను కుంచించుకుపోయేలా / బిగుసుకపోయేలా చేస్తాయి. దాంతో ఛాతీ బిగదీసుకుపోవడం ఆస్తమా లక్షణాలు తీవ్రతరం కావడం జరగవచ్చు. అప్పుడు శ్వాసనాళాలు సన్నబారడంతో దగ్గు, ఆయాసం, ఎగశ్వాస, ఛాతీ బిగదీసుకుపోవడం వంటి ఆస్తమా లక్షణాలు కనిపిస్తాయి లేదా వాటిని తీవ్రతరం చేస్తాయి కూడా. తుమ్ములు మరింత ఎక్కువగా వస్తూ, దగ్గు కూడా తోడైనప్పుడు ఊపిరితిత్తులపై ఒత్తిడి బాగా పెరిగి, ఆస్తమా ఉన్నవారికి అది మరింత కష్టంగా పరిణమించవచ్చు.

## శ్వాసనాళాల్లో ఇబ్బంది (ఇరిటేషన్), వాపు (ఎయిర్ వే ఇరిటేషన్ అండ్ ఇన్‌ఫ్లమేషన్)

తుమ్మినప్పుడు గాలి అకస్మాత్తుగా చిమ్మినట్టుగా చాలా వేగంగా బయటకు వస్తుంది. ఇది శ్వాసనాళాల లోపలి పొరల్లో ఇబ్బంది (ఇరిటేషన్) కలిగిస్తుంది. అలాగే అలెర్జీలూ, మాటిమాటికీ వచ్చే ఇన్ఫెక్షన్ల వల్ల వల్ల తరచుగా తుమ్ములు వస్తున్నట్లయితే, ఈ ఇబ్బంది (ఇరిటేషన్) కాస్తా దీర్ఘకాలిక వాపునకు (క్రానిక్ ఇన్‌ఫ్లమేషన్) దారితీసే అవకాశముంది. ఈ ఇన్‌ఫ్లమేషన్ కాస్తా శ్వాసనాళాలను మరింతగా కుంచించుకుపోయేలా చేసి, గాలి సాఫీగా ప్రసరించడాన్ని ఆటంకపరుస్తుంది. ఫలితంగా హాయిగా ఊపిరి పీల్చుకోవడం కష్టమవుతుంది.

## ఊపిరితిత్తుల కండరాలపై ఒత్తిడి (స్ట్రెయిన్ ఆన్ లంగ్ మజిల్స్)



తుమ్మిన ప్రతిసారీ కడుపును రెండు భాగాలుగా విభజించి, ఊపిరితిత్తులనూ, కడుపు తాలూకు జీర్ణవ్యవస్థలోని భాగాల్ని వేరు చేసే డయాఫ్రమ్ అనే పొర, ఛాతీ కండరాలూ సంకోచిస్తాయి. ఇలా మరీ ఎక్కువగానూ, శక్తిమంతంగానూ తుమ్ములు వస్తున్నప్పుడు అక్కడి కండరాలపై తీవ్రమైన ఒత్తిడి కలిగిస్తాయి. దాంతో ఛాతీలో నొప్పి, అక్కడి కండరాలకు తీవ్రమైన అసౌకర్యం కలుగుతుంది. దీనివల్ల ఊపిరితిత్తులపైన నేరుగా ప్రభావం పడదుగానీ... శ్వాసప్రక్రియకు సహాయపడే కండరాలపై తీవ్రంగా ఒత్తిడి పడుతుంది. దాంతో శ్వాస సరిగా ఆడకపోవడం, ఆయాసం రావడం జరుగుతాయి. దీన్నే వాడుక భాషలో ఉబ్బసంగా చెబుతుంటారు.

### ఇన్ఫెక్షన్ వ్యాప్తి (స్ప్రెడ్ ఆఫ్ ఇన్ఫెక్షన్):

జలుబు లేదా ఫ్లూ వంటి ఇన్ఫెక్షన్‌ల వల్ల తుమ్ములు వస్తున్నప్పుడు, అలా తుమ్మినప్పుడు వెలువడే అతి సన్నటి తుంపర్లలతో వైరస్‌లు ఉంటాయి. ఆ తుంపర్ల కారణంగా వైరస్ ఇతరులకు వ్యాప్తి చెందడంతో పాటు, కొన్నిసార్లు శ్వాసనాళాల లోపల మరింత లోతుకు విస్తరించి బ్రాంకైటిస్ లేదా నిమోనియా వంటి ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌లకు దారితీయవచ్చు. మరీ ముఖ్యంగా వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో ఇలా జరగడం చాలా సాధరణం.

### గాలి గదులు ధ్వంసం కావడం లేదా న్యూమోథొరాక్స్ :

ఇది చాలా అరుదుగా మాత్రమే చోటు చేసుకునే ప్రమాదం. కొన్ని తీవ్రమైన సందర్భాల్లో, అంటే మరీ ముఖ్యంగా ముఖ్యంగా ఊపిరితిత్తులలోని అంతర్గత సమస్యలు (ఉదాహరణకు ఎంఫసిమా వంటి సమస్యలు) ఉన్నవారిలో, తుమ్ములు చాలా బలంగా లేదా తీవ్రంగా వస్తున్నప్పుడు ఊపిరితిత్తులలోని అతి చిన్న గాలి గదులు (బ్లెబ్స్ అండ్ బ్యుల్లే) ఫటేల్మంటూ పగిలినట్టుగా అయ్యే ముప్పు ఉంటుంది. అయితే ఇది చాలా అరుదు. అయితే ఇది జరిగితే దీని వల్ల ఊపిరితిత్తీ అలాగే ఛాతీ గోడకు మధ్యన గాలి లీక్ అయి, న్యూమోథొరాక్స్ (కొలాప్స్‌డ్ లంగ్) అనే తీవ్రమైన కండిషన్‌కు దారి తీస్తుంది. ఇది చాలా అత్యవసరంగా వైద్యచికిత్స అందించాల్సిన పరిస్థితి.... అంటే మెడికల్ ఎమర్జెన్సీ.

### వైద్యచికిత్స ఎప్పుడంటే...

ఈ కింద పేర్కొన్న లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. అవి... ● గాలి పీల్చడంలో తీవ్రమైన ఇబ్బంది; శ్వాస సరిగా తీసుకోలేకపోవడం, ఊపిరి అందకపోవడం / ఊపిరాడకపోవడం ● ఛాతీ బిగుసుకుపోవడం / ఛాతీలో తీవ్రమైన నొప్పి ● ఒక పట్టాన తగ్గని తీవ్రమైన జ్వరం ● శ్లేష్మం / కఫం పసుపురంగులో లేదా ఆకుపచ్చ రంగులో ఉండటం ● ఇక్కడ పేర్కొన్న ఈ లక్షణాలు కొన్ని రోజుల తర్వాత కూడా తగ్గకుండా ఉండటం లేదా మరింత తీవ్రతరమైతే తక్షణం డాక్టర్‌ను సంప్రదించడం అవసరం.

### కొన్ని ఇతర వైద్యపరమైన సమస్యలతో కనిపించే లక్షణాలు :

- గుండె సంబంధిత సమస్యల కుటుంబ చరిత్ర / వైద్య చరిత్ర (హెల్త్ అండ్ ఫ్యామిలీ హిస్టరీ ఉన్నవారు బాగా ఛాతీలో ఇబ్బంది లేదా ఛాతీ బిగుసుకుపోవడం వంటి లక్షణాలు కనిపిస్తున్నప్పుడు.
- తరచుగా తుమ్ములు, ఛాతీలో బాగా బిగదీసుకుపోయి ఛాతీలో ఒత్తిడి ఉన్నట్లుగా అనిపిస్తుండటం (ఇలాంటి లక్షణాలు కనిపించినప్పుడు ఎంతమాత్రమూ నిర్లక్ష్యం చేయకూడదు. ఈ సందర్భాల్లో సమస్య చాలా సాధారణంగా కనిపిస్తున్నా లేదా అంత తీవ్రమైన సమస్య కానప్పటికీ ఆ లక్షణాలను నిర్లక్ష్యం చేయడం సరి కాదు. ఈ లక్షణాలు కనిపించినప్పుడు డాక్టర్‌కు చూపించి వెంటనే తగిన చికిత్స తీసుకోవడం అవసరం.



**చివరగా...** తరచుగా తుమ్ములు రావడమన్నది దాదాపుగా అందరిలోనూ తమ జీవితకాలంలోని ఏదో ఒక సమయంలో అనుభవంలోకి వచ్చే సమస్య. అయితే ఇలా తుమ్ములు పదేపదే కనిపిస్తుంటే మాత్రం ఒకసారి డాక్టర్‌ను సంప్రదించడం మంచిది.

నిర్వహణ:
యాసీన్

## ఐపీవో స్ట్రీట్..

### జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ @ రూ. 139-147

- ఈ నెల 7-11 మధ్య ఐపీవో
- రూ. 3,600 కోట్ల సమీకరణ




ముంబై: ప్రయివేట్ రంగ కంపెనీ జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ పబ్లిక్ ఇష్యూకి రూ. 139-147 చొప్పున ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 7న ప్రారంభమై 11న ముగియనుంది. దీనిలో భాగంగా రూ. 1,600 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో రూ. 2,000 కోట్ల విలువైన షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి ఇష్యూ ద్వారా రూ. 3,600 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 520 కోట్లు రుణ చెల్లింపులకు, మిగిలిన నిధులను సామర్థ్య విస్తరణకు వినియోగించనున్నట్లు కంపెనీ ఎండీ పార్థ్ జిందాల్ పేర్కొన్నారు. పంజాబ్‌లోని తల్వాండీలో రూ. 800 కోట్లతో ప్లాంటు ఏర్పాటు ప్రణాళికలున్నట్లు వెల్లడించారు.

### లిస్టింగ్‌కు ఆల్ టైమ్ ప్లాస్టిక్స్ రెడీ

- ఈ నెల 7-11 మధ్య ఐపీవో
- షేరుకి రూ. 260-275 ధరల శ్రేణి
- రూ. 401 కోట్ల సమీకరణకు సై



ముంబై: కన్జూమర్‌వేర్ ప్రొడక్టుల కంపెనీ ఆల్ టైమ్ ప్లాస్టిక్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 260-275 చొప్పున ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 7న ప్రారంభమై 11న ముగియనుంది. దీనిలో భాగంగా రూ. 280 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటితో పాటు మరో రూ. 121 కోట్ల విలువైన 43.8 లక్షల ఈక్విటీ షేర్లను ప్రమోటర్లు ఆఫర్ చేయనున్నారు. వెరసి ఇష్యూ ద్వారా రూ. 401 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఈక్విటీ జారీ నిధులను రుణ చెల్లింపులుసహా.. గుజరాత్‌లోని మానెక్‌పూర్ ప్లాంటు కోసం మెషీనరీ కొనుగోలుకి, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. కంపెనీ ఆధునిక ట్రేడ్ రిటైలర్లు, సూపర్ డిస్ట్రిబ్యూటర్ల ద్వారా యూరోపియన్ యూనియన్, యూఎస్ తదితర దేశాలకు ప్రొడక్టులను ఎగుమతి చేస్తోంది.

### కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

5-8-2025

| | |
|---|---|
| విశాఖ | 470-00 |
| చిత్తూరు | 513-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 470-00 |
| విజయవాడ | 475-00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| హైదరాబాద్ | 435-00 |
| వరంగల్ | 437-00 |
| రిటైల్ ధర | 4.95 |

### నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| HEROMOTOCO | 4,535.00 | 5.18 |
| TATASTEEL | 159.25 | 4.08 |
| ADANIPORTS | 1,395.00 | 3.56 |
| BEL | 389.9 | 3.37 |
| JSWSTEEL | 1,057.20 | 2.86 |

### నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| POWERGRID | 288 | -1.12 |
| HDFCBANK | 1,994.40 | -0.88 |
| ONGC | 235.13 | -0.7 |
| APOLLOHOSP | 7,309.00 | -0.58 |
| ICICIBANK | 1,463.10 | -0.58 |

### స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 6,401 |
| ఎన్ఎస్ఈ | 83,320 |
| ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్) | 1,31,974 |
| ఎఫ్ఐఐ | - 2,567 |
| డీఐఐ | + 4,386 |

### ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 66.10 (రాత్రి 11.30కు) | $ 67.33 (క్రితం ముగింపు) |
| బ్రెంట్ | 68.58 (రాత్రి 11.30కు) | $ 69.67 (క్రితం ముగింపు) |

# తయారీ లక్ష్యానికి పారిశ్రామిక ఎలక్ట్రానిక్స్ దన్ను

**ప్రభుత్వం మరింతగా దృష్టి పెట్టాలి**
- ఐసీఈఏ విజ్ఞప్తి




న్యూఢిల్లీ: దేశీయంగా పారిశ్రామిక, మౌలిక సదుపాయాల రంగంలో ఉపయోగించే ఎలక్ట్రానిక్స్ తయారీని ప్రోత్సహించడంపై మరింతగా దృష్టి పెట్టాలని కేంద్రాన్ని ఇండియా సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) కోరింది. 2030-31 నాటికి 500 బిలియన్ డాలర్ల ఎలక్ట్రానిక్స్ తయారీ లక్ష్యాన్ని సాధించేందుకు ఇది తోడ్పడుతుందని ఒక ప్రకటనలో పేర్కొంది. కేవలం ప్రోడక్టుల తయారీకే పరిమితం కాకుండా ఫ్యాక్టరీలు, నగరాలు, రవాణా నెట్‌వర్క్‌లు మొదలైన వాటిని ఆటోమేట్ చేసేందుకు ఉపయోగపడే ఉత్పత్తులను తయారు చేస్తే ఎలక్ట్రానిక్స్ పరిశ్రమకు భవిష్యత్తు ఉంటుందని వివరించింది. ఈ నేపథ్యంలో ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్ సెగ్మెంట్‌కు జాతీయ స్థాయిలో ప్రాధాన్యం ఇవ్వాలని ఐసీఈఏ చైర్మన్ పంకజ్ మహీంద్రూ తెలిపారు. 'ప్రతి అధునాతన తయారీ సెటప్‌కి ఇది మెదడు, నాడీమండలం లాంటిది. తయారీ రంగంలో భారత్ అగ్రస్థానానికి చేరుకోవాలంటే, పారిశ్రామిక ఆటోమేషన్‌లో అగ్రగామిగా ఎదగాల్సి ఉంటుంది' అని ఆయన చెప్పారు.

**భారీగా ఉద్యోగావకాశాలు..**

పారిశ్రామిక ఎలక్ట్రానిక్స్ సెగ్మెంట్‌కి సంబంధించి ఎంబెడెడ్ సిస్టమ్స్, ఆటోమేషన్ సాఫ్ట్‌వేర్, రోబోటిక్స్, ఏఐ ఆధారిత సిస్టమ్స్ మొదలైన విభాగాల్లో నిపుణులకు భారీగా ఉద్యోగావకాశాలు ఉంటాయని మహీంద్రూ చెప్పారు. ఈ విభాగం మరింతగా అభివృద్ధి చెందేలా నిపుణులను తీర్చిదిద్దడంపై, పరిశోధన-అభివృద్ధి కార్యకలాపాలపై ఇన్వెస్ట్ చేయడం, ప్రోత్సాహకాలు ఇవ్వడం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ఆధునిక తయారీ మౌలిక సదుపాయాల కల్పనకు ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్ సాంకేతికంగా వెన్నెముకలాంటిదని డెల్టా ఎలక్ట్రానిక్స్ వీపీ మనీష్ వాలియా తెలిపారు. స్మార్ట్ ఫ్యాక్టరీలు, రోబోటిక్స్, ఇంటెలిజెంట్ గ్రిడ్స్, ఆటోమేటెడ్ సిస్టమ్స్, భవిష్యత్తు అవసరాలకు తగ్గట్లు ఉండే రవాణా, లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌లకు ఇది దన్నుగా నిలుస్తుందని వివరించారు.

## ఎలక్ట్రిక్ మొబిలిటీ ఇండెక్స్‌లో ఢిల్లీ, మహారాష్ట్ర టాప్



న్యూఢిల్లీ: ఇండియా ఎలక్ట్రిక్ మొబిలిటీ ఇండెక్స్ (ఐఈఎంఐ)లో ఢిల్లీ, మహారాష్ట్ర, చండీగఢ్ అగ్రస్థానంలో అగ్రస్థానంలో నిల్చాయి. ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగం, చార్జింగ్ మౌలిక సదుపాయాలపరమైన సన్నద్ధత, ఈవీ టెక్నాలజీ-ఆవిష్కరణలు అనే మూడు థీమ్‌ల కింద మొత్తం 16 అంశాల్లో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో పరిస్థితులను మదింపు చేసి నీతి ఆయోగ్ ఈ ర్యాంకులు ఇస్తుంది. ఐఈఎంఐ 2024 నివేదిక ప్రకారం విద్యుత్ వాహనాల వినియోగంలో ఢిల్లీ, మహారాష్ట్ర అగ్రస్థానంలో ఉండగా, చార్జింగ్ సదుపాయాల విషయంలో హర్యానా, కర్ణాటక, లడఖ్, హిమాచల్ ప్రదేశ్ టాప్‌లో ఉన్నాయి. ఈవీ పరిశోధనలు, కొత్త ఆవిష్కరణల్లో తెలంగాణతో పాటు ఢిల్లీ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, హర్యానా ముందంజలో ఉన్నాయి. 2018లో మొత్తం వాహనాల విక్రయాల్లో 0.5 శాతంగా ఉన్న ఈవీల అమ్మకాలు 2024లో 7.6 శాతానికి చేరాయని, 2025 జూన్ నాటికి భారతీయ రహదారులపై 65 లక్షల పైగా ఎలక్ట్రిక్ వాహనాలు పరుగులు తీస్తున్నాయని నీతి ఆయోగ్ తెలిపింది. విద్యుదీకరణ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కొత్త ఆవిష్కరణవ్యాప్తంగా పురోగతిని మదింపు చేసేందుకు ఐఈఎంఐ పారదర్శకమైన, తులనాత్మకమైన విధానంగా ఉపయోగపడుతుందని నీతి ఆయోగ్ సభ్యుడు రాజీవ్ గౌబా తెలిపారు.

## అందరికీ ఆర్థిక సేవలకు కట్టుబడి ఉన్నాం

- 55.9 కోట్ల జన్‌ధన్ ఖాతాలు
- కేంద్ర సహాయ మంత్రి పంకజ్ చౌదరి



న్యూఢిల్లీ: అందరికీ ఆర్థిక సేవలను మరింతగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కట్టుబడి ఉన్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రాథమిక బ్యాంకింగ్ సేవలను అందరికీ అందించేందుకు, అధికారిక ఆర్థిక వ్యవస్థలో అందరినీ భాగస్వాములను చేసేందుకు కృషి చేయనున్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభకు లిఖిత పూర్వకంగా తెలియజేశారు. 2014లో ప్రారంభించిన ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన (పీఎంజేడీవై) పథకాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ పథకం కింద ఎలాంటి బ్యాలన్స్ అవసరం లేని బేసిక్ సేవింగ్స్ ఖాతాలను ప్రారంభించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించడం తెలిసిందే. ఇప్పటికి 55.90 కోట్ల జన్‌ధన్ యోజన ఖాతాలు ప్రారంభమైనట్టు చెప్పారు. ఆర్థిక సేవల విస్తృతిపై అవగాహన కల్పించేందుకు, బ్యాంక్ ఖాతాల పునర్ కేవైసీ సేవల కోసం బ్యాంక్‌లు దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టాయని.. జూలై 1న ఇది మొదలు కాగా, సెప్టెంబర్ 30తో ముగుస్తుందన్నారు.

## జేఎల్‌ఆర్ తొలి భారత సీఈవోగా పీబీ బాలాజీ




న్యూఢిల్లీ: టాటా గ్రూప్‌లో భాగమైన బ్రిటిష్ ఆటోమొబైల్ సంస్థ జాగ్వార్ లాండ్ రోవర్ (జేఎల్ఆర్) తొలి భారత సీఈవోగా పీబీ బాలాజీ సేవలు అందించనున్నారు. ఆగస్ట్ 4నాటి సమావేశంలో పీబీ బాలాజీ నియామకానికి అనుకూలంగా నిర్ణయం తీసుకున్నట్టు కంపెనీ ప్రకటించింది. ప్రస్తుతం బాలాజీ టాటా గ్రూప్ సీఎఫ్‌వోగా పనిచేస్తున్నారు. జేఎల్ఆర్ సీఈవోగా ఇటీవలే మూడేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న అడ్రియన్ మార్డెల్ తప్పుకోవాలని నిర్ణయించుకోవడం గమనార్హం. జేఎల్ఆర్‌తో ఆయన 35 ఏళ్లుగా కలసి నడుస్తున్నారు. జేఎల్ఆర్ సీఈవో బాధ్యతలను బాలాజీ నవంబర్‌లో చేపడతారని కంపెనీ వెల్లడించింది.

### గోబోల్ట్‌గా బోల్ట్ పేరు మార్పు

న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూకి రానున్న వేరబుల్ డివైజ్‌ల తయారీ సంస్థ బోల్ట్ సరికొత్తగా ప్రీమియం ఉత్పత్తుల సంస్థగా రీబ్రాండింగ్‌పై దృష్టి పెట్టింది. 'గోబోల్ట్'గా పేరు మార్చుకుంది. వచ్చే ఏడాదిన్నర వ్యవధిలో ఐపీవోకి రానుండటంతో అధిక వేల్యుయేషన్ పొందే దిశగా, లాభాలను మెరుగుపర్చుకునే ప్రణాళికలు ఉన్నట్లు సంస్థ సహ-వ్యవస్థాపకుడు వరుణ్ గుప్తా తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ. 750 కోట్ల ఆదాయం ఆర్జించగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 1,000 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వివరించారు. సగటున రూ. 2,000 ధరతో విక్రయించగలిగే ప్రీమియం ఉత్పత్తులను రూపొందించేందుకు పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలపై వార్షిక లాభాల్లో 25 శాతం ఇన్వెస్ట్ చేస్తున్నట్లు చెప్పారు.

# హైదరాబాద్‌లో ఆఫీస్ వసతులు రూ.1.39 లక్షల కోట్లు

**123 మిలియన్ చదరపు అడుగులు**
- టాప్-8 నగరాల్లో రూ.16.27 లక్షల కోట్లు
- నైట్‌ఫ్రాంక్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: హైదరాబాద్‌లో రూ.1.39 లక్షల కోట్ల విలువైన 123 మిలియన్ చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) కార్యాలయ వసతులు (ఆఫీస్ స్పేస్) ఉన్నట్టు నైట్‌ఫ్రాంక్ నివేదిక వెల్లడించింది. అంతే కాదు దేశవ్యాప్తంగా టాప్-8 నగరాల్లో జూన్ త్రైమాసికం చివరికి 993 మిలియన్ ఎస్ఎఫ్‌టీ ఆఫీస్ స్పేస్ అందుబాటులో ఉండగా, దీని విలువ 187 బిలియన్ డాలర్లు ఉన్నట్టు తెలిపింది. ఈ నగరాల్లో సెప్టెంబర్ త్రైమాసికం చివరికి కార్యాలయ వసతుల పరిమాణం బిలియన్ చదరపు అడుగులకు చేరుకుంటుందని అంచనా వేసింది. ప్రస్తుతం యూఎస్‌లో 10.2 బిలియన్ ఎస్ఎఫ్‌టీ, చైనాలో 6.26 బిలియన్ ఎస్ఎఫ్‌టీ, జపాన్‌లో 1.77 బిలియన్ ఎస్ఎఫ్‌టీ చొప్పున ఆఫీస్ స్పేస్ ఉన్నట్టు గుర్తు చేసింది. "2005లో 200 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉన్న ఆఫీస్ స్పేస్ ఏటా 8.6 శాతం చొప్పున పెరుగుతూ వచ్చింది. ఈ ఏడాది చివరికి బిలియన్ ఎస్ఎఫ్‌టీకి చేరుకుంటుంది''అని నైట్‌ఫ్రాంక్ ఇండియా వెల్లడించింది.

**నగరాల వారీగా..**

- బెంగళూరులో ఆఫీస్ వసతుల పరిమాణం జూన్ చివరికి 229 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉండగా, దీని విలువ 49 మిలియన్ డాలర్లు.
- ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో 44 బిలియన్ డాలర్ల విలువైన 199 మిలియన్ ఎస్ఎఫ్‌టీ కార్యాలయ వసతులు అందుబాటులో ఉన్నాయి.
- ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్)లో మొత్తం 169 మిలియన్ ఎస్ఎఫ్‌టీ (41 బిలియన్ డాలర్లు) అందుబాటులో ఉంది.
- పుణెలో 106 మిలియన్ ఎస్ఎఫ్‌టీ ఆఫీస్ స్పేస్ ఉండగా, దీని విలువ 16 బిలియన్ డాలర్లు.
- 13 బిలియన్ డాలర్ల విలువైన 92 మిలియన్ ఎస్ఎఫ్‌టీ ఆఫీసు వసతులకు చెన్నై నగరం వేదికగా ఉంది.
- అహ్మదాబాద్‌లో 41 మిలియన్ ఎస్ఎఫ్‌టీ (4 బిలియన్ డాలర్లు), కోల్‌కతాలో 34 మిలియన్ ఎస్ఎఫ్‌టీ (4 బిలియన్ డాలర్లు) మేర కార్యాలయ వసతులు ఉన్నట్టు ఈ నివేదిక వెల్లడించింది.
- టాప్-8 నగరాల్లోని మొత్తం ఆఫీస్ స్పేస్‌లో గ్రేడ్-ఏ వసతులు 53 శాతంగా ఉంటే, గ్రేడ్-బీ వాటా 43 శాతంగా, గ్రేడ్-సీ 4 శాతం చొప్పున ఉన్నాయి.

**జీసీసీలు ప్రధాన చోదకం**

"గత 35 ఏళ్లలో భారత్‌లో ఆఫీస్ స్పేస్ డిమాండ్ ఎంతో మార్పును చూసింది. ముఖ్యంగా గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు (జీసీసీలు) ఆఫీస్ స్పేస్ డిమాండ్‌కు ప్రధాన చోదకంగా నిలుస్తున్నాయి. ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆఫీస్ మార్కెట్‌గా భారత్ అవతరించింది. ఇప్పటికే 0.99 మిలియన్ ఎస్ఎఫ్‌టీ ఆఫీస్ స్పేస్ అందుబాటులో ఉండగా, బిలియన్ ఎస్ఎఫ్‌టీ మార్కును త్వరలో చేరుకోనుంది'' అని నైట్‌ఫ్రాంక్ ఇండియా రీసెర్చ్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గులామ్ జియా తెలిపారు.

## క్యూ1 ఫలితాలు

### అక్జో నోబెల్ భారీ డివిడెండ్

షేరుకి రూ. 156 చెల్లింపు
లాభం రూ. 91 కోట్లు




న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో పెయింట్ల రంగ దిగ్గజం అక్జో నోబెల్ ఇండియా ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 21 శాతం క్షీణించి రూ. 91 కోట్లకు పరిమితమైంది. అమ్మకాలు నీరసించడం, కన్జూమర్ డిమాండ్ మందగమనం ప్రభావం చూపాయి. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 115 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు షేరుకి రూ. 156 చొప్పున మధ్యంతర డివిడెండ్ చెల్లించేందుకు కంపెనీ బోర్డు అనుమతించింది. ఇందుకు ఆగస్ట్ 11 రికార్డ్ డేట్‌గా ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం రూ. 1,036 కోట్ల నుంచి రూ. 995 కోట్లకు బలహీనపడింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 892 కోట్ల నుంచి రూ. 882 కోట్లకు తగ్గాయి. గత నెలలో జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్ రూ. 8,986 కోట్లకు కంపెనీలో 74.76 శాతం వాటా కొనుగోలుకి ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. దీంతోపాటు అక్జో నోబెల్ వాటాదారుల వద్ద నుంచి మరో 25 శాతం వాటా కొనుగోలుకి ఓపెన్ ఆఫర్ ప్రకటించింది. ఇందుకు అదనంగా రూ. 3,929 కోట్లు వెచ్చించనుంది. ఈ నేపథ్యంలో వన్‌టైమ్ ప్రత్యేక డివిడెండ్‌కు బోర్డు నిర్ణయించింది.

ఫలితాల నేపథ్యంలో అక్జో నోబెల్ షేరు బీఎస్ఈలో 2.4 శాతం లాభపడి రూ. 3,726 వద్ద ముగిసింది.

### మారికో లాభం ప్లస్

రూ. 513 కోట్లు




న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ఎఫ్ఎంసీజీ రంగ దేశీ దిగ్గజం మారికో లిమిటెడ్ ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 8 శాతం వృద్ధితో రూ. 513 కోట్లను తాకింది. దేశ, విదేశాలలో అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 474 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2,643 కోట్ల నుంచి రూ. 3,259 కోట్లకు జంప్ చేసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 2,075 కోట్ల నుంచి రూ. 2,659 కోట్లకు పెరిగాయి. దేశీ బిజినెస్ ఆదాయం 27 శాతం జంప్‌చేసి రూ. 2,495 కోట్లను తాకినట్లు కంపెనీ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో మారికో షేరు బీఎస్ఈలో 2 శాతం లాభపడి రూ. 723 వద్ద ముగిసింది.

### ఏథర్ ఎనర్జీ నష్టాలు తగ్గాయ్

రూ. 178 కోట్లు




న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన రంగ కంపెనీ ఏథర్ ఎనర్జీ ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర నష్టం స్వల్పంగా తగ్గి రూ. 178 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 183 కోట్ల నష్టం ప్రకటించింది. అమ్మకాలు పుంజుకోవడం, నెట్‌వర్క్‌ను విస్తరించడం ఇందుకు సహకరించాయి. మొత్తం ఆదాయం మాత్రం 83 శాతం జంప్‌చేసి రూ. 673 కోట్లను తాకింది. గత క్యూ1లో కేవలం రూ. 368 కోట్ల టర్నోవర్ అందుకుంది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 551 కోట్ల నుంచి రూ. 851 కోట్లకు ఎగశాయి. ఈ కాలంలో 97 శాతం అధికంగా 46,078 వాహనాలు విక్రయించింది. ఏథర్ రిజ్టా వాహనానికి నెలకొన్న డిమాండ్ ఇందుకు కారణమైనట్లు కంపెనీ పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో ఏథర్ ఎనర్జీ షేరు బీఎస్ఈలో 15 శాతం దూసుకెళ్లి రూ. 399 వద్ద ముగిసింది.

### మైండ్‌స్పేస్ రీట్ ఆదాయం జూమ్

రూ. 616 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో రియల్టీ పెట్టుబడుల సంస్థ మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్ ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర నిర్వహణ ఆదాయం 24 శాతం ఎగసి రూ. 616 కోట్లను అధిగమించింది. దీంతో వాటాదారులకు రూ. 353 కోట్లు పంపిణీ చేయనున్నట్లు కె.రహేజా గ్రూప్ కంపెనీ వెల్లడించింది. ఇది 18 శాతం వృద్ధికాగా.. ఒక్కో యూనిట్‌కు 15 శాతం అధికంగా రూ. 5.79 చొప్పున చెల్లించనుంది. కాగా.. కంపెనీ ముంబై, పుణే, హైదరాబాద్, చెన్నైలలో ఆఫీసుల పోర్ట్‌ఫోలియోను కలిగి ఉంది. నిర్మాణంలో ఉన్న 3.7 మిలియన్ చదరపు అడుగులతో కలిపి మొత్తం 38.1 మిలియన్ చదరపు అడుగుల లీజబుల్ ఏరియాతో పోర్ట్‌ఫోలియోను విస్తరించింది. దీనిలో 3.4 మిలియన్ చదరపు అడుగులు భవిష్యత్ డెవలప్‌మెంట్‌లో ఉంది.

ఫలితాల నేపథ్యంలో మైండ్‌స్పేస్ రీట్ ఎన్ఎస్ఈలో 2.2 శాతం లాభపడి రూ. 421 వద్ద ముగిసింది.

### బాష్ లాభం హైజంప్

రూ. 1,115 కోట్లు




న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో డైవర్సిఫైడ్ దిగ్గజం బాష్ లిమిటెడ్ ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం రెండు రెట్లు ఎగసి రూ. 1,115 కోట్లను తాకింది. బిజినెస్ విభాగాన్ని బదిలీ చేయడంతో లభించిన వన్‌టైమ్ ఆదాయం ఇందుకు దోహదపడింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 465 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 4,496 కోట్ల నుంచి రూ. 5,077 కోట్లకు జంప్ చేసింది. ఈ కాలంలో వీడియో సొల్యూషన్స్, యాక్సెస్, ఇన్‌ట్రూజన్, కమ్యూనికేషన్ సిస్టమ్స్ విభాగాన్ని బదిలీ చేయడం ద్వారా రూ. 556 కోట్లు అందుకున్నట్లు కంపెనీ వివరించింది.

ఫలితాల నేపథ్యంలో బాష్ షేరు బీఎస్ఈలో 2 శాతం బలపడి రూ. 41,118 వద్ద ముగిసింది.

### టాటా ఇన్వెస్ట్‌మెంట్ షేర్ల విభజన

లాభం రూ. 146 కోట్లు




న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో మధ్యస్థాయి ఎన్‌బీఎఫ్‌సీ.. టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 12 శాతం వృద్ధితో రూ. 146 కోట్లను అధిగమించింది. అధిక డివిడెండ్ ఆదాయం ఇందుకు దోహదపడింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 131 కోట్లు ఆర్జించింది. ఈ కాలంలో డివిడెండ్ ఆదాయం రూ. 84 కోట్ల నుంచి రూ. 89 కోట్లకు పెరిగింది. కంపెనీ బోర్డు షేరు ముఖ విలువను ప్రస్తుత రూ. 10 నుంచి రూ. 1కు విభజించేందుకు అనుమతించినట్లు కంపెనీ వెల్లడించింది. వెరసి ఒక్కో షేరునీ 10 షేర్లుగా విభజించనుంది. కాగా.. మొత్తం ఆదాయం రూ. 142 కోట్ల నుంచి రూ. 145 కోట్లకు స్వల్పంగా బలపడింది. మొత్తం వ్యయాలు నామమాత్రంగా పెరిగి రూ. 12 కోట్లకు చేరాయి.

ఫలితాల నేపథ్యంలో టాటా ఇన్వెస్ట్‌మెంట్ షేరు బీఎస్ఈలో 3 శాతం బలపడి రూ. 6,980 వద్ద ముగిసింది.

### స్ట్రింగ్ మెటావర్స్ ఆదాయం రూ. 199 కోట్లు




హైదరాబాద్: వెబ్3 ఇన్‌ఫ్రా సంస్థ స్ట్రింగ్ మెటావర్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ. 199 కోట్ల ఆదాయం సాధించింది. క్రితం క్యూ1లో నమోదైన రూ. 50 కోట్లతో పోలిస్తే ఇది సుమారు 298 శాతం అధికమని కంపెనీ తెలిపింది. సమీక్షాకాలంలో నికర లాభం రూ. 5 కోట్ల నుంచి సుమారు 240 శాతం పెరిగి రూ. 18 కోట్లకు చేరిందని వివరించింది. గేమింగ్, పేమెంట్స్, కంప్యూట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర విభాగాలు ఆదాయ వృద్ధికి తోడ్పడ్డాయని సంస్థ డైరెక్టర్ ఎ. సంతోష్ తెలిపారు. బీఎస్ఈలో సంస్థ షేరు సుమారు అయిదు శాతం పెరిగి రూ. 278 వద్ద ముగిసింది.

# ఆర్చరీ లీగ్‌కు సన్నాహాలు

- 6 ఫ్రాంచైజీలతో నిర్వహణ
- న్యూఢిల్లీలో అక్టోబర్‌లో తొలి సీజన్



**న్యూఢిల్లీ:** భారత్‌లో మరో క్రీడ 'లీగ్' రూపంలో అలరించేందుకు ముస్తాబవుతోంది. ఇన్నాళ్లు పతకాలపై గురి పెట్టిన ఆర్చర్లు ఇకపై ఫ్రాంచైజీ లీగ్‌పై గురి పెడతారు. భారత ఆర్చరీ సంఘం (ఏఏఐ) ఆధ్వర్యంలో ఈ ఏడాది నుంచే ఆర్చరీ లీగ్ నిర్వహణకు ఏర్పాట్లు మొదలయ్యాయి. ప్రపంచ టాప్-10 ర్యాంకర్లు ఇందులో పాల్గొననున్నారు. మహిళలు, పురుషులతో కలిపి జట్టుగా కాంపౌండ్, రికర్వ్ ఈవెంట్లలో పోటీలు నిర్వహిస్తారు. మొత్తం ఆరు ఫ్రాంచైజీలు ఇందులో తలపడతాయి. న్యూఢిల్లీలోని యమున స్పోర్ట్స్ కాంప్లెక్స్ తొలి సీజన్‌కు ఆతిథ్య వేదికగా నిలువనుంది. ఈ అక్టోబర్‌లో వరుసగా 11 రోజుల పాటు నిర్వహించే పోటీలతో ఈ లీగ్ ముగుస్తుంది. ఆర్చరీ ఆట కొత్త పుంతలు తొక్కేందుకు, మరింత ఆదరణ పెరిగేందుకు ఈ తరహా లీగ్‌లు దోహదం చేస్తాయని భారత ఆర్చరీ లీగ్ నిర్వహణకు ప్రపంచ, ఆసియా ఆర్చరీ సమాఖ్యలు మద్దతు తెలిపాయి. ఏఏఐ అధ్యక్షుడు అర్జున్ ముండా మాట్లాడుతూ 'ఆర్చరీ లీగ్‌తో క్రీడాకారులకు మరిన్ని పోటీ అవకాశాలు పెంచుతామనే నమ్మకంతో ఉన్నాం. అంతర్జాతీయ ఆర్చర్లతో కలిసి పోటీపడేందుకు, తమ సత్తా చాటుకునేందుకు ఈ లీగ్ కచ్చితంగా దోహదం చేస్తుంది. తద్వారా ఆర్చరీ క్రీడ మనదేశంలో మరో దశకు చేరుతుంది' అని అన్నారు. ప్రపంచ ఆర్చరీ కార్యదర్శి టామ్ డీలెన్ మాట్లాడుతూ 'లీగ్‌తో ఆర్చరీ క్రీడ ప్రాభవం పెరుగుతుంది. భారత ఆర్చర్లకే కాదు... అంతర్జాతీయ ఆర్చర్లందరికీ మేలు చేస్తుంది. గట్టిపోటీ ప్రత్యర్థులను ఢీకొనే అవకాశాల్ని విరివిగా సృష్టిస్తుంది. తద్వారా ఆర్చర్లందరూ తమ ఆటతీరును మరింత మెరుగుపర్చుకుని... భవిష్యత్తులో దీటుగా తయారయ్యేందుకు ఉపయోగపడుతుంది' అని పేర్కొన్నారు.

## తెలంగాణ స్విమ్మర్లకు రెండు పతకాలు




**అహ్మదాబాద్:** జాతీయ జూనియర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ పతకాల బోణీ చేసింది. ఈ టోర్నీ రెండో రోజు సోమవారం తెలంగాణకు రెండు పతకాలు లభించాయి. గ్రూప్-1 బాలుర విభాగం 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌లో సుహాస్ ప్రీతమ్ కాంస్య పతకం... గ్రూప్-1 బాలికల విభాగంలో 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌లో శ్రీ నిత్యా సాగి రజత పతకం సొంతం చేసుకున్నారు. సుహాస్ 58.37 సెకన్లలో గమ్యానికి చేరి మూడో స్థానాన్ని పొందగా... నిత్య 1ని:06.13 సెకన్లలో రేసును ముగించి రెండో స్థానాన్ని దక్కించుకుంది.

# 'డ్రా'లోనూ డబుల్ ఆనందం...



## గిల్ కెప్టెన్సీలో, గంభీర్ శిక్షణలో మెరిసిన భారత్
## ప్రతికూల పరిస్థితుల్లోనూ అంచనాలకు మించి ప్రదర్శన

సాక్షి క్రీడా విభాగం

**భారత జట్టు చివరిసారిగా ఇంగ్లండ్ గడ్డపై 2007లో 1-0తో సిరీస్ గెలిచింది. ఆ తర్వాత నాలుగుసార్లు మన టీమ్ అక్కడకు వెళ్లింది. 2011లో 0-4తో చిత్తుగా ఓడిన జట్టు... 2014,** 2018లలోనూ సిరీస్‌లు కోల్పోయింది. 2021 సిరీస్‌ను మాత్రం సమంగా ముగించగలిగింది. ఈసారి జట్టు ఇంగ్లండ్ బయల్దేరినప్పుడు కూడా ఎన్నో సందేహాలు. కోహ్లి, రోహిత్, అశ్విన్ రిటైర్ అయిన తర్వాత ఆడుతున్న తొలి టెస్టు సిరీస్ కావడంతో పాటు ఎక్కువ మందికి అనుభవం పెద్దగా లేకపోవడంతో కూడా అంచనాలు తక్కువగా ఉన్నాయి. భారత మాజీ క్రికెటర్లు సహా ప్రసారకర్తల బృందంలో ఉన్నవారంతా ఇంగ్లండ్ సిరీస్ గెలవడం ఖాయమని జోస్యం చెప్పారు. భారత్ కొంత వరకు పోరాడుతుందని, సిరీస్ తుది ఫలితంలో మాత్రం మార్పు ఉండదని వారంతా వ్యాఖ్యానించారు. కానీ టీమిండియా తమ అసాధారణ ఆటతో అందరి నోళ్లు మూయించింది. ఈ పర్యటనకు ముందు స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో 0-3తో ఓడి, ఆపై ఆస్ట్రేలియాలో 1-3తో చిత్తయిన జట్టు ఇంగ్లండ్‌కు వెళ్లి ఈ తరహా ఫలితంతో తిరిగి రావడం చాలా గొప్ప ప్రదర్శన. అంకెల్లో చూస్తే సిరీస్ 'డ్రా'గా ముగిసిందని, భారత్ గెలవలేదని అనిపించవచ్చు కానీ మన కోణంలో చూస్తే ఇది విజయంతో సమానం. సిరీస్‌లో అన్ని మ్యాచ్‌లు చూసినవారు ఎవరైనా ఇదే విషయాన్ని అంగీకరిస్తారు. ఐదు టెస్టుల్లో వేర్వేరు దశల్లో, సెషన్‌లలో మన జట్టు ఆధిక్యం కనబర్చిన తీరు, వెనకబడిన ప్రతీసారి కోలుకున్న పట్టుదల చూస్తే 'డ్రా' కూడా గెలుపు సంబరమే.

### హోరాహోరీ పోరులో సత్తా చాటి...

**తొలి టెస్టులో భారత్ చిత్తుగా ఏమీ ఓడలేదు. మన జట్టు తరఫున ఐదు సెంచరీలు నమోద**య్యాయి. ఆ జట్టు దూకుడుగా ఆడి 371 పరుగులు ఛేదించగలిగింది. రెండో టెస్టులో ఏకంగా 336 పరుగులతో ఘన విజయం సాధించి సరైన రీతిలో మనం బదులిచ్చాం. లార్డ్స్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో స్కోరు సమం. చివర్లో కాస్త అదృష్టం కలిసొస్తే ఈ మ్యాచ్ కూడా మన సొంతమయ్యేది. ఓల్డ్‌ట్రాఫోర్డ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో ఏకంగా 311 పరుగులు వెనుకబడి కూడా పోరులో నిలవడం, ఓటమిని తప్పించుకోవడం మన పోరాటపటిమను చూపించింది. రెండో ఇన్నింగ్స్‌లోనైతే సున్నాకి 2 వికెట్లు కోల్పోయిన తర్వాత మరో 2 వికెట్లు మాత్రమే చేజార్చుకొని 425 పరుగులు చేయడం అసాధారణం. ఒకదశలో 'డ్రా' కోసం ఇంగ్లండ్ ముందుకు రావడం, మన ఆటగాళ్లు నిరాకరించడం జట్టులో పెరిగిన ఆత్మవిశ్వాసాన్ని చూపించింది. ఇది తర్వాతి టెస్టులో కనిపిస్తుందని వేసిన అంచనాలు సరిగ్గా నిజమయ్యాయి. తొలి ఇన్నింగ్స్‌లో 224 పరుగులు చేసి, ఆపై దూకుడుగా ఆడుతున్న ఇంగ్లండ్‌ను తక్కువ స్కోరుకే నిలువరించగలిగింది.

### ఆకట్టుకున్న వ్యక్తిగత ప్రదర్శనలు...

**సిరీస్‌లో** సమష్టి ప్రదర్శన జట్టును ముందంజలో నిలిపింది. సిరాజ్ 23 వికెట్లు పడగొట్టగా, 3 మ్యాచ్‌లలో బుమ్రా 14 వికెట్లు తీశాడు. **పరుగులు భారీగా ఇచ్చినా... ప్రసిధ్ కృష్ణ (14), ఆకాశ్‌దీప్ (13) కీలక సమయాల్లో వికెట్లు తీశారు. జడేజా బౌలర్‌గా విఫలమైనా ఆ లోటును బ్యాటింగ్‌తో పూరించాడు. ఏకంగా ముగ్గురు బ్యాటర్లు 500కు పైగా పరుగులు చేసి తామేంటో చూపించారు. శుబ్‌మన్ గిల్ (754), కేఎల్ రాహుల్ (532), జడేజా** (516) చెలరేగగా... పంత్ (479), జైస్వాల్ (411) కూడా తమవంతు పాత్ర పోషించారు. ముస్ముందు అశ్విన్ స్థానాన్ని పూర్తి స్థాయిలో భర్తీ చేయగల ఆల్‌రౌండర్‌గా సుందర్ నిరూపించుకున్నాడు. మాంచెస్టర్‌లో సెంచరీతో పాటు చివరి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో అతను బాదిన 4 సిక్సర్లు తుది ఫలితంపై ప్రభావం చూపాయి. క్రికెట్‌ను మరో అవకాశం అడిగిన కరుణ్ నాయర్ అద్భుతంగా ఆడకపోయినా...చివరి టెస్టు హాఫ్ సెంచరీ అతడికి మరో అవకాశం కల్పించవచ్చు.

### ఇద్దరికీ పాస్ మార్కులు...

**ఈ** టెస్టు సిరీస్ ప్రధానంగా కెప్టెన్ గిల్, కోచ్ గంభీర్‌లకు వ్యక్తిగతంగా ఎంతో కీలకమైంది. ఈ సిరీస్‌కు ముందు పేలవ సగటుతో బ్యాటర్‌గా కూడా గొప్ప రికార్డు లేని గిల్ అటు ఆటగాడిగా, ఇటు కెప్టెన్‌గా కూడా నిరూపించుకోవాల్సిన స్థితి. ఇందులో ఏది విఫలమైనా అతనిపై తీవ్ర విమర్శలు వచ్చేవి. అయితే గిల్ ఇప్పుడు విజయవంతంగా దీనిని ముగించాడు. టాప్ స్కోరర్‌గా నిలవడంతో పాటు కెప్టెన్‌గా సిరీస్‌ను కోల్పోలేదు. అక్కడక్కడ తప్పుడు నిర్ణయాలు తీసుకున్నా తొలి సిరీస్ కాబట్టి క్షమించే పరిస్థితి ఉంది. ఇక గత రెండు టెస్టు సిరీస్‌లు కోల్పోయిన తర్వాత గంభీర్‌పై కూడా తీవ్ర ఒత్తిడి ఉంది. ముఖ్యంగా కోహ్లి, రోహిత్‌లను తానే సాగనంపి జట్టుపై పూర్తి పట్టు పెంచుకున్నాడనే వార్తలు ప్రచారంలో ఉన్న నేపథ్యంలో అతని ప్రతీ ప్రణాళికపై అందరి దృష్టి ఉంది. ముఖ్యంగా ఇక్కడ ఓడితే కొన్ని అనూహ్య ఎంపికలకు అతను సమాధానం ఇచ్చుకోవాల్సి వచ్చేది. ఇక తాజా ప్రదర్శనతో గంభీర్ నిశ్చింతగా ఉండవచ్చు. భారత్ తమ తదుపరి టెస్టు సిరీస్‌ను స్వదేశంలో వెస్టిండీస్‌తో ఆడనుంది. 27 ఆలౌట్ తర్వాత ఆ జట్టు ఆడనున్న తొలి మ్యాచ్ ఇక్కడే కానుంది. ఇంగ్లండ్‌తో సిరీస్ తర్వాత మన జట్టు ప్రదర్శనను విశ్లేషిస్తే వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌లో టీమిండియా జోరు కొనసాగడం ఖాయం.



రాహుల్, పంత్

# ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీలకు అమన్, అంతిమ్

## ముగిసిన జాతీయ రెజ్లింగ్ ట్రయల్స్



**లక్నో:** గత ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన భారత స్టార్ రెజ్లర్ అమన్ సెహ్రావత్... ప్రపంచ చాంపియన్‌షిప్‌లో తొలి పతకంపై గురి పెట్టాడు. సెప్టెంబర్ 13 నుంచి 21వ తేదీ వరకు క్రొయేషియా రాజధాని జాగ్రెబ్‌లో ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ జరగనుంది. ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొనే భారత పురుషుల, మహిళల ఫ్రీస్టయిల్ జట్లను సోమవారం ప్రకటించారు. రెండు రోజులపాటు నిర్వహించిన సెలెక్షన్ ట్రయల్స్ ఆధారంగా జట్లను ఎంపిక చేశారు. 22 ఏళ్ల అమన్ జూన్‌లో మంగోలియాలో జరిగిన ర్యాంకింగ్ సిరీస్ టోర్నీలో కాంస్య పతకం గెలిచాడు. రెండు నెలల తర్వాత మళ్లీ మ్యాట్‌పైకి అడుగు పెట్టిన అమన్ చురుకైన కదలికలతో ఆకట్టుకున్నాడు. ట్రయల్స్‌లో తన ప్రత్యర్థులు సుమీత్, రాహుల్‌లపై అమన్ 'టెక్నికల్ సుపీరియారిటీ' పద్ధతిలో (ప్రత్యర్థిపై 10 పాయింట్ల ఆధిక్యం సంపాదించడం) అలవోకగా గెలిచాడు. 'నా అత్యుత్తమ స్థాయికి చేరుకున్నానని భావిస్తున్నాను. పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నా. ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీలకు సిద్ధంగా ఉన్నా. ఏడాది తర్వాత బరిలోకి దిగిన మంగోలియా టోర్నీలో నేను కొన్ని పొరపాట్లు చేశాను. ఓవరాల్‌గా నా ప్రదర్శనపట్ల సంతృప్తిగా ఉన్నా' అని అమన్ వ్యాఖ్యానించాడు. 2022 ఆసియా క్రీడల్లో కాంస్యం, 2023 ఆసియా చాంపియన్‌షిప్‌లో స్వర్ణం నెగ్గిన అమన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మాత్రం ఇంకా పతకాల బోణీ కొట్టలేదు. మరోవైపు మహిళల విభాగంలో స్టార్ రెజ్లర్ అంతిమ్ పంఘాల్ ఈసారి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. 2023 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్యం గెలిచిన అంతిమ్ జాతీయ ట్రయల్స్‌లో తన ప్రత్యర్థులకు ఒక్క పాయింట్ కూడా ఇవ్వకుండా విజేతగా నిలిచింది. గత ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో తొలి రౌండ్‌లోనే నిష్క్రమించిన 20 ఏళ్ల అంతిమ్ ఇప్పటికే ఆసియా క్రీడల్లో, ఆసియా చాంపియన్‌షిప్‌లో, గ్రాండ్‌ప్రి సిరీస్ టోర్నీల్లో, అండర్-20, అండర్-17 ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో పతకాలు సాధించింది.



**భారత పురుషుల ఫ్రీస్టయిల్ జట్టు:** అమన్ సెహ్రావత్ (57 కేజీలు), ఉదిత్ (61 కేజీలు), సుజీత్ కల్కాల్ (65 కేజీలు), రోహిత్ (70 కేజీలు), జైదీప్ (74 కేజీలు), అమిత్ (79 కేజీలు), ముకుల్ దహియా (86 కేజీలు), దీపక్ పూనియా (92 కేజీలు), విక్కీ (97 కేజీలు), రజత్ (125 కేజీలు). **భారత మహిళల ఫ్రీస్టయిల్ జట్టు:** అంకుశ్ (50 కేజీలు), అంతిమ్ (53 కేజీలు), నిశు (55 కేజీలు), తపస్య (57 కేజీలు), నేహా (59 కేజీలు), మనీషా (62 కేజీలు), వైష్ణవి (65 కేజీలు), సృష్టి (68 కేజీలు), జ్యోతి (72 కేజీలు), ప్రియా మలిక్ (76 కేజీలు).

# హర్మన్‌ప్రీత్ సారథ్యంలో...

## ఆస్ట్రేలియా పర్యటనకు భారత హాకీ జట్టు

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ టోర్నమెంట్‌కు సన్నాహాల్లో భాగంగా భారత పురుషుల హాకీ జట్టు ఈ నెలలో ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. ఆగస్టు 15 నుంచి 21 వరకు జరిగే ఈ పర్యటనలో టీమిండియా నాలుగు మ్యాచ్‌లు ఆడుతుంది. ఈ సిరీస్‌లో పాల్గొనే భారత జట్టును సోమవారం ప్రకటించారు. 24 మంది సభ్యులతో కూడిన భారత జట్టుకు హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యం వహిస్తాడు. కర్ణాటకకు చెందిన డిఫెండర్ సీబీ పూవణ్ణ తొలిసారి జాతీయ సీనియర్ జట్టులోకి ఎంపికయ్యాడు. ప్రస్తుతం బెంగళూరులోని భారత స్పోర్ట్స్ అథారిటీ (సాయ్) కేంద్రంలో భారత జట్టుకు శిక్షణ శిబిరం జరుగుతోంది. ఈ పర్యటన కోసం భారత జట్టు శుక్రవారం బెంగళూరు నుంచి ఆస్ట్రేలియాకు బయలుదేరుతుంది.



భారత పురుషుల హాకీ జట్టు: కృషన్ పాఠక్, సూరజ్ (గోల్‌కీపర్లు), సుమిత్, జర్మన్‌ప్రీత్ సింగ్, హర్మన్‌ప్రీత్ సింగ్ (కెప్టెన్), సంజయ్, అమిత్ రోహిదాస్, నీలం సంజీప్, జుగ్‌రాజ్ సింగ్, పూవణ్ణ (డిఫెండర్లు), రాజిందర్ సింగ్, రాజ్‌కుమార్ పాల్, హార్దిక్ సింగ్, మన్‌ప్రీత్ సింగ్, వివేక్ సాగర్ ప్రసాద్, రబిచంద్ర సింగ్, విష్ణుకాంత్ సింగ్ (మిడ్‌ఫీల్డర్లు), మన్‌దీప్ సింగ్, శిలానంద్ లాక్రా, అభిషేక్, సుఖ్‌జీత్ సింగ్, దిల్‌ప్రీత్ సింగ్, సెల్వం కార్తీ, ఆదిత్య లలాగే (ఫార్వర్డ్స్).

# వరుసగా ఆరోసారి...

- వెస్టిండీస్‌పై టి20 సిరీస్ నెగ్గిన పాకిస్తాన్
- మూడో టి20లో 13 పరుగులతో విజయం




**లాడెర్‌హిల్ (అమెరికా):** వెస్టిండీస్‌తో జరిగిన మూడు టి20ల సిరీస్‌ను పాకిస్తాన్ 2-1తో కైవసం చేసుకుంది. భారత కాలమానం ప్రకారం సోమవారం తెల్లవారుజామున జరిగిన ఆఖరి మూడో టి20లో పాక్ 13 పరుగుల తేడాతో విండీస్‌పై గెలుపొందింది. టి20 ఫార్మాట్‌లో వెస్టిండీస్‌పై పాకిస్తాన్‌కిది వరుసగా ఆరో సిరీస్ విజయం కావడం విశేషం. గతంలో పాక్ 2016లో 3-0తో...2017లో 3-1తో... 2018లో 3-0తో... 2021లో 1-0తో (మూడు మ్యాచ్‌లు వర్షంతో రద్దయ్యాయి)... 2021లోనే 3-0తో విండీస్‌పై నెగ్గింది. చివరి మ్యాచ్‌లో టాస్ నెగ్గిన పాకిస్తాన్ మొదట బ్యాటింగ్ చేపట్టి... నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 189 పరుగులు చేసింది. ఓపెనర్లు సాహిబ్‌జాదా ఫర్హాన్ (53 బంతుల్లో 74; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు), సయీమ్ అయూబ్ (49 బంతుల్లో 66; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) కరీబియన్ బౌలర్లపై చెలరేగారు. 34 బంతుల్లో ఫర్హాన్, 37 బంతుల్లో అయూబ్ అర్ధసెంచరీలు పూర్తి చేసుకున్నారు. ముఖ్యంగా ఫర్హాన్ భారీ సిక్సర్లతో విండీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఇద్దరు 16.1 ఓవర్లలోనే 138 పరుగులు జోడించారు. ఎట్టకేలకు షామర్ జోసెఫ్ 17వ ఓవర్ రెండో బంతికి ఫర్హాన్‌ను అవుట్ చేయడంతో ఓపెనింగ్ వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత వచ్చిన హసన్ నవాజ్ (15), హారిస్ (2), ఖుష్‌దిల్ షా (11 నాటౌట్), అష్రఫ్ (10 నాటౌట్) చెప్పుకోదగ్గ స్కోర్లేమీ చేయలేదు. విండీస్ బౌలర్లలో హోల్డర్, చేజ్, జోసెఫ్ తలా ఒక వికెట్ తీశారు. అనంతరం వెస్టిండీస్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 176 పరుగులు చేసి పోరాడి ఓడింది. పెద్ద లక్ష్యాన్ని ఛేదించేందుకు విండీస్ దూకుడుగానే ఇన్నింగ్స్‌ను ప్రారంభించింది. తొలి రెండు ఓవర్లలోనే 33 పరుగుల్ని శరవేగంగా రాబట్టింది. అయితే ఈ జోరుకు హారిస్ రవూఫ్ అడ్డుకట్ట వేశాడు. మూడో ఓవర్లో కేవలం 5 పరుగులే ఇచ్చిన అతను... తన మరుసటి ఓవర్లో (ఇన్నింగ్స్ 5వ) జెవెల్ ఆంద్రూ (15 బంతుల్లో 24; 3 ఫోర్లు)ను అవుట్ చేయడంతో 44 పరుగుల వద్ద తొలి వికెట్ కూలింది. కెప్టెన్ షై హోప్ (7) మెప్పించలేకపోయినా... షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ (35 బంతుల్లో 51; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించాడు. ఓపెనర్ అలిక్ అతనాజ్ (40 బంతుల్లో 60; 8 ఫోర్లు, 1 సిక్స్) జట్టు స్కోరు 110 పరుగుల వద్ద మూడో వికెట్‌గా నిష్క్రమించేవరకు విండీస్ రేసులోనే ఉంది. కానీ తర్వాత వచ్చిన రోస్టన్ ఛేజ్ (15), హోల్డర్ (0)లు విఫలమవడంతో లక్ష్యానికి దూరమైంది. పాక్ బౌలర్లు రవూఫ్, నవాజ్, హసన్ అలీ, అయూబ్, ముకీమ్ తలా ఒక వికెట్ తీశారు. ఈ వేదికపైనే ఆడిన తొలి టి20లో పాక్ నెగ్గితే, రెండో మ్యాచ్‌లో విండీస్ గెలిచింది. అమెరికాలో పొట్టి సిరీస్ ఆడిన ఇరుజట్లు ఇప్పుడు మూడు వన్డేల సిరీస్ కోసం కరీబియన్‌కు పయనమవుతాయి. అక్కడ టరౌబా వేదికగా 8, 10, 12 తేదీల్లో వన్డేలు ఆడనున్నాయి.

# చాంపియన్స్ నిఖత్, ఆరుష్







**సాక్షి, హైదరాబాద్:** సాంరెడ్డి సుదర్శన్ రెడ్డి స్మారక తెలంగాణ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ (టీటీ) టోర్నమెంట్‌లో మహిళల సింగిల్స్ విభాగంలో నిఖత్ బాను (రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా), పురుషుల సింగిల్స్ విభాగంలో ఆరుష్ రెడ్డి (సోమ్‌నాథ్ ఘోష్ టీటీ అకాడమీ) చాంపియన్స్‌గా నిలిచారు. రంగారెడ్డి జిల్లా టీటీ సంఘం ఆధర్యంలో బండ్లగూడలోని మహావీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎంఎస్ఐటీ)లో మూడు రోజుల పాటు ఈ టోర్నీ జరిగింది. ఫైనల్స్‌లో నిఖత్ బాను 11-2, 11-5, 11-2, 11-3తో టి.లక్ష్మి హర్షిత (ఏడబ్ల్యూఏ)పై, ఆరుష్ రెడ్డి 11-2, 11-6, 8-11, 4-11, 11-9, 11-7తో స్వర్ణేందు చౌధురీ (ఏబీఎస్‌సీ)పై విజయం సాధించారు. ఎంఎస్ఐటీ చైర్‌పర్సన్ సురేందర్ రెడ్డి, చైర్మన్ జయలక్ష్మి ముఖ్య అతిథులుగా విచ్చేసి విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఐటీ కోశాధికారి అగ్నిహోత్రి, తెలంగాణ రాష్ట్ర టీటీ సంఘం (టీఎస్‌టీటీఏ) జనరల్ సెక్రటరీ నాగేందర్ రెడ్డి, టీఎస్‌టీటీఏ సంయుక్త కార్యదర్శి ధనుంజయ్ రెడ్డి, టీఎస్‌టీటీఏ మెంటార్ ప్రకాశ్‌రాజు తదితరులు పాల్గొన్నారు. ఇతర విభాగాల ఫలితాలు ఇలా ఉన్నాయి.

**అండర్-11 బాలికల సింగిల్స్:** 1. యశశ్రీ, 2. అపర్ణ (స్కోరు: 11-8, 11-8, 11-9). బాలుర సింగిల్స్: 1. విహాన్, 2. శుభమ్ డే (స్కోరు: 11-7, 11-4, 11-9). అండర్-13 బాలికల సింగిల్స్: 1. అవంతిక, 2. రిద్ధి టోరో (స్కోరు: 11-0, 11-5, 11-8). బాలుర సింగిల్స్: 1. విరాట్ సాగర్, 2. వీఎస్ఎస్ అద్విక్ (స్కోరు: 16-14, 11-9, 11-7). అండర్-15 బాలికల సింగిల్స్: 1. శ్రీ సాన్వీ, 2. అవంతిక (స్కోరు: 12-10, 11-8, 11-5). బాలుర సింగిల్స్: 1. హర్షిత్ రెడ్డి, 2. తనయ్ కుమార్ (స్కోరు: 11-9, 11-9, 11-5). అండర్-17 బాలికల సింగిల్స్: 1. శ్రీ సాన్వీ, 2. గాయత్రి కృష్ణ (స్కోరు: 11-13, 9-11, 11-7, 11-3, 11-8). బాలుర సింగిల్స్: 1. ధర్మతేజ, 2. దేవాంశ్ సింగ్ (స్కోరు: 11-9, 9-11, 11-5, 12-10). అండర్-19 బాలికల సింగిల్స్: 1. శ్రీ సాన్వీ, 2. నిఖిత (స్కోరు: 9-11, 7-11, 11-7, 11-5, 11-5, 11-6). బాలుర సింగిల్స్: 1. తరుణ్, 2. ఆరుష్ రెడ్డి (స్కోరు: 9-11, 11-9, 8-11, 11-5, 8-11, 12-10, 11-9).



వేతనాలు పెంచాలని, పనిభారం తగ్గించాలని కేరళ పీఈటీ(ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్)లు సోమవారం తిరువనంతపురంలోని సెక్రటేరియట్ వద్ద ఇలా జుంబా డ్యాన్స్‌తో నిరసన తెలిపారు



సెంట్రల్ గాజాలోని జువైదా వద్ద విమానాల నుంచి పారాచూట్ల ద్వారా వస్తున్న ఆహార ప్యాకెట్లను అందుకునేందుకు పరుగులు తీస్తున్న పాలస్తీనా వాసులు

# ఎంపీనీ వదలని చైన్ స్నాచర్లు

- తమిళనాడు ఎంపీ ఆర్ సుధ మార్నింగ్ వాక్ చేస్తుండగా మెడలో గొలుసు లాక్కెళ్లిన దుండగులు
- పెనుగులాటలో స్వల్పగాయాలు
- అత్యంత భద్రత కలిగిన చాణక్యపురి ఏరియాలో ఘటన



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో తమిళనాడు ఎంపీ ఆర్ సుధ చైన్ స్నాచర్ల బారిన పడ్డారు. సోమవారం ఉదయం 6 గంటల వేళ మార్నింగ్ వాక్ చేస్తుండగా బైక్‌పై వచ్చిన దుండగులు ఆమె మెడలో బంగారు గొలుసును తెంపుకుని పరారయ్యారు. ఆమె దుస్తులను చించివేశారు. ఈ సందర్భంగా జరిగిన పెనుగులాటలో ఎంపీ స్వల్పంగా గాయపడ్డారు. వివిధ దేశాల దౌత్య కార్యాలయాలకు నెలవైన అత్యంత భద్రత కలిగిన చాణక్యపురి ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకోవడం సంచలన కలిగించింది. 'దుండగులు గొలుసు లాక్కెళ్లుతుండగా ప్రతిఘటిస్తూ గట్టిగా కేకలు వేశాను. ఎవరూ సాయం చేయలేదు. కొద్దిసేపటి తర్వాత చూస్తే అక్కడికి 200 మీటర్ల దూరంలోనే పోలీస్ గస్తీ వాహనం కనిపించింది. కానీ, వాళ్లు స్పందించలేదు. పార్టీ విప్ మాణిక్యం ఠాగూర్‌కు విషయం చెప్పాను. ఆయన చెప్పాకే పోలీసులు వచ్చారు'అని ఎంపీ చెప్పారు. 'పోలీసులకు, లోక్‌సభ స్పీకర్, హోం మంత్రికి కూడా రాతపూర్వకంగా తెలిపాను'అని పార్లమెంట్ ఆవరణలో మీడియాకు ఎంపీ సుధ తెలిపారు. తమిళనాడు భవన్‌లో ఉంటున్న ఎంపీ సుధ మెడలోని బంగారు గొలుసును తెంపుకెళ్లారని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు. దుండగులను పట్టుకునేందుకు పరిసర ప్రాంతాల్లోని సీసీటీ ఫుటేజీని పరిశీలిస్తున్నామన్నారు. స్నాచింగ్ ఘటన సమయంలో ఆ ప్రాంతంలో అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యక్ష సాక్ష్యుల నుంచి సమాచారం సేకరిస్తున్నారు. ఘటన నేపథ్యంలో తమిళనాడు భవన్, పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశామన్నారు.

**శాంతిభద్రతలున్నాయా?: ప్రతిపక్ష ఎంపీల విమర్శలు**

కాంగ్రెస్‌కు చెందిన లోక్‌సభ ఎంపీ సుధ చైన్ స్నాచర్ల బారినపడటంపై ప్రతిపక్ష పార్టీలకు చెందిన పలువురు ఎంపీలు కేంద్రంపై దుమ్మెత్తిపోశారు. సాక్షాత్తూ దేశ రాజధానిలోనే శాంతి భద్రతలు కరవయ్యాయనడానికి ఇదే నిదర్శనమన్నారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఢిల్లీ పోలీసు విభాగాన్ని నియంత్రించే కేంద్ర హోం శాఖే దీనికి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సాధారణంగా అత్యంత భద్రత కలిగి ఉండే ఈ ప్రాంతంలో ఇలాంటి ఘటన ఎన్నడూ జరగలేదని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ పేర్కొన్నారు. మహిళలకు భద్రత లేకుండా పోయిందని, మహిళలపై నేరాలు పెరిగిపోయాయని ఆరోపించారు. చైన్ స్నాచింగ్ ఘటన అత్యంత దురదృష్టకరమైన ఘటన అని శివసేన(యూబీటీ)ఎంపీ ప్రియాంకా చతుర్వేది అన్నారు. ఢిల్లీ మాజీ సీఎం అతిశీ స్పందిస్తూ.. చాణక్యపురి వంటి వీఐపీ ప్రాంతంలో పార్లమెంట్ సభ్యురాలికే భద్రత లేకుంటే దేశ రాజధానిలో సామాన్య పౌరుడి భద్రత విషయం ఆందోళన కలిగించే అంశమన్నారు.

**రోజుకు 14 స్నాచింగ్‌లు..**

దేశ రాజధాని ఢిల్లీలో చైన్ స్నాచర్లు బరి తెగించారనడానికి స్వయంగా పోలీసు శాఖ వెల్లడించిన గణాంకాలే సాక్ష్యంగా ఉన్నాయి. ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లోనే అంటే జూన్ 30వ తేదీ వరకు ఏకంగా 2,500 చైన్ స్నాచింగ్ ఘటనలు నమోదైనట్లు ఢిల్లీ పోలీసులు అంటున్నారు. ఈ లెక్కన రోజుకు 14 చైన్ స్నాచింగ్ ఘటనలు జరుగుతున్నాయి. ఇదే సమయంలో 2024లో 3,381 కేసులు, 2023లో 3,865 చైన్ స్నాచింగ్ కేసులు నమోదయ్యాయి. వరుసగా కేసుల సంఖ్య తగ్గుతూ వస్తున్నప్పటికీ స్నాచర్ల బెడద మాత్రం తగ్గలేదని తెలుస్తోంది. చోరీచేసిన, రిజిస్టర్ కాని వాహనాలతో స్నాచర్లు వాడుతుండటంతో వారిని పట్టుకోవడం కష్టంగా మారిందని పోలీసులు చెబుతున్నారు. ముందుగా పక్కాగా ప్లాన్ వేసుకుని, స్నాచింగ్ పూర్తి చేసుకున్న వెంటనే కనిపించకుండా పోతున్నారన్నారు. తక్కువ వెలుతురు ఉండే, రద్దీ లేని, సీసీటీవీ నిఘా లేని ప్రాంతాలనే నేరగాళ్లు ఎంచుకుంటున్నారని వివరించారు.

## ఎయిరిండియా విమానంలో బొద్దింకలు

- ప్రయాణికులకు క్షమాపణలు చెప్పిన సంస్థ

**ముంబై:** శాన్ ఫ్రాన్సిస్కో నుంచి ముంబై వస్తున్న ఎయిరిండియా విమానంలో ప్రయాణికులను బొద్దింకలు ఇబ్బంది పెట్టాయి. కోల్‌కతాలో స్టాప్ ఓవర్ ఉన్న ఏఐ 180 విమానంలో ఈ సంఘటన జరిగింది. బొద్దింకలున్నాయంటూ ఇద్దరు ప్రయాణికులు ఫిర్యాదు చేసిన వెంటనే కేబిన్ సిబ్బంది వారిని ఇతర సీట్లకు మార్చారు. ఆ తరువాత కోల్‌కతాలో ఇంధనం నింపడం కోసం ఆగిన సమయంలో గ్రౌండ్ సిబ్బంది విమానాన్ని శుభ్రపరిచారు. ఆ తరువాత విమానం ముంబైలోని దాని తుది గమ్యస్థానం ముంబైకి వెళ్లింది. ''కీటకాలను నివారించడానికి మేం క్రమం తప్పకుండా ఫాగింగ్ చేస్తున్నాం. అయినా కొన్నిసార్లు కీటకాలు విమానంలోకి చొరబడవచ్చు. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి మేం చింతిస్తున్నాం. హృదయపూర్వకంగా క్షమాపణలు కోరుతున్నాం'' అని ఎయిరిండియా ఒక ప్రకటనలో తెలిపింది. అంతేకాదు.. సంఘటనకు మూల కారణాన్ని గుర్తించి, ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపింది.

టాటా గ్రూప్ యాజమాన్యంలోని విమానయాన సంస్థ ఇప్పటికే జాప్యాలు, సేవా పరమైన ఇబ్బందులు, నిర్వహణ సమస్యలతో సహా నిరంతరం సమస్యలను ఎదుర్కొంటోంది. ఇలాంటి సమయంలో ఈ ఘటన జరగడం గమనార్హం. జూన్‌లో డ్రీమ్‌లైనర్ క్రాష్, ఏవియేషన్ నియంత్రణ సంస్థ డీజీసీఏ ఆడిట్‌లో అనేక భద్రతా ఉల్లంఘనలను బయటపడటంతో ఎయిర్‌లైన్ ఇప్పుడు తీవ్ర పరిశీలనలో ఉంది. ఇక, విమానంలో పరిశుభ్రతలో లోపాల కారణంగా ఈ విమానయాన సంస్థ తరచుగా విమర్శలకు గురవుతోంది. గత సెప్టెంబర్‌లో ఢిల్లీ నుంచి న్యూయార్క్ వెళ్లే విమానంలో ఒక ప్రయాణికుడికి ఆమ్లెట్‌లో బొద్దింక కనిపించిందని ఫిర్యాదు చేశారు. దీనికి ముందు, బెంగళూరు నుంచి శాన్ ఫ్రాన్సిస్కో వెళ్తున్న విమానంలో ఫిగ్-చాట్ భోజనంలో బ్లేడ్ కనిపించింది. ఇది ఎయిరిండియాలో ఆహార భద్రతపై మరింత ఆందోళనలను రేకెత్తించింది.

## మా షరతులు అంగీకరిస్తే బందీలకు సాయం చేస్తాం

- ఇజ్రాయెల్‌కు హమాస్ ప్రతిపాదన
- వైమానిక దాడులను నిలిపేయాలి
- మానవతా కారిడార్లు తెరవాలని డిమాండ్

**కైరో:** ఇజ్రాయెల్ కొన్ని షరతులను నెరవేరిస్తే, బందీలకు సహాయం అందించడానికి రెడ్ క్రాస్‌తో సమన్వయం చేసుకోవడానికి తాము సిద్ధమని హమాస్ ఆదివారం తెలిపింది. రెడ్‌క్రాస్‌తో ఏదైనా సమన్వయం కావాలనుకుంటే.. ఇజ్రాయెల్ శాశ్వతంగా మానవతా కారిడార్లను తెరవాలని, సహాయ పంపిణీ సమయంలో వైమానిక దాడులను నిలిపివేయాలని హమాస్ డిమాండ్ చేసింది. ఇజ్రాయెల్ అధికారుల ప్రకారం, గాజాలో ఇప్పుడు 50 మంది బందీలు మిగిలి ఉన్నారు. వారిలో 20 మంది మాత్రమే బతికే ఉన్నారని భావిస్తున్నారు. హమాస్ ఇప్పటివరకు, మానవతా సంస్థలు బందీలను సంప్రదించకుండా నిషేధించింది. వారి పరిస్థితుల గురించి కుటుంబాలకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. కృశించిపోయిన ఇజ్రాయెల్ బందీ డేవిడ్ వీడియో హమాస్ విడుదల చేయగా.. ప్రపంచ దేశాల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. వీడియో.. ఇజ్రాయేలీలను భయభ్రాంతులకు గురి చేయగా.. ఫ్రాన్స్, జర్మనీ, యూకే, యూఎస్‌లు హమాస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశాయి. గాజాలో బందీల పరిస్థితిపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి మంగళవారం ఉదయం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనుందని ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో హమాస్ తాజా ప్రతిపాదన తీసుకొచ్చింది.

దాదాపు రెండేళ్ల యుద్ధం తరువాత.. మానవతా విపత్తు ఎదుర్కొంటున్న గాజాకు ఇంధన సరఫరాను అనుమతించినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది.ఇంధన కొరత ఆసుపత్రుల కార్యకలాపాలకు ఆటంకం కలిగించడంతో పాటు ఆకలి మరణాలు పెరుగుతున్నాయనే భయాల మధ్య ఇజ్రాయెల్ ఈ సడలింపును జారీ చేసింది. ఆదివారం, రెండు ట్రక్కులు ఈజిప్ట్ నుంచి ఇజ్రాయెల్ నియంత్రణలో ఉన్న కారెం అబు సలేం క్రాసింగ్ ద్వారా గాజాలోకి ప్రవేశించాయి. ఆసుపత్రులు, బేకరీలు, పబ్లిక్ కిచెన్‌లకు సహాయం చేయడానికి ఈ వారం చివరిలో మరో నాలుగు ట్యాంకర్లు యూఎన్ ఇంధనం వచ్చే అవకాశం ఉంది. ఆస్పత్రులు, బేకరీలు, పబ్లిక్ కిచెన్లు, ఇతర ముఖ్యమైన సేవల కార్యకలాపాలకు సహాయం చేయడానికి నాలుగు యూఎన్ ఇంధన ట్యాంకర్లు ప్రవేశించాయని సహాయాన్ని సమన్వయం చేసే ఇజ్రాయెల్ సైనిక సంస్థ సీఓజీఏటీ తెలిపింది. కాగా, గత 24 గంటల్లో గాజాలో ఆకలి లేదా పోషకాహార లోపంతో మరో ఆరుగురు మరణించారని దాని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి కరువు కారణంగా మరణించిన వారి సంఖ్య 175కి పెరిగింది. వీరిలో 93 మంది పిల్లలు ఉన్నారు.

## సనాతన సంకెళ్లను తెంచేది విద్య మాత్రమే

- కమల్ హాసన్

**చెన్నై:** నియంతృత్వం, సనాతన ధర్మం సంకెళ్లను తెంచే ఏకైక ఆయుధం విద్య మాత్రమేనంటూ మక్కల్ నీది మయ్యమ్ చీఫ్, రాజ్యసభ ఎంపీ కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. తమిళ నటుడు సూర్య సారథ్యంలోని అగరం ఫౌండేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమల్ మాట్లాడారు. నేషనల్ ఎంట్రన్స్ కమ్ ఎలిజిబిలిటీ టెస్ట్(నీట్) కారణంగా ఎందరో విద్యార్థులు వైద్య విద్యకు నోచుకోవడం లేదన్నారు. వైద్య కళాశాలలో ప్రవేశం పొందాలంటే పరీక్ష రాయడం తప్పనిసరి అనే నిబంధనను మార్చే శక్తి విద్యకు మాత్రమే ఉందన్నారు. అగరం ఫౌండేషన్ కూడా ఈ విషయంలో ఏమీ చేయలేదని పేర్కొన్నారు. 'నిరంకుశత్వం, సనాతన ధర్మం సంకెళ్లను ఛేదించగల ఏకైక ఆయుధం కూడా ఇదే'అని కమల్ అన్నారు. కమల్ ప్రసంగం సమయంలో కార్యక్రమం వేదికపై నటుడు సూర్య కూడా ఉన్నారు. 'ఇతర అంశాల్లో జోక్యం చేసుకోవద్దు. ఎందుకంటే మీరు గెలవలేరు. మెజారిటీ మిమ్మల్ని ఓడిస్తుంది, మెజారిటీ మూర్ఖులు మిమ్మల్ని ఓడిస్తారు. మీ జ్ఞానం ఓడిపోతుంది'అని వ్యాఖ్యలు చేశారు. కమల్ వ్యాఖ్యలపై బీజేపీ సీనియర్ నేత తమిళిసై సుందరరాజన్ తీవ్రంగా స్పందించారు. హిందువుల మనోభావాలను ఆయన అగౌరవపరిచారన్నారు. విద్య అవసరం గురించి మాట్లాడుతూ కమల్ సనాతన్ గురించి వ్యతిరేకంగా ఎందుకు మాట్లాడాల్సి వచ్చిందని ప్రశ్నించారు. మతం పేరుతో ప్రజలను విడదీయాలని ఆయన చూస్తున్నారని ఆరోపించారు. సీఎం స్టాలిన్‌ను పొగడటంలో డీఎంకే నేతల్ని మించి విధేయతను కమల్ ప్రదర్శించారని ఎద్దేవా చేశారు. తమిళం నుంచే కన్నడ పుట్టిందంటూ ఇటీవల కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలు కర్నాటకలో తీవ్ర వివాదాస్పదమయ్యాయి. అదేవిధంగా, 2023లో తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ గతంలో సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేసి, వివాదంలో చిక్కుకోవడం తెల్సిందే.

## 'మాస్క్‌డ్ బూబీ' ముంబైలో ప్రత్యక్షం



**ముంబై:** ఉష్ణమండల ప్రాంతాల్లో తీరానికి సుదూర ప్రాంతాల్లో మాత్రమే కనిపించే మాస్క్‌డ్ బూబీ పక్షి ముంబైలో ప్రత్యక్షమైంది. ఇవి జన సంచారం ఉన్న చోట కనిపించడం చాలా అరుదు, అనూహ్యమని నిపుణులు అంటున్నారు. గోరెగావ్ ఈస్ట్‌లోని ఒక రెసిడెన్షియల్ సొసైటీలోని భవానీ బిల్డింగ్‌లో బుధవారం సాయంత్రం బూబీ బర్డ్ వాలింది. ఎన్నడూ చూడని పక్షి కావడంతో స్థానికులు సునీల్ గుప్తా అనే వన్యప్రాణి సంరక్షకునికి సమాచారమిచ్చారు. ఆయన దానిని జాగ్రత్తగా పట్టుకుని తదుపరి సంరక్షణ కోసం అటవీ శాఖ అధికారులు అందజేశారు. సునీల్ గుప్తా గత పదిహేనేళ్లుగా వన్యప్రాణుల సంరక్షణ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. 'బుధవారం సాయంత్రం 5.10 గంటల సమయంలో రెసిడెన్షియల్ సొసైటీ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. తమ భవనంలోకి ఓ కొత్తరకం పక్షి వచ్చి వాలిందని చెప్పారు. సాయి మొండ్‌కర్ అనే మరో సంరక్షకునితో కలిసి ఆ ప్రాంతానికి హుటాహుటిన వెళ్లాను. పరిశీలించి చూడగా అది అరుదైన జాతికి చెందిన మాస్క్‌డ్ బూబీ పక్షిగా తేలింది' అని గుప్తా చెప్పారు. 'ఇవి సముద్రంలో మారుమూల దీవుల్లో, ముఖ్యంగా అరేబియా సముద్రంలో కనిపిస్తుంటాయి. చేపలు వీటి ఆహారం. తరచూ సమూహాలుగా సంచరిస్తుంటాయి. బలమైన గాలుల తాకిడికో లేదా దారి తప్పో ఇటుగా వచ్చి ఉంటుంది. మనుషులంటే వీటికి చాలా భయం. కాకులు వెంటాడటంతో మరో దారి లేక ఇక్కడికి వచ్చి ఉంటుంది'అని వివరించారు. 'బూబీ అనే పేరు బోబో అనే స్పానిష్ మాట నుంచి వచ్చింది. బోబో అర్థం హాస్యగాడు. చూడటానికి ఇవి నవ్వు తెప్పించేలా ఉంటాయి. అందుకే వీటికా పేరు వచ్చి ఉంటుంది'అని గుప్తా వివరించారు.

**రూపం, లక్షణాలు**

మాస్క్‌డ్ బూబీల తల, ఆపై భాగం బూడిద-గోధుమ రంగులో ఉంటుంది. రెక్కలు ముదురు గోధుమ రంగులో ఉంటాయి. ముక్కులు పసుపు రంగులో కనిపిస్తాయి. వీటి ముఖం నీలం-బూడిద రంగులోనూ, కళ్లు ముదురు గోధుమ రంగులోనూ ఉంటాయి. పెద్దవయ్యేకొద్దీ ఈకలు ప్రధానంగా తెల్లగా మారుతాయి. ఈ జాతి పక్షులు బలమైన ముక్కు, పొడవైన, కోణాల రెక్కలకు ప్రసిద్ధి చెందింది. సముద్రంలోకి డైవ్ చేసి ఎరను పట్టుకోవడానికి ఇవి మాస్క్‌డ్ బూబీలకు ఎంతో అనుకూలంగా ఉంటాయి.

## ధర్మస్థలలో తవ్వకాల ఉత్కంఠ

- రాడార్‌తో స్కాన్ చేయాలని ఫిర్యాదిదారు సూచన
- ఇప్పటికి 11 పాయింట్లలో తవ్వకం

**బనశంకరి:** కర్ణాటకలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ధర్మస్థల పరిసరాలలో వందలాది మంది మృతదేహాలను పూడ్చిపెట్టారనే ఆరోపణల నేపథ్యంలో సిట్ అధికారులు, పోలీసులు ముమ్మరంగా తవ్వకాలు జరుపుతున్నారు. సోమవారంతో తవ్వకాలు 8వ రోజుకు చేరాయి. నేత్రావతి నదీ తీరం, అటవీ ప్రదేశాల్లో మినీ జేసీబీలు, ఎర్త్ మూవర్లతో పాటు పెద్దసంఖ్యలో కూలీలతో అనుమానం ఉన్నచోట తవ్వకాలు సాగిస్తున్నారు. 8, 9, 10 పాయింట్లలో ఆరడుగుల మేర లోతు తవ్వినప్పటికీ ఎలాంటి మృతదేహాలు దొరకలేదు. 11వ పాయింట్ వద్ద సోమవారం తనిఖీలు చేశారు. అస్థిపంజరంలోని కొన్ని భాగాలు, పుర్రె, మనిషి ఎముకలు వంటివి లభించాయి.

**రాడార్‌తో అయితే బెస్ట్...**

రిటైర్డు పారిశుధ్య కార్మికుడు, ఫిర్యాదిదారు అనుమానాస్పద 13 పాయింట్లను పోలీసులకు చూపించాడు. ఇప్పటివరకు కొన్ని ఎముకలు తప్ప ఒక్క అస్థిపంజరం కూడా లభించలేదు. ఈ నేపథ్యంలో ఫిర్యాదిదారు సిట్ అధికారులకు కొత్త సూచన చేశాడు. గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్‌తో అన్వేషించాలని చెప్పారు. ఈ రాడార్‌తో భూమిలోపల ఏముందో తవ్వకుండానే స్కాన్ చేసి చూడవచ్చని చెప్పాడు.

**బాలికను పూడ్చిపెట్టారు**

15 ఏళ్ల క్రితం 15 ఏళ్ల బాలిక శవాన్ని పూడ్చిపెట్టారని సామాజిక కార్యకర్త టి.జయంత్ సిట్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. సోమవారం ఉదయం ధర్మస్థల వద్ద బెళ్తంగడిలో సిట్ ఆఫీసుకు వెళ్లి ఆ బాలికను పూడ్చిపెట్టిన స్థలం చూపిస్తానని తెలిపాడు. సిట్ పోలీసులు ఫిర్యాదు స్వీకరించారు.

## ఒడిశా విద్యార్థి ఆత్మహత్య కేసులో ఏబీవీపీ నేత సహా ఇద్దరు అరెస్టు

**భువనేశ్వర్:** బాలాసోర్‌లో కళాశాల విద్యార్థిని ఆత్మహత్య కేసులో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర సంయుక్త కార్యదర్శితో సహా ఇద్దరు వ్యక్తులను ఒడిశా పోలీసులు అరెస్టు చేశారు. విద్యార్థిని నిప్పంటించుకున్నప్పుడు ఏబీవీపీ నాయకుడు సుభత్ సందీప్ నాయక్, జ్యోతి ప్రకాష్ బిస్వాల్ అక్కడే ఉన్నారని అధికారులు సోమవారం తెలిపారు. తన ఫిర్యాదును ఉపసంహరించుకోవాలని కళాశాల అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ) సమావేశంలో విద్యార్థినిపై ఒత్తిడి చేశారు. అంతేకాదు.. యువతిపైనే చర్యలు తీసుకోవాలంటూ కళాశాల యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావడానికి నిందితుడు సాహూ విద్యార్థుల బృందాన్ని సమీకరించారు. ఈ నేపథ్యంలో ప్రిన్సిపాల్, హెచ్ఓడీ సాహూను గతంలోనే పోలీసులు అరెస్టు చేశారు. వారిని బాధ్యతల నుంచి సస్పెండ్ చేశారు. అనంతరం ఆత్మహత్య చేసుకునే పరిస్థితులకు పురికొల్పిన ఇద్దరు ఏబీవీపీ నేతలను ఇటీవల అరెస్టు చేశారు.

బాలాసోర్‌లోని ఫకీర్ మోహన్ అటానమస్ కాలేజీలో ఇంటిగ్రేటెడ్ బి.ఎడ్ చదువుతున్న 20 ఏళ్ల యువతి.. డిపార్ట్‌మెంట్ హెడ్ సమీర్ కుమార్ సాహూ తనను లైంగికంగా వేధిస్తున్నారని కళాశాల ప్రిన్సిపాల్, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. అంతర్గత కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ, అది పెద్దగా పురోగతి సాధించలేదు. ఇదే విషయమై కళాశాల ప్రిన్సిపాల్‌ను కలిసిన ఆమె.. కొద్దిసేపటికే క్యాంపస్‌లోనే నిప్పంటించుకుంది. ఆమెను మొదట బాలాసోర్ జిల్లా ఆసుపత్రిలో చేర్చి, తరువాత ఎయిమ్స్ భువనేశ్వర్‌కు తరలించారు. 90 శాతం కాలిన గాయాలతో ఆమె ప్రాణాలతో పోరాడింది. పరిస్థితి విషమించడంతో జూలై 14న మరణించింది. వేధింపుల కారణంగా యువతి బాధపడుతోందని తోటి విద్యార్థులు తెలిపారు. సాహూ అనుచిత డిమాండ్లు చేసేవాడని, అంగీకరించకపోతే ఫెయిల్ చేస్తానని బెదిరించేవాడన్నారు.

## తేజస్వీ యాదవ్‌పై కేసు నమోదు

**పట్నా:** బిహార్‌లో ఓటరు జాబితా ముసాయిదాపై వివాదం నేపథ్యంలో ఆర్జేడీ నేత, అసెంబ్లీలో ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్‌పై పట్నాలో కేసు నమోదైంది. ఓటరు గుర్తింపు కార్డులు రెండింటిని కలిగి ఉన్న తేజస్వీ యాదవ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ లాయర్ రాజీవ్ రంజన్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మీడియా సమావేశంలో ప్రదర్శించిన ఓటరు గుర్తింపు కార్డు, అధికారికంగా అందజేసింది కాదని దానిపై విచారణ జరిపేందుకు తమకు అందజేయాలంటూ పట్నాలోని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఆదివారం తేజస్వీని కోరడం తెల్సిందే. ఈసీకి వ్యతిరేకంగా పలు వ్యాఖ్యలు చేసిన తేజస్వీ యాదవ్‌పై చట్టపరంగా ముందుకెళతామని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ పేర్కొన్నారు.

## నేడు ఎన్‌డీఏ పార్లమెంటరీ పార్టీ భేటీ

**న్యూఢిల్లీ:** బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ పార్లమెంటరీ పార్టీ ఎంపీలు నేడు భేటీ కానున్నారు. చాలా కాలం తర్వాత జరుగుతున్న ఈ సమావేశాన్ని ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించనున్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికకు నామినేషన్ల దాఖలు ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభం కానుండగా ఈ భేటీ ఏర్పాటు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఉపరాష్ట్రపతి పదవికి ఎన్‌డీఏ అభ్యర్థిని ఖరారు చేయాల్సి ఉంది. ప్రస్తుత సమీకరణల ప్రకారం అధికార ఎన్‌డీఏ బలపరిచే అభ్యర్థి గెలుపు ఖాయంగా కనిపిస్తోంది. అదేవిధంగా, వర్షాకాల పార్లమెంట్ సెషన్ సగం పూర్తయింది. బిహార్ ఓటరు జాబితా సవరణకు వ్యతిరేకంగా ప్రతిపక్షాల మూకుమ్మడి ఆందోళనలతో పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్‌పై చర్చ మినహా చెప్పుకోదగ్గ ఎలాంటి కార్యక్రమాలను ఈ సెషన్‌లో చేపట్టలేదు. ఆపరేషన్ సిందూర్, పహల్గాం దాడి, ప్రభుత్వానికి అనుకూలంగా ఈసీ వ్యవహరిస్తోందంటూ ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలపై ప్రధాని మోదీ మాట్లాడే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

## ఢిల్లీ చేరుకున్న ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు మార్కోస్

**న్యూఢిల్లీ:** భారత్‌లో ఐదు రోజుల పర్యటనకుగాను ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ ఆర్ మార్కోస్ జూనియర్ సోమవారం ఢిల్లీ చేరుకున్నారు. విమానాశ్రయంలో విదేశాంగ శాఖ సహాయ మంత్రి పబిత్రా మార్గరిటా ఆయనకు స్వాగతం పలికారు. రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు ఉద్దేశించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. మంగళవారం ప్రధాని మోదీతో సమావేశమవుతారు. భారత్-ఫిలిప్పీన్స్ మధ్య దౌత్య సంబంధాలకు 75 ఏళ్లు అవుతున్న సందర్భంగా జరుగుతున్న సందర్భమిది. మార్కోస్ పర్యటన ద్వైపాక్షిక సంబంధాలను మరింత దృఢతరం కానున్నాయి'అని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఎక్స్‌లో పేర్కొన్నారు. అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక మార్కోస్ జూనియర్ మనదేశానికి రావడం ఇదే మొదటిసారి. మార్కోస్ వెంట ప్రథమ మహిళ అరనెటా మార్కోస్, పలువురు మంత్రులు, ప్రముఖులు, వాణిజ్యవేత్తలతో కూడిన ఉన్నతస్థాయి ప్రతినిధి వర్గం ఉంది.



ప్రయాగ్‌రాజ్‌లోని నివాస ప్రాంతాల్లోకి చేరిన వరద

## వానలతో వణుకుతున్న ఉత్తరాది

- ఉత్తరాఖండ్, హిమాచ్‌ప్రదేశ్‌లలో ఆరుగురు మృత్యువాత
- ఉత్తరప్రదేశ్‌లో స్తంభించిన జనజీవనం

**న్యూఢిల్లీ:** ఏకబిగిన కురుస్తున్న వానలతో ఉత్తర భారతం తడిచి ముద్దవుతోంది. ఉత్తరాఖండ్‌లో నీట మునిగి ముగ్గురు చనిపోగా, హిమాచల్ ప్రదేశ్‌లో వరదలో వాహనం కొట్టుకుపోయి మరో ముగ్గురు మృత్యువాతపడ్డారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ వద్ద భాక్రా వరద ఉధృతికి ఒక వ్యక్తి కొట్టుకుపోయాడు. ఇదే జిల్లాలో భుజియాఘాట్ వద్ద ఇద్దరు వ్యక్తులు నీట మునిగారు. రుద్రప్రయాగ్‌లో కొండచరియలు విరిగి పడటంతో రెండు దుకాణాలు బురద మట్టి, రాళ్ల కింద సమాధి అయ్యాయి. డెహ్రాడూన్ జిల్లాలో ఆదివారం రాత్రి కుండపోత వాన కురియడంతో సోమవారం స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు యంత్రాంగం సెలవు ప్రకటించింది. హిమాచల్ ప్రదేశ్‌లోని మండిలో వాహనం లోయలో పడి ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. మగ్రులా వద్ద జరిగిన మరో ఘటనలో రోడ్డుపై వెళ్తున్న వాహనం వర్షం కారణంగా జారి ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఒక జాతీయ రహదారి సహా రాష్ట్రంలోని 310 రోడ్లు దెబ్బతినడంతో మూసివేశామని హిమాచల్ ప్రభుత్వం తెలిపింది. ఉత్తరప్రదేశ్‌లోని గంగ, యమున, బెత్వా నదులు ప్రమాదస్థాయిని మించి ప్రవహిస్తుండటంతో 13 జిల్లాలు వరద దిగ్బంధనంలో చిక్కుకున్నాయి. మొత్తం 24 జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి.

## ట్రేడ్‌మార్క్‌పై ఎవరికీ అనుమతివ్వలేదు

- ఆపరేషన్ సిందూర్‌పై కేంద్రం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ:** ఆపరేషన్ సిందూర్ లేదా ఆప్స్ సిందూర్ ట్రేడ్‌మార్క్ కోసం అందిన దరఖాస్తులకు అనుమతివ్వలేదని కేంద్ర ప్రభుత్వం సోమవారం స్పష్టతనిచ్చింది. రాజ్యసభలో సాగరికా ఘోష్ అడిగిన ప్రశ్నకు పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద ఈ సమాధానమిచ్చారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన దరఖాస్తుల సంఖ్య ఒక్కసారిగా 46కు పెరిగిపోయిందన్న ఆయన..ఇప్పటి వరకు ఎవరికీ అనుమతివ్వలేదన్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఇచ్చిన ఒక దరఖాస్తును మాత్రం ఉపసంహరించుకున్నారని వెల్లడించారు. కేంద్రం ఆపరేషన్ సిందూర్ ప్రకటించిన కొద్ది గంటల్లోనే రిలయన్స్ ఇండస్ట్రీస్ ట్రేడ్ మార్క్ కోసం దరఖాస్తు చేసుకోవడం అప్పట్లో అందరి దృష్టినీ ఆకర్షించడం తెల్సిందే. ప్రైవేట్ వ్యక్తులతోపాటు మీడియా నిర్మాతలు, ఆహార ఉత్పత్తిదారులు, బ్యూటీ బ్రాండ్‌లకు సంబంధించిన పలు సంస్థలు ట్రేడ్ మార్క్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌తోపాటు మిషన్ సిందూర్, సిందూర్ టీవీ, సిందూర్: ది రివెంజ్ వీటితోపాటు లోగో మార్కు కోసం సైతం దరఖాస్తులు అందాయన్నారు. కాగా, ఆపరేషన్ సిందూర్ లోగోకు అధికారిక రక్షణ కల్పించాలని రక్షణ శాఖ కేంద్రాన్ని కోరింది. కేంద్రం రక్షణ శాఖ వినతిని ఆమోదించిన పక్షంలో ట్రేడ్‌మార్క్ కోసం అందిన దరఖాస్తులన్నీ తిరస్కరణకు గురైనట్లే అవుతుంది.

## సూట్‌కేస్‌లో సజీవంగా రెండేళ్ల చిన్నారి

- న్యూజిలాండ్‌లో మహిళ అరెస్ట్

**వెల్లింగ్టన్:** బస్ డ్రైవర్ అప్రమత్తత ఓ చిన్నారి ప్రాణాలను కాపాడింది. న్యూజిలాండ్ రాజధాని ఆక్లాండ్‌కు ఉత్తరాన ఉన్న కైవకాలో వద్ద ఆదివారం ఘటన చోటుచేసుకుంది. ఆక్లాండ్ వైపు వెళ్తున్న ఓ బస్సు కైవకా వద్ద ఆగింది. ఆ సమయంలో ఓ ప్రయాణికుడి కోరిక మేరకు బస్సు డ్రైవర్ లగేజీ కంపార్టుమెంట్ తెరిచారు. ఆ సమయంలో ఓ సూట్‌కేసులో కదలికలను ఆయన గమనించారు. అనుమానంతో వెంటనే దానిని తెరిపించి చూసి, షాక్‌కు గురయ్యారు. అందులో ఓ బాలిక సజీవంగా ఉంది. అప్పటికే ఒళ్లు కాస్తంత వేడెక్కినా చిన్నారికి ఎటువంటి ప్రమాదం జరగనందుకు ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై డ్రైవర్ అధికారులకు సమాచారమిచ్చారు. ఆ సూట్‌కేసును లోపల ఉంచిన మహిళ(27)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చిన్నారిని నిర్లక్ష్యం చేసిందంటూ కేసు నమోదు చేశారు. సోమవారం కోర్టులో హాజరుపరిచారు. మహిళ వివరాలేవీ తెలియరాలేదు. చిన్నారిని ఆస్పత్రిలో చేర్చారు. అయితే, లగేజీ కంపార్టుమెంట్‌లో శిశువు ఎంత సేపు ఉన్నదీ అధికారులు వెల్లడించలేదు.

# రాజపుత్ర, శీలాదిత్య అనే బిరుదులు ధరించిన రాజు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

## జనరల్ స్టడీస్

### భారతదేశ చరిత్ర

1. అశోకుడి ఎన్నో పాలనా సంవత్సరంలో కళింగ యుద్ధం జరిగింది?
   1) 1వ 2) 2వ 3) 8వ 4) 13వ
2. అశోకుడి శాసనాల్లో ఉపయోగించని లిపి?
   1) ఆరామిక్ 2) ఖరోష్ఠి
   3) బ్రాహ్మి 4) సంస్కృతం
3. అశోకుడు శ్రీనగర్ పట్టణ నిర్మాత అని తెలిపే గ్రంథం?
   1) రాజతరంగిణి 2) పరిశిష్ట పర్వన్
   3) అశోకవదన 4) దివ్యవదన
4. అశోకుడి శాసనాలు.. ఎవరి శాసనాలను పోలి ఉన్నాయి?
   1) ఆంటియోకస్-2 2) టాలమీ-2
   3) మాగాస్ 4) డేరియస్
5. మౌర్యుల కాలంలో శిస్తు వసూలుకు అధిపతి?
   1) సమాహర్త 2) సన్నిధాత
   3) రూపదర్శక 4) కరణిక
6. ఏ సమయంలోనైనా తనను కలిసేందుకు ఏ అధికారులకు అశోకుడు అనుమతినిచ్చాడు?
   1) రజ్జుకలు 2) యుక్తలు
   3) పతివేదకులు 4) ధమ్మ మహామాత్రులు
7. సుదర్శన తటాకాన్ని నిర్మించినవారు?
   1) చంద్రగుప్త మౌర్య 2) అశోకుడు
   3) రుద్రదమన 4) ఆర్యాతుషస్ప
8. మౌర్యుల కాలంలో విష్టి అంటే..?
   1) ఒక రాష్ట్రం 2) ఒక జిల్లా
   3) బలవంతపు శ్రమ 4) ఒక నాణెం
9. పన్నుల వ్యవస్థను ప్రస్తావించిన అశోకుని శాసనం?
   1) రుమ్మిందై శాసనం
   2) నిగాలిసాగర్ శాసనం
   3) కాందహార్ శాసనం
   4) బారాబర్ శాసనం
10. మౌర్యుల కాలంలో గొప్ప విద్యాకేంద్రం?
    1) తక్షశిల 2) ఉజ్జయినీ
    3) నలంద 4) వల్లభి
11. రాణి శాసనంలో పేర్కొన్న అశోకుడి రాణి ఎవరు?
    1) విదీష మహాదేవి 2) అసంధిమిత్ర
    3) కారువాకి 4) తిస్యరక్షిత
12. మౌర్యుల ఆస్థానానికి రాయబారిగా రానివారు?
    1) మెగస్తనీస్ 2) డైమాకస్
    3) డైనోసియస్ 4) పాట్రోకిల్స్
13. మెగస్తనీస్ ప్రకారం.. మౌర్యుల కాలంలో సమాజాన్ని ఎన్ని వర్గాలుగా విభజించారు?
    1) రెండు 2) నాలుగు
    3) ఆరు 4) ఏడు
14. 'ఒకే చక్రంతో బండి ఏ విధంగా నడవలేదో పరిపాలన కూడా ఒకే వ్యక్తి ద్వారా నడవలేదు' అని వ్యాఖ్యానించినవారు?
    1) మెగస్తనీస్ 2) కౌటిల్యుడు
    3) చంద్రగుప్తుడు 4) వి.ఎ. స్మిత్
15. అశోకుడు ధమ్మ ప్రచారానికి చేపట్టిన చర్యల్లో లేనిది?
    1) ధమ్మ గురించి తెలుపుతూ శిలా శాసనాలు, స్తంభ శాసనాల జారీ
    2) ధమ్మ మహామాత్రల నియామకం
    3) స్వీయ ధమ్మ యాత్రలు చేయడం
    4) ధమ్మ ఉల్లంఘనకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించడం
16. అశోకుడు ఏటా తన పట్టాభిషేక దినోత్సవం సందర్భంగా మానవతా దృక్పథంతో కొంత మంది ఖైదీలను విడుదలచేసేవారని తెలిపే శాసనం?
    1) 5వ స్తంభ శాసనం
    2) మొదటి శిలాశాసనం
    3) 13వ శిలాశాసనం
    4) 4వ స్తంభ శాసనం
17. భారతదేశంలో తొలిసారిగా నౌకాదళాన్ని ఏర్పాటు చేసిన పాలకులు?
    1) నందరాజులు 2) మౌర్యులు
    3) కుషాణులు 4) గుప్తులు
18. మౌర్యుల కాలంలో ఎంత శాతం భూమిశిస్తు (భాగ)గా వసూలు చేశారు?
    1) 1/8 2) 1/6 - 1/4
    3) 1/3 4) 1/2
19. మౌర్యులు గయ వద్ద నిర్మించిన గుహల్లో అతిపెద్దది?
    1) కర్ణచౌపార గుహ 2) సుధాముని గుహ
    3) లోమస రుషి గుహ 4) గోపికా గుహ
20. సముద్రగుప్తుడి అలహాబాద్ ప్రశస్తిపై ఏయే రాజుల శాసనాలు ఉన్నాయి?
    1) అశోకుడు, జహంగీర్
    2) అశోకుడు, కనిష్కుడు
    3) జహంగీర్, ఫిరోజ్ షా తుగ్లక్
    4) అశోకుడు, అక్బర్
21. అశోకుడిలానే 'దేవానాం ప్రియ' అనే బిరుదు ధరించిన మౌర్యచక్రవర్తి ఎవరు?
    1) సంప్రతి 2) బిందుసారుడు
    3) దశరథుడు 4) బృహద్రథుడు
22. అశోకుడి సామ్రాజ్యంలో లేని ప్రాంతం?
    1) కేరళ 2) తమిళనాడు
    3) కాశ్మీర్ 4) 1, 2
23. అశోకుడు తన పొరుగు రాజులుగా కింది వారిలో ఎవరిని పేర్కొన్నాడు?
    1) చోళులు, పాండ్యులు 2) సత్య పుత్రులు
    3) కేరళ పుత్రులు 4) పైవారందరూ
24. కౌటిల్యుడు పేర్కొన్న సప్తాంగాల్లో లేనిది?
    1) స్వామి 2) కోశ 3) ప్రదేశ 4) దండ
25. గ్రీకు రాజ్యాల్లో అశోకుడి సమకాలీనులు కానివారు?
    1) ఆంటియోకస్ 2) మాగాస్
    3) జెక్సెస్ 4) టాలమీ ఫిలడెల్ఫస్
26. ఎడమ నుంచి కుడికి, కుడి నుంచి ఎడమకి రాసిన అశోకుడి శిలా శాసనం ఏది?
    1) ఎర్రగుడి సూక్ష్మ శిలాశాసనం
    2) లంపక శిలాశాసనం
    3) షాబాజ్‌గరి శిలాశాసనం
    4) మాన్‌షేరా శిలాశాసనం
27. మౌర్య ప్రభుత్వ గుత్తాధిపత్యం లేని అంశం?
    1) అడవులు 2) గనులు
    3) రేవులు 4) జూద గృహాలు
28. మౌర్యుల పాలనా భాష?
    1) సంస్కృతం 2) ప్రాకృతం
    3) ఖరోష్ఠి 4) అర్ధమాగధి
29. కిందివాటిలో మౌర్యుల రాగి నాణెం ఏది?
    1) పణం 2) సువర్ణం
    3) నిష్క 4) మషాక
30. జాతీయ పాలకుడిగా పేరొందిన తొలి భారతీయ రాజు?
    1) చంద్రగుప్త మౌర్య 2) అశోకుడు
    3) సముద్రగుప్తుడు 4) అక్బర్
31. అలెగ్జాండర్ తర్వాత భారతదేశ లోపలి ప్రాంతాలపై దండయాత్ర చేసిన గ్రీకు రాజు?
    1) యూథిడియస్ 2) యూకటైడస్
    3) డెమిట్రియస్ 4) మినాండర్
32. మహేశ్వర అనే బిరుదును ధరించిన విదేశీ రాజు?
    1) కుజుల కాడ్‌ఫైసెస్
    2) ఆంటియాల్ సిడాస్
    3) విమా కాడ్‌ఫైసెస్ 4) హెలియో డోరస్
33. వీమా కాడ్‌ఫైసెస్ ఆదరించిన శైవమత శాఖ?
    1) పాశుపతం 2) కాపాలికం
    3) కాలాముఖం 4) అఘోర శైవం
34. పాంచావో అనే చైనా సేనాని చేతిలో ఓడిన కుషాణ చక్రవర్తి?
    1) కుజుల కాడ్‌ఫైసెస్ 2) కనిష్కుడు
    3) వీమా కాడ్‌ఫైసెస్ 4) హువిష్కుడు



35. కనిష్కుడు ఎవరి సలహాపై కుండల వనంలో నాలుగో బౌద్ధ సంగీతి నిర్వహించాడు?
    1) వసుమిత్రుడు 2) అశ్వఘోషుడు
    3) శీలభద్రుడు 4) పార్శ్వ
36. శివుడు, నంది గుర్తు కలిగిన నాణేలను జారీ చేసిన కుషాణ చక్రవర్తి?
    1) హువిష్కుడు 2) వాసుదేవుడు
    3) రెండో కనిష్కుడు 4) వశిష్కుడు
37. ఎవరి పాలనా కాలంలో కశ్యపమాతంగ చైనాలో బౌద్ధాన్ని ప్రవేశపెట్టారు?
    1) మౌర్యులు 2) శుంగులు
    3) శకులు 4) కుషాణులు
38. హుయాన్‌త్సాంగ్ ప్రకారం హర్షుడు చాతుర్వర్ణాల్లోని ఏ వర్ణానికి చెందినవాడు?
    1) బ్రాహ్మణ 2) క్షత్రియ
    3) వైశ్య 4) శూద్ర
39. స్థానేశ్వర్ నుంచి కనౌజ్‌కు రాజధానిని మార్చిన ఉత్తర భారతదేశ రాజు?
    1) నరవర్ధన 2) ఆదిత్యవర్ధన
    3) ప్రభాకరవర్ధన 4) హర్షవర్ధన
40. హర్షుడి చేతిలో ఓడిన వల్లభి పాలకుడు?
    1) రెండో ధ్రువసేనుడు
    2) రెండో ప్రవరసేనుడు
    3) మూడో ధ్రువసేనుడు
    4) మూడో ప్రవరసేనుడు
41. హర్షుడి దిగ్విజయ యాత్రలకు నాయకత్వం వహించిన సేనాపతి ఎవరు?
    1) దండి 2) భండి
    3) వ్యాఘ్రకేతు 4) నిర్ఘాత
42. సకలోత్తరపథేశ్వర అనే బిరుదు ఉన్న రాజు ఎవరు?
    1) గ్రహవర్మ 2) శశాంక
    3) హర్ష 4) భాస్కరవర్మ
43. భారతదేశ చరిత్రలో తొలిసారిగా అధికారులకు భూదానాలు చేసిన రాజవంశం?
    1) శాతవాహనులు 2) గుప్తులు
    3) ఇక్ష్వాకులు 4) పుష్యభూతులు
44. ఏ వర్గాన్ని హుయాన్‌త్సాంగ్ వ్యవసాయదారులుగా పేర్కొన్నాడు?
    1) బ్రాహ్మణులు 2) క్షత్రియులు
    3) వైశ్యులు 4) శూద్రులు
45. బాణుడి ప్రకారం హర్షుడి కాలంలో సర్వసాధారణమైపోయిన దురాచారం?
    1) సతీసహగమనం 2) వరకట్నం
    3) కన్యాశుల్కం
    4) వితంతు వివాహాల నిషేధం
46. హర్షుడు ఆదరించిన మతం?
    1) హిందూ మతం 2) బౌద్ధ మతం
    3) జైన మతం 4) వైష్ణవ మతం
47. హర్షుడి కాలంలో అధికంగా వ్యాప్తిలో ఉన్న మతం?
    1) వైష్ణవం 2) బౌద్ధం 3) శైవం 4) జైనం
48. ఉత్తర భారతదేశాన్ని పాలించిన చివరి గొప్ప హిందూ చక్రవర్తిగా ఎవరిని పేర్కొంటారు?
    1) సముద్రగుప్తుడు 2) హర్షవర్ధనుడు
    3) రెండో చంద్రగుప్తుడు
    4) యశోధర్ముడు
49. రాజపుత్ర, శీలాదిత్య అనే బిరుదులు ధరించిన రాజు?
    1) రెండో పులకేశి
    2) మొదటి మహేంద్రవర్మ
    3) హర్షుడు 4) రెండో నరసింహవర్మ
50. రెండో పులకేశి ఏ యుద్ధంలో మొదటి మహేంద్రవర్మను అంతం చేశాడు?
    1) పుల్లలూరు యుద్ధం
    2) కొప్పం యుద్ధం 3) సంగమేశ్వర యుద్ధం
    4) మణిమంగళ యుద్ధం
51. గుజరాత్‌పై అరబ్బుల దాడిని తిప్పికొట్టిన చాళుక్యరాజు?
    1) రెండో పులకేశి
    2) మొదటి విక్రమాదిత్యుడు
    3) రెండో విక్రమాదిత్యుడు
    4) రెండో కీర్తివర్మ
52. రెండో పులకేశి క్రీ.శ.642లో జరిగిన ఏ యుద్ధంలో మొదటి నరసింహవర్మ చేతిలో అంతమయ్యాడు?
    1) మణిమంగళ యుద్ధం
    2) కంచి యుద్ధం 3) అనిల్‌వారా యుద్ధం
    4) బనవాసి యుద్ధం
53. బాదామీ చాళుక్యుల రాజ చిహ్నం?
    1) వరాహం 2) వృషభం
    3) సింహం 4) పులి
54. ఐహోల్ శాసనాన్ని రచించిన వారు?
    1) హరిసేనుడు 2) రవికీర్తి
    3) మొదటి పులకేశి 4) బాణుడు
55. అవనీసింహ అనే బిరుదున్న పల్లవ రాజు?
    1) సింహవిష్ణు 2) రెండో నరసింహవర్మ
    3) మొదటి మహేంద్రవర్మ
    4) మొదటి పరమేశ్వర వర్మ
56. మహాబలిపురంలోని ఆదివరాహ దేవాలయంలో ఉన్న పల్లవరాజు విగ్రహం ఎవరికి సంబంధించింది?
    1) మొదటి నరసింహవర్మ
    2) రెండో నరసింహవర్మ
    3) సింహవిష్ణు 4) అపరాజిత వర్మ
57. ఏ పల్లవరాజును సైనికుడు, పాలనాదక్షుడు, మత సంస్కర్త, భవన నిర్మాత, కవి, సంగీతకారుడు అని పిలిచేవారు?
    1) రెండో నరసింహవర్మ
    2) మొదటి మహేంద్రవర్మ
    3) రెండో పరమేశ్వరవర్మ
    4) రెండో నందివర్మ

**సమాధానాలు**

| | | | | |
|---|---|---|---|---|
| 1) 3 | 2) 4 | 3) 1 | 4) 4 | 5) 1 |
| 6) 3 | 7) 1 | 8) 3 | 9) 1 | 10) 1 |
| 11) 3 | 12) 4 | 13) 4 | 14) 2 | 15) 4 |
| 16) 1 | 17) 2 | 18) 2 | 19) 4 | 20) 1 |
| 21) 3 | 22) 4 | 23) 4 | 24) 4 | 25) 3 |
| 26) 1 | 27) 4 | 28) 2 | 29) 4 | 30) 1 |
| 31) 3 | 32) 3 | 33) 1 | 34) 2 | 35) 4 |
| 36) 2 | 37) 4 | 38) 3 | 39) 4 | 40) 1 |
| 41) 2 | 42) 3 | 43) 4 | 44) 4 | 45) 2 |
| 46) 2 | 47) 3 | 48) 4 | 49) 3 | 50) 1 |
| 51) 3 | 52) 1 | 53) 1 | 54) 2 | 55) 1 |
| 56) 3 | 57) 2 | | | |

# మిష్మి కొండలు ఏ రాష్ట్రంలో ఉన్నాయి?




**మాదిరి ప్రశ్నలు**

1. భారత్‌తో అత్యధిక భూసరిహద్దును పంచుకుంటున్న దేశం ఏది?
   1) చైనా 2) నేపాల్
   3) పాకిస్తాన్ 4) బంగ్లాదేశ్
2. కర్కాటక రేఖ (23½° ఉత్తర అక్షాంశం) కింద పేర్కొన్న ఏ రాష్ట్రం ద్వారా వెళ్లదు?
   1) మిజోరాం 2) త్రిపుర
   3) మేఘాలయ 4) జార్ఖండ్
3. సింధూనదిని 'ఇండస్' అని ఎవరు పిలిచారు?
   1) పర్షియన్లు 2) గ్రీకులు
   3) డచ్‌వారు 4) ఫ్రెంచ్‌వారు
4. భారతదేశ ఉత్తర, దక్షిణ చివరల మధ్య దూరం ఎంత?
   1) 3,214 కి.మీ. 2) 2,933 కి.మీ.
   3) 1,324 కి.మీ. 4) 3,514 కి.మీ.
5. 82½° తూర్పు రేఖాంశం ఎన్ని రాష్ట్రాల ద్వారా వెళుతోంది?
   1) 6 2) 7
   3) 8 4) 5
6. రాడ్‌క్లిఫ్ రేఖ ఏ దేశాల మధ్య సరిహద్దుగా ఉంది?
   1) భారత్ - పాకిస్తాన్
   2) భారత్ - చైనా
   3) భారత్ - మయన్మార్
   4) భారత్ - బంగ్లాదేశ్
7. పాంబన్ దీవి వేటి మధ్య ఉంది?
   1) భారత్ - శ్రీలంక
   2) భారత్ - మాల్దీవులు
   3) భారత్ - ఇండోనేషియా
   4) భారత్ - మారిషస్
8. కింద పేర్కొన్న ఏ రాష్ట్రాలకు తీరరేఖ, విదేశాలతో భూ సరిహద్దు ఉన్నాయి?
   1) గుజరాత్, మహారాష్ట్ర
   2) గుజరాత్, పశ్చిమబెంగాల్
   3) పశ్చిమబెంగాల్, త్రిపుర
   4) పశ్చిమబెంగాల్, తమిళనాడు
9. లక్షదీవుల రాజధాని ఏది?
   1) సిల్వస్సా 2) పోర్ట్‌బ్లెయిర్
   3) కవరత్తి 4) పాండిచ్చేరి
10. మలబార్ తీరం ఏ రాష్ట్రానికి ఉంది?
    1) గోవా 2) మహారాష్ట్ర
    3) కేరళ 4) ఒడిశా
11. 'డంకన్ పాస్' వేటి మధ్య ఉంది?
    1) ఉత్తర అండమాన్, తూర్పు అండమాన్
    2) అండమాన్, నికోబార్ దీవులు
    3) ఉత్తర అండమాన్, దక్షిణ అండమాన్
    4) గ్రేట్ అండమాన్, లిటిల్ అండమాన్
12. భారతదేశంలోని మొత్తం దీవుల (Distant Islands) సంఖ్య?
    1) 240 2) 247
    3) 204 4) 194
13. ఎవరెస్ట్ శిఖరాన్ని నేపాల్‌లో ఏ పేరుతో పిలుస్తారు?
    1) జోంగ్‌మా 2) కోమలాంగిని
    3) సాగరమాత 4) చోగొరి
14. మిష్మి కొండలు ఏ రాష్ట్రంలో ఉన్నాయి?
    1) ఉత్తరాఖండ్ 2) నాగాలాండ్
    3) అరుణాచల్ ప్రదేశ్
    4) బీహార్
15. భారతదేశంలో ఎత్తైన కనుమ ఏది?
    1) బుర్జిలా 2) కారకోరం
    3) ఖార్దూంగ్లా 4) జోజిలా
16. పీర్ పంజాల్, ధౌలాధార్ పర్వత శ్రేణులు ఎక్కడ ఉన్నాయి?
    1) హిమాద్రి హిమాలయాలు
    2) హిమాచల్ హిమాలయాలు
    3) శివాలిక్ కొండలు
    4) ట్రాన్స్ హిమాలయాలు
17. భారతదేశంలో అతిపెద్ద నదీ ఆధారిత దీవి ఏది?
    1) గోవిందసాగర్ 2) మజులీ
    3) భైసాలా 4) ఏదీకాదు
18. సాత్పురా పర్వతాల్లో ఎత్తైన శిఖరం ఏది?
    1) అమర్ కంటక్ 2) మైకుల
    3) పంచమర్హి 4) ధవళగిరి
19. హిమాలయాలు ఏ యుగంలో ఆవిర్భవించాయి?
    1) ప్లిస్టోసీన్ 2) టెర్షియోరరీ
    3) కేంబ్రియన్ 4) ఏదీకాదు
20. సర్వే ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
    1) అమృత్‌సర్ 2) సిమ్లా
    3) డెహ్రాడూన్ 4) త్రివేండ్రం
21. కొడైకెనాల్ ఏ కొండల్లో ఉంది?
    1) యాలకుల కొండలు
    2) పళని కొండలు
    3) బాబా బుడాన్ గిరికొండలు
    4) తమిళనాడు కొండలు
22. మహేంద్రగిరి శిఖరం ఏ పర్వతాల్లో ఉంది?
    1) వింధ్య 2) సాత్పురా
    3) పశ్చిమ కనుమలు
    4) తూర్పు కనుమలు
23. ముంబై - నాసిక్‌ను కలిపే కనుమ ఏది?
    1) థాల్‌ఘాట్ 2) బోర్‌ఘాట్
    3) పాల్‌ఘాట్ 4) కలహట్టి
24. సాడిల్ పీక్ ఎక్కడ ఉంది?
    1) నికోబార్ దీవులు 2) అండమాన్ దీవులు
    3) సుహేలి దీవులు 4) మినికాయ్ దీవులు
25. 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ' ఎక్కడ ఉంది?
    1) చెన్నై 2) పనాజీ
    3) బెంగళూరు 4) కొచ్చిన్
26. 'గ్రీష్మ రుతువు' కాలం ఏది?
    1) మార్చి, ఏప్రిల్ 2) మే, జూన్
    3) జూలై, ఆగస్టు 4) సెప్టెంబర్, అక్టోబర్
27. భారత వాతావరణ పరిశోధన కేంద్రం ఎక్కడ ఉంది?
    1) కోల్‌కతా 2) హైదరాబాద్
    3) పుణే 4) బెంగళూరు
28. అధిక వర్షపాతం సంభవించే 'మాసిన్ రామ్' ఏ రాష్ట్రంలో ఉంది?
    1) మణిపూర్ 2) అసోం
    3) నాగాలాండ్ 4) మేఘాలయ
29. జాతీయ వరద నియంత్రణ కార్యక్రమాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
    1) 1956 2) 1975
    3) 1954 4) 1974
30. భారతదేశంలో ఎత్తైన జలపాతం ఏది?
    1) దూద్‌సాగర్ 2) జోగ్
    3) రకిమ్‌కుండ్ 4) కుంతల
31. కాలబైశాఖీలు అనే రుతుపవన ఆరంభ జల్లులు ఏ రాష్ట్రంలో కురుస్తాయి?
    1) ఉత్తరప్రదేశ్ 2) పశ్చిమబెంగాల్
    3) అసోం 4) కేరళ
32. లానినో, ఎల్‌నినోలు ఎక్కడ సంభవిస్తాయి?
    1) హిందూ మహాసముద్రం
    2) పసిఫిక్ మహాసముద్రం
    3) అట్లాంటిక్ మహాసముద్రం
    4) బంగాళాఖాతం
33. భారతదేశంలో అత్యధికంగా వర్షపాతాన్నిచ్చే రుతుపవనాలు ఏవి?
    1) ఆగ్నేయ రుతుపవనాలు
    2) వాయువ్య రుతుపవనాలు
    3) నైరుతి రుతుపవనాలు
    4) ఈశాన్య రుతుపవనాలు
34. ఈశాన్య రుతుపవనాల వల్ల అధికంగా వర్షపాతం పొందే రాష్ట్రం ఏది?
    1) కేరళ 2) కర్ణాటక
    3) ఆంధ్రప్రదేశ్ 4) తమిళనాడు
35. విస్తీర్ణపరంగా అడవులు ఎక్కువగా ఉన్న రాష్ట్రం ఏది?
    1) మధ్యప్రదేశ్ 2) ఛత్తీస్‌గఢ్
    3) మిజోరాం 4) ఉత్తరప్రదేశ్
36. తీర ప్రాంతాల్లో అత్యధికంగా తుపాన్లకు గురయ్యే రాష్ట్రం ఏది?
    1) తమిళనాడు 2) ఒడిశా
    3) గోవా 4) అసోం
37. భారతదేశంలో అత్యల్ప వర్షపాతం నమోదయ్యే ప్రాంతం ఏది?
    1) లడక్ 2) బికనీర్
    3) లే 4) జైసల్మీర్
38. మనదేశంలో అధిక విస్తీర్ణంలో ఉన్న అడవులు ఏవి?
    1) క్షారజల అరణ్యాలు
    2) సతతహరిత అరణ్యాలు
    3) ఆకురాల్చే అడవులు
    4) చిట్టడవులు
39. దచిగామ్ దుప్పి వన్యప్రాణి సంరక్షణ కేంద్రం ఏ రాష్ట్రంలో ఉంది?
    1) ఉత్తరాంచల్ 2) జమ్ము-కశ్మీర్
    3) బీహార్ 4) హిమాచల్ ప్రదేశ్
40. అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని ఎప్పుడు నిర్వహిస్తారు?
    1) మార్చి 21 2) మార్చి 22
    3) మార్చి 29 4) మార్చి 24
41. 'ప్రాజెక్ట్ ఎలిఫెంట్'ను ఎప్పుడు ప్రారంభించారు?
    1) 1992 2) 1991
    3) 1990 4) 1994
42. మనదేశంలో మొదటి టైగర్ రిజర్వ్ కేంద్రం ఏది?
    1) కజిరంగా 2) బందీపూర్
    3) నామ్‌దఫా 4) సిమిపాల్
43. భారతదేశంలో అత్యధిక విస్తీర్ణంలో ఉన్న నేలలేవి?
    1) చిత్తడి నేలలు 2) ఒండలి నేలలు
    3) నల్ల నేలలు 4) ఎర్ర నేలలు
44. సాయిల్ అండ్ ల్యాండ్ యూజ్ సర్వే ఆఫ్ ఇండియాను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1951 2) 1954
    3) 1958 4) 1960
45. కేంద్రీయ అటవీ నేలల పరిశోధన సంస్థ ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
    1) బళ్లారి 2) కోటా
    3) పసద్ 4) ఊటీ
46. చేతివేళ్ల ఆకారంలో జరిగే క్రమక్షయాన్ని ఏమంటారు?
    1) వట క్రమక్షయం 2) వంక క్రమక్షయం
    3) అవనాళికా క్రమక్షయం
    4) వాలు క్రమక్షయం
47. వరి పంటను ఏ మృత్తికల్లో అత్యధికంగా పండిస్తారు?
    1) ఎర్ర నేలలు 2) ఒండ్రు నేలలు
    3) నల్లరేగడి నేలలు 4) జేగురు నేలలు
48. వేదకాలంలో 'చంద్రభాగ'గా పేర్కొన్న నది ఏది?
    1) రావి 2) చినాబ్
    3) బియాస్ 4) సట్లేజ్
49. బ్రహ్మపుత్ర నదిని బంగ్లాదేశ్‌లో ఏమని పిలుస్తారు?
    1) మజిలీ 2) పద్మా
    3) మేఘన 4) ఐరావతి
50. 'దక్షిణ గంగ' అని ఏ నదిని పిలుస్తారు?
    1) నర్మద 2) తపతి
    3) గోదావరి 4) కృష్ణా
51. రామ్‌గంగ తీరంలో ఉన్న కాంస్య నగరం ఏది?
    1) ఉజ్జయినీ 2) రూర్కెలా
    3) మొరాదాబాద్ 4) ఫిరోజ్‌పూర్
52. 'కూడంకుళం అణు విద్యుత్ కేంద్రం' ఏ రాష్ట్రంలో ఉంది?
    1) రాజస్థాన్ 2) గుజరాత్
    3) ఉత్తరప్రదేశ్ 4) తమిళనాడు
53. దేశంలో అతిపెద్ద మంచినీటి సరస్సు ఏది?
    1) సాంబర్ 2) ఊలార్
    3) చిల్కా 4) లోక్‌తక్
54. బాగ్లీహార్ ప్రాజెక్ట్ విషయంలో భారత్‌కు ఏ దేశంతో వివాదం ఉంది?
    1) నేపాల్ 2) చైనా
    3) బంగ్లాదేశ్ 4) పాకిస్తాన్
55. బాబ్లీ ప్రాజెక్టు ఏ రెండు రాష్ట్రాల మధ్య వివాదాస్పదమైంది?
    1) కర్ణాటక -ఆంధ్రప్రదేశ్
    2) మహారాష్ట్ర - తెలంగాణ
    3) తమిళనాడు -కర్ణాటక
    4) కేరళ - తమిళనాడు

**సమాధానాలు**

| | | | | |
|---|---|---|---|---|
| 1) 4; | 2) 3; | 3) 2; | 4) 1; | 5) 4; |
| 6) 1; | 7) 1; | 8) 2; | 9) 3; | 10) 3; |
| 11) 4; | 12) 2; | 13) 3; | 14) 3; | 15) 3; |
| 16) 2; | 17) 2; | 18) 3; | 19) 2; | 20) 3; |
| 21) 2; | 22) 4; | 23) 2; | 24) 2; | 25) 2; |
| 26) 2; | 27) 3; | 28) 4; | 29) 3; | 30) 2; |
| 31) 2; | 32) 2; | 33) 3; | 34) 4; | 35) 1; |
| 36) 2; | 37) 4; | 38) 3; | 39) 2; | 40) 1; |
| 41) 1; | 42) 2; | 43) 4; | 44) 3; | 45) 4; |
| 46) 2; | 47) 2; | 48) 2; | 49) 3; | 50) 3; |
| 51) 3; | 52) 4; | 53) 2; | 54) 4; | 55) 2. |

## విద్య, ఉద్యోగ సమాచారం

### రాష్ట్రీయ రక్షా యూనివర్శిటీలో వివిధ ఉద్యోగాలు

గుజరాత్‌లోని రాష్ట్రీయ రక్షా యూనివర్సిటీ(ఆర్ఆర్‌యూ)లో ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **పోస్టులు:** స్పోర్ట్స్ ట్రైనింగ్ ఆఫీసర్(ఫుట్‌బాల్), రీసెర్చ్ ఆఫీసర్, ఇంటర్న్‌షిప్, ట్రైనింగ్-ప్లేస్‌మెంట్ అసోసియేట్.

» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిప్లొమా, డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

» **వేతనం:** నెలకు స్పోర్ట్స్ ట్రైనింగ్ ఆఫీసర్‌కు రూ.56,100, రీసెర్చ్ ఆఫీసర్‌కు రూ.56,010, ప్లేస్‌మెంట్ అసోసియేట్‌కు రూ.41,061.

» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును స్కూల్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ రాష్ట్రీయ రక్షా యూనివర్శిటీ విలేజ్-లవడ్, తెహసిల్-దహెగామ్ జిల్లా-గాంధీనగర్, గుజరాత్-382305 చిరునామకు పంపించాలి.

» **దరఖాస్తులకు చివరితేది:** 12.08.2025.

» **వెబ్‌సైట్:** https://rru.ac.in

### ట్రిపుల్ఐటీ డీఎం, కాంచీపురంలో 27 నాన్ టీచింగ్ పోస్టులు

కాంచీపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ట్రిపుల్ ఐటీ) రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 27.

» **పోస్టుల వివరాలు:** జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్-03, జూనియర్ టెక్నీషియన్-13, జూనియర్ అసిస్టెంట్-11.

» **విభాగాలు:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఫిజిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, డిజైన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఫిజిక్స్, ఇన్‌స్టిట్యూట్ కంప్యూటర్ సెంటర్.

» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఈ/బీటెక్, డిగ్రీ, ఎంఎస్సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.

» **వయసు:** జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్‌కు 32 ఏళ్లు, ఇతర పోస్టులకు 27 ఏళ్లు మించకూడదు.

» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ట్రేడ్/స్కిల్ టెస్ట్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**14.08.2025

» **వెబ్‌సైట్:** https://iiitdm.ac.in

# లుంబినీ వనంలో శిలాశాసనాన్ని ప్రతిష్టించినవారు?

## మాదిరి ప్రశ్నలు

1. కట్టె మనది.. కలప మనది.. అడవి మనది... భూమి మనది! అనే నినాదంతో గోండులు, కోయలు, చెంచులను సంఘటితం చేసి పోరుబాటలో నడిపించింది ఎవరు?
   1) గాంగంటం దొర
   2) అల్లూరి సీతారామరాజు
   3) కొమరం భీమ్ 4) అగ్గిరాజు
2. వితంతు పునర్వివాహ సంఘాన్ని మద్రాసులో ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   1) 1871 2) 1872
   3) 1873 4) 1874
3. మహారాష్ట్రులు, నిజాం మధ్య 1738లో జరిగిన యుద్ధం ఏది?
   1) బొబ్బిలి యుద్ధం
   2) ఔరంగాబాద్ యుద్ధం
   3) భోపాల్ యుద్ధం
   4) రెండో కర్ణాటక యుద్ధం
4. 1948 ఏప్రిల్‌లో ఏర్పాటైన లాయర్ల నిరసన సమితి అధ్యక్షుడు?
   1) వినాయకరావు విద్యాలంకార్
   2) జమలాపురం కేశవరావు
   3) వి.పి.మీనన్
   4) బొమ్మకంటి సత్యనారాయణ
5. స్వామి రామానందతీర్థ వ్యక్తిగత సత్యాగ్రహాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
   1) 1941 2) 1940
   3) 1939 4) 1938
6. వందేమాతర ఉద్యమ కాలంలో జి.సుబ్రమణ్య అయ్యర్ సంపాదకత్వంలో వెలువడిన పత్రిక?
   1) దేశమాత 2) స్వదేశీ మిత్రన్
   3) ఆంధ్రపత్రిక 4) స్వరాజ్య
7. గోల్కొండ రాజ్యాన్ని మొగలు సామ్రాజ్యంలో ఔరంగజేబు ఎప్పుడు విలీనం చేశాడు?
   1) 1687 2) 1677
   3) 1697 4) 1667
8. 'యథాపూర్వస్థితి ఒడంబడిక' మీద నిజాం సంతకం చేసిన తర్వాత ఏ ప్రాంతం నుంచి భారత సైన్యాలు ఉపసంహరించుకున్నాయి?
   1) సికింద్రాబాద్ 2) బొల్లారం
   3) తిరుమలగిరి 4) పైవన్నీ
9. పోలీసు చర్య తర్వాత 1948లో నిజాం పాలన ముగిసింది. 'అఖిలాంధ్ర మహాసభ'ను 1949లో ఎవరు నెలకొల్పారు?
   1) అయ్యదేవర కాళేశ్వరరావు
   2) కట్టమంచి రామలింగారెడ్డి
   3) దేవులపల్లి రామానుజరావు
   4) బూర్గుల రామకృష్ణారావు
10. 'ముల్కీ' ఉద్యమం అంటే?
    1) ఆంగ్లేయులకు వ్యతిరేకత
    2) ఉర్దూ అభివృద్ధి
    3) ఉద్యోగాల్లో స్థానికులకే ప్రాధాన్యత
    4) రెవెన్యూ సంస్కరణలు
11. 'ఇండియన్ ముసల్మాన్స్' గ్రంథాన్ని రచించిన ఆంగ్లేయుడెవరు?
    1) హంటర్ 2) కర్జన్
    3) లిట్టన్ 4) రిప్పన్
12. 1911లో ఏర్పాటు చేసిన 'మన సంఘం' లక్ష్యం ?
    1) దళితుల పిల్లల్లో విద్యావ్యాప్తి
    2) బాల్య వివాహాలను వ్యతిరేకించడం
    3) జోగిని, మురళి, బసివి వ్యవస్థల నిర్మూలన
    4) పైవన్నీ
13. అధికార భాషా సంఘం ఏర్పాటైన సంవత్సరం ?
    1) 1965 జనవరి 27
    2) 1966 ఫిబ్రవరి 13
    3) 1966 మార్చి 27
    4) 1967 ఏప్రిల్ 25
14. 1958లో జాతీయ అభివృద్ధి మండలి ఎవరి నివేదికను ఆమోదించింది?
    1) అశోక్ మెహతా కమిటీ
    2) రాకేష్ మోహన్ కమిటీ
    3) బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ
    4) స్వరణ్‌సింగ్ కమిటీ
15. బుద్ధుడి జన్మకు సంకేతం?
    1) పద్మం 2) ధర్మచక్రం
    3) స్తూపం 4) బోధివృక్షం
16. ఏ ప్రాంతీయ సంఘాల ఆవిర్భావంతో 1885లో జాతీయ కాంగ్రెస్ ఏర్పాటైంది?
    1) మద్రాసు మహాజనసభ
    2) ఇండియన్ అసోసియేషన్
    3) బాంబే అసోసియేషన్
    4) పైవన్నీ
17. విద్వాన్ విశ్వం, తరిమెళ్ల నాగిరెడ్డి రాసిన ఏ గ్రంథం సామ్యవాద ప్రచారానికి తోడ్పడింది?
    1) నవ్య సాహిత్యమాల
    2) సాహిత్య దర్శనం
    3) ఆంధ్ర సాహిత్య విమర్శ
    4) సాహిత్యంలో దృక్పథాలు
18. 'కుమార సంభవం' రచయిత?
    1) కొక్కిలి 2) పావులూరి మల్లన్న
    3) అయ్యన మహాదేవి
    4) నన్నెచోడుడు
19. కాకతీయుల కాలంలో తీర్థులంటే?
    1) సేనానులు 2) మంత్రులు
    3) సైనికులు 4) దూతలు
20. భారతదేశంలో మొదటిగా భూమిని దానం చేసిన రాజవంశం ఏది?
    1) కళింగులు 2) పల్లవులు
    3) శాతవాహనులు 4) శకులు

**గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం**

**జనరల్ స్టడీస్**

**తెలంగాణ చరిత్ర**

21. 1950 ఫిబ్రవరిలో విశాలాంధ్ర మహాసభ ప్రథమ సమావేశం ఎక్కడ జరిగింది?
    1) కడప 2) వరంగల్
    3) హైదరాబాద్ 4) గుంటూరు
22. మీర్ ఉస్మాన్ అలీఖాన్ ఆస్థానంలోని హిందూ దివాన్ పేరు?
    1) సర్ కిషన్ ప్రసాద్
    2) పింగళి వెంకట్రామిరెడ్డి
    3) సర్ భగవంత్ ప్రసాద్
    4) పండిత్ రామదాస్
23. 1938లో ఉస్మానియా యూనివర్సిటీలో హిందూ విద్యార్థులు ప్రారంభించిన రాజకీయ ఉద్యమం ఏ పేరుతో ప్రసిద్ధి చెందింది?
    1) జాయిన్ ఇండియా మూవ్‌మెంట్
    2) స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహం
    3) వందేమాతర ఉద్యమం
    4) ముల్కీ ఉద్యమం
24. తెలంగాణ పరిరక్షణ దినాన్ని ఎప్పుడు పాటించారు?
    1) 1968 జూలై 10
    2) 1969 జూన్ 10
    3) 1966 ఆగస్టు 20
    4) 1969 సెప్టెంబర్ 13
25. అస్పృశ్యుల గురించి రాసిన మొదటి నవల 'మాలపల్లి....' 1921 వెలువడింది. దీని రచయిత ఎవరు?
    1) ఉన్నవ లక్ష్మీనారాయణ
    2) దాశరథి 3) ఆదిరాజు వీరభద్రరావు
    4) సురవరం ప్రతాపరెడ్డి
26. గ్రంథాలయ ఉద్యమ నాయకుడు?
    1) కొమర్రాజు లక్ష్మణరావు
    2) అయ్యంకి వెంకట రమణయ్య
    3) నారాయణరావు
    4) సురవరం ప్రతాపరెడ్డి



27. కింది వాటిలో సరైంది?
    1) బాదామి చాళుక్యులు మహారాష్ట్ర ప్రాంతాన్ని పాలించారు
    2) వేములవాడ చాళుక్యులు కరీంనగర్ ప్రాంతాన్ని పాలించారు
    3) ముదిగొండ చాళుక్యులు మధిర, మానుకోట, వరంగల్ ప్రాంతాల్ని పాలించారు
    4) పైవన్నీ
28. మీర్ ఖమ్రుద్దీన్ ఖాన్‌కు 'అసఫ్ జా' బిరుదును ప్రదానం చేసిన మొగల్ చక్రవర్తి?
    1) బహదూర్ షా 2) ఔరంగజేబు
    3) మహమ్మద్ షా 4) షాజహాన్
29. ఆనందభైరవి రాగాన్ని తొలుత ఉపయోగించిన వాగ్గేయకారుడెవరు?
    1) త్యాగరాజు 2) క్షేత్రయ్య
    3) సారంగపాణి 4) రామదాసు
30. తూర్పు దేశాల్లో వర్తకం చేసేందుకు ఆంగ్లేయ వర్తకులకు అనుమతి ఇచ్చిన ఇంగ్లండ్ రాణి?
    1) ఎలిజబెత్-2 2) ఎలిజబెత్-1
    3) విక్టోరియా-1 4) విక్టోరియా-2
31. హరిజనుల సమస్యలను, వాటి పరిష్కార మార్గాలను ప్రజల, ప్రభుత్వ దృష్టికి తేవడానికి భాగ్యరెడ్డి వర్మ నడిపిన వారపత్రిక?
    1) మిర్రర్ 2) హైదరాబాద్
    3) విశాఖ 4) కృష్ణ పత్రిక
32. నాగార్జునుడు ఎవరి సమకాలీనుడు?
    1) యజ్ఞశ్రీ శాతకర్ణి
    2) గౌతమీపుత్ర శాతకర్ణి
    3) రెండో శాతకర్ణి 4) హాలుడు
33. శాతవాహనుల కాలంలో 'కోలిక'లనే వారు?
    1) వ్యవసాయదారులు
    2) నూనె తీసేవారు
    3) నేతపనివారు 4) ధాన్య వర్తకులు
34. 'ఘటిక' అనేది?
    1) దేవాలయం 2) బౌద్ధారామం
    3) విద్యాకేంద్రం 4) నాట్య కళాశాల
35. దంఢోళి అంటే?
    1) ఒక రకమైన కత్తి
    2) ఒక రకమైన బాణం
    3) శత్రువులపై రాళ్లు రువ్వే ఫిరంగి
    4) అశ్విక దళం
36. లుంబినీ వనంలో శిలాశాసనాన్ని ప్రతిష్టించినవారు?
    1) ఆచార్య నాగార్జునుడు
    2) అశోకుడు 3) ఆమ్రపాలి
    4) ఆర్యదేవుడు
37. 'లెంకలు' అంటే?
    1) శత్రురాజులు 2) అంగరక్షకులు
    3) నేతపనివారు 4) విదేశీయులు
38. 1857 తిరుగుబాటులో బ్రిటీష్ వారికి సహాయం చేసి 'స్టార్ ఆఫ్ ఇండియా' బిరుదు పొందిన నిజాం నవాబు?
    1) నిజాం ఉల్‌ముల్క్ 2) నసీరుద్దౌలా
    3) మహబూబ్ అలీఖాన్
    4) అఫ్జలుద్దౌలా
39. బోలు శబ్దం వచ్చే ద్వారబంధం ఎక్కడ ఉంది?
    1) వేయి స్తంభాల గుడి
    2) రామప్ప దేవాలయం
    3) లేపాక్షి దేవాలయం
    4) భీమేశ్వరాలయం
40. 'అనల్ మాలిక్' అంటే?
    1) నేనే దేవుణ్ని 2) నేనే రాజును
    3) అల్లాయే ప్రభువు
    4) ప్రభువే అల్లా
41. నన్నయ భట్టుకు ఆంధ్ర మహాభారత రచనల్లో తోడ్పడ్డ కవి?
    1) పాల్కురికి సోమనాథుడు
    2) నారాయణ భట్టు
    3) పండితారాధ్యుల మల్లికార్జునుడు
    4) రావిపాటి త్రిపురాంతక కవి
42. అశోకుని శాసన భాగం బయల్పడిన ప్రాంతం?
    1) శాలిహుండం 2) ధరణికోట
    3) కొట్టాం 4) రాజుల మందగిరి
43. తెలంగాణలో ముల్కీ నిబంధనలు ఎప్పుడు ప్రవేశపెట్టారు?
    1) 1888 2) 1890
    3) 1895 4) 1885
44. జాగిర్దారీ విధానంలో భూములు ఎవరి స్వాధీనంలో ఉండేవి?
    1) ముక్తేదారులు 2) ఇనాందారులు
    3) ఇజారీదారులు 4) పైవారందరూ
45. మిలిటరీ సామాగ్రిని నిజాం ప్రభుత్వం ఏ సంస్థ నుంచి కొనుగోలు చేసింది?
    1) టాటా కంపెనీ
    2) అట్లాస్ ట్రేడింగ్ సంస్థ
    3) మహీంద్ర అండ్ మొహమ్మద్
    4) 2, 3
46. 1958లో ఏర్పాటు చేసిన తెలంగాణ ప్రాంతీయ కమిటీని రాష్ట్రపతి ఉత్తర్వు మేరకు ఎప్పుడు రద్దు చేశారు?
    1) 1974 జనవరి 1
    2) 1975 ఫిబ్రవరి 2
    3) 1974 డిసెంబర్ 4
    4) 1973 నవంబర్ 1
47. శాతవాహనుల కాలం నాటి సాంఘిక జీవనాన్ని తెలియజేసే గ్రంథం?
    1) గాథాసప్తశతి 2) కథా సరిత్సాగరం
    3) సుహృల్లేఖ 4) శూన్య సప్తశతి

### సమాధానాలు

1) 3; 2) 4; 3) 3; 4) 4; 5) 2; 6) 2; 7) 1; 8) 3; 9) 1; 10) 3; 11) 1; 12) 4; 13) 3; 14) 3; 15) 1; 16) 4; 17) 1; 18) 4; 19) 2; 20) 3; 21) 2; 22) 1; 23) 3; 24) 1; 25) 1; 26) 1; 27) 4; 28) 3; 29) 4; 30) 3; 31) 2; 32) 1; 33) 3; 34) 3; 35) 3; 36) 2; 37) 2; 38) 4; 39) 2; 40) 2; 41) 2; 42) 4; 43) 1; 44) 4; 45) 4; 46) 1; 47) 1.

# Bridge is used in which layer?

**BANK EXAMS**

**COMPUTER AWARENESS**



### ISO/OSI MODEL IN COMMUNICATION NETWORKS

In the late 1970s, two projects began independently, with the same goal: to define a unifying standard for the architecture of networking systems. One was administered by the International Organization for Standardization (ISO), while the other was undertaken by the International Telegraph and Telephone Consultative Committee (CCITT). These two international standards bodies each developed a document that defined similar networking models. In 1983, these two documents were merged to form a standard called The Basic Reference Model for Open Systems Interconnection. The concept of a seven-layer model was provided by the work of Charles Bachman at Honeywell Information Services

The ISO-OSI model consists of seven layer architecture. It defines seven layers or levels in a complete communication system.

| | |
|---|---|
| Layer 7 | Application |
| Layer 6 | Presentation |
| Layer 5 | Session |
| Layer 4 | Transport |
| Layer 3 | Network |
| Layer 2 | Data Link |
| Layer 1 | Physical |

#### Layer 1: The Physical Layer

The bottom most layer of the OSI model is the physical layer. It addresses the physical characteristics of the network i.e., it activates, maintain and deactivate the physical connection. Voltages and data rates needed for transmission. In this layer data will be in the form of electronic signals called bit stream (0 and 1). Devices used in this layer are Repeater and Hub.

#### Layer 2: Data Link Layer

Data Link Layer is the second layer in the OSI model. In data link layer data is transformed in the form of frames. In this layer devices like Switch and Bridge are used.

IEEE 802 divides the data link layer into two sub layers:

1) Media Access Control (MAC) layer: It contains the address of each device on a network which is assigned to the device during its manufacturing.
2) Logical Link Control (LLC) layer: In this layer the redundant data and error data can be detected using cyclic redundancy check.

#### Layer 3: The Network Layer

This layer provides the functional & procedural means of transferring variable length data sequences (called datagram's) from one node to another connected to the same network. In this layer router is used to connect devices of different networks. It routes the signal through different channels to the other end. It acts as a network controller. It decides by which route data should take. It divides the outgoing messages into packets and to assemble incoming packets into messages for higher levels.

#### Layer 4: Transport Layer

The main purpose of transport layer is to ensure that packets are moved over the network without errors and data loss. It decides if data transmission should be on parallel path or single path. Functions such as multiplexing, segmenting or splitting on the data done by layer four that is transport layer. Transport layer breaks the message (data) into small units so that they are handled more efficiently by the network layer.

#### Layer 5: The Session Layer

Session layer manages and synchronize the conversation between two different applications. Transfer of data from one destination to another session layer streams of data are marked and are resynchronized properly, so that the ends of the messages are not cut prematurely and data loss is avoided. In session layer during large file transfers it maintains check points.

#### Layer 6: The presentation Layer

Presentation layer takes concern that the data is sent in such a way that the receiver will recognize the information (data) and will be able to use the data. Data encryption, decryption, compression and decompression is done in the presentation layer.

#### Layer 7: Application Layer

It is the top layer. Manipulation of data in various ways is done in this layer. Transferring of files disturbing the results to the user is also done in this layer. Mail services, directory services, network resource etc are services provided by application layer..

### PREVIOUS QUESTIONS ON ISO/OSI MODEL

1. In which layer data will be in the form of bit stream
   a) Physical layer b) Data link layer
   c) Application layer d) Network layer
   e) Session layer
2. Data encryption and decryption is done in which layer
   a) Network layer b) Physical layer
   c) Transport layer
   d) Presentation layer e) None of these
3. OSI Stands for
   a) Open Source Interconnect
   b) Open System Interconnect
   c) Open Systems Interconnection
   d) Open Sources Interconnected
   e) None of these
4. ISO stands for
   a) International Standardization Organization
   b) International Standard Organization
   c) International Standard for Organization
   d) International Organization for Standardization
   e) None of These
5. MAC layer is a sub layer of ______ layer
   a) Physical layer b) Data link layer
   c) Application layer d) Network layer
   e) Session layer
6. Repeater is used in which layer
   a) Network layer b) Physical layer
   c) Transport layer d) Presentation layer
   e) None of these
7. Router is used in which layer
   a) Physical layer
   b) Data link layer
   c) Application layer
   d) Network layer
   e) None of these
8. Cyclic Redundancy Check is done in which layer
   a) Network layer b) Physical layer
   c) Transport layer d) Presentation layer
   e) LLC Layer
9. Check points are maintained ___ layer
   a) Physical layer b) Data link layer
   c) Application layer d) Network layer
   e) Session layer
10. IPX stands for ________
    a) Internet Packet Exchange
    b) Internet Protocol Exchange
    c) Internetwork Packet Exchange
    d) Intranet Protocol Exchange
    e) None of these
11. Which protocol is considered as connectionless protocol?
    a) SMTP b) FTP c) TCP
    d) UDP e) IP
12. IP protocol is used in which layer
    a) Physical layer b) Data link layer
    c) Application layer d) Network layer
    e) None of these
13. Bridge is used in which layer
    a) Session layer b) Physical layer
    c) Application layer d) Network layer
    e) Data link layer
14. The concept of OSI seven layers was proposed by________
    a) Charles Babbage
    b) Von Neumann c) Lovelace
    d) Hopper e) Charles Bachman
15. LLC stands for
    a) Logic Layer Control
    b) Logical Control Layer
    c) Logic Link Control Layer
    d) Logic Links Centre Layer
    e) None of These

**Answers:**

1) a; 2) d; 3) c; 4) d; 5) b; 6) b; 7) d; 8) e; 9) e; 10) c; 11) d; 12) d; 13) e; 14) e; 15) c.

### Model Questions on Computer Networks

1. The Internet began with the development of
   a) USENET b) ARPANET
   c) Ethernet d) Intranet
   e) None of these
2. A global network made up of thousands of privately owned computers and networks is called the:
   a) World Wide Web
   b) Internet
   c) Specialized search engine
   d) Internet2 e) None of these
3. A peer-to-peer LAN is an appropriate network architecture for__
   a) The Internet
   b) Home network
   c) Network requiring a server with shared resources
   d) wide area network
   e) None of these
4. What is a serial port that adds a direct connection to a network?
   a) FireWire b) NIC
   c) USB d) Server
   e) None of these
5. The________ runs the front-end applications software in a network.
   a) Client b) Database
   c) Server d) USB
   e) None of these
6. This device is used to connect your computer with a telephone line, so that can access information from other servers and ordinary users too, said device is called __________
   a) Modem b) Set Top Box
   c) LAN Card
   d) UPS e) None of these
7. Device on one network can communicate with devices on another network via______
   a) File Server b) Utility Server
   c) Printer Server
   d) Gateway e) None of these
8. Which of the following will connect you to the Internet?
   a) An commercial online service
   b) An internet service provider
   c) A network connection
   d) All of the above
   e) None of these
9. The word FTP stands for_____
   a) File Translate Protocol
   b) File Transits Protocol
   c) File Typing Protocol
   d) File Transfer Protocol
   e) None of these
10. _____ is a set of rules computers utilize to talk to each other.
    a) Protocol b) Syntax
    c) DOS command
    d) HTML
    e) None of these
11. Which type of transmission media is acknowledged as regular telephone wire?
    a) Wi-Fi b) Twisted-pair wire
    c) Fiber optic cable
    d) Coaxial cable
    e) None of these
12. What is the idea of a firewall on a computer?
    a) To protect a computer from unauthorized access
    b) To protect a computer in case of fire
    c) To protect a computer from spam
    d) All of the above
    e) None of these

**Answers:**

1) b; 2) b; 3) b; 4) b; 5) a; 6) a; 7) d; 8) b; 9) d; 10) a; 11) b; 12) a.